తాళ్లపాక సాహిత్యము

# శృంగార సంకీర్తనలు



తాళ్లపాక అన్నమాచార్యులు

శ్రీ తాళ్ళపాకవారి పదసాహిత్యము—సంపుటము 24

# శృంగార సంకీర్తనలు.

## (అన్నమాచార్య విరచితములు)

పరిష్కర్త:

గౌరిపెద్ది రామసుబ్బశర్మ

తిరుమల తిరుపతి దేవస్థానముల బోర్డు ఆఫ్ ట్రస్టీస్‌వారి అనుమతితో
ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారగు
శ్రీ పి. యస్. రాజగోపాలరాజు I. A. S., గారి
అనుమతిని ప్రకటింపఁబడినది.

తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాలయము,
తిరుపతి.

1977

తిరుమల తిరుపతి దేవస్థానము
సర్వస్వామ్య సంకలితము.

మొదటి ముద్రణము
1000 ప్రతులు

ముద్రితము :
తి. తి. దే. ముద్రణాలయము
తిరుపతి.

# పీఠిక

పూజ్యపాదులు శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారిచేతి-క్రింద నేను నేర్చినంతమితికి తగినట్లుగా ఈ సంపుటమునుండి కొన్ని సంపుటములు పరిష్కరించుటకు పూనుకొంటిని.

ఈ తాళ్లపాకకవులవాఙ్మయమునందు గ్రాంథికవ్యావహారిక-భాషలు రెండింటికి విడి విడిగ రెండు సింహాసనములు గలవు. వీనిలో ఒకదాని కొకటి తీసిపోదు. అయితే సంకీర్తనములందుమాత్రమే గ్రాంథికవ్యావహారికభాషలసాంకర్యము. తక్కినపద్యగద్యరచనల యందంతటను గ్రాంథికమునకే పట్టాభిషేకము.

గ్రాంథికవ్యావహారికభాషలు రెండును దేవదానవులవలె తొలినుండి కుమ్ములాడుకొనుచున్నవే. తెలుగుదేశమున వ్యవహా-రమున ఒకతీరుభాష, గ్రంథములందు మడికట్టుకొన్న మరొకభాష, వాటివాటిపనులు సాగించుచునే యున్నవి. అన్ని దేశభాషలకు ఇది సహజమే. గ్రాంథికవ్యావహారికభాషలలో ఒకటి ప్రామాణికము, ఒకటి అప్రామాణికము అనేవాదము. పందొమ్మిదవశతాబ్దమునుండి శ్రీ గిడుగు శ్రీరామమూర్తి పంతులుగారు, శ్రీ వేదము వేంకటరాయ శాస్త్రిగారు, మొదలగు ఉద్దండ పండితులవాదబలముతో వేళ్ళుదన్ని నేటికిని నిలుపులేక క్రొత్తక్రొత్తగ చిగిరించుచునే యున్నది.

కాని, పదహైదవశతాబ్దమున పదకవితాపితామహుఁడుగా ప్రసిద్ధికెక్కి చాలమందిప్రబంధకవులకు సాహిత్యభిక్ష పెట్టినతాళ్ళ-పాకఅన్నమాచార్యులవాఙ్మయమును చూస్తే పై పేర్కొన్న-వాదము నిలువున నీరుగాక తప్పదు. ఆనాటికే వ్యవహారభాషకు సాహిత్యములో ఒకవిశిష్టస్థానము, భావప్రకటనలో తిరుగు మరుగు

లేనిసూటినడక, అది సంపాదించుకొన్నది. అన్నమాచార్యులకు ఇంచుమించు సమకాలికుడగు శ్రీనాథుడు,

" ముదివిటులు విధవలంజెలు పదకవితలు మారుబాసబాపనవారల్
చదువనిపండితవర్యులు, కదనాస్థిరవీరవరులు కడిదిపురమునన్"

అను చాటువులో 'పదకవితలు' అనుపదప్రయోగముతో వ్యావహారికభాషను ఒకపోటు పొడిచినాడు. అది బహుశః తాళ్ళపాకకవుల–పదవాఙ్మయమును చూడనిదోషము కావచ్చు.

"భాసురభారతార్థములభంగులు నిక్క మెఱుంగనేరమిన్
గాసటబీసటే చదివి గాథలు ద్రవ్వ తెనుంగు వారికిన్
వ్యాసమునిప్రణీతపరమార్థము తెల్లఁగఁ జేసినట్టియ–
బ్జాసనకల్పులం దలఁతు నాద్యుల నన్నయతిక్కనార్యులన్"
అని యెఱ్ఱన. (నృసింహపురాణము 1–8)

మహాభారతమునాటికే ఈ వాదమున్నట్లు పై నుదాహరించిన పద్యమువలన తెలియుచున్నది. నన్నయ ప్రకృతిప్రత్యయ సంవిధానయోగ్యమైన తెలుగుపదజాతిని గ్రాంథికభాషగా ఉపయోగించుకొనినాడు. ఆ పై దానిని మరింత విస్తారముగా తిక్కన చక్కబరచినాడు. తక్కినవారందరు వారి అడుగుజాడలలో నడచినారు. పదప్రయోగమునందు భారతకవులకున్నంతప్రామాణికదృష్టి తక్కినవారికి లేదేమో! తరువాతివారు వస్తుతత్వమెరుగని వాదవైతండికులు. నన్నయకాలమున "అతడు" అను సర్వనామమేగాని "ఆయన" లేదు. తిక్కన దానికి స్వాగతమిచ్చినాడు. తిక్కన రచనలో శబ్దసాధుత్వము కనబడుచున్నను, రచనావిధానములో వ్యావహారికపద్ధతి గట్టిగ పాదుకొన్నది. ఉదాహరణమునకు:–

"ఒకనాఁడాఁతమముందటన్ పలుమరున్ హోరాటమై నేల యొ-
త్తికొనంగా బవరంబులం గెలువగాఁ దెల్లంబుగాఁజూచి, పాం-
డుకుమారాళి నుతింపకుండుదురె! యాటోపంబునన్ ఘోషయా
త్రకు గంధర్వులు వచ్చినప్పటి చరిత్రం బాత్మలం బాయునే?"

(ఉద్యో 1-279)

ఇక్కడ కారకాన్వయము యోచించినచో విచిత్రపడవలసి-నదే. ఘోషయాత్రకు గంధర్వులు వచ్చిరా? అటుకానిచో 'గంధ-ర్వులు' పదమునకు ఎక్కడ అన్వయము? ఈ వాక్యమంతటిని తీసి కొని మనముమాటలాడుధోరణిలో వీరు (కౌరవులు) పొగరుబోతు తనముతో ఘోషయాత్రకువచ్చుట, గంధర్వులు వీరిని పరిభవించుట ఇత్యాది అధ్యాహారము లెన్నియో చేసికొన్నగాని కుదురుపడదు. 'ఘోషయాత్రకు' లోని 'కుషష్ఠికి' విషయసంబంధార్థములు పెట్టు కొన్నను అధ్యాహారబాధ తొలగదు. ఈరకమైనవాక్యములు మన వ్యవహారములో సహజముగ వచ్చుచుండును. విషయము తెలిసి-యుండుటచే పదములఅన్వయముజోలికి పోక మనము అర్థముచేసి-కొనుటయు సహజమే. ఇది దేశిసంప్రదాయములో నొకతీరు.

ఇక మాటలతీరులో "ఆయిరువురు ఒకతలయై" (ఉద్యో 2-151) ఇత్యాదులు తెలుగుభాషా సంప్రదాయమునుబట్టి తిక్కనభారతమున స్థాన మేర్పరచుకొన్నవి.

ఒకకొందరు కాదనినను నిజము చెప్పుటకు వెరువరాదు. భారతకవులను, శైవకవులను దాటినమీదట తెనుగునకు ప్రాణము పోసినది తాళ్లపాకకవులే. తిక్కన వీరికి ఆదర్శమూర్తి.

## వ్యవహారము - నాడు - నేడు

పైవిధముగ గానుగలో మెదుగుచుండిన ఈ వ్యవహారభాషను పదవాఙ్మయమున కెక్కించి, సాహిత్య సామ్రాజ్యమునందు దానికి

ఒకపెద్దరికము కూర్చిన తొలితెలుగుసాహసికుడు తాళ్ళపాక అన్నమాచార్యులే. ఈ వాఙ్మయ మందరికి చేతికందవలెనని సంకల్పించి నట్లున్నది. దీనిలో సాహిత్యమర్మముమాత్రము అన్నివాఙ్మయ-ములకు పైచేయి. అన్నమయ్య కీర్తనలను చదివిన, చదువుచున్న, చదువగలతెలుగురసికులందరు ఆతెగువకు మెచ్చుకొనుటయేగాక, వ్యావహారికపదములవాడకములో గల చురుకును, రుచిని, మర్మజ్ఞతను మెచ్చుకొని మురియక మానరు. అయితే ఈతనివ్యావహారిక-భాష అంతా ఆనాటిరాయలసీమలో జనవ్యవహారమున ప్రసిద్ధమైనది.

ఈనాటివ్యావహారికభాషావాదులకు, వ్యావహారికభాషకు, ఆనాటి వ్యావహారికభాషకు హస్తిమశకాంతర మున్నది. తెలుగు-భాషకు సహజములైన అరసున్నశకటరేఫలు వగైరా నియమములు రూపు మాసి, ఎంతెంత యాసగా, ఎంతెంత వికృతముగా వాడితే అంత వ్యావహారికమని నేటివారివాదము. గిడుగువారి కాలమునాడు కూడ ఇంత ఉదారత కనబడదు. అన్నమయ్యకాలమునాడు గ్రాంథిక-భాషకు సన్నిహితమై వ్యాకరణలక్షణములకు దూరముకాని వ్యవహార భాషయే గ్రంథములకెక్కుట కర్తవ్యముగా కనపడినది. అందువలననే వ్యావహారిక పదములందు సైతము అరసున్నలు, శకటరేఫలు భద్రముగ నిల్చినవి.

'అయినన్ + కూడ' అను స్థలమున 'అయినన్'కు మారుగా 'అయితే' అను వ్యావహారికపదమును స్వీకరించినను, దాని ద్రుతాంతత్వము లోపింపక "అయితేఁగూడ" అనియే ప్రయోగముల-కెక్కుచు వచ్చినది. వర్తమానశత్రర్థకచువర్ణము ద్రుతాంతము గావున దాని స్థానములో "విసరుచున్ + కదలె" అనుటకుమారు "విసరుతాఁగదలె" "విసరుకొంటాఁగదలె" వంటి రూపములు ఈ వాఙ్మయమున కోటానుకోట్లు. "కౌఁగిట" అను దానికి వ్యావహారికమైన "కాఁగిట" లో గూడ అరసున్న పట్టుతప్పలేదు. "ఆడన్" ఈడన్

మొదలగువాని వ్యావహారిక రూపములకు "ఆడాన్, ఈడాన్" లో గూడ ద్రుతముండుట మరీ వింత. ఇంకన్, చాలన్ మొదలగు— గ్రాంథికరూపములు "ఇంకా", "చాలా"గా దీర్ఘాంతము అయిన పుడుకూడ ద్రుతాంతత నాటికీ నేటికీ సుప్రసిద్ధమే.

అట్టులే "ఎఱుఁగు" మెఱయు, "మీఱు" పాఱు, మొదలగు ధాతువులయందును, కఱకు, చెఱకు, మొదలగు సుబంతములయందును శకటరేఫ పట్టుదప్పలేదు. ఈ శకటరేఫ విషయమున కొంతవ్రాయవలసి యున్నది. యతిప్రాసస్థలములలోతప్ప తక్కినచోట్ల ఈ వాఙ్మయ మున దీనికి నియమ మున్నట్లు కనబడదు. "రేఫఱకారనిర్ణయము"ను వెలయించిన పెద్దతిరుమలాచార్యులపెద్దటీకముతో సాగినఈరాగి— రేకులవ్రాతలో, ఈ రేఫవిషయమున ఇంతశైథిల్య ముండుట విచా— ర్యమే. అయినా వ్రాతఅంతా పోగరపనివారిచేతిలో నడచియుండును. పెద్ద తిరుమలాచార్యులనిర్బంధము, పనివారి అవ్యుత్పత్తిని సవరింప లేదుగదా! "న కతకం పంకప్రసాదనాయ"! అను వామనునిమాటను స్మరించి ఊరకుందము. ఏమైననేమి? రేఫఱకారములు ఈ పద— వాఙ్మయమున పీఠము దిగలేదు. కావున నాటి వ్యావహారికభాషలో గ్రాంథికశబ్దములకంటె వికృతి కనపడుచున్నను అది చాలదూరముగ దాటిపోలేదు. వ్యాకరణగంధమూ పరిమళించక తప్పలేదు. నాటి నేటి వ్యావహారిక భాషలకు. ఆ వాదములకు ఇంతవ్యత్యాస మున్నది.

ఈ అనంతమైనతీవ్రమందోద్వేగములు దేశ్యభాషలో తప్ప వని ఊహించియే నన్నయ, "ప్రవాహినీ దేశ్యా" అని నెలవిచ్చినారు. ఈ వ్యావహారికభాష, పదములలో, సంధులలో, సమాసములలో, అంతట తనప్రతిష్ఠను విశిష్టముగ చూపుకొనుచుండును.

<u>పదములలో</u> :— "వచ్చును" మొదలగుతద్ధర్మార్థకరూప ములు 'వచ్చీని, చేసీని,' ఇత్యాదిగా ఈ వాఙ్మయమున గలవు.

వాక్యాదియందును "నేసిన చేఁతలు" ఇత్యాది రూపములుగలవు. "ఉండేడువాఁడు, ఉండెడివాఁడు" వంటివానికి మారుగా "ఉండేటి వాఁడు, ఉండేవాఁడు" వంటిరూపములు కోకొల్లలు. "వలదు" అను శబ్దము కొంతకాలానికి "వద్దు"గా మారితే, అది అన్నమయ్యభాషలో "వొద్దు"గా యతిస్థానములలోగూడ బిగిసినది. "ఒడి" శబ్దము "వొడి"గానే పెక్కుస్థలముల నిల్చినది, "యకారంబును వువూవొ వోలును తెనుఁగుమాటలకు మొదట లేవు" అను అనుశాసనమును శాసించినది ఈ భాష. తీయు, తోయు, వచ్చు, తెచ్చు, పిలుచు, నిలుచు మొదలగు యువర్ణాంత, ద్విరుక్త చువర్ణాంత, చువర్ణాంతములైన ధాతువులరూపములు తోస్తే, తీస్తే, వస్తాడు, తెస్తాడు, వస్తే, తెస్తే, వస్తిని, తెస్తిని, పిలిస్తే, నిలిస్తేగా ఈ భాషలో క్వాచిత్క ముగ గలవు. ఈ రూపములకు ఆనాడు ప్రారంభదశయేమో!!

'ఉన్నదానకు' బదులు 'ఉందాన' అని, 'ఏల' కు 'యాల' అని, 'ఎంతకు' 'యంత' అని, 'అనినచోఁ' కు 'అంటేన్' అనియు వ్యావహారికరూపములు గలవు.

తద్భవపదముల విషయమున మరింత స్వాతంత్ర్యమును చూపి నట్లు కనపడుచున్నది. ఉదా:- 'భోజనము'నకు 'బోజనము' అని, 'నిత్యము' నకు 'నిత్తెము' అని, 'వీధి'కి 'వీది'అని, 'సుఖము' నకు 'సుకము' 'దృఢము' నకు 'దిడము' 'దిటము' దిటవు, అని, 'బోధించు' కు 'బోదించు' అనియు, మహాప్రాణాక్షరములను మాత్రము తొలగించి, తద్భవీకరణ పద్ధతి నవలంబించి ఆంధ్రవర్ణములతో అపూర్వముగ కొన్ని ప్రయోగించిరి.

'దృష్టము' నకు 'దిష్టము' అని, 'ధృష్ట' శబ్దమునకు భావార్థమున 'దాష్టీక' మని, 'దృఢ' మునకు 'దిఢ' మనియు అనాంధ్ర వర్ణతద్భవముల ప్రయోగమునూ గలదు

'ఘనుఁడవు నీ విట్ల సేతురా' వంటి ప్రయోగములలో కర్మ క్రియ లకు యేకవచన బహువచన వ్యత్యయ పద్ధతియు వ్యావహారిక ముగనే సాగినది.

సంధులు: చాల స్థలములందు అచ్ సంధులు, ద్రుత గసడదవా దేశాది హల్సంధులు గట్టిగ నిలిచి యున్నవి. కొన్నిపట్టుల స్వేచ్ఛగా నడచినవి. ఆ సంధి నియమములు కొన్నిపట్టుల మనము విప్పిచెప్పితే తప్ప సందేహించవలసినంతగా గలవు. 'సరి + పాలు=సరివాలు: పంట + పండినది=పంట వండినది: ఆడన్ + ఈడన్=అడానీడా; ఒక + బుద్ధి; ఓ + బుద్ధి= ఒబ్బుద్ధి ఇది విచిత్రమైనత్రికసమాసము. నీ + ఎడ=నియ్యెడ కూడ అట్టిదే! ఇవన్నియు ప్రకరణమునుబట్టి మనమే వింగడించుకొనవలసి యుండును. ద్రుతముపై అచ్చులకు, ఉకారాంతములపై అచ్చులకును. యడాగమము వచ్చుట, విసంధిగ, వ్రాయుటయు గలదు.

ఓకారమునకు, నీ, మీ, వంటి శబ్దములలోని 'ఈ'కారమునకు త్రికసంధిని శాస్త్రము చెప్పకపోయినంతమాత్రమున మనము వాడ కూడదా? అని అన్నమయ్యప్రశ్న. వ్యవహారము సహజము స్వతం త్రము. వ్యాకరణము విశ్వామిత్రసృష్టి అని అన్నమయ్య దృష్టి. ఇంత చెల్లుబడిగలతెగువరి తెలుగుకవులలో ఇంకొకడు లేడు.

'కడ + కడ=కట్టకడ'ను 'కట్టఁగడ' అనివాడుట ఈ వాఙ్మ యమునందు వింతగా తోచుచున్నది. ఇది తమిళ వ్యాకరణ పద్ధతిగా తోచుచున్నది. 'ఏ ప్రొద్దును కొలువుకు మారుగా' 'ఏ ప్రొద్దుఁ గొలువు' వంటి రూపములు కోకొల్లలు!

ఈవాఙ్మయమంతా శోధించినపుడు పొల్లునకారముమాత్రమే ద్రుతముగా తోచును. (అయె) ఆయను + కానీ-స్థలమున 'ఆయనుఁ గానీ' వంటి రూపములే పలుతావుల కానవచ్చుచున్నవి. ఈ పద్ధతిలో

చూచినప్పుడు 'నేను' కళ, 'నేన్' ద్రుతాంతముగా వీరి సంప్రదాయము చెప్పుచున్నది. ద్రుతసంధులవిషయమునందంతటా ఇదే మర్యాద. ఇంచుమించు వ్యాకరణములన్నియు ఉత్వవిశిష్ట. ఇత్వ విశిష్టనకారము లనుగూడ ద్రుతాంతములుగా చెప్పుచున్నవి. నారాయణీయాంధ్ర వ్యాకరణమున చర్లగణపతిశాస్త్రిగారు, పై జెప్పినట్లు ఈ, ఊ సహిత నకారములు ద్రుతాంతములని పెద్దవాదనచేసి చూపినారు. వ్యావహారి కమునందును, వ్యాకరణసంప్రదాయమును వదలని తాళ్ళపాకకవుల– వాఙ్మయమును వారు చూడలేదేమో! వజ్ఝలవారివాదము ద్రుతవిష యమున తాళ్ళపాకకవులవాఙ్మయమునకు సన్నిహితముగ తోచు చున్నది. "నేను విడప దిగియెద" అను తిక్కన ప్రయోగము. 'పవ్వ నజు కవచమే. నువరింతు" అను చిత్రకవి పెద్దన ప్రయోగము, మొదలగునవి 'నేను' ను కళగా చూపినవి. ఇక్కడ పాఠభేద కల్పన మునకు పండితులు వెనుకాడరు. సంధులలో ద్రుతసంధియు ఒక టగుటచే ద్రుతమునుగూర్చి ఇంతమాత్రము చర్చింపవలసి వచ్చెను. 'చెప్పి + అంపెను=చెప్పెంపెను. ఆపె + అనఁగా = ఆపెనఁగా, వంటి సంధులు నేటికిని వ్యవహారారూఢములే! 'ఆమె + అఁట'= 'ఆమఁట' అనిన చేమకూరవానిసంధిగూడ మనము గుర్తింపవలసి యున్నది. వాఙ్మయమంతా నిండిన యీపద ప్రయోగములకు, కంబళభోజనన్యాయ మగునని పాట లుదాహరింపలేదు.

సమాసములు :– ఈ విషయము ఒకటే ప్రత్యేకముగ విమర్శింప వలసియున్నది. కానీ ప్రకరణానుగతముగ ఒకటి రెండు మాత్రము చూపుచున్నాను. (1) 'కన్నుల కలువలను గక్కన నిన్నుఁజూచితే' (పాట 171), (2) 'చిగిరించే నాలోని సిగ్గులకుగాక' (పాట 231); (3) 'తుమ్మెదలు (లః?) బెదరని తోరపుగుంపు' (పాట 239); అను నవి క్రమముగా, (1) కలువ కన్నులు, (2) నాలో చిగిరించేసిగ్గులు (ఇది కర్మధారయాభాసము) (3) బెదరని తుమ్మెదలగుంపు–అనుట

సహజముగదా ! మరి ఈ సమాస విధానము కొన్నిస్థలముల యతి-ప్రాసనిర్బంధముతో, మరికొన్నిస్థలముల స్వాతంత్ర్యముతో నడచినది.

## రసభావములు — అన్నమయ్యదృష్టి

శృంగారమునందు, కృష్ణుని చిలిపి చేష్టలుగ ఉదాత్తతకు దిగువమెట్టుగా సాగినపాటలు కొన్ని కలవు. దీనివలన, కేవలము పరమేశ్వరార్పితములయినవానిలో హెచ్చుతగ్గులు గమనించి, కొన్ని పరమేశ్వరున కనర్హములనుట ఆయన సర్వాత్మకత్వాన్ని శంకించి-నట్లగునని అన్నమయ్యభావము కాబోలును. ఉదాహరణమునకు:- వాకోవాక్యము,

నాట

మేలురా నీకతలకు మెచ్చితి నేను
మేలములాడితి నీవు మెచ్చులాఁడివంటానే ॥ పల్లవి ॥

వెన్నలేల తీసేవురా చిన్నవాఁడా నీ—
చన్నులపై పయ్యదేల జారెనె నీకు
యెన్నిక నేమాటకు నీవేమాదేవు; అవి
జన్నెపాలువట్టినమాచాదెలంటానే ॥ మేలు ॥

వుట్టులేల యెక్కేవురా వుద్దండీఁడా చక్కఁ—
గట్టుకోవె పోఁకముడి కదలె నీకు
వొట్టుక నేనొకటంటే నొకటాదేవు; అది
తొట్టి రతులసిగ్గులదొడ్డియంటానే ॥ మేలు ॥

చేరి యిల్లు చొచ్చేవేరా శ్రీవేంకటేశ నీవు
తారసిల్లి వొంటినే వుందానవంటానె
కోరి నను( గాఁగిలించి కొత్తలుగా నాదేవు
దూరనేలె గొల్లవారిదోమటంటానే ॥ మేలు ॥ 186

దీనిలో , కృష్ణుడు పరబ్రహ్మమే యైనను, తాను స్వీకరించిన మానవత్వము, గొల్లకులముదోమటి, చిన్నవయసు చిలిపితనమూ, ప్రతిఫలించున ట్లన్నమయ్య వర్ణించినాడు. లోతుగ పరిశీలించినపుడు కృష్ణరూపియగు శ్రీవేంకటేశ్వరకీర్తనమే దీనిపరమార్థము,

కొన్నిటియందు, భౌతికముగా మనము భావించేశృంగారము పరమార్థమైన అధ్యాత్మవిద్యగా, కావ్యములలోని శృంగారరససంప్ర-దాయమునుపై కప్పుకొన్న యోగిమర్యాదలుగ భాసించుటయు కలదు.

### సామంతం

తరుణి జవ్వనపుఁదపము సేయఁగను
వరుసతోడ జాతివైరము లుడిగె ॥పల్లవి॥

జక్కవపులుగులు జంటవాయవివె
గక్కన వెన్నెలగాసినను
యెక్కడఁ గోవిలయెలుఁగులు చెదరవు
గుక్కక వానలు గురిసినను ॥ తరు ॥

గుంపుఁదుమ్మెదలు గొబ్బున బెదరవు
సంపెఁగతావులు చల్లినను
ముంపునఁ జకోరములు వసివాడవు
సొంపుఁగళలు (ల?) పెనుసూర్యుఁ డుండఁగను ॥ తరు ॥

చిలుకలు సందడి సేసినఁ దొలఁగవు
కలసినసమరతి కయ్యమున
యెలమిని శ్రీ వేంకటేశుఁడు గూడఁగ
చెలియంగములని చెప్పఁగఁ బొసఁగె ॥ తల ॥ 167

ఈ కీర్తనమునందు శృంగారము గుబాళించు చున్నను, వెన్నెల కాచినను జక్కవలు (చన్నులు) జోడు వీడకుండుట, రతిస్వేదవర్షమున్నను వాసంతికములగు కోయిలలు కూయుచుండుట, సంపెగవంటి ముక్కున బుట్టిన నిట్టూర్పులు సందడించినను చికురభ్రమరములు బెదరకుండుట, రతి సమ్మర్దశబ్దములతో చిలుకలు — చిలుకల యెలుగులు (రతికూజితములు) కట్టుగదలక ఉన్నచోటనే (కంఠములందే) ప్రతిధ్వనించుట మొదలగు సహజవైరత్యాగము వర్ణింపబడినది. యౌవనమును తపముగా వర్ణించుటచే, తపశ్శక్తికి పరీక్షగా చెప్పిన "అహింసాప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః" అను యోగశాస్త్ర మర్యాద ఇందు పాటింపబడినది. ఇది చాల ఉదాత్తమైన భావన.

కావున అన్నమయ్య దృష్టి, పరమేశ్వరార్చనగా సాగించిన యీ సంకీర్తనలరాశిలో ఉత్తమాధమభేదబుద్ధి భావములందైనను భాషయందైనను తగదనియే. అందుకే యీ రెండు పాట లుదాహరించితిని.

ఈ వాఙ్మయమునందుగల క్రొత్తలను వరుసగ ఒక్కొక్క అంశమును, ఒక్కొక్క సంపుటమున లఘువుగ చర్చింపదలచి, నాటి నేటి వ్యావహారికభాషా పద్ధతిని సంగ్రహముగ దీనిలో చర్చించితిని. వ్యుత్పన్నులు, రసికులునగువారు ఇంకను పైపై చర్చలు సాగించి, తాళ్ళపాకకవులభాషలోని రహస్యరత్నములను అంగడిబెట్టగలరు.

ఈ సంపుటము వ్రాతపని ముగిసి, దాదాపు రెండుసంవత్సరములకు పైగా జరిగినది. ఈ వాఙ్మయ మంతటిని త్వరగ లోకమునకు అందివ్వవలెననుదొడ్డసంకల్పముగల దేవస్థానముకమిటీ-ఛేర్మన్ శ్రీ చెలికాని అన్నారావుగారికి, ఆయవ్యయములను లెక్కపెట్టక ఈ పనికి వలసినంతప్రోత్సాహమిచ్చి నడిపించుచున్న తి.తి.

దేవస్థానకార్యనిర్వహణాధికారులు శ్రీ పి. యస్. రాజగోపాలరాజు I.A.S. గారికి, ఈపని నడుపుటలో మాకు తమనిందుసహకారము-నిచ్చుచున్న శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాలాధ్యక్షులు శ్రీ కె. సేతు రామేశ్వరదత్తాగారికి, నా కృతజ్ఞతాభివందనములు. ఈ సంపుటము ముగిసీ ముగియకయే తరువాతి సంపుట ముద్రణము చేపట్టిన తి. తి. దేవస్థానప్రెస్ మేనేజరు శ్రీ యం. విజయకుమారరెడ్డిగారికి. వీలయి నంతనిర్దుష్టముగ ముద్రణభరమును వహించిన అచ్చుకూర్పరులకు నాధన్యవాదములు. ఎంత మెలకువనైనను తారుమారు చేయగల ముద్రణ దోషములను సహృదయులు మన్నించి తెలిపిన, ముందు జాగ్రత్త-పడగలను. ఈ వాఙ్మయమందలి పవిత్రమైనభక్తి, భాషలోని మాధు-ర్యము, నేనీపని చేసినచో శ్రీ రాళ్ళపల్లివారి తృప్తికి పాత్ర-మగుదు ననుభావము నన్నీపనికి పురికొల్పినవి. ఈ దొడ్డకార్యమును నాచే చేయించుటకు శ్రీ శ్రీనివాసుని నిందుదయ, తాళ్ళపాకకవుల అనుగ్రహము, పూజ్యపాదులు శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి మంగళాశాసనములు, అండగనిలిచి కడతేర్పగలవు.

తిరుపతి.
12-6-1977

ఇట్లు,
గౌరిపెద్ది రామసుబ్బశర్మ,
ఆంధ్రశాఖాధ్యక్షుడు,
శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాల,
[తాళ్ళపాక వాఙ్మయ పరిశోధకుడు]

*



'పదకవితాపితామహుడు'

శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు

శ్రీః

శ్రీరస్తు

శ్రీ తాళ్లపాక

# అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు

24 వ సంపుటము

స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహనశకవరుషంబులు ౧౩౪౬ అగు నేఁటి క్రోధి సంవత్సరమందు తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన పదారుయేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహనశకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ౧౨ నిరుధానకు[1] తిరువేంగళనాథునిమీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన శృంగార సంకీర్తనలు.

రేకు. 801 కన్నడగౌళ

ఏమని పొగడవచ్చు నిదివో నీదేవులను
కామించి నీచిత్త మెంత గరఁగెనో కాని ॥ పల్లవి ॥

పలచని కెమ్మోవిఁ బలువరుసల కెంపు
దొలఁక మాఁటలాడీఁ దొయ్యలి
కలువరేకుఁగన్నులఁ దళుకులు మెరువఁగా
సొలసీ నిన్నుఁ జూచి సొబగులుదేరను ॥ ఏమ ॥

---

(1) ఈ శబ్దము 'నిరోధ' 'నిరుద్ధ' శబ్దములకు వ్యావహారిక రూపముగా కానవచ్చుచున్నది. అడ్డగింపు, అవధి అని యర్థము. ఆనాడు కడపటిదినమని తాత్పర్యము. కీ॥ శే॥ ప్రభాకర శాస్త్రిగారూహించిన "సరియగు" అనునర్థము తాత్పర్యార్థము కావచ్చును. "అవధి" అను నర్థములో, "ఈ నిరుద్ధమునకుఁ గుశలంబు మాకు" అను తరిగొండ—వెంగమాంబగారి ప్రయోగము "విష్ణుపారిజాతము" 55 వ పుట — సాహిత్య అకాడమీవారిది దీనికి సహాయపడుచున్నది. నే నీప్రయోగ మివ్వగా శ్రీమాన్ రాళ్ళపల్లి—అనంతకృష్ణశర్మగారు, "నిఱుత్తం" అను అరవపదము గూడ 'నిఱవు' అనునర్థముతో దీనికి సహాయపడు ననిరి.

ముసిముసినవ్వులతో మోమునఁ జంద్రకళలు
విసరుతా సిగ్గువడీ వెలఁది
పసిఁడివన్నెలగుబ్బపాలిండ్లు గదలఁగా-
నొసగీ బాగాలు నీకు నుడివోనియాసల ॥ఏమ॥

సోగకరములగోళ్ళు సోఁకకుండా నీకు నిట్టె
బాగుగఁ బాదాలొత్తీఁ బడఁతి
లాగుగ శ్రీ వేంకటేశ లలితాంగిఁ గూడితివి
యీగతి రతిఁ జొక్కించీ నిట్టె నిన్ను నింపుల ॥ఏమ॥ 1

ధన్నాసి

చెలికత్తెలతో నేల చేరి సరసమాడేవు
వలపించితినా నీ వద్ద నుంటిఁగాక ॥పల్లవి॥

పలుకుఁదేనెల నిన్ను భ్రమయించ వచ్చితినా
చెలియమాటలు నీకుఁ జెప్పితిఁగాక
కలికితనాల నీకుఁ గడుగుట్టు సేసితినా
వెలి నిన్నుఁ జూచి చూచి వెరగందితిఁ గాక ॥చెలి॥

అక్కరతో నీకు నడియాసలు చూపితినా
యిక్కువ లంటఁగాఁ గాను కిచ్చితిఁ గాక
మక్కువ సేయుమనుచు మర్మము లంటితినా
చేతులు నొక్కఁగఁ జేత మొక్కితిఁ గాక ॥చెలి॥

యొనయుమనుచు నీతో నెరుక సేసితినా
వొనర నే నీపాదా లొత్తితిఁ గాక
ఘనుఁడ శ్రీ వేంకటేశ కాఁగిట నన్నేలితివి
మనసు సోదించితినా మరిగితిఁ గాక ॥చెలి॥ 2

## దేశాక్షి

తడవాయ నీవద్దికి తానే వచ్చునో యేమో
యెడయక నీవునీవే యెరుఁగుదువయ్యా ॥ పల్లవి ॥

విందువలె నాకెమ్మాఁట విన్నవించితిమి నీకు
అందుకు మారుమాఁట లానతీవయ్యా
సందడికొలువు నీకు సతులెందరో కలరు
మందలించ నాకెకిచ్చినమాఁట దలఁచవయ్యా ॥ తడ ॥

గక్కున నాపెయంపినకానుకిచ్చితిమి నీకు
యిక్కువైనఆనవాలు యియ్యవయ్యా
పెక్కుపనులవాఁడవు ప్రేమ నీ కెందునుండునో
యెక్కువ నీచుట్టరిక మెంచుకొనవయ్యా ॥ తడ ॥

చెలఁగి యాకెమారు చేయెత్తి మొక్కితిమి
తిలకించి నీవిందుకు దీవించవయ్యా
యెలమి శ్రీవేంకటేశ యిట్టె వచ్చి కూడితివి
మలసి యీనసువులు మరువకువయ్యా ॥ తడ ॥ 3

## మాళవశ్రీ

కంటిమి కొత్తలు గొన్ని కన్నులపండుగగాను
అంటితివో లేదో నాతో నానతీవయ్యా ॥ పల్లవి ॥

చనవరిమాటలు సారెకు నీతో నాడి
చెనకీ నెవ్వతో కాని చెలి నిన్ను
తనివోనియాసలతో తగులువిరితనాన
పెనఁగులాడుతా నీపైఁ బ్రేమము చల్లీని ॥ కంటి ॥

సందడిఁ దానేమౌనో సరసనే కూచుండి
అంది విడేలియ్యవచ్చీ నప్పటి నీకు
మందెమేళాలుసేసుక మలసి సొలసి నవ్వి
సందుసుడిఁ దనమోవిచౌలు చూపీని ॥ కంటి ॥

పచ్చిదేర నాడానీడా పంచలఁ బొలసుకొంటా
యెచ్చరిక లేల సేసీ నేమీ యాపె
యిచ్చట శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు
నచ్చుకొట్టుతాఁ గొంత నవ్వఁగ లాచీని ॥ కంటి ॥ 4

## దేవగాంధారి

చక్కనివాఁడ వన్నిటా జాణవు నీవు
మక్కువ నీకుఁ జేయుటే మాభాగ్యము గాదా ॥ పల్లవి ॥

వన్నెకెక్క నీకు నేను వలవ నావసమా
కన్నులనే చూచి చొక్కఁగలఁ గాక
చన్నుల నొత్తి కాఁగిలించఁగ నావసములా
సన్నలనే నీమోవి చవిగొంట గాక ॥ చక్క ॥

ఆయమెరిఁగి పెనఁగ నప్పటి నావసమా
కాయమంటి సంతోసించఁగలఁ గాక
చేయిముట్టి నే నిన్నుఁ జెనకఁగ వసమా
చాయలకు నీతో సరసమాడుట గాక ॥ చక్క ॥

పిలిచి నిన్ను రతులఁ గలయఁగ వసమా
చెలరేఁగి నీసేవ సేయుట గాక
యెలమి శ్రీ వేంకటేశ యిన్నిటా నన్నేలితివి
తలఁచ నిన్ను వసమా తగులుట గాక ॥ చక్క ॥ 5

శుద్ధవసంతం

విభునితో నీఁకనేలే వేసాలు
సుభసోభ (శుభశోభ) నములెల్లాఁ జూపవలెఁగాని ॥పల్లవి॥

చేరి సంగడిఁ గూచుండి సిగ్గులువడితేఁ బోదు
వూరకే తలవంచుక వుండఁగరాదు
గోరగీరఁగా నొడ్డుకొంటే సంగతి గాదు
కూరిమితో రతి కియ్యకొనవలెఁగాని ॥విభు॥

తప్పక మొగాలు చూచి తలవంచుకొంటేఁ బోదు
ముప్పిరిఁ జిరునవ్వులు ముయ్యఁగరాదు
పిప్పిగా మోవి యానఁ బెనఁగేది బుద్ధిగాదు
కుప్పలు దెప్పలుగాఁ గూడవలెఁ గాని ॥విభు॥

జిగిఁ జన్నులు సోఁకించి చెమరించితేఁ బోదు
అగపడి కాఁగిలించి యలయరాదు
వెగటు లేక యేలె శ్రీ వేంకటేశుఁ డిట్టె నిన్ను
తగులై యిట్లానే పొందఁగవలెఁ గాని ॥విభు॥ 6

రేకు 802 కాంబోది

నీవేల సిగ్గువడేవే నెలఁతా
యీవలఁ జెలికత్తెల మెగసక్కె మాడేమా ॥పల్లవి॥

చక్కలవలె నీమోవి సూదివాటు లుండఁగాను
యిక్కున నీకెంగేల నేల మూసేవే
తక్కక గజరుఁజేఁతలవాఁడు నీమగఁడు
యెక్కడా లేనిదా యందుకేమాయనే ॥నీవే॥

వాటుకొని (కోసీ?) చెక్కులపై నవచంద్రకళ లుండఁగాను
గాటపుఁగస్తూ రెంతకడు మెత్తేవే
మేటియైన నీ విభుఁడు మిక్కిలి నారజకాఁడు
అఁటదానికిఁ గలదే యందుకేమాయనే ॥ నీవే ॥

తగ నీమెయి నాడాడ తమ్మచదురు లుండఁగ
పొగరుఁగుంకుమలేల పూసుకొనేవే
జగములో శ్రీ వేంకటేశ్వరుఁడె జాజరకాఁడు
అగపడి నిన్ను నేలె నందుకు నేమాయనే ॥ నీవే ॥ 7

శంకరాభరణం

పోలించి చూచితేను పొసఁగు నిద్దరికిని
మేలువాయ తొల్లె మీరు వోలలాడరయ్యా ॥ పల్లవి ॥

కదిసి యింతి నీతో కడు మాఁటలాడఁగాను
అదె మోవిచిగురులు యల్లాడఁ జొచ్చె
యిదె వసంతకాలము యెదిరించె నీకు నేఁడు
సదరాన పలపులు చల్లులాడరయ్యా ॥ పోలిం ॥

కందువఁ గాంత నిన్నుఁ గాఁగిలించుకొనఁగాను
అందమై బాహులతలు అల్లుకోఁజొచ్చె
వింతజాజరకాలము వేడుకతోఁ దలఁపించె
సంతోసపుచిరునవ్వు చల్లులాడరయ్యా ॥ పోలిం ॥

అంచెల రతివేళల సంగన నిన్నుఁ గూడఁగా
మించి గుబ్బలపూగుత్తులు మెరయఁ జొచ్చె
కొంచక శ్రీ వేంకటేశ కూడె నామనికాలము
చంచలించక యింపులు చల్లులాడరయ్యా ॥ పోలిం ॥ 8

బౌళిరామక్రియ

ఇంతటిమీఁదిపనులు యింక నీ చేతిలోనివి
పంతమున మోహము నీపై వేసుకొన్నది ॥ పల్లవి ॥

వెలయఁగ నీకు నన్నివిన్నపములునుఁ జేసి
తల వంచుక వున్నది తరుణి
కలయ నీమేనెల్లా కందువచూపులఁ జూచి
తలఁచుకొంటా నున్నది తనలోనను ॥ ఇంత ॥

పనివడి తెచ్చి నిమ్మపండు నీచేతికిచ్చి
నినుపుసిగ్గులతోడ నిలుచున్నది
ననుపునఁ గొంతచిరునవ్వు నీముందర నవ్వి
తనియక చెమటల దైవారీని ॥ ఇంత ॥

కడునిచ్చకముగాఁగ గక్కన నీపాదా లొత్తి
వుడివోని బత్తితోడ నోలలాడీని
యెడయక శ్రీ వేంకటేశ నీవు గూడఁగాను
చిడుముడిఁ జెలులతోఁ జెప్పి మెచ్చీని ॥ ఇంత ॥ 9

నీలాంబరి

ఎంతవేడుకో నీకు యీపెమీఁదను
వింతలెల్లాఁ జూచి మాకు వెరగయ్యీ నిపుడు ॥ పల్లవి ॥

ప్రియ [1](ప్రేమ?) మున నీతోడ ప్రియురాలు మాఁటాడఁగ
ఆముకొని వినేవు నీ వప్పటనుండి
గోమున నేపొద్దు నీకుఁ గొలువులు నేయఁగాను
జామటనుండి యిట్టె సంతోసించేవు ॥ ఎంత ॥

1. గురుప్రాసభంగము.

అప్పటిని బాగాలిచ్చి ఆకుమడిచియ్యఁగాను
వుప్పతిల్లుఁగళలతో నుబ్బేవు నీవు
చిప్పిలఁగ నిన్నుఁ జూచి సెలవుల నవ్వఁగాను
చెప్పరానితమకానఁ జిమ్మిరేఁగేవు ॥ ఎంత ॥

నేరుపులెల్లా మెరసి నీకుఁ బాదా లొత్తఁగాను
బోరున నీనిలువెల్లఁ బులకించేవు
యీరీతి శ్రీ వేంకటేశ యేలితివి నీదేవుల
గారవపురతులనుఁ గడుఁజొక్కేవు ॥ ఎంత ॥ 10 ॥

నాదరామక్రియ

ఎంత వలతువో కాని యీతనికిని
చింతలెల్లఁ జిగిరించి చిమ్మిరేఁగెనే ॥ పల్లవి ॥

చక్కనినీరమణుఁడు సరసము లాడితేను
లక్కవంటినీమనసు లలిఁ గరఁగి
చెక్కులపై చెమటలు చిరుమోవితేనెలు
వొక్కమాటే చెలరేఁగి వూటలెత్తెనే ॥ ఎంత ॥

మచ్చికతో నీమగఁడు మాఁటలాడినంతలోనె
పచ్చినీజవ్వనమెల్ల పదనెక్కి
పచ్చనిమెయిపులకలు బాగుగా మోముకళలు
విచ్చనవిడిఁ దోడుతో వెదలై మొలచెనే ॥ ఎంత ॥

యెన్నఁగ శ్రీ వేంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడఁగాను
చన్నులై నీవురమున నెన్నులు వెళ్లి
కన్నులఁజూచేకాంక్షలు కాఁగిటిలోనిరతులు
పన్ని యిరువంక నొక్కపరే రాసులాయనే ॥ ఎంత ॥ 11

తెలుఁగుఁగాఁ(గాం)బోది

వెంగెములు నిన్నాడను వేసరించను
సంగతిగ నీకు నిచ్చకమే సేసేను ॥పల్లవి॥

తలపోఁత లెన్ని లేవు తమకము లెన్ని లేవు
వలచినయటువంటివనితకును
కలువల వేసి నన్నుఁ గమ్మక యెంతడిగేవు
నెలకొన్ననీచేఁతలు నీవెరఁగవా ॥వెంగె॥

వాడుమోవైతే నేమి వంచినతలైతే నేమి
వోదక విరహముతో నున్నదానికి
యీడకు వచ్చితివిగా యిప్పుడు వేఁడుకోనేల
వేడుకకాఁడవు నీకు వెలితున్నదా ॥వెంగె॥

నివ్వెరగులు గడమా నిండునవ్వులు గడమా
వువ్విళ్లూర నిన్నుఁ గూడి వున్ననాకును
యివ్వల శ్రీవేంకటేశ యెంత నన్ను లాలించేవు
నివ్వటిల్లునేర్పరివి నీకు నేఁడు గొత్తలా ॥వెంగె॥ 12॥

రేకు 803 హిందోళం

ఎదిరిఁ దన్నెరఁగని దేఁటియాఁటది
కదిసేవు వలపులకలగంప గలఁదా ॥పల్లవి॥

కూరిమి నావద్ద వచ్చి కూచుండినపతితోను
సారెసారెఁ గొసరితే చవి వుట్టునా
నారుకొన నాతోను నవ్వు లితఁడు నవ్వఁగ
చేరి చెనకే వెంతచిత్తిణివే నీవు ॥ఎది॥

మందలించి నాతోను మాఁటలాడఁగానే నీవు
సందుసుడిఁ గత చెప్ప సంగతే యిది
కందువ నాతఁడు నన్నుఁ గాఁగిలించుకుండఁగాను
అంది విడేలిచ్చే వెంతయానోదకత్తెవే ॥ ఎది ॥

శ్రీ వేంకటేశుఁడు నేనూఁ జేరి తెరలో నుండఁగా
సేవలకు దగ్గరేవు చెల్లదే నీకు
కైవశమై నాకితఁడు గలసిమెలఁగుండఁగా
నీవుఁ (పూఁ?) జెప్పకొనే వేఁటినేరుపరివే ॥ ఎది ॥ 13

దేసాళం

వలచి వచ్చితి నేను వానికిఁగాను
నెలవై మీ గొల్లవాడనే తానుండు న (నం?) టా ॥ పల్లవి ॥

చెందమ్మికన్నులవాఁడు చేతిపిల్లఁగోవివాఁడు
యిందు వచ్చెఁ గంటిరా యేమిరే యమ్మా
మందలపసువులవాఁడు మకరాంకములవాఁడు
యెందు నున్నాఁడు చెప్పరే యేల దాఁచేరమ్మా ॥ వల ॥

నెమలిపించెమువాఁడు నీలమేఘకాంతివాఁడు
రమణుఁ డాతఁడు, మొక్కె రమ్మనరమ్మా
జమళిచేతులవాఁడు సంకుఁజక్రములవాఁడు
అమర మీపాలఁ జిక్కెనట చూపరమ్మా ॥ వల ॥

పచ్చఁబైఁడిదట్టివాఁడు పక్షివాహనపువాఁడు
యిచ్చినాఁడు నా కుంగర మిదివో యమ్మా
చెచ్చెరఁ గొనేటివాఁడు శ్రీ వేంకటేశ్వరుఁడు
వచ్చి నన్నుఁ గూడినాఁడు వాఁడువో యమ్మా ॥ వల ॥ 14

కౌశి

నీకు బాఁతై నీముందర నిలుచున్నది
దాకొని నిన్నెటువలెఁ దగిలీనో కాని ॥ పల్లవి ॥

చెలరేఁగి చెలరేఁగి సేవలుసేసీ నాపె
వలచి తానెందుండి వచ్చెనో కాని
వెలలేనిసింగారాలవింత మొగము దాపె
కలయ నెన్నాళ్ళనుండి కలిగెనో కాని ॥ నీకు ॥

నిట్టచూపులతోడ నీమొగము చూచీ నాపె
పుట్టి నీవేవూరో తానేవూరో కాని
బట్టబయలు నీతోను పైకొని నవ్వీ నాపె
చుట్టరికము నీకుఁ దా నెట్టాయనో కాని ॥ నీకు ॥

పొంచి నీవద్దఁ గూచుండి పువ్వులు ముడిచీ నాపె
అంచెలఁ దా నెన్నఁడు పెండ్లాడెనో కాని
యెంచఁగ నన్ను శ్రీవేంకటేశ నేఁడు గూడితివి
పంచలపాలై తానేల పదరీనో కాని ॥ నీకు ॥ 15 ॥

కన్నడ గౌళ

ఏమి చెప్పేది నీసుద్దులు యెంతవాఁడవు
చేముట్టి నామీఁద నిట్టె సేసలు చల్లేవు ॥ పల్లవి ॥

ముచ్చట నెవ్వతైనా నీమోము చూచితేఁ జాలు
చెచ్చెర మేనవావి చెప్పుకొందువు
మచ్చికతో నొకమారు మాఁటాడితేఁ జాలు
గచ్చుల నంతటిలో కంకణము గట్టుదువు ॥ ఏమి ॥

చెంగట మగవాఁడని సిగ్గువడితేఁ జాలు
సంగడి నందుకే సరసమాడుదువు
ముంగిటికి నీవు రాఁగా మొనసి మొక్కితేఁ జాలు
కొంగువట్టి పెనఁగి గక్కునఁ గాఁగిలింతువు ॥ఏమి॥

చిప్పిలునీ సేఁతలకు సెలవి నవ్వితేఁ జాలు
దప్పిదేర మోవి యాని తగులుదువు
యిప్పుడిట్టె శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
వొప్పుగ రేయిఁబగలు వొనగూడి యుందువు ॥ఏమి॥ 16

సామంతం

చూడఁ బిన్నవు గాని నీసుద్దు లెన్నైనాఁ గలవు
వేడుకకత్తెకుఁ గాని వేసాలింత రావే ॥పల్లవి॥

తేలగిల రమణుని దిష్టించి సారెఁ జూచేవు
చేలకొంగ గాతఁ దంటితే సిగ్గువడేవు
నాలితనాన సెలవి నవ్వూఁ గొంత నవ్వేవు
యీలీల తరితీపులు యెన్ని నేర్చుకొంటివే ॥చూడ॥

మునుకొని మగవాని ముందరనూఁ బొలసేవు
పెనఁగి పైకొంటేఁ దప్పించుకొనేవు
మనసిచ్చి యంతలోనె మంచిమాఁట లాడేవు
యెనలేనియడియాస లెన్ని నేర్చుకొంటివే ॥చూడ॥

సేవసేసేదానివలె చేరి వద్దనే వుండేవు
శ్రీవేంకటేశుఁ దేలితే జీరదీసేవు
భావించాడతఁడు నన్నేలె పాదాలకు మొక్కేవు
యీవిధాన నిట్టిబూమె లేమి నేర్చుకొంటివే ॥చూడ॥ 17॥

ముఖారి

ఎఱఁగ గొల్లపడుచ[1]నిల్లు గాచుకుండఁగాను
మఱి కృష్ణుఁడు వచ్చి నామయి చెమరింపించెనే ॥ పల్లవి ॥

పాపట దువ్వేనంటా బాసికము గట్టినాఁడే
చాఁపేనంటాఁ జేత నేసలు చల్లెనే
కాఁపురాలు సేతమని కాఁగిలించుకొనెనే
మాపుదాఁకా నేమోసేసి మనసు గరఁచెనే ॥ ఎఱ ॥

కైదండ వట్టేనంటా కంకణము గట్టెనే
జూదాలాడేనంటా రొమ్ముచోటు గీరెనే
సోదించేనంటా నొడి చూపుమని పట్టెనే
పోదిసేసి వేగినంతా పులకలు రేఁచెనే ॥ ఎఱ ॥

మొగము చూపు మనుచు మోవిపొత్తు గలసెనే
నగేనంటా బిగ్గఁబట్టి నామెక్కించెనే
చిగురుఁబడుకమీఁద శ్రీవేంకటేశుఁడు
తగరువలె మాఁటాడి తలఁపు చొక్కించెనే ॥ ఏఱ ॥ 18 ॥

రేకు 804 సౌరాష్ట్రం

అంతే పో వోయమ్మ ఔనయ్య మంచివాఁడవు
పంతాన నీతోఁ బెనఁగేపాటిదా యీమగువ ॥ పల్లవి ॥

కన్నెపడుచైనదానిఁ గాఁగిట బిగింతురా
పన్నీ పూవువలెఁ జేతఁ బట్టుట గాక
చిన్నిచన్ను లొక్కమాఁటే చిప్పిలఁ బిసుకుదురా
మన్ననలనే రతుల మరపుట గాక ॥ అంతే ॥

---

1. అని+ఇల్లు

సిగ్గరిపెండ్లికూఁతురుఁ జిందువందు గాఁ దీతురా
వొగ్గి రొమ్ముమీఁదఁ బెట్టుకుండుట గాక
కగ్గులేనికెమ్మోవి కడుఁ బిప్పి సేతురా
తగ్గకుండాఁ గాఁగిటఁ దమిరేఁచుటగాక ॥ అంతే ॥

కొత్తవయసుపడుచు గోరికొన సోఁకింతురా
పొత్తుగ లాలన సేసి పొందుటగాక
యిత్తల శ్రీవేంకటేశ యిన్నిటా నీవేలితివి
నిత్తెము నీసేవలెల్లా నేరుపుటగాక ॥ అంతే ॥ 19 ॥

దేసాళం

ఇదివో నీపొందు లెట్టనరాదు
కదిసితే నంటురాయిగతివంటివాఁడవు ॥ పల్లవి ॥

సూటిగా నీసింగారము చూడఁగవచ్చుఁగాని
నాటినచూపు దిప్పుకొనఁగరాదు
మాటలు నీతో నాడి మలయఁగవచ్చుఁగాని
మాటికి నీసల్లాపము మరవఁగరాదు ॥ ఇది ॥

ననుపు సేసుక నీతో నవ్వఁగవచ్చుఁ గాని
వెనక నది యణఁచుకొనఁగరాదు
చెనకి సరసమున చేత నంటవచ్చుఁగాని
పెనగొన్న కేలు విడిపించఁగరాదు ॥ ఇది ॥

కలయికరతి నిన్నుఁ గాఁగిలించవచ్చుఁగాని
వలవంతఁ గొంతైనా వదలరాదు
చెలరేఁగి నీవె నన్ను శ్రీవేంకటేశ కూడితివి
యిల మెచ్చవచ్చుఁగాని యేమి (మీ?) ననరాదు ॥ ఇది ॥ 20

## మేఘరంజి

మొదల నిన్నుఁ జూచితే మొగమోటము [1]గనము
యెదురు గుదురుగా నిన్నేమి సేతుమయ్యా ॥ పల్లవి ॥

కొంచక నీవు సేసేవి గొప్పగొప్పచేఁతలు
మంచిమాట లాడేవు మాతో నైతే
పొంచి చెవులారా వింటే పొసఁగ నీప్రియాలు
యెంచారావు పంచారావు యేమిసేతుమయ్యా ॥ మొద ॥

యెక్కడనైనా నీచల మెంతవలసినాఁ గద్దు
పక్కన నవ్వేవు మాతో పలుమారును
యిక్కడనే కంటిమి నీయిచ్చలు కోటికొండలు
యెక్కారావు దిగారావు యేమిసేతుమయ్యా ॥ మొద ॥

ఘత్తిననీదేవుళ్ల అంతటా నిండి వున్నారు
గుత్తముగా నాకాఁగిటఁ గూడితి విందు
నిత్తె[2]ము శ్రీవేంకటేశ నీవలపు మోపులాయ
యెత్తారావు దించారావు యేమి సేతుమయ్యా ॥ మొద ॥ 21 ॥

## శ్రీరాగం

నవ్వుగాదు నే నిన్ను నమ్మితిఁ జుమ్మీ
యివ్వల నామోవి లంచ మిచ్చితిఁజుమ్మీ ॥ పల్లవి ॥

మంతనాన నీవాడినమాటలు మఱవకుమీ
కాంత లెందరైనా నీకుఁ గలవాఁడవు
వింతలేకుండా నిప్పుడే విన్నవించుకొంటి నేను
అంతలోనే ఇది బాస యడిగె ననకుమీ ॥ నవ్వు ॥

1. ఘనశబ్దభవమా ; 2. నిత్యశబ్దమునకు క్రొత్త తద్భవము.

గట్టిగాబిగించుకొన్న నాకాఁగిలిఁ దలఁచుకొమ్మీ
గుట్టునఁ బెక్కుసతులఁ గూడేవాఁడవు
వొట్టి సేవలెల్లాఁ జేసి వొడఁబాటు సేసుకొంటి
నెట్టనే నిన్ను మీఁదుకట్టితి ననకుమీ ॥ నవ్వు ॥

పుక్కిటితమ్మ వెట్టినపొందు విడువకుమీ
మిక్కిలివనితలకు మేలువాఁడవు
నెక్కొని శ్రీవేంకటేశ నిన్ను నిందుకే కూడితి
చొక్కించి నాసొమ్ముగాఁ జేసుకొనె ననకుమీ ॥ నవ్వు ॥ 22 ॥

## ఆహిరి

ఆఁపలేక కొసరితి నంతియకాక
పైపై నిన్నింత వొడఁబరచఁగవలెనా ॥ పల్లవి ॥

తలఁపులో తమకము దాఁచ నలవిగాక
చెలరేఁగి విన్నపము చేసితిఁగాక
మలసి నీయంత నీవు మన్నించవా నన్ను
నెలకొన్న నావలపు నీ వెరఁగనిదా ॥ ఆఁప ॥

తనువుపై జవ్వనమదము వారించఁగరాక
వొనర నాచన్నుల నిన్నొత్తితిఁగాక
ననుపుతో చనవులు నాఁడే నాకియ్యవా
నినుపైననావునికి నీవు చూడనిదా ॥ ఆఁప ॥

వెసఁ గాఁగిటిలో రతివేడుక వసముగాక
పసలుగా నిన్నుఁ గూడి పైకొంటిఁగాక
పొసఁగ శ్రీవేంకటేశ భోగము నాకియ్యవా
మెస(ఁ?)గ నాగుణము నీవిటు సోదించవిదా ॥ ఆప ॥ 23 ॥

గౌళ

ఎందరిఁ బెండ్లాడినా నీకేమాయను
అందుకుఁగా నే నిన్ను నొఁగాదనేనా ॥ పల్లవి ॥

వలచి వచ్చితినని వనిత వేఁడుకొనఁగా
చెలిమిసేయక యేల సిగ్గువడేవు
సొలపుఁజూపుల నిన్నుఁ జూచిచూచి కొసరఁగా
తలవంచుకొని యేల తప్పించుకొనేవు ॥ ఎంద ॥

కాఁపురము సేయవచ్చి కాచుకొని యాపె వుండఁగా
యేపున నీవు సెలవి నేల నవ్వేవు
పైపై నీతమ్ములానకు భామ చేయిచాఁచఁగాను
రాఁపుజాణతనా లేల రచ్చలో నాడేవు ॥ ఎంద ॥

వేడుకతో నాపె నీకు వెసఁ బాదాలొత్తరాఁగా
కూడుదువు గాక యేల గుట్టుచూపేవు
యీడనె శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
వీడెమిచ్చేసతి నేల వింతసేసేవు ॥ ఎంద ॥ 24 ॥

రేకు 805 భైరవి

చెలులము మాచేతఁ జెప్పించరాదు
వెలయ నాతఁడు నీవు విచారించుకొనవే ॥ పల్లవి ॥

సిగ్గువడ నేమిటికి చిత్తములోనివేడుక
యెగ్గుగాదు రమణుని కెరిఁగించవే
తగ్గించి దాఁచవచ్చునా తలఁపులోనివలపు
వొగ్గి యాకతానకు నీవు వొనరిక(క(?)డీయవే ॥ చెలు ॥

ముసిముసినవ్వులేల ముంచిననీకోరికలు
వెస నాతడుఁ జెల్లించీ వేఁడుకొనవే
వసగాని[1]చన్నులజవ్వన మొద్దంటేఁ బోవునా
కొసరి చూపుదుగాని కూడి తెరవేయవే ॥ చెలు ॥

సన్నలుఁ జాయలు నేల చలమున నీయాస
పన్ని యితఁ డీడేరిచీ విన్నవించవే
నిన్ననే తాఁ గూడినాఁడు నీవేల మొరఁగేవు
యెన్నిక శ్రీవేంకటేశు నింకాఁ గాఁగిలించవే ॥ చెలు ॥ 25 ॥

శ్రీరాగం

ఎంత సింగారించుకొంటి విప్పుడు నీవు
చింతించఁ జక్కఁదనమే సింగారము గాదా ॥ పల్లవి ॥

కాంత నీవు నిమ్మపండ్లు గాను కియ్యవలెనా
బంతి నీచన్నులే నిమ్మపండ్లుగావా
పొంత నందుకుఁ దామరపూవుల వేయవలెనా
చెంతఁజూచేనీకన్నులే చెందామరలు గావా ॥ ఎంత ॥

కలికి నీవప్పటిని కప్ర మంపవలెనా
కలగొన్ననవ్వులే కప్రాలు గావా
తెలిసి నీమాఁటల తీపులు చల్లవలెనా
తిలకింప మోవితేనే తీపులు గావా ॥ ఎంత ॥

వనిత యింటికిఁ బిలువఁగ నింతవలెనా
యెనసితే నీపయ్యదె యిల్లుగాదా
చెనకి యలమేల్మంగ శ్రీవేంకటేశుఁడఁ దాను
కని మొక్కవలెనా నీకాఁగిలే మొక్కు గాదా ॥ ఎంత ॥ 26 ॥

---

1. 'వసము + కాని'

పళవంజరం

వింటి[1]రటే చెలులాల వేడుక సంతోసవార్త
యింట నింట పూరనెల్ల యిదే సుద్ది ॥ పల్లవి ॥

కోమలి దేవకిదేవి కొడుకుఁ గంటే రేపల్లెఁ
బ్రేమతో వసుదేవుఁడు పెంచఁబెట్టి వచ్చెనట
గామిడై యశోదకూఁతుఁ గంసునికిఁ జూపెనట
ఆమగువ కంసుని నదలించినదట ॥ వింటి ॥

శ్రావణబహుళాష్టమి సవరేతిరికాడను
ఆవేళ రోహిణి మంచిదైనపొద్దూనట
కావింప మేనమామకు గండమట యీతఁడే
దేవరట బాఁపలెల్లా దిక్కులఁ జెప్పిరి ॥ వింటి ॥

యిటమీఁద రాకాసుల నిందరిఁ గొట్టెనట
ఘటన సాధులనెల్లాఁ గరుణ రక్షించెనట
పటుగతి వీఁడు శ్రీవేంకటగిరికృష్ణుఁడట
నటించునలమేల్మంగనాయఁకుడు దానట ॥ వింటి ॥ 27 ॥

సామంతం

సందుసుడికత్తెలజాణతనా లిట్టివౌనె
పొందులేనిపొందులేల పొదువ వచ్చేవే ॥ పల్లవి ॥

బట్టబయ లాతఁడు నీబావంటా నందరితో
చుట్టరికా లెంతేసి చూపి చెప్పేవే
మెట్టిపట్టు కప్పటి నీమేనత్తకొడుకంటాను
జట్టిగొని యాతనితో సరసాలాడేవే ॥ సందు ॥

---

1. ఇది అధ్యాత్మధాతులో నున్నది.

బెరసి యాతఁడు నీపెండ్లికొడు కవునంటా
సొరిదిఁ గంకణ మెట్టు చూపవచ్చేవే
గరిమ నాతఁడు నీకాలు దొక్కినాఁడంటా
పరపుపై నింటిలోనఁ బవళించేవే ॥ సందు ॥

వూఁకె యిప్పుడు నీవాడివట్టె నీతఁడంటా
నోరిమాటలాడి చన్నుల నొత్తేవే
యీరీతి శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
నారమణుఁడేలె నన్ను నవ్వులేల నవ్వేవే ॥ సందు ॥ 28 ॥

## ముఖారి

కాఁగిలించి పట్టుకోరే కల్లరి వీఁడు
మాఁగినమోవి చూపి మరిగించీ పీఁడు ॥ పల్లవి ॥

కోడెకాండ్లఁ దాను కోలలెత్తుకొని
వాడవాడల నుట్లు వడిఁ గొట్టీని
వేడుకకాఁడమ్మ వెసఁ గృష్ణుఁ డిటువంటి-
జాడలు వద్దంటేను చన్నులంటీని ॥ కాఁగి ॥

వీదివీదిఁ బాలువెన్న వెసఁ గొల్లలాడినాఁడు
ఆదెసఁ జాడెలు నిండి అట్టెవున్నవి
పాడుకొని చక్కిలాలబాన విడువుమని
పాదాలకు మొక్కితేను పయ్యద దెరచీని ॥ కాఁగి ॥

వోసరించక యిదివో వుట్ల[1]పండగసేసి
వేసరక పెక్కిండ్లవిందైనాఁడు
సేసవెట్టె నిందరిపై శ్రీ వేంకటాద్రిమీఁద
బాసతో నలమేల్మంగపతియైనకృష్ణుఁడు ॥ కాఁగి ॥ 29 ॥

1. దీని గురుతేనా ఉట్లపండుగ. (ఉట్లోత్సవము)

రామక్రియ

చిత్తగించి చూడవయ్యా సిగ్గువడ నీకేఁటికి
బత్తిసేసీ నాకె నీపై భావించవయ్యా ॥ పల్లవి ॥

సెలవుల నవ్వుతాను చేరి మాఁటలాడుతాను
పలువరుసలు చూపీఁ బడఁతి నీకు
నిలుగునివ్వెరగుతో నిండుసింగారములెల్లాఁ
బలుమారు నీముందరఁ బచరించీని ॥ చిత్త ॥

కొప్పు చక్కఁ బెట్టుకొంటా కొలువులు సేసుకొంటా
నెప్పునఁ జన్నుల నొత్తీ నెలఁత నిన్ను
వుప్పతిల్లుఁగళలతో నుడివోనిజవ్వనాన
కుప్పళించి వలపులు గురిసీ నీయెదుట ॥ చిత్త ॥

సరులు దిద్దుకొనుచు చవులెల్లా మోవిఁ జూపి
మరిగించీ నలమేలుమంగ నిన్నును
ఇరవై శ్రీ వేంకటేశ యిటు నన్ను నేలితివి
వురముపై నుండి యాపె వుబ్బించీ నీమనసు ॥ చిత్త ॥ 30

రేకు 806 శంకరాభరణం

అలమేలుమంగను నేనైతేనయితిఁగాక
నిలుచుండి నన్నుఁ జూచి నీకేల లోఁగను ॥ పల్లవి ॥

చేరి విన్నవించవే సిగ్గువడ నీకేఁటికి
చీరుమూరుగా వలచినదానవు
వేరులే కప్పటనుండి నేళగాచుకుందానవు
నేరుపుతో నన్నుఁ జూచి నీవేల లోఁగేవు ॥ అల ॥

గట్టిగాసు నవ్వవే కడుదాఁచనేఁటికి
తొట్టినట్టితమకముతోడిదానవు
[1]నట్టున నందుకుఁగానే కోరి లాచివుందానవు
నెట్టన నేనుండఁగాను నీవేల లోఁగేవు ॥ అల ॥

యెనసి కాఁగిలించవేఁ యేఁకరఁగ నీకేఁటికి
పనివడి యట్టె యాసపడదానవు
మునుపె నన్నుఁ గూడె నిమ్ముల శ్రీ వేంకటేశుఁడు
నిను నాతఁడే కూడీ నీవేల లోఁగేవు ॥ అల ॥ 31

రామక్రియ

విచారించవలె నాకు వేడుకకత్తెవు నీవు
పచారించి యతనిఁ జేపట్టవు గదా ॥ పల్లవి ॥

చెక్కులవెంట నేలే చెమట గారీ
తెక్కులఁ గన్నుల నేలే తేటలు వారీ
యెక్కడనుండి వచ్చేవే యింతిరో నీవు
మక్కువ నామగనితో మాఁటాడవు గదా ॥ విచా ॥

యెన్నఁగ నీపోఁకముడి యేల వీడీ
వన్నెలఁగెమ్మోవి యాల వసివాడీ
చెన్నుమీర రతి యెందుఁ జేసి వచ్చేవే
అన్నిటా నారమణుని నంటవుగదా ॥ విచా ॥

చాలె మేనఁ బులకససులు నిండీ
మేలు నీమేనివలపు మిక్కిలి పండీ
ఆలకించి యెవ్వరిఁ బెండ్లాడి వచ్చేవే
యేలిననాశ్రీవేంకటేశుఁ గూడవుగదా ॥ విచా ॥ 32 ॥

1. యతిభంగమైనట్లున్నది. 'లాచి'కి బదులు 'నాచి, గాలో'ఁడు.

నాదరామక్రియ

వేరే (రై?) నిన్నుఁబాసినట్టివిరహమే యరఁగదు
ఆరీతిఁ గూడివుందాననంటానే వున్నది ॥ పల్లవి ॥

తలఁపులో నీరూపు తలపోసి మదిరాక్షి
సొలసి మాఁటలాడి చొక్కుచు నుండు
వలపు లూరకే చల్లు వాడికలు చేసుకొని
వులివచ్చిరతులలో నోలలాడును ॥ వేరే ॥

నెట్టనఁ జేతిబాగాలు నీకు సమర్పణ చేసి
అట్టె తంమ్మ* (తమ్మ?)లమ్మ నిన్నడుగుచుండు
గట్టిగా నీవిచ్చినవుంగరము చన్నులంటించి
తొట్టుకొన్నయట్టిసిగ్గుతోడఁ గడునవ్వును ॥ వేరే ॥

పైపై నీభావచిత్రపలక కాఁగిటఁ జేర్చి
దీపించువేడుకతో తెరవేసును
యేపున శ్రీవేంకటేశ యింతలో నీవు గూడఁగా
వోపికతో నాఁడు నేఁడు నొక్కరీతినుంన్న (నున్న!)ది ॥ వేరే33॥

లలిత

అట్టె నీకాఁగిటి కాపె యాసపడి వచ్చెనేమో
దట్టముగ నిఁక దయదలఁచఁగరాదా ॥ పల్లవి ॥

మోవితేనె లుట్టిపడ ముచ్చటలాడీఁ జెలి
వోవరిలోఁ గూచుండి వూఁకొనరాదా
చేవమీరఁ గొనగోళ్ళఁ జిక్కుదీసీని నెరులు
సేవలకు మెచ్చి యిట్టె చిత్తగించరాదా ॥ అట్టె ॥

* 'తమ్మకు' 'తంమ్మ' 'నన్ను, కు 'నంన్ను' వంటివ్రాత రేకులలో చాల చోట్ల గలదు. శాసనములవ్రాత లెరిగినవారి కిది వింతగాదు.

కొనచూపులనే నీపైఁ గుమ్మరించీ వలపులు
పెనఁగక కాఁగిటికిఁ బిలుపఁగాదా
తనివోనితమకానఁ దడఁబడి నీకు మొక్కీ
చనవు చేకొని సరసములాడరాదా ॥ అట్టె ॥

నెలవుల నవ్వులనే నేసలు నీపైఁ బెట్టీ
లలిఁ గంకణము గట్టి లాలించరాదా
యెలమి శ్రీవేంకటేశ యేలితి వీకె నింతలో
వెలసె నీకోరికలు విడెమియ్యరాదా ॥ అట్టె ॥ 34 ॥

సాళంగం

నా[1]వల్లఁ (యందుఁ?) దప్పు లేదు నేనా చాటిచెప్పితిని
నాయము మీరు చెప్పరే నాకూ నాతనికీ ॥ పల్లవి ॥

పాయపువాఁడు గనక పంతములే యాడీని
చాయల నేనూ నిట్టే జవ్వనిఁగదే
చేయి మీఁదాయనంటాను చెనకఁగవచ్చీని
ఆయములు నేనూఁ గొంత అట్టె సోఁకింతుఁగదే ॥ నావ ॥

వేడుకకాఁడు గనక వేసీఁ బూవులచెండున
వాడిక నాతమి తనవంటిదే కదే
వీడెమిచ్చితినంటాను వెసఁ గొంగువట్టీని
తోడనే నేనూఁ గాలుదొక్కి పైకొందుఁగదే ॥ నావ ॥

బలిమికాఁడు గనక పట్టీ నాచనుఁగన
నలి నేనూఁ గాఁగిటఁ బెనఁగుదుఁగదే
యెలమి శ్రీ వేంకటేశుఁ డింత సేసి నన్నుఁ గూడె
కెలసి తనమోవి యెంగిలి సేతుఁగదవే ॥ నావ ॥ 35 ॥

---

1. ప్రాసభంగమైనది.

మధ్యమావతి

వెలయ ముందపెత్తు విచారించుకొనవయ్య
కలసేవు నాకాఁగిటఁ గాదనేనా నేను ॥ పల్లవి ॥

ఒచ్చెనమాట లాడి భామ నిన్ను వలపించె
యిచ్చకములే సేసి యిల్లుమరిపె
లచ్చనగా మోవిమీఁద లకముద్రలునుఁ బెట్టె
యిచ్చటికి విచ్చేసితి వేమనునో ఆపె ॥ వెల ॥

గక్కన తనసొమ్మని కంకణము చేతఁ గట్టె
తక్కక సేవలుసేసి తమిరేఁచెను
పక్కనఁ బూవులదండ పైవేసె గురుతుగా
ఇక్కగ నన్నుఁ జెనకే వేమనునో ఆపె ॥ వెల ॥

నెలకొని పాదాలొత్తి నిన్ను నిట్టె పెండ్లాడె
లలి గంటలనూలు నీమొలఁ గట్టెను
చెలఁగి నాకు వలచి శ్రీవేంకటేశ కూడితి–
వెలమి నిట్టె విని యేమనునో ఆపె ॥ వెల ॥ 36 ॥

రేకు 807 సాళంగనాట

[1] ఈఁదుకరమ్మనవే యిటు నన్నుఁ జూచుఁగాని
యీఁదాడంటేఁగోదాఁడనేయెడమాట లేఁటికి ॥ పల్లవి ॥

వలపు లీఁతలబంటి వడి నాకు నైతేను
తలపోఁతలకునైతే తలబంటి
కలువలకైతేను కాముకింటితెగబంటి
చిలుకలకెల్లాను మచ్చికఁ బుక్కిళ్లబంటి ॥ ఈఁదు ॥

1. ఈ పాటలో నిభావము సులభాన్వయమై స్పష్టపడుటలేదు.

పాయము మోపులకొద్ది పైపై నాకైతేను
కాయపుగుబ్బలకైతే గంపలకొద్ది
చాయవెన్నెలలకైతే చంద్రుడుగాసినకొద్ది
కోయిలలకైతేను కుత్తిక కొద్ది ॥ ఈఁదు ॥

సారమైనవేడుకలు సందెఁదేసి నాకైతేను
కోరికలకైతేను గుంపెఁదేసి
యీరీతి శ్రీవేంకటేశుఁ డిట్టెవచ్చి నన్నుఁగూడె
శే[1]రికలనోరిరాద చెప్పఁ జేటఁదేసి ॥ ఈఁదు ॥ 37 ॥

## ఆహిరి

మగఁడట అలట మాఁటలెన్నైనా నాడితే
తగు తగదన నేలే తరుణులాలా ॥ పల్లవి ॥

పాయపువారికినెల్లా పట్టరాదు తమకము
ఆయాలు సోఁకఁ బతితో నాడకుందురా
చేయిమీఁదుగా నీతనిఁ జెనకెనంటా సతికి
నాయము లేమిచెప్పేరే నాతులాలా ॥ మగఁ ॥

వలచినవారికి వడియుచుండు మదము
బలిమిఁ బ్రియునికొంగు పట్టకుందురా
పెలుచుఁదనాన నీకె పెనఁగెనంటా మీరు
పలుకనేలే సాకిరి పడఁతులాలా ॥ మగఁ ॥

తతిఁ గూడినవారికి దాఁచరాదు గర్వము
మితులు రతులలోన మీరకుందురా
ఇతవై శ్రీవేంకటేశునెద నీపె వున్నదంటా
కత లేమాడుకొనేరే కాంతలాలా ॥ మగఁ ॥ 38 ॥

---

1. శారికలా?

కాఁ(కాం) బోది

చెల్లఁబో యెన్నాళ్లైనాఁ జిన్నదానవా
వెల్లవిరి నీతనికి వినయాలు సేయవే ॥ పల్లవి ॥

యీపొద్దు నీపతి వచ్చె నేల సిగ్గులువడేవే
చూపుల నివాళ్లీవే సుదతి
తీపైననీమోవివిందు తెల్లమిగఁ జెప్పవే
యేపున నీవేడుకల నెదురుకొనఁగదే ॥ చెల్లఁ ॥

నలుగడ నెలవులనవ్వుల ముగ్గువెట్టవే
నిలువుఁజెమటల పన్నీళ్లియ్యవే
పలుకులకప్పురాల బాగా లొసఁగవే
వెలయఁగ నీమేను విడిదేల సేయవే ॥ చెల్లఁ ॥

పట్టగుసీకాఁగిటఁ బానుపు వరచవే
గట్టినీచన్నులఁ దలగడ వెట్టవే
యిట్టె శ్రీవేంకటేశుఁ డిన్నిటా నిన్నుఁగూడె
ఒట్టిగొన్నరతి నుపచారాలు సేయవే ॥ చెల్లఁ ॥ 39

మాళవి

ఈతఁడు గుట్టుమానిసి యీతఁడు గంభీరుఁడు
కాఁతరీఁడు గాఁడు యేల కాఁకలు సేసేవే ॥ పల్లవి ॥

చెక్కు చేతఁబెట్టుకొని నెలవుల నవ్వుకొంటా
మక్కువ నీతనితోడ మాటలాడేవు
జక్కవచన్నులమీఁదిచంద్రకావిపయ్యద
పక్కన జారించి యెంత భ్రమలఁబెట్టేవే ॥ ఈతఁ ॥

తలిరుమోవి చూపి తములము సేసుకొంటా
పలుమారు నీతనిఁ దప్పకచూచేవు
చెలులమంటుననుండి సిగ్గులు నెరపుకొంటా
వలపులు చల్లి యెంత వలలఁ బెట్టేవే ॥ ఈతఁ ॥

చిమ్ముఁజెమటలతోడ సేసకొప్పు గదలఁగ
కమ్ముక శ్రీవేంకటేశుఁ గాఁగిలించేవు
పమ్మి నన్నుఁ గూడినాఁడు బయ(లు)సింగారాల
యెమ్మెలుసేసి యేల యెలఇంచేవే ॥ ఈతఁ ॥ 40 ॥

## బౌళి

ఆతఁడు నీకు మోహించీ నన్నిటా బత్తిసేసీని
చేతికి లోనై వుండవే చెప్పితినే బుద్దులు ॥ పల్లవి ॥

వినయములే సేసి వేడుకలు చూపవే
మనసురాఁ బతితోను మాటలాడవే
తనివోవ కేపొద్దు దండఁ గాచుకుండవే
ననుపుసేసుకొని నవ్వులెల్లా నవ్వవే ॥ ఆతఁ ॥

యెగ్గులు వట్టకువే ఇచ్చకము సేయవే
సిగ్గులువడకువే చెనకితేను
వెగ్గళించి రతులలో వేసట సేయకువే
అగ్గమై చన్నుల నొత్తి యట్టె పెనఁగవే ॥ ఆతఁ ॥

మొగమెత్తి చూడవే మోహములు చల్లవే
చిగురుమోవి చూపి చెలఁగించవే
జిగిమించ నంతలోనె శ్రీవేంకటేశుఁడు గూడె
తగిలి పాయకువే తముల మడుగనే ॥ ఆతఁ ॥ 41 ॥

రామక్రియ

తనచిత్త మెఱఁగము తగుల నెట్టు వచ్చునే
చెనకేఁగానీ ముందే సేసవెట్టు మనవే ॥పల్లవి॥

ననుపుగలసతులు నవ్వితే నమరుఁ గాక
పెనఁగితే వింతవారు ప్రియమయ్యేరా
చనవు గలిగితేను సరసమాడుట గాక
మనసెనయనిచోట మచ్చిక గలుగునా ॥తన॥

పిలిచితేఁ గొంతగొంత బిగియఁగవచ్చుఁగాక
తలఁచకుండఁగ వచ్చి తమిరేఁతురా
వలపుగలుగుచోట వాడిక సేతురుగాక
కెలనిచుట్టాలు రతికేలి సేయఁదగునా ॥తన॥

చెక్కునొక్కి వేఁడుకొంటే సిగ్గువడవచ్చుఁగాక
అక్కడిమోమై యుండఁగా నంటవచ్చునా
యిక్కువెరిఁగి శ్రీవేంకటేశుఁడే నం(న)న్నేలెఁగాక
తక్కినవారికినెల్లాఁ దడవఁగ వచ్చునా ॥తన॥ 42॥

రేకు 808 కాంబోది

అంగన నీతోఁ బెనఁగదంటా నేలసాదించేవు
చెంగలువవంటిదిది చెనక నిన్నోపునా ॥పల్లవి॥

సెలవుల నవ్వేది సిగ్గుతోడ నుండేది
వలపులసొల పాఁడువారిసాజము
చవివాయ లాలించేది చనవులు చెల్లించేది
నెలకొని మన్నించేది నీచేతి దిఁకను ॥అంగ॥

తనినోవక చూచేది దండనే నిలుచుండేది
గసమైనవినయమే కాంతలపోఁజ
మనసిచ్చి మాఁటాడేది మచ్చికతోఁ గలసేది
నిను సేవించనిచ్చేది నీచేతి దిఁకను ॥ అంగ ॥

గుట్టుతోడ నుండేది కొసరుచు మొక్కేది
దట్టపుటాసలు వనితలగుణము
యిట్టె శ్రీవేంకటేశ యీకె నేలుకొంటివి
నెట్టనఁ బాయకుండేది నీచేతి దిఁకను ॥ అంగ ॥ 43 ॥

## బౌళిరామక్రియ

నెఱజాణ విన్నిటాను నీవెఱఁగవా
మఱి నీచిత్తముకొద్ది మమ్ము మన్నించవయ్యా ॥ పల్లవి ॥

చెలిమికొలఁదియే చెల్లుబడి
కలిమికొలఁదియే కాఁపురము
వలపుకొలఁదియే వాడిక
తలపుకొలఁదియే తాలిమి ॥ నెఱ ॥

పట్టినకొలఁదియే పంతము
చుట్టరికముకొలఁదే సోబనము
దిట్టతనముకొలఁదే తేఁకువ
నెట్టుకొన్నకొలఁదే నిలుకడ ॥ నెఱ ॥

కూడినకొలఁదియే కూటమి
వేడుకకొలఁదియే విందులు
యీడనె శ్రీవేంకటేశ యెనసితివి
యీడుజోడైనకొలఁదే యింపులు ॥ నెఱ ॥ 44 ॥

పాడి

కాంతలకుఁ బతులకు గడవరా దీమాయ
యెంతని చెప్పఁడుఁ దానే యెరుఁగు నావలపు ॥పల్లవి॥

వదినెమరఁదియనేవావులే యాసలు రేఁచు
కదిసి పాయకుండితే కాఁక వుట్టించు
చెదరనిఁగూపులే చింతకు మూలములవు
పొదలునేకాంతాలు పొందులెల్లాఁ జేయును ॥కాంత॥

పచ్చిదేరేసిగ్గులే భావములు గరఁగించు
ముచ్చటనవ్వులే కడుమోహము నించు
కచ్చుపెట్టి సరసాలు కాయము లంటింపించు
యిచ్చకము వినయము నింపులు వుట్టించును ॥కాంత॥

పాయపుమదములు గొబ్బన రతులకుఁ దీసు
చాయలు సన్నలు మోవిచవులు చూపు
యీయెడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
ఆయమైనమాటలు అన్నిటాఁ జొక్కించును ॥కాంత॥ 45॥

మంగళకౌశిక

విన్నవించవే యీమాఁట విభునికిని
కన్నులారాఁ దానే వచ్చి కనుఁగొనుమనవే ॥పల్లవి॥

తన్నుఁ దలఁచుకొంటేను తలపోఁతలు
విన్నవినుకలి రేఁచీ వేడుకలు
చన్నులపైఁ జేసినాడు చంద్రవంకలు
యెన్నరానినామోహ మేమని చెప్పుదునే ॥విన్న॥

దిట్టనై నే నొంటినుండితే విరహము
అట్టె తొంగిచూచితేను ఆడియాసలు
కట్టినాఁడు ముంజేతఁ గంకణము
యెట్టు వేగించఁగవచ్చు నేమిసేతునే ॥ విన్న ॥

నేనే మాటాడేనంటే నిండీ సిగ్గు
మోనమున నుండితేను ముంచీఁ గామి
తానే శ్రీవేంకటేశుఁడు తగ నన్నేలె
యీనెపాలెల్లా నాకు నేమిటికి వచ్చునే ॥ విన్న ॥ 46

దేసాళం

ఏమని చెప్పుదుమయ్య యిదివో నీభాగ్యము
భామవేడుకలు నీకు నామనై నిలిచెను ॥ పల్లవి ॥

చెలిమేనఁ గురిసేటిచెమటలవానకు
మొలచెఁ జిరునవ్వులు మోసులెత్తి
చలువమంచితనాలు జవ్వనము పంట[1] వండి
కొలఁదిలేనిచన్నుల గొప్పరాసులాయను ॥ ఏమ ॥

కలికిమోమునన్నకారుమెఱుఁగులకును
జలజలఁ బల్కుఁదేనె జడివట్టెను
యెలమి సింగారరస మేరులు నిండాఁ బారి
తలపోఁతచెరువుల దైవారె మరవలు ॥ ఏమ ॥

అలమేలుమంగమోహమనేసోనలు ముంచి
పలువిధములరతుల పదనెక్కెను
యెలమి శ్రీ వేంకటేశ యెదురీఁతకాగిఁట
వులివచ్చి యానందాన నూటులెత్తును ॥ ఏమని ॥ 47

1. వంట+పండి

శుద్ధవసంతం

ఇంకా నెంత సేసునో యీపెకు నీతోడిపొందు
పొంకమైనకొత్తవలపులది యీ మగువ ॥పల్లవి॥

చెమటలు మేననిండె సిగ్గులెల్లా ముంచుకొనె
రమణి నీతో సరసములాడఁగా
తమకము లుప్పతిల్లె తగ నిట్టూర్పులు రేఁగె
తిమురుచు సారెకు నీదిక్కు చూడఁగాను ॥ఇంకా॥

సెలవుల నవ్వుదేరె సేసకొప్పు వెడజారె
నెలఁత నీకొలువులో నిలుచుండఁగా
పులకలు మేన నిండె పొదిగె నడియాసలు
నెలకొన్న వేడుకతో నీవద్ద నుండఁగాను ॥ఇంకా॥

కమ్ముకొనెఁ గోరికలు కళలు మోమునఁ దేరె
నెమ్మదిఁ జేతులెత్తి నీకు మొక్కఁగా
యిమ్ముల శ్రీ వేంకటేశ యీకె నిట్టె కూడితివి
చిమ్మిరేఁగె వలపులు సేవ సేయఁగాను ॥ఇంకా॥ 48

రేకు 809 కేదారగౌళ

ఇంత వేగిరకత్తెనా యెఱఁగనా నే నేమైనా
మంతనాన నన్నతఁడే మన్నించీఁగాక ॥పల్లవి॥

పతిసేల దూరేనే పడఁతీ
తతిగొన్న నావలపుఁ దడవేఁ గాక
రతిరా జేమిచేయునే రచ్చలోనను
ఇతవరి నావయసే ఇంత సేసీఁగాక ॥ఇంత॥

సవతుల నననేలే సకియా
జవళినాచూపునే సాదించేఁగాక
నవకపుచంద్రునితో నాకేడ పగే
తివురుచు నావయసే దిమ్మరేఁచుఁగాక ॥ ఇంత ॥

విరహముఁ దిట్టనేలే వెలఁదీ
తిరమైన నాబుద్ధినే తెలిపేఁగాక
యిరవై శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నేలె
సరససల్లాపముల సతమయ్యేఁగాక ॥ ఇంత ॥ 49

**ఆహిరి**

తప్పించుకొనఁగలఁడా దాఁటవచ్చునా తనకు
మెప్పించేఁగాని పానుపుమీఁదికి రమ్మనవే ॥ పల్లవి ॥

మగువలమాఁటలు మంచిచక్కెరతీపులు
నగవు లందులోనికి నానఁబాలు
వెగటుగా దెఁత్తై(దెంత్తై?)నా వేగినంతా నాడినాను
చిగిరించి చిగిరించి చిమ్మిరేఁచు ననవే ॥ తప్పిం ॥

పొదలుగుబ్బలు వలపులబోనపుదొంతులు
కదలుకనుచూపులు కప్రవిడేలు
అదనఁ బెనఁగితేను ఆసలాసలు వుట్టించు
పొదిగిపొదిగి కడుఁబోదిసేసు ననవే ॥ తప్పిం ॥

కలసినకాఁగిలి కమ్మపూవుచప్పరము
బలిమి మోవిరసాలు పానకాలు
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁగూడె
తలపించి తలపించి తగిలించుననవే ॥ తప్పిం ॥ 50

కాఁ(కాం) బోది

చేరి వూరకేల రట్టుసేసేవు నన్ను
సారె నాతో నవ్వేవు నీసరిదాననా ॥ పల్లవి ॥

వెలయ నాచెక్కునొక్కి వేఁడుకానే విందరిలో
అలుగ నీతో నే నంతదాననా
మలసి యప్పటి నన్ను మాఁటలాడించవచ్చేవు
పలుకకుండఁగ నీతోఁ బంతగత్తెనా ॥ చేరి ॥

జట్టిగొని చేయివట్టి సంగడికిఁ దీసేవు
అట్టె పెనఁగ నీతో వియ్యపుదాననా
గుట్టున నాపట్టుచీరకొంగు వట్టుకున్నాఁడవు
తొట్టినగర్వమున నీతో బలిమిదాననా ॥ చేరి ॥

జక్కవచన్నులంటి ప్రమరతి లాలించేవు
పక్కన నీతో మెచ్చేపాటిదాననా
యిక్కడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నెక్కొని నీవలె నం(న)న్నీ నేరిచినదాననా ॥ చేరి ॥ 51

సౌరాష్ట్రం

[1] సొలసితే పాయరానిచుట్టమవు నీవు నాకు
నెలకొంటివి నామతి నీవే యెఱుఁగుదువు ॥ పల్లవి ॥

పిలిచి చేవట్టితేను బెళకి తప్పించుకోకు
వలపులు చల్లితేను వంచకు తల
మోలనూలు వట్టఁగానే మోరతోపుఁదనమేల
చెలువుఁడ మారుమోము సేసుక నవ్వేవు ॥ సొల ॥

---

1, దశావతార సమన్వయము గలదు.

పొందులు సేయఁగాను పొదవు దాఁచకు మిఁక
కందువనే పతినలు కడుఁజూపేవు
మందలించి చెనకితే మలసేవు రాజసాన
విందువలె మేనంటితే వెలవెలఁబారేవు ॥ సొల ॥

సారె బుద్ధులడిగితే చల్లేవు సిగ్గులెల్లా
కోరి చూచితే నాదేవు గుబ్బముమీఁద
యీరీతి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
తారుకాణ సేసేవు దశావస్థలూను ॥ సొల ॥ 52

మాళవి

పిలువక వచ్చితిమి పేరటాండ్లము
సొలసి సొలసి మీపైన సోబానఁ బాడేము ॥ పల్లవి ॥

చుక్కబొట్టు వెట్టుకొని సూసరము గట్టుకొని
నిక్కినిక్కిచూచీ నాపె నీదిక్కు
పిక్కటిల్ల నీకు నాపె పెండ్లికూఁతురాయనో
చొక్కముగఁ జెప్పవయ్య సోబానఁ బాడేము ॥ పిలు ॥

ముప్పిరినవ్వులతోడ ముఁ(ముం?) జేతికంకణముతో
చిప్పిల నీయెదుటను సిగ్గువడీని
దెప్పరమై తానుఁ గొత్తదేవులు నీకాయనో
చొప్పులెత్తి చెప్పవయ్య సోబానఁ బాడేము ॥ పిలు ॥

తాళి మెడఁగట్టుకొని దైవారాఁ బసపు పూసి
ఆలాయనో తాను అప్పుడే నీకు
యేలితివి వేంకటేశ నన్ను నింతలోనే
సోలి నింకాఁ జెప్పవయ్య సోబానఁ బాడేము ॥ పిలు ॥ 53 ॥

వరాళి

ఏమని చెప్పేమయ్యా యివిగో మాభాగ్యాలు
నీమన్ననలే మాకు నిండునిధానాలు ॥ పల్లవి ॥

పలుకుఁబంతముతోను పతిచిత్తము వచ్చితే
వలపు కామధేనువు వనితలకు
పిలిచి మాఁటాడినప్రియము తంగేటిజున్ను
సెలవులనవ్వులు చేనిపంటలు ॥ ఏమ ॥

దయతోఁ దనమగఁడు తనవద్దనుండితేను
వయసు కల్పవృక్షము వనితలకు
నయమునఁ జూచేచూపు నమ్మినటువంటిసొమ్ము
రయమునఁ జెనకులే రత్నాభిషేకములు ॥ ఏమ ॥

చనవిచ్చి శ్రీవేంకటేశ నీవు గూడితేను
మనసే పరుసవేది మగువలకు
ననుపు నటించి నేఁడు నన్ను నిట్టె యేలితివి
నినుపులరతులివి నిచ్చకల్యాణములు ॥ ఏమ ॥ 54 ॥

రేకు 810 దేశాక్షి

ఎట్టునేసినాఁ జేయు మెన్న నెఱజాణవు నీ-
చుట్టరికమే గురి సుదతిచేఁతలకు ॥ పల్లవి ॥

జలజాక్షిచూపులకు చక్కనినీమేను గురి
పిలిచేనోరికిని నీపేరే గురి
తలపోఁతలకు నీతగినగుణాలే గురి
చెలులము నేమింత చెప్ప నేమున్నది ॥ ఎట్టు ॥

కాంతచన్నులకు నీకందువకాఁగిలి గురి
బంతి నాపెచేతికి నీపాదాలే గురి
చెంత శిరసుపైకి నీసేసపా లెప్పుడు గురి
వింతలుగా నీకు విన్నవించ నేమిటికి ॥ ఎట్టు ॥

అతివరతులకు నీయధరామృతము గురి
మతిలోనియాసలకు మన్ననే గురి
ఇతవై శ్రీ వేంకటేశ యీపె నిట్టె యేలితివి
మితిలేనిమీమహిమ మెచ్చఁగ మావసమా ॥ ఎట్టు ॥ 55

గౌళ

నా మొగము చూచి యేమి నవ్వేవే ఇంచుకఁగాను
నీమగనియెదుటను నిలుచుండఁగదవే ॥ పల్లవి ॥

కన్నులు గొప్పలైతే చక్కఁదనాలకు మేలు
చన్నులు బలిసితేను జవ్వనమునకు మేలు
నిన్ను నీవే యెంచుకొని నీవే సిగ్గువడితే
కన్నెరో నీపతి వచ్చె గక్కన రావే ॥ నామొ ॥

ముక్కు గొప్పదైతేను మోమునకు సింగారము
నిక్కనకొప్పయితేను నిలువునకు సింగారము
చెక్కు చేతఁబెట్టుకొని శిరసేల వంచేవే
మక్కువ నీవిభునితో మాటలాడఁగదవే ॥ నామొ ॥

నిండుఁబిరుదైతేను నెన్నడిమి కాదరువు
దండియైనమీఁగాళ్లు తనువు కాదరువు
అండనే శ్రీ వేంకటేశుఁ డంతలోనె నిన్నుఁగూడె
పండె నీతపము లింకఁ బాదాలకు మొక్కవే ॥ నామొ ॥ 56 ॥

సామంతం

ఎడయ నీచుట్టరిక మెప్పుడు మాకుఁ గలదు
తడవితే నానందము దైవారునే ॥ పల్లవి ॥

ననిచినచోటను నాఁటుకొను నేస్తము
తనిసినచోట నుండు తాలిములు
కనుఁగొనేచోట నిండు కడలేనియాసలు
పెనఁగఁబోతే వలపు పిప్పిగట్టునే ॥ ఎడ ॥

తగులుగలుగుచోట తమకము లుప్పతిల్లు
సొగసినవావులైతే సొంపురేఁగును
మొగమోటగలచోట నగవులు తానే వచ్చు
యెగసక్కెమైతే మన సెరవులౌనే ॥ ఎడ ॥

చెలఁగి కూడేటిచోట సిగ్గులు తానే విడు
వలెనని కాచితేనే వాడికలౌను
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
బలిమిసేసితే రతి పచ్చిదేరునే ॥ ఎడ ॥ 57 ॥

కాఁ(కాం)బోది

ఏమిదపము సేసెనో యీతఁడు నీకుఁగాఁ దొల్లి
ప్రేమతోడ నురమునఁ బెట్టుకున్నాఁ డిపుడు ॥ పల్లవి ॥

పండువెన్నెలబయలు పడఁతి నీనవ్వుమోము
కొండలవేఁటపొలము గొప్పచన్నులు
పండెడిపూఁబొదవిల్లు బాహులతలకాఁగిలి
అంద నీపతిభాగ్య మేమని చెప్పేమే ॥ ఏమి ॥

పొత్తులబోజనసాల[1] పొలఁతి నీవదనము
హత్తినకొలువుకూటాలాయఁ దొడవు
గుత్తపు సాముకంబము కోమలమైనగళము
ఇత్తల నీరమణుఁడు ఇన్నిటాను ఘనుఁడే ॥ఏమి॥

వాటపుఁబెండ్లిచవికె వనిత నీపిరుఁదు
మేఁటిరాజ్యపదవి నీమేనల్లాను
యీటున శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁగూడె
బోఁటి నీవిభుఁ డీతనిఁ బొగడఁగ వసమా ॥ఏమి॥ 58॥

## కురంజి

వాకిలి గాచుకొనివుండే వనితలము నేమెల్లా
చేకొని వేళయైతేఁ జెప్పేము గాని ॥పల్లవి॥

మేడలో దేవులుఁదాము మెరసి మాటలాడేరు
వేడుకతో సవతులు వినఁబోకురే
కూడిమండి నవ్వుకుంటాఁ గూచున్నాఁడు నాయకుఁడు
చూడకురే యీదిక్కు సుదతులాల ॥వాకి॥

పానుపుపైనుండి వారే బాగాలు వేసుకునేరు
కానుక లిచ్చేమంటా దగ్గరఁబోకురే
ఆనుక పూవులవేట్లాడేరు కొప్పులు జార
పానిపట్టి రొదసేసి పరాకుసేయకురే ॥వాకి॥

లలి శ్రీవేంకటేశుఁ డలమేల్మంగాఁ గూడున్నారు
బలిమితో లోనికి గొబ్బనఁ బోకురే
పిలిచే రదివో మిమ్ముఁ బ్రియములతోఁ దామే
సలిగెగలవారలు సందడించకురే ॥వాకి॥ 59

---

1. 'భోజనము' నకు 'బోజనము' తద్భవమా?

దేసాళం

నేనేమి యెఱుఁగుదు నీసేవసేసేదాన
మోనముతోనే పొగడి మొక్కేమయ్యా ॥ పల్లవి ॥

చెప్పరానిమాటలు చెవులొగ్గి వినరాదు
విప్పరానిముడియలు విడువరాదు
చొప్పులెత్తరానిసుద్దులు నీకే తెలుసు
అప్పటి నాతో నేమి ఆనతిచ్చేవయ్యా ॥ నేనే ॥

చూపరానిసొమ్ముల మించుకన్నులఁ జూడరాదు
ఆఁపరానిగుణముల సణఁచరాదు
నీపొందులవేడుకలు నెమ్మది నీకే తెలుసు
యీపొద్దు నాకానతిచ్చే విది యేమయ్యా ॥ నేనే ॥

పట్టరానినీచిత్తము పైకొని చెయిచాఁచరాదు
ముట్టరానినీనవ్వు ముడువరాదు
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నం(న)న్ను నేఁడు
గుట్టెల్లా నానతిచ్చేవు కొంక కిదేమయ్యా ॥ నేనే ॥ 60 ॥

రేకు 811 దేసాళం

అప్పుడుగాని నీయాసోదము దీరదు
ముప్పిరి నీవు కొంగులు ముళ్లువేసుకోవయ్యా ॥ పల్లవి ॥

వినేవు విన్నపములు వేడుకతో మఱవక
వనితమాటలు నీవు వా(వ్రా?) సుకోవయ్యా
యెనలేక చూచేవు యేపొద్దు నాపెమోము
గొనకొని [1]లక్కఁబఁబెచ్చున వేసుకోవయ్యా ॥ అప్పు ॥

---

1. లక్కన్ + పట్ + అచ్చు పడియచ్చు ప్రసిద్ధమే

వొప్పుగ నాపెచన్నులు వూరక పట్టిచూచేవు
గొప్పలెంతలేశో కొల్చుకోవయ్యా
యెప్పుడు నాపెగుణాలే యెంచేవు సారెసారె
తప్పక నీమనసులో దాఁచుకోవయ్యా ॥ అప్పు ॥

చేరి నీపాదా లాపెచేత గుద్దించుకొనేవు
కోరి యట్టె కాఁగిలించుకొనవయ్యా
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
సారపునామోవితేనె చవిచూడవయ్యా ॥ అప్పు ॥ 61

హిందోళం

ఎటువంటిజాణతన మిది మేలయ్యా
మట(టు?)మాయచేఁతలనే మచ్చిక చూపేవు ॥ పల్లవి ॥

తేరకొనఁ జూచితేనే దిష్టిదాఁకెనంటాను
కోరి కొంగువట్టేవు కొమ్మను నీవు
మేరతో నవ్వుకొంటేను మీఁదఁజల్లె వలపంటా
గోరసంటి చెక్కునొక్కి గురుతు సేసేవు ॥ ఎటు ॥

సంగడికి వచ్చితేనే చన్నులు దాఁకించెనంటా
యెంగలి సేసేవు మోవి ఇంతలో నీవు
చెంగట మాటాడితేనే చిత్తము గరఁచెనంటా
కెంగేల సంగములు గిలిగించేవు ॥ ఎటు ॥

ఆకుమడిచిచ్చితేనే ఆసలు రేఁచెనంటా
కైకొని నీవచ్చడము గప్పేవు నీవు
యీకడ శ్రీవేంకటేశ యింతి నిట్టె యేలితివి
దీకొని మొక్కితే నీకు దేవులంటా మెచ్చేవు ॥ ఎటు ॥ 62

నట్టనారాయణి

ఏమి సేయవచ్చునయ్య యేల సిగ్గులువడేవు
కామినుల కేమిచ్చినా ఘనమౌను ఫలము ॥ పల్లవి ॥

కొమ్మ యెవ్వతెచన్నులఁ గస్తూరి వూసితివో
వుమ్మడి నీమేన నంటివున్నది నేఁడు
ఇమ్ముల నింతలోఁ జూచి యేల తుడుచుకొనేవు
నెమ్మి నీచేసినచేఁత నిన్నే తగిలెను ॥ ఏమి ॥

పడఁతి కెవ్వతెకును బాగా లొసఁగితివో
వుడివోని(క?) నీపుక్కిట నున్నది నేఁడు
అడరి తలఁచుకొని యట్టే వుమియఁజూచేవు
నడుమ నీవిచ్చినపుణ్యమే నిం(ని)న్నంటెను ॥ ఏమి ॥

శ్రీవేంకటేశ యెవ్వతెఁ జేరి వురమెక్కితివో
వోవల నీవురముపై నున్నది నేఁడు
ఆవిధాన నన్నేలితి వన్నిటికి మెచ్చేవు
కావించినవినోదము కడు నినుమడించె ॥ ఏమి ॥ 63 ॥

రామక్రియ

ఆయ నాయ నీయెమ్మె లటుండనీవే
నీయంత నీవెఱఁగవు నేనైనాఁ జెప్పేను ॥ పల్లవి ॥

వంతులకే వచ్చేవు వాసులెల్ల నెరపేవు
పంతములు చూపఁగ నాపాటిదానవా
మంతనాన నప్పటి నామగనితో నవ్వేవు
యెంతలేదే నీపగటు యేమి చెప్పేదే ॥ ఆయ ॥

పురుండ్లకుఁ జేరేవు పొత్తుల మాటలాడేవు
సరుసఁ గూచుండఁగ నాసరిదానవా
తెరమాఁటుననే వుండి తేలించేవు రమణుని
తొరలినంతటిలోనే దొరవయ్యేవా ॥ అయ ॥

సలిగెలు మెరసేవు సాటి కిట్టి పెనఁగేవు
అలమేలుమంగను నాయంతదానవా
కలసెను నన్ను శ్రీవేంకటేశుఁడు నీవు మెచ్చే-
వెలమి నీకుఁ గారణ మేమైనాఁ గలదా ॥ అయ ॥ 64 ॥

## బౌళి

ఆపెకేల నన్ను నేసే వంతటిలోనెనే-
నేపున నీసుద్దులకు యెగ్గువట్టేనా ॥ పల్లవి ॥

తొల్లిటియలవాటున తొయ్యాలి పిలిచెఁగాక
యెల్లవారు నుండుట యెఱుఁగునా
చల్లఁగా నీవిచ్చినచనవు మెరసెఁగాక
చిల్లరనీసేఁత గుట్టుసేయఁగ నేర్చునా ॥ ఆపె ॥

యెప్పటివలెనంటానే యెదురుగా వచ్చెఁగాక
చొప్పఁలె త్తేసవతులఁ జూడవచ్చెనా
కప్పేమగఁడవుగాఁగాఁ గాఁగిలించుకొనెఁగాక
తప్పకుండా నీమర్మాలు దాఁచిపెట్టనేర్చునా ॥ ఆపె ॥

దోమతెర మరఁగంటా తూరి ఇంతి గూడెఁగాక
నీమై నలమేల్మంగ చెందిన దెంచెనా
ఆముక శ్రీవేంకటేశ ఆమాఁటాడెఁగాక నిన్ను
నేమెల్లా నీయాండ్ల మవుత నిన్నమొన్న వినెనా ॥ ఆపె ॥ 65 ॥

శంకరాభరణం

ఇట్టే పిలిపించవయ్యా ఇందరముఁ జూచేము
గుట్టుసేసి మాముందర కొంచకు నీవింకను ॥ పల్లవి ॥

యేమనిచెప్పి యంపెనో ఇంతి నీకుఁ జెలులచే
నీమోమునఁ గళలు నిండుకొనెను
ఆముకొని చెలులతో నాడేవు యేకాంతాలు
ప్రేమము నీకాపెమీఁదఁ బెరుగఁగఁబోలును ॥ ఇట్టే ॥

ఆనవా లేమి యంపెనొ యప్పటిని యాకె నీకు
ఆనుక పిడికిలి గొప్పయి వున్నది
పానుపుపై నేఁడిదేపనై కాచుకవున్నాఁడవు
తానకపువలపులు తగులఁగఁబోలును ॥ ఇట్టే ॥

ఆస యేమి వెట్టెంపెనో అలమేలుమంగ నీకు
సేసవెట్టుకున్నాఁడవు శ్రీవేంకటేశ
పోసరించి మమ్ముఁ గూడి పొందు లాపెవి చెప్పేవు
లాసి నీవుర మాపెకు లంకెయగాఁబోలును ॥ ఇట్టే ॥ 66 ॥

రేకు 812 భైరవి

చిత్తగించు నాగుణము చెప్పితి నీకు
బత్తిసేసి నీకు మీఁదెత్తితి నావయసు ॥ పల్లవి ॥

రారాఁపులదానఁ గాను రాతిగుండెదానఁ గాను
కోరి నీకు మోహించినకొమ్మను నేను
బీరము లాడుకోను; నీపేరు చెవుల వింటేను
నీరువలెఁ గరఁగును నెమ్మది నామనసు ॥ చిత్త ॥

కుచ్చితపుదానఁ గాను కొసరేటిదానఁ గాను
ఇచ్చకమే నీకుఁ జేసే యింతిని నేను
చెచ్చెర మందెమేళాలు సేయను నిన్నుఁ జూచితే
పచ్చిమదనకళలఁ బరగు నామొగము ॥ చిత్త॥

యెరవులదానఁ గాను యెగ్గుపట్టేదానఁ గాను
మరిగిన యలమేలుమంగను నేను
యిరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
బెరసి నీకాఁగిటనే పెరుగు నాచన్నులు ॥ చిత్త ॥ 67 ॥

## పాడి

ఎఱఁగమా నీజాగ లింతకతొల్లి
మెఱసితి విట్టె యలమేలుమంగతనము ॥ పల్లవి ॥

సరసమెంతాడేవే చవులెంత చూపేవే
విరులేల చల్లేవే విభునిమీఁద
వరుసకువచ్చినవనితలెల్లా నుండఁగా
దొరవైతి విందరిలో తొయ్యలి నీవు ॥ ఎఱఁ ॥

నవ్వులెందాఁకా నవ్వేవే నాఁట నెంతచూచేవే
రవ్వగాఁ బెనఁగనేలే రమణునితో
జవ్వనపువేడుకతో సవతులెల్లాఁ జూడఁగా
వువ్విళ్లూర నీవితని వుర మెక్కుకొంటివే ॥ ఎఱఁ ॥

వావులేమి చెప్పేవే వడిగా నెట్టు గూడేవే
యేవేళైనా శ్రీవేంకటేశ్వరుని
సేవసేసి నేమెల్లా సేసవెట్టి పెండ్లాడఁగా
దేవరవలె పట్టపుదేవులవైతివే ॥ ఎఱఁ ॥ 68 ॥

రామక్రియ

చెప్పవే నీసుద్దులు చెవులారా నేము వినేము
వుప్పతిల్లీఁ దమకము ల్లములో మాకును ॥ పల్లవి ॥

వెన్నెలగాసీ మొగాన వేడుక నీనవ్వులనే
సన్నలనే సంతోసాలు చాలామించీని
చెన్నుమీర నీపతి నీచేతికి లోనాయనా
పన్ని నేఁడు నీతపము ప(ఫ)లియించెనా ॥ చెప్ప ॥

చెక్కులఁ జెమటగారీ సిగ్గులు కన్నులఁ దేరీ
తక్కక నిండుఁగళలు దైవారీని
చక్కనినీపతి నీకు చనవులెల్లా నిచ్చెనా
మిక్కిలి నీవువేసినమేలెల్లా నీడేరెనా ॥ చెప్ప ॥

మోవితేనె లుట్టిపడీ మించినతీపులతోడ
భావించితే నీకు మేనఁ బచ్చిదేరీని
నీవలమేలుమంగవు నెమ్మది శ్రీవేంకటేశుఁ-
డీవేళ నిన్నుఁ గూడెనా యీడకు విచ్చేసెనా ॥ చెప్ప ॥ 69 ॥

వరాళి

ఎదురుకొంటి వలపు లిరుమేలా నితనికిఁ
బొదిగితే సరిచేసి భోగములై మించెనే ॥ పల్లవి ॥

నంటున నాతనితో నే నవ్వితే నీవందుకుఁగా
గొంటరివై పతినేల కొచ్చి చూచేవే
జంటల నిద్దరివిని జాజులుఁ గలువలునై
పెంటలపూజలై కడుఁబిక్కటిల్లీ మేనను ॥ ఎదు ॥

మక్కువల పతికి నే మరి పాదాలొత్తితేను
 మొక్కలాన నాతనికి మొక్కవచ్చేవే
 చిక్కనితామరలునుఁ జిగురులుఁ గూడ పెట్టి
 వొక్కట గుదిగుచ్చితే నోపునా యీతఁడు ॥ ఎదు ॥

యెలమి శ్రీవేంకటేశు నిట్టె నేఁ గాఁగిలించితే
 నులివచ్చితోనేల చన్నుల నొత్తేవే
 అలమేలుమంగను నేనై నీవు భూసతివై
 కలసితేఁ జెప్పఁగొత్తై కతలై నిలిచెనే ॥ ఎదు ॥ 70 ॥

నారాయణి

చెలరేఁగి కొలువులు సేతువుగాక
 పలసి నీకు తెరమఱఁగు లేమిటికే ॥ పల్లవి ॥

అగ్గలపుమోహమున నతఁడు నీమోము చూచీ
 సిగ్గులువడకువే చెలియా
 వెగ్గళపుఁదమకము వెదచల్లీ నీమీఁద
 తగ్గి నీవందుకుఁగాను తలవంచనేఁటికే ॥ చెల ॥

మనసిచ్చి యప్పటిని మాటలు నీతో నాడీ
 వెనకతియ్యకువె వెలఁదీ
 ననుపునఁ జన్నులపై నగుతానే చేయిచాఁచీ
 పెనఁగి నీవంతేసి బిగియఁగ నేఁటికే ॥ చెల ॥

ఆఱడై శ్రీవేంకటేశుఁ డట్టె నిన్నుఁ గాఁగిలించీ
 మీఱకువే యిఁక నలమేలుమంగా
 కాఱుకమ్మినరతులఁ గలసె నిన్నీతఁడు
 ఆటితేరెఁ బనులెల్లా నలయించనేఁటికే ॥ చెల ॥ 71 ॥

మాళవిగౌళ

ఏమి చెప్పేది మోహము యెంతోకాని
కామిని నింతట నిట్టె కరుణించవయ్యా ॥ పల్లవి ॥

చెలి నిన్నుఁ జూచి చూచి చిమ్మిరేఁగీ నాసలను
యెలమిఁ బయ్యెదఁ జారు టెఱఁగదు
వెలలేనిమాఁటలెల్లా వేడుకతో నాడీఁగాని
లలిఁ బెదవిమీఁదికెంపులు దాఁచనేరదు ॥ ఏమి ॥

మొగమెత్తి చేతులెత్తి. మొక్కీలోలోఁ జొక్కీ
జిగిఁ(గి?)ఁ(చ?)న్నులు గానవచ్చేది యెంచదు
మిగులా సెలవులను మిక్కిలి నవ్వీఁగాని
చిగురుమోవిరసాలు చిందేది దలఁచదు ॥ ఏమి ॥

తక్కక కొలువుసేసేతమినే నిలుచున్నది
పక్కన మైసోఁకులు భావించదు
యిక్కడ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
అక్కరతోఁ గూడీఁగాని అలయఁగ నేరదు ॥ ఏమి ॥ 72 ॥

రేకు 813 సాళంగనాట

సిగ్గరిపెండ్లికొడుకు చెలులముందరనెల్లా
యెగ్గరఁగక మెరసీ నిదివో యనుచు ॥ పల్లవి ॥

జంటతేరులమీఁద సతులు నీవును నెక్కి
యింటింట వీదివీది నేఁగిరాఁగాను
పెంటలగోపికలెల్లా పెదపెదమేడ లెక్కి
నంటునఁ జూచి సిగ్గుతో నవ్వులు నవ్వేరు ॥ సిగ్గ ॥

గాడ(డు?)గులనీడను కోలుపడిగెలతోడ
యెడనెడవాడల నీవేఁగిరాఁగాను
మెడలెత్తి నీపొందుల మెలుఁత లబ్బురమంది
జడిగొని తోఁగిచూచి జాణతనాలాడేరు ॥సిగ్గ॥

విరులదండలలోన వింజామరలలోన
యిరవై దేవుళ్ళు నీవు నేఁగిరాఁగాను
పరగ నలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
సొరిదిఁ బురసతులు చూచి పొగడేరు ॥సిగ్గ॥ 73॥

## లౌళి

ఈకెనీచుట్టరికము లెఱుఁగుదుము
మాకు నీవు లోఁగుదురా మరఁగు లింతేల ॥పల్లవి॥

కలువపూవుల వేసి కప్పురము మొవిఁ జూపీ
పొలఁతికి నీ కెన్నటిపొందులోకాని
పిలిచీ మెల్లనె నిన్నుఁ బేరుకొని; యంతలోనే
పలుకవయ్యా యేల పరాకుసేసేవు ॥ఈకె॥

సిగ్గు గొంత చల్లిచల్లి సెలవుల నవ్వునవ్వి
వెగ్గళించీఁ జేఁత లెంతవేడుకోకాని
వొగ్గిఁ దమ్ములానకు వూరకే చేతిసన్నల
యెగ్గులేదు చూడవయ్యా యేల దాఁచేవు తమి ॥ఈకె॥

చన్నుమొనలు దాఁకించి సారెకు సేవలుసేసీ
యెన్నఁడు గూడితివో యింతకతొల్లి
యిన్నిటా శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
నన్నుఁ గూడితివి యెంత నాఁటకముసేసేవు ॥ఈకె॥ 74

సామవరాళి

ఎందాఁకా బుజ్జగించే వేమయ్యా
మందెమేళమయ్యా మరి నే మొక్కేనయ్యా ॥ పల్లవి ॥

యీడువెట్టుకొని నన్ను యెంతవొడఁబరచేవు
వేడుకతో నీమాటలు వింటినయ్యా
నీడకుఁ దీసి నన్ను నిమిరేవు నాచెక్కులు
తోడనే యిందుకు నే సంతోసించుకొంటినయ్యా ॥ ఎందాఁ ॥

సరుస నన్నుఁ బెట్టుక చన్ను లెంతపుడికేవు
గరిమ నీమన్ననలు గైకొంటినయ్యా
విరులు ముడిచి నన్ను వెస నెంతలాలించేవు
సరవులన్నిటా నాకు సమ్మతాయనయ్యా ॥ ఎందాఁ ॥

చనవిచ్చి నన్ను నెంత సారెకుఁ గాఁగిలించేవు
నినుపురతులను తనిసితినయ్యా
యెనసితివి శ్రీవేంకటేశ యల మేల్మంగను
మనసున నీపొందులు మరిగితినయ్యా ॥ ఎందాఁ ॥ 75 ॥

ధన్నాసి

ఎవ్వరి నేరుపు లెంచే మింపు లోనను
వువ్విళ్లూరి మీలో మీకు నొనగూడె వలపు ॥ పల్లవి ॥

చిమ్ముఁజూపులనుఁ జూచీ సిగ్గరిపెండ్లికూఁతురు
నిమ్మపంట వేసేవు నీవాపెను
తమ్మిమోములు వంచేరు దండనున్న పేరటాండ్లు
సమ్మతించి మీలో మీకు చలివాసె వలపు ॥ ఎవ్వ ॥

కుప్పళించీఁ జెమటలు కొత్తపెండ్లికూఁతురు
నెప్పున మెయిసోఁకించేవు నీవాపెను
వొప్పుగ మోములు చూచే రూడిగపువారలు
చెప్పరాక మీలో మీకు చిమ్మిరేఁగె వలపు ॥ఎవ్వ॥

మొక్కీ నలమేలుమంగ ముద్దులపెండ్లికూఁతురు
నెక్కొని కాఁగిలించేవు నీవాపెను
చొక్కపు శ్రీవేంకటేశ చుట్టాలెల్లా మెచ్చేరు
వుక్కుమీరి మీలో మీకు నుమ్మగిలీ వలపు ॥ఎవ్వ॥ 76

ముఖారి

సారె సారె మన్నించేవు చనవు లిచ్చేవు నాకు
యీరీతి నీసతులలో నెవ్వరిఁ బోలుదును ॥పల్లవి॥

చక్కెరమాఁట లాడి సాదించు నిన్ను నాపె
మిక్కిలిసేవలు సేసి మెప్పించును
చిక్కనిచన్నులు చూపి చిత్తమెల్లాఁ గరగించు
ఇక్కడ నన్నుఁ జెనకే వేమిటాఁతి నేను ॥సారె॥

సన్నలనే మోవిచూపి చవులురేఁచు నాపె
వన్నెలుగా నవ్వునవ్వి వలపించును
కన్నుల మొక్కులు మొక్కి కళలెల్లాఁ బుట్టించు
ఇన్నిటా నన్నుఁ బొగడే వెంతదాన నేను ॥సారె॥

అయములంటు నిన్ను నలమేలుమంగ యాపె
చాయల నీవురమెక్కి జట్టిగొనును
పాయకుండు నిన్నేపొద్దు బత్తితో శ్రీవేంకటేశ
యీయెడ నన్నేలితివి యితవైతి నేను ॥సారె॥ 77 ॥

మంగళకౌశిక

నేరుపరివి నీవైతే నెలఁతైతే ముద్దరాలు
పేరునఁ బిలిచి నీవే పెనఁగఁగరాదా ॥ పల్లవి ॥

చెన్నుదిగనని యింతి సిగ్గుతోడ నున్నది
అన్నిటా రట్టడివి మాటాడించరాదా
తన్నుఁదానె నీపై ప్రేమ దాఁచుకొని వున్నది
సన్నలనే నీమోవి చవిచూపరాదా ॥ నేరు ॥

జవరాలుగనక ఆసలఁ బొంచుకవున్నది
నవకపుజాణవు నవ్వించరాదా
వివరించి బత్తి వెల్లవిరి సేయకున్నది
చివురుకెంగేలు చాఁచి చిమ్మిరేఁచరాదా ॥ నేరు ॥

కౌమరెగనక కడుగుట్టుఁతోడ నున్నది
నెమకి దిట్టవు మేలు నెరపరాదా
అమర శ్రీవేంకటేశ అండ వాయకున్నది
సమరతి నిట్లానే చనవియ్యరాదా ॥ నేరు ॥ 78 ॥

రేకు 814 దేవగాంధారి

పొలఁతీ నీనటనలు పొగడ నలవిగాదు
నిలువున వలపులు నివ్వటిల్లఁజేయునే ॥ పల్లవి ॥

కందువైననీమాటలు కప్పురపుబేంట్లు
పొందుల నీపతికి దప్పులు దీర్చునే
అందిననీసొలపు మోహములకలగలపు
సందడించి యతనికి సంతోసము రేఁచునే ॥ పొలఁ ॥

సూటియైననీచూపులు సొంపగుఁదరితీపులు
గాఁటమై యీతనికి నక్కర దీర్చునే
కూటపునీనవ్వులు గుదిగుచ్చినపువ్వులు
పాటించి యీతనిమతిఁ బరిమళించునే ॥ పొలఁ ॥

మంతనపుఁజెనకులు మాణికపుమినుకులు
చెంతల నీసొమ్ములై సింగారించునే
యింతలోనె శ్రీ వేంకటేశుఁడు నిన్ని దెకూడె
వింతలగునీరతులు వేడుక వుట్టించునే ॥ పొలఁ ॥ 79

## భూపాళం

చిత్తగింతువు రవయ్యా చిల్లరపరాకు మాని
హత్తి తారుకాణవచ్చీ నప్పుడే నీకు ॥ పల్లవి ॥

చిగురాకుమోవిమీఁదఁ జెలి యాడేమాఁటలు
మిగులాఁ దేనెలకంటే మించుఁదీపులు
జిగిమించ నీతోడఁ జేసేటిచెలుములు
జిగురుఁగందెలకంటెఁ జిక్కించేబందనలు ॥ చిత్త ॥

తమ్మిరేకుఁగన్నులలోఁ దళుకనేచూపులు
తుమ్మిదపౌఁజులకంటేఁ దూరిపారును
వుమ్మగిలుఁబయ్యదలో నుండేటికుచములు
నిమ్మపండ్లకంటేను నీకుఁ గానుకలౌను ॥ చిత్త ॥

లతలచేతులుఁ చాఁచి లాచేటికాఁగిలి
రతిఁ బెండ్లిచవికకంటే రమ్యమైనది
యితవై శ్రీవేంకటేశ యేలితివి నీమోహపు-
సతికంటే నెక్కుడు జాణతనాలు ॥ చిత్త ॥ 80 ॥

గౌళ

నావాఁడనేయంటా నమ్మించేవు నన్ను నేఁడు
చేవల నిన్నాపె చూచి సిగ్గువడనేలయ్యా ॥ పల్లవి ॥

మంతనాన నీవు నేను మాటలాడుకొన్నవెల్లా
ఇంతలోనె యాపె వినుటెట్లయ్యా
వింతలైననామచ్చెలు వేలఁ బెట్టుకొంటివి
వంతుల నాపె చేతికి వచ్చుటెట్లయ్యా ॥ నావాఁ ॥

పొంచుగా నీవును నేనుఁ బూసుకొన్నపరిమళ-
మందముగా నాపెమేన సంటుటెట్లయ్యా
కిందట మాయింట నారగించినకూరలచవులు
మందలించి యాపె చెప్పే మర్మమేఁటిదయ్యా ॥ నావాఁ ॥

చెలరేఁగి నీరతులఁ జేసిననానేర్పులకు
నలువంక నాపె నిన్ను నగుటెట్లయ్యా
యెలమి శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
మెలుపున నిన్ను నాపె మెచ్చుటెట్లయ్యా ॥ నావాఁ ॥ 81 ॥

సామంతం

ఆతనిఁ జూపవె మాకు నదెంతచక్కనివాఁడో
ఆతఁడి నిన్నుఁ గలసినంతటిజాణఁ డెవ్వఁడె ॥ పల్లవి ॥

జక్కవచన్నులమీఁద చంద్రోదయము లాయ
చుక్కలు నీమోవిమీఁదఁ జూపట్టెను
మిక్కిలి శిరసుమీఁద మేఘములు గారుకొనె
యెక్కడనుండి వచ్చేవే యెవ్వఁడే నీమగఁడు ॥ ఆత ॥

సరిఁ గన్నుకలువల సంధ్యాకాలము వచ్చె
అరిది సంపెంగముక్కుం దాయిటి రేఁగె
తొరిగి చుక్కమీఁదఁ దొలుకరించెఁ జెమట
యిరవై యేడనుంటివే యెవ్వఁడే నీమగఁడు ॥ అత ॥

నాటుకొని సెలవుల నవ్వులవెన్నెల గాసె
తేటలచూపులనే తెల్లవారెను
మేటిశ్రీవేంకటాద్రిదేవుఁడఁ(డం?)టా నీవు
యేటవెట్టుకుండె(దే?)నా(వా?)తఁ డెవ్వఁడే నీమగఁడు ॥ అత ॥

## వరాళి

ఇంతలో విచ్చేసితి నీకెభావమిదె చూడు
ఇంతి గోడపైరూపే యీరూపనుచును ॥ పల్లవి ॥

జిగిమించునీరూపు చిత్తరువులోఁ జూచి
నగు నింతి తనతోను నవ్వితివంటా
మొగము చూచేవంటా ముచ్చటతోఁ దలవంచు
చిగురుమోవి చూచి సిగ్గువడును ॥ ఇంత ॥

చేరి మాటలాడెనంటాఁ జెప్పు నీకుఁ బ్రియములు
కోరికతో దండనుండి కొలువునేసు
సారెకుఁ బానుపుపైకి సన్నలునేసి పిలుచు
నేరుపుతోఁ దములము నిన్నట్టె యడుగును ॥ ఇంత ॥

నివ్వెరగైతివంటా నిన్నుఁ గొనగోర నంటు
పవ్వళించుమని చేతఁ బట్టఁబూనును
నివ్వటిల్ల నంతలోనె నీవె వచ్చి కూడితివి
యివ్వల శ్రీవేంకటేశ యిట్టె వోలలాడును ॥ ఇంత ॥ 83 ॥

ఆహిరి

మరుతంత్రములలోన మరఁగేఁటికి
శిరసు వంచి మొక్కేను చెప్పరే యాతనికి ॥పల్లవి॥

తమి యేలరేఁచీనే తరితీపేల సేసీనే
సముకాన నున్నదానఁ జనవరిని
కొమరె వయసుదానఁ గుదురుకొనె వలపు
చెమటలు మేననిండెఁ జెప్పరే యాతనికి ॥మరు॥

సెలవినేల నవ్వీనే సిగ్గులేల నెరపీనే
చెలిమి చేసినదాన సేవచేసేను
నలుగడ నివ్వెరగై నామనసు తనకె
సెలవుసేసితినని చెప్పరే యాతనికి ॥మరు॥

సన్నలేల సేసీనే చన్నులేల పిసికీనే
వున్నతిఁ దనకాఁగిట నున్నదానను
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డింతలోఁ దా నన్నునేలె
చెన్నగునాసంతోసము చెప్పరే యాతనికి ॥మరు॥ 84॥

రేకు 815 గుండక్రియ

ఏల సిగ్గువడేవు ఇందరముఁ జూచేమని
చాలవలచేవలపు చల్లించుకోవయ్యా ॥పల్లవి॥

చేకొని విడెము చేతికిచ్చి జవరాలు
ఆకుమడిచియ్యఁజూచీ నందుకోవయ్యా
మేకొని గందము నీమేనఁ బూసేనంటా వచ్చె
యీకడ నిట్టై పూయించుకొనవయ్యా ॥ఏల॥

చేరి పువ్వులసరులు చేతఁబట్టుక వున్నది
కోరి యట్టె ముడిపించుకొనవయ్యా
గారవానఁ బాదాలొత్తఁ గడువేడుకపడీని
పూరడించి పాదాలు నీ వొత్తించుకొనవయ్యా ॥ ఏల ॥

పిలిచి నీగరిడిలోఁ బెనఁగేనఁటా నున్నది
చెలఁగి యాపెతో సాము సేయవయ్యా
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
సొలసీ నాపె నిన్ను సొలయించుకోవయ్యా ॥ ఏల ॥ 85

దేసాళం

తప్పించుకొనరాదు తలఁగా రాదు
చెప్పితి నిట్టె మన్నించి చిత్తానఁ బెట్టుమీ ॥ పల్లవి ॥

నాతలఁపుకొండ సాగి నంటునఁ దీగెవంటిది
ఆతలనీతల నీమై నల్లుకున్నది
కాతరపునాచూపు గబ్బితుమ్మెదవంటిది
గాతల నీయందే గూఁడుగాఁ బెట్టుకున్నది ॥ తప్పిం ॥

వేడుక నాయాస ఇది వేఁటమెకమువంటిది
కూడి నీపాదాలఁ దగులఁకున్నది
వోడక నావలపు నీవాళ్లినీడవంటిది
వీడక నీవెంటవెంట వెసఁ బాయకున్నది ॥ తప్పిం ॥

దాఁగక నాచన్నులివి తమ్మిమొగ్గలవంటివి
కాఁగిటిలో నీకుఁ బూజై కాచుకున్నది (వి?)
చేఁగదేర నేలితివి శ్రీవేంకటేశ నన్ను
మాఁగిననామోవితేనె మంచివిందై వున్నది ॥ తప్పిం 86

మాళవిగౌళ

లలనలసఁ(సం)తలోనిలాబగాఁడవు
తలఁచనితలఁపులు దైలువారె నిపుడు ॥ పల్లవి ॥

వేడుకతో నీవాపెపై వేసినపూవులచెండ్లు
తోడువచ్చి నిలుచున్నతొయ్యలిఁ దాఁకె
కూడాఁబట్టి యిద్దరిని గొబ్బునఁ బెండ్లాడవయ్య
యీడనే నీబేర మొక టినుమడి యాయను ॥ లల ॥

చెలరేఁగి యాపెమీఁదఁ జిమ్మినట్టిపన్నీరు
మెలుపునఁ జెలికత్తెమీఁదఁ నిండెను
కలసి నీవిద్దరినిఁ గాఁగిలించుకొనవయ్య
వలపు లినుమడించి వడ్డివచ్చె నీకును ॥ లల ॥

పిక్కటిల్ల నీవాపెపైఁ బెట్టినటువంటినేస
పక్కన నూడిగపుసతిపైఁ జిందెను
యిక్కువ శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
మొక్కలాన నీమేలు ముయ్యేడ [1]నాఁగాయను ॥ లల ॥ 87

భైరవి

అన్నిటా నెరజాణఁడైననాయకుఁడు తాను
సన్నల చాయలఁ దానే సరిచూడుమనవే ॥ పల్లవి ॥

మనసులోనివలపు మాటలలోనే తోఁచు
తనువుపై వేడుకలు తమియై రేఁగు
కనుచూపులలో యాస కడఁగు జాగరములై
తనకు నేఁ జెప్పనేల తలఁచుకొమ్మనవే ॥ అన్ని ॥

1. నాఁగు+ఆయను

మొలచినసిగ్గులు ముసిముసినవ్వులౌను
నెలకొన్నతలపోఁత నిట్టూర్పు లగును
చెలఁగి యెదమాటలు చిగిరించుఁ గోరికలై
తిలకించి నాభావము తెలుసుకొమ్మనవే ॥ అన్ని ॥

చిప్పిలుఁగళలతేట చిందు మోవితేనియలై
చెప్పరానిసంతోసము చెమటలౌను
యిప్పుడె నన్నేలినాఁడు ఇదె శ్రీవేంకటేశుఁడు
యెప్పటికి నిదేమాట యెరుఁగుకొమ్మనవే ॥ అన్ని ॥ 88

నాట

ఊరకే గుట్టుతోడ నుందువు గాక
మేరమీరి ఇంత మందెమేళ మేఁటికే ॥ పల్లవి ॥

వేరొకతెమీఁదఁ బెట్టి విభుఁడు నవ్వినందుకు
సారె సారె నీవేల జంకించేవే
చేరి నీరతిసుద్దులు చెలులతోఁ జెప్పితేను
గిరుచు గోర నీవెంత గిలిగించేవే ॥ ఊర ॥

నెట్టన నెవ్వతెసొమ్మో నీమేనఁ బెట్టినందుకు
ఇట్టె వాఁడిచూపుల నీవేల చూచేవే
జట్టిగొని పెదవులసన్నలనే తిట్టితేను
గట్టిగాఁ బెదవి యేల గంటిసేసేవే ॥ ఊర ॥

కాంతలు చూడఁగ నిన్నుఁ గాఁగిలించుకొన్నందుకు
చెంతనుండి నీవేల సిగ్గువడేవే
ఇంతలో శ్రీవేంకటేశుఁ డేకతాన నిన్నుఁ గూడె
పంతమున నీవెఁ(వెం?)త పచ్చిసేసేవే ॥ ఊర ॥ 89

తెలుఁగుఁగాంబోది

చక్కనిదానవు నీవు జవరాలవు
మక్కువ నీపైఁ జేయక మానవచ్చునా ॥పల్లవి॥

కన్నులఁజూచినచూపు గండుతుమ్మిదల పూఁపు
సన్నలనవ్వినవ్వు జాజిపువ్వు
పన్ని నీమోములో సిగ్గు వెన్నెలతేటనిగ్గు
వన్నెలనీరమణుఁడు వలచు ఁటేమరుదే ॥చక్క॥

మలయునీపలుకులు మరునంపచియకులు
కలికికొప్పుజారు మేఘపుఁదీరు
నిలువుఁజక్కఁదనము నిండుజవ్వనవనము
బలిమి నాతఁడు నీకు భ్రమయు టేమరుదే ॥చక్క॥

వాఁడిగోరిచెనకులు వజ్రాలమినుకులు
పోఁడిమి నీకెమ్మోవి పొగరుఁగావి
నేఁడు శ్రీవేంకటేశుఁడు నిన్ను నింతలోనె కూడె
నాఁడే యీతఁడు నీకు ననుపౌ టేమరుదే ॥చక్క॥ 90

రేకు 816 దేశాక్షి

ఎలయించీ సారెకు నిన్నెవ్వతో కాని
వలపులు చల్లిని వాడుదేరిచీని ॥పల్లవి॥

కలువల వేసి సతి గక్కన నీవు చూచితే
మొలకసన్నలనే మోవి చూపీని
అలరి చదురంగము లాడేపరాకున నుంటే
యెలుఁగెత్తి పాటపాడి యెచ్చరించీని ॥ఎల॥

యింతి చన్నుల నిన్నొత్తి ఇవ్వలిమోము నీవైతే
అంతలోనే కన్నుల నీకటు మొక్కీని
పంతానఁ బానుపుమీఁదఁ బవ్వళించి నీవుండితే
చెంతనుండి యెరుకలు సేయుచు నవ్వీని ॥ ఎల ॥

నిమ్మపండు గానుకిచ్చి నీవు చేతనందుకొంటే
కమ్మక నిన్నింతలోనే కాఁగిలించీని
నెమ్మది శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
కమ్మర నను గూడితే కందువ చెప్పీని ॥ ఎల ॥ 91

ధన్నాశి

ఇంతులచేఁతకు లోనే యెప్పుడును మగవాఁడు
యింతేసిపంతాలు మాతో నేలాదేవయ్యా ॥ పల్లవి ॥

కన్నులఁ జూచినయాస కాఁగిటికిఁ బెనఁగించు
సన్నలు సేసినయాస సంగడిఁ బెట్టు
చన్నులునోఁకినయాస సమరతి కొనగూర్చు
యిన్నేసి మాతో నేరా లేలాదేవయ్యా ॥ ఇంతు ॥

మాటలాడించినయాస మర్మములు గరఁగించు
చోటిచ్చినయాస రతిఁ జొక్కించును
నాటించినగోరియాస నసువులు వెడరేఁచు
యీటున నీయాచారాలు యెంత చెప్పేవయ్యా ॥ ఇంతు ॥

సరసమాడినయాస జంట లప్పుడే సేయు
సరుగ నవ్వినయాస చవులు రేఁచు
ఇరవై శ్రీ వేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
యెరవులవెడమాయ లేల సేసేవయ్యా ॥ ఇంత ॥ 92

లలిత

నీయందు నేమైనా నెరసు లెంచితిమా
చేయెత్తి మొక్కితేనేల సిగ్గువడేవు ॥ పల్లవి ॥

మంతనాన నిద్దరము మాటలాడుకొంటేను
అంతలోఁ బెట్టుకొనేవు ఆనలు నీవు
సంతోసాన నీమోము సారె సారెఁ జూచితేను
యెంతకెంత నీవేల యెగ్గుపట్టేవు ॥ నీయం ॥

జవ్వనులము మాలోనే సన్నలు సేసుకొంటేను
యివ్వల సుద్దులు మమ్ము నేలడిగేవు
వువ్విళ్లూర నీమేనంటి వూడిగాలు సేసితేను
చువ్వన నీవెంత మాకు సోదనిచ్చేవు ॥ నీయం ॥

కొమ్మల నిందరిని కొలువుకుఁ బిలిచితే
కమ్మి యెంత మమ్ము నిద్దె కాఁగిలించేవు
యిమ్ముల శ్రీ వేంకటేశ యెనసితి విన్నిటాను
తెమ్మలుగా మమ్ము నేమి తెలుపవచ్చేవు ॥ నీయం ॥ 93

రామక్రియ

పదఁతులఁ గంటేనే పట్టలేవు తమకము
నడుమంత్రపుచెలులు నవ్వరా నిన్నును ॥ పల్లవి ॥

చల్లువెదమాట లాడి సంగడినే గూచుండి
చిల్లరచేఁతలు సేసి చెక్కునొక్కేవు
యెల్లవారిలోన నన్నునేల సిగ్గువరచేవు
కొల్లలుగ యేకతానఁ గూడఁగరాదా ॥ పదఁ ॥

పగటున నగి నీపాదము నామీఁద వేసి
మొగము చూచి నన్ను మొక్కుమనేవు
నిగిడి నిన్నింతలోనే నీవేల పచ్చిసేసేవు
వెగటేల మాయింటికి విచ్చేయరాదా ॥ పద ॥

చన్నులపైఁ జేయివేసి సరుగునఁ గాఁగిలించి
కన్నులఁ జొక్కించి మోవి గంటిసేసేవు
యిన్నిటా శ్రీ వేంకటేశ యేల చిమ్మిరేఁచేవు
మన్నించితి విట్లానే నెంమ(నెమ్మ)ది నుంగరాదా ॥ పద ॥94

కాఁ(కాం)బోది

ముద్దరాలవై తేనేమి మోహము చూపఁగవద్దా
కొద్దిమీర పతివద్దఁ గూచుండవే ॥ పల్లవి ॥

చెక్కుచేయేల పెట్టేవే సిగ్గులేల నెరపేవే
చిక్కనిచెమటలేల చిందేవే
నిక్కిచూచి రమణుఁడు నిమ్మపండు చేతికిచ్చీ
మక్కువతో నందుకొని మాటలాడవే ॥ ముద్ద ॥

దప్పులఁ బొరలేవేలే తలవంచుకొననేలే
ముప్పిరి నీగుబ్బలేల మూసిదాఁచ(చే?)వే
కప్పురము(పు?)మోవిఁ జూపి కాంతుఁడు నిమ్ము లాలించీ
వొప్పుగఁ జేకొని నీవూ నుపచరించవే ॥ ముద్ద ॥

నీవి వదలగనేలే నివ్వెరగు చూపనేలే
కావికన్నులనేల కడుఁబొక్కేవే
యీవల శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడెఁ
వేవేగ నీప్రియములు వెలయించవే ॥ ముద్ద ॥ 95

నాదరామక్రియ

ఔనయ్య తగవు నేఁ డట్టిదె కాదా
మోనముతోడుత నీకు మొక్కు మొక్కెను ॥పల్లవి॥

చెక్కునొక్కి జవరాలు చేరి నిన్ను వేఁడుకొని
వుక్కుమీరి గుబ్బలు నిన్నొరయఁగాను
యిక్కువలఁ దొలుత నిన్నేమని తిట్టెనోకాని
పక్కన నింతటిలోనే పంతమిచ్చెను ॥ఔన॥

కమ్మటిఁ గాఁగిట నించి కడు నిన్ను లాలించి
సమ్మతి మోవితేనెలు చవిచూపుతా
యిమ్ములఁ దొలుత నిన్ను యేమిసేసెనో కాని
ముమ్మాటికి నీకుఁ బ్రియములు చెప్పెను ॥ఔన॥

తమకించి నిన్నుఁగూడి తమ్ములానకు నోరొగ్గి
ప్రమదానఁ దురుము నీపై నొరగఁగా
అమర శ్రీవేంకటేశ యంతలో నన్నేలితివి
సమమోహాలని యాపె సారె సారె మెచ్చెను ॥ఔన॥ 96

రేకు 817 ముఖారి

తానే యెఱుఁగుఁగాక దండనున్నాఁడు విభుఁడు
యీనేరుపు లీకత లేమని చెప్పుదునే ॥పల్లవి॥

చిత్తములోపలిసిగ్గు చెప్పరాదు
బత్తితోడితలపోఁత భావించరాదు
గుత్తపుగుబ్బలవుబ్బు గురి లేదు
యిత్తల నోచెలులాల యేమని చెప్పుదునే ॥తానే॥

వాడికనాకోరిక వశగాదు
వేడుకకు నెంతైనాను వెలలేదు
వోడక నాతమకము వోరువరాదు
యీడనె నాయడియాస లేమని చెప్పుదునే ॥ తానే ॥

తొట్టుకున్న జవ్వనము దొబ్బితేఁ బోదు
చుట్టుకున్న నావలపు చూపరాదు
యిట్టె శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
యెట్టనెదిటిసంతోస మేమని చెప్పుదునే ॥ తానే ॥ 97

## శ్రీరాగం

అంగనా నీవును మాటలాడుకోరయ్యా
చెంగటనున్న చెలులు సేసేపని యేదయ్యా ॥ పల్లవి ॥

వలపు లినుమడించె వాడికె లెదిరించె
చెలికి నీకు వావులు చిగిరించెను
తలఁపులు దైవారె తమకములు సందించె
యెలమి సుద్దులు మమ్ము నేమడిగేవయ్యా ॥ అంగ ॥

కొనచూపులు గదిసె కోరిక లల్లుకొనె
మనసు లిద్దరివిని మర్మము లంటె
ననుపులు సరిదాఁకె నవ్వులు వియ్యములందె
యెనలేనివిచారము లిఁక నేఁటికయ్యా ॥ అంగ ॥

మోవు లొక్కమరె మాఁగె మోహము లొండొంటి ముట్టె
భావించ సమరతులు బంతికి వచ్చె
శ్రీవేంకటేశ యింతిఁ జేకొని కూడితి విట్టె
యీవేళ నీసంతోసము లెంత చూపేవయ్యా ॥ అంగ ॥ 98

లలిత

ఇటువలె నుండవద్దా యిద్దరిపొందు
తటుకన నీదేరెఁ దనకు నాకిపుడు ॥ పల్లవి ॥

నేరుపు గలిగితేను నేస్తము లొనగూడు
మేరతోనే వుండితేను మించు వేడుక
వోరుచుకొంటేను వొద్దికౌను సరసము
తారుకాణలాయ నాకుఁ దనకు నేఁడిపుడు ॥ ఇటు ॥

చనవులు నెరపితేఁ జవులుపుట్టుఁ గాఁపురము
ననుపులు జరపితే నవ్వులురేఁగు
చెనకులు బలిసితే సిగ్గులు మొదలౌను
మనసులు సరిదాఁకెఁ దనకు నాకిపుడు ॥ ఇటు ॥

అంటిముట్టి పెనఁగితే నాయములు గరఁగును
జంటవాయకుండితేను సతమౌ మేలు
ఇంటిలోన శ్రీ వేంకటేశుఁడు తా నన్నుఁ గూడె
దంటతనా లుప్పతిల్లెఁ దనకు నాకిపుడు ॥ ఇటు ॥ 99

భైరవి

పదఁతి నెప్పుడు నీవు పాయనివాఁడవె కాక
నిడి సాగిలె నీపెకు నీమీఁదిచింత ॥ పల్లవి ॥

నెలఁతకొప్పుపై నవే నీవువెట్టిననేసలు
తలఁచుకున్నది నీతగుబాసలు
వలపులలో నున్నది (వి?) వడి నడియాసలు
యెలమి నీవెందుండినా నికనేల చింత ॥ పదఁ ॥

చన్నులపైనే వున్నవి చక్కనినీరేకలు
సన్నల నవ్వేనవ్వులసమజోకలు
కన్నులెదుట నున్నవి గక్కన నీరాకలు
మన్నిం చెప్పుడు వచ్చినా మరియేల చింత ॥ పద ॥

కూడినకాఁగిట మించె గురుతైననీ పొందులు
వాడికెమోవితేనెల వచ్చె విందులు
యీడనె శ్రీ వేంకటేశ యేలితి పీకె నిట్టె
జోడుగా ఫలించె నీకుఁ జూపనేల చింత ॥ పద ॥ 100

ముఖారి

చేయివట్టి తియ్యనేలే చెలులాలా
యీయెడనే వున్నవాఁడు యేలుకొనీఁగాక ॥ పల్లవి ॥

సరసమాడెడువాఁడు సంగాతము సేయఁడా
మరిగినవాఁడు నన్ను మన్నించఁడా
వరుసకువచ్చేవాఁడు వలపులు చల్లఁడా
వెరవెఱఁగక యేల వేగిరించేరే ॥ చేయి ॥

చనవులిచ్చినవాఁడు సంగడిఁ గూచుండఁడా
మనసెరిఁగినవాఁడుఁ మాటలాడఁడా
కనుఁగొన్నవాఁడు యిఁకఁ గాఁగిలించుకొనఁడా
తనివిఁబొందక యేల తమికించేరే ॥ చేయి ॥

కూడిమాడినవాఁడు గుట్టు నాకుఁ జెప్పఁడా
వాడికెక్కినవాఁడు నావసమేకాఁడా
యీడనే శ్రీ వేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
జాడదెలియక యెంత సారెఁ బెనఁగేరే ॥ చేయి ॥ 101

శుద్ధవసంతం

[1]ఏమి సేతుమయ్య నిన్ను నేమిటా గెలువరాదు
ఆముకొనఁ జనవిచ్చి యాసలు రేఁచేవు ॥ పల్లవి ॥

పెనఁగితే బెళికి తప్పించుకొనఁజూచేవు
చెనకితేఁ దలవంచి సిగ్గువడేవు
మొనసి సన్నసేసితే మూతులు గిరిపేవు
ననుపు నటించితేను నవ్వులు నవ్వేవు ॥ ఏమి ॥

నుడిగితే నెంతయినాఁ బొడవులు సూపేవు
తడవితే రాచపంతాలు మీరేవు
బడివాయకుండఁగానే బాస లడుగవచ్చేవు
వాడివట్టితే జలధి నెడముగానేవు ॥ ఏమి ॥

పొంచి మోము చూచితే పొందులే బోధించేవు
అంచల మొక్కితేనే వయ్యాళి చూపేవు
మంచితనాలనే నన్ను మన్నించితి విటు కూడి
ముంచి శ్రీవేంకటేశుఁడ మోవి లంచమిచ్చేవు ॥ ఏమి ॥ 102

రేకు 818 పాడి

ఎంతనోము నోఁచితినో యేమిచెప్పేది
మంతుకెక్క నింకా నింత మన్నించేవుగాక ॥ పల్లవి ॥

మేకొని నీ వాదేటిమేలములు కావా
లాకలై నామోమునఁ గళలు రేఁచేవి
జోకతోడ నీతోడిచుట్టరికమే కాదా
యేకాలమును నిన్ను నెడయనియ్యనిది ॥ ఎంత ॥

1. ఇందు దశావతార సమన్వయము గలదు.

ననుపున నీవు నాతో నవ్వినవవ్వులే కావా
తనివిదీరకుండాఁ దలపించేవి
పెనఁగి కొప్పుపై నీవుపెట్టినసేసలే కావా
యెనసి నీకాఁగిటిలో నింతకుఁ దెచ్చినవి ॥ ఎంత ॥

చన్నులపై నీవు చేయిచాఁచినరతులే కావా
పన్నినపలపులై పాదుకొన్నవి
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
కన్నులచూపులేకావా కామించఁజేసినవి ॥ ఎంత ॥ 103

గౌళ

ఊరకే విఱ్ఱవీఁగేవు వువిదలలోనవెల్లా
యీరీతి నుండితేను నాయీడుదానవైతివా ॥ పల్లవి ॥

పంతముతో బిగిసితే పగటుదానవైతివా
సంతసుద్దులు చెప్పితే జాణవైతివా
బంతిఁ గూచుండితేనే పట్టపుదేవివైతివా
వంతుతోడ వలపించవలెఁగాక విభుని ॥ ఊర ॥

సారె సారె నవ్వితేనే చనవరివైతివా
తోరపుఁగొప్పు వెట్టితే దొరవైతివా
చేరి యంటుకొంటేనే చేఁతలాడివైతివా
దారకాన దక్కఁగొనఁదగుఁగాక పతిని ॥ ఊర ॥

పెనఁగి దండఁ గూచుంటే పెండ్లికూఁతురవైతివా
పనులు సేసితే నేరువరివైతివా
యెనసి శ్రీవేంకటేశుఁ డేలె నన్నిందుకు, నీవు
చెనకి మెచ్చేది మంచిదిగాక ఇతనిని ॥ ఊర ॥ 104

హిందోళవసంతం

ఏమని చెప్పుదునే వీఁడెమ్మెకాఁడు
చేముట్టి వేఁడుకొనీనే చెలిమికాఁడు ॥ పల్లవి ॥

చలపాదిసరసాలజాజరకాఁడు
వలపులు చల్లీఁ బెక్కువలపుకాఁడు
తలఁపించీఁ దనపొందు దాయగాఁడు
వెలయించీ నన్ను నింత వేడుకకాఁడు ॥ ఏమ ॥

బచ్చనపరాకులపంతగాఁడు
కొచ్చికొచ్చి చెనకీని కోడెకాఁడు
అచ్చుగా నాసరులంటీ నాసోదకాఁడు
యిచ్చటనే కాచుకున్నాఁ డెలయింపుకాఁడు ॥ ఏమ ॥

వద్దనుండే యెలయించీ వన్నెకాఁడు
అద్దుకొనీఁ గాఁగిట నందగాఁడు
వొద్దికై శ్రీవేంకటేశుఁ డుబ్బరికాఁడు
పెద్దరికపులాబాలబేరగాఁడు ॥ ఏమ ॥ 105

భైరవి

ఎప్పుడు చిత్తగించేవో యేగతి మన్నించేవో
వొప్పనసేసితి నీకు నుడివోనివయసు ॥ పల్లవి ॥

పంతమాడి వలచితి పైకొని నే నీకు
సంతోసానఁ బొగడితి సారెకు నిన్ను
చింతదీర మొక్కితి చెలఁగ నీపాదాలపై
ఇంతకంటె మరి నే నేమిసేతు నీకను ॥ ఎప్ప ॥

సన్నలనే చవిగొంటి సరసపునీమోవి
కన్నులను సొలసితి గక్కన నిన్ను
చన్నుమొనల నొత్తితి సంగడికి వచ్చి నీమై
యెన్నికలు నెరవేరె నేమిసేతు నిఁకను ॥ ఎప్పు ॥

విరులసేస వెట్టితి వేడుక నీకొప్పుమీఁద
నిరతిమైఁ గాఁగిట నించితి నిన్ను
సిరుల నన్నేలితివి శ్రీ వేంకటేశ్వర
యిరవైతి నూడిగాన కేమిసేతు నిఁకను ॥ ఎప్పు ॥ 106

నాగగాంధారి

మేలుకు మేలేకాక మిక్కుటమేలా
కోలుముందై మీఁద గుట్టుసేయనేలా ॥ పల్లవి ॥

పచ్చిగా మగువ నీతోఁ బలుకఁగాను
అచ్చుగా నూఁకొందు గాక అలయనేలా
ముచ్చట నాపె నీకు మొక్కఁగాను
యిచ్చగించుకొంటగాక యిఁక సిగ్గులేలా ॥ మేలు ॥

ననుపున నాకె నీతో నవ్వఁగాను
చనువు లిచ్చుటగాక జాగులేలా
వినయముతో నిన్ను వేఁడుకోఁగాను
యెనయుటగాక మరి యెలయింపులేలా ॥ మేలు ॥

ప్రియమున నీతో నాపె పెనఁగఁగాను
దయతోఁ గూడుటగాక తాలిములేలా
క్రియతోఁ గాఁగిలించఁగా శ్రీ వేంకటేశా
నయమే మంచిదిగాక నాలితనములేలా ॥ మేలు ॥ 107

నాదరామక్రియ

నెలఁతచక్కఁదనమే నిండుబండారము నీకుఁ
గలిగెఁ గనకలక్ష్మి కాంతుఁడవైతివి ॥ పల్లవి ॥

పడఁతినెమ్మోమునకు బంగారుకళలు దేరీ
వెడలేనెలవినవ్వే వెండిగనులు
అడియాలమగుమోవి న(య?)దె పగడపుఁదీగె
నిడువాలుఁదురుమే నీలములరాశి ॥ నెలఁ ॥

తరుణిపాదపుగోళ్లు తళుకులవజ్రములు
పరగుఁజేతిగోళ్లె పద్మరాగాలు
అరిదికన్నులతేట లాణిముత్తెపుసరులు
సరిఁ బచ్చలకొండలు చనుమొనలు ॥ నెలఁ ॥

చెలితేనెమాటలు జిగిఁ బుష్యరాగాలు
వలపుతెరసిగ్గులు వైడూర్యాలు
తొలఁకుననురాగాలే దొడ్డగోమేధికములు
కలసి తీకెను శ్రీవేంకటేశ కాఁగిటను ॥ నెలఁ ॥ 108

రేకు 819 నాగవరాళి

వీడుదోడాయ వలపు వెలఁదికి నీకును
చూడఁజూడ వేడుకాయ చూచువారికిని ॥పల్లవి॥

సిగ్గుతోడ బాగాలు చెలి నీకు నందియ్యఁగా
వొగ్గుచు నందుకొంటివి వొయ్యన నీవు
నిగ్గులుదేరేయట్టినీపుక్కిటితములము
అగ్గలపుమోహమున నాపెకుఁ బెట్టితివి ॥ వీడు ॥

చన్నులు బటువులుగా సతి నీకు నానించితే
వున్నతి నొరగుకొంటివి వొద్దికై నీవు
యెన్నికఁ జేతులు రెండు నీపెమేని కాదారుగ
చెన్నుమీర మెడదండ సేసి కాఁగిలించితి ॥వీడు॥

పడఁతి నీకు దప్పికిఁ బన్నీ రందియ్యఁగా
కడఁగి శ్రీవేంకటేశ కైకొంటివి
తడయక అధరామృతపుపానకము నేఁడు
యెడనెడ మారుకుమారిచ్చితివి నీవు ॥వీడు॥ 109

## దేసాళం

చిత్తగించి చూడవయ్య చెలిలాగు
బిత్తరపుజవ్వనము పెచ్చుపెరిగీని ॥పల్లవి॥

చెలిపీనులజవ్వాది చెక్కులఁ గరఁగి జారీ
వెలి నిన్నుఁ బాసినవిరహానను
మలసినకోరికలు మతిలోఁ దీఁ[1]గెలువారీ
వలపులచెమటలవానలను ॥చిత్త॥

వేవేగఁ బెట్టినకొప్పు వెడజారీ మూఁపుమీఁద
నీవొద్దికి వచ్చేటినిబ్బరానను
పూవులదండలోనిపుప్పొడి దుమ్ములు రేఁగీ
కావరపునిట్టూర్పులగాలిచేతను ॥చిత్త॥

ముసుకొన్ని మొరసీని ముంజేతికంకణములు
తఃవార నిన్నుఁగూడేతమకమున
యెనసితివి శ్రీవేంకటేశ యింతలోనె యీకెను
వినయాన నీకు మొక్కీ వేడుకలను ॥చిత్త॥ 110

1. ఈ శబ్దములో పలుచోట్ల వరసున్న లేదు.

సింధురామక్రియ

ఎంతలేదు పరాకు నీ కేపొద్దును
వింతొకచూపు మరి వేఁడొకచ వెం[1]దురు ॥ పల్లవి ॥

వేడుకతోడుత నీకు విన్నపాలు సేయవచ్చె
ఆడరాదా కతము లాపెతోడను
తోడనే సింగారించుక తొంగిచూచీ నల్లదివో
చూడరాదా యాదిక్కు జోడుగా నీవు ॥ ఎంత ॥

విందుగాఁ బయ్యదలోన వెస నేమో మూసితెచ్చె-
నందుకోరాదా లోన నాపెచేతను
పొందుగాఁ గొలువుసేసీ పూనుకొని యెదుటనె
చెంది వూడిగ మేమైనాఁ జేయించుకొనరాదా ॥ ఎంత ॥

వినోదానఁ దా నేర్చిన విద్యలు చూపఁగడఁగీ
మనసారఁ జూడరాదా మాఁటున నుండి
యెనసితివి శ్రీ వేంకటేశ యిం(యి)న్నిటా నన్ను
పెనఁగి యాపెవలపుఁ బెడరేఁచరాదా ॥ ఎంత ॥ 111

పాడి

ఎంత యెడగొల్లకత్తె వేమే నీవు
ఇంతవై వలపు లిట్టిచవులుగొనేవు ॥ పల్లవి ॥

కురుగు దువ్వేనంటా గుబ్బల నొత్తుకొనేవు
సరులు గట్టేనంటా సారెకుఁ గాఁగిలించేవు
శిరసంటేనంటాను చెక్కుఁజెక్కు మోపించేవు
బెరసి విభుని నెంత పిప్పిసేసేవే ॥ ఎంత ॥

1. వేఁడి + ఒకచవి + అందురు.

కై దండ యిచ్చేనంటా కాయము సోఁకించేవు
పాదాలొత్తేనంటాఁ దొడపైకిఁ దీసుకొనేవు
ఆదట జలకమార్చేనంటా నొరసుకొనేవు
గోదిలిమోహాన నెంతగుబ్బతిలేవే ॥ ఎంత ॥

తములాన కొగ్గేనంటా తగ మోవి దాఁకించేవు
చెమట దుడిచేనంటా సిగ్గులంటి పెనఁగేవు
అమర శ్రీవేంకటేశుఁ డన్నిటాను నన్నుఁ గూడె
భ్రమసి నీవెందాఁకాను బాఁతిపడేవే ॥ ఎంత ॥ 112

## శ్రీరాగం

తానే యెఱుఁగుఁ బతి తలఁపించరే
యీనెలఁత మేలు[1]దాయ నెట్టోర్వ వచ్చునే ॥ పల్లవి ॥

కొమ్మతలపోఁతలేద కోవిలకూఁతలేద
నిమ్మలపుమనసేద నివ్వెరగేద
పమ్మికొన్నసిగ్గులేద పట్టరానితమి యేద
ఇమ్ముల నిట్టివలపు లెట్టోర్వవచ్చునే ॥ తానే ॥

కలయువేడుకలేద కంతునిబాణములేద
నెలకొన్నయాసలేద నిట్టూర్పులేద
చెలిచక్కఁదనమేద చెక్కిటిచేయిచింతలేద
ఇల నిట్టివలపులు యెట్టోర్వవచ్చునే ॥ తానే ॥

మంతనాన నుండుటేద మలయుకోరికలేద
సంతసపుమాటలేద జాగులేద
ఇంతలో శ్రీవేంకటేశుఁ డిట్టె వచ్చి యాకె నేలె
యెంతయినా నీవలపు లెట్టోర్వవచ్చునే ॥ తానే ॥ 113

1. మేలుది+ఆయ.

తెలుఁగుఁగాఁ(గాం)బోది

విరహమునకు నీవు వెరవవద్దు
గరిమ నేపొద్దూ నివే కాపులు నీకును ॥ పల్లవి ॥

చెంగలువబంతి నీవు చేతఁబట్టుకొనవే
సంగతి నాతనిమేనిఛాయల దది
ముంగిటితామర ఉరమున నొత్తుకోవే
రంగుగాఁ జెలువునినేత్రములఁ బోలు నవి ॥ విర ॥

కనకపుసొమ్ములెల్లా కాయముపై నించుకోవే
ఘనునిపీతాంబరపుకాంతులఁ బోలు
పెనచి మాణికములపేరు మెడ వేసుకోవే
కనుఁగొంటే నాతనికౌస్తుభముజాతివి ॥ విర ॥

చేవమీర ముంజేతిచిలుకతో మాఁటాడవే
భావింప నాతఁడెక్కేపక్షికులము
కోవరపునీచనుఁగొండ లిట్టె చూపవే
యీవేళ శ్రీ వేంకటేశుఁ డేలె నిన్నును ॥ విర ॥ 114

రేకు 820 ఆహిరి

తలఁపులో కోరికలు దైవారీని
యెలమిఁ గానుక లిచ్చి యీడకు రమ్మనవే ॥ పల్లవి ॥

చెప్పరే యాతనిరాక చెలులాల
వుప్పతిల్లుఁగాఁకలకు నోపనే నేను
కుప్పలుఁదెప్పలునాయ కోరికలు
ఇప్పుడు కొలువులోఁ దా నేమిసేసీనే ॥ తలఁ ॥

చూపరే యాతనిమోము సుదతులాల
పైపై నాతమకము పట్టఁగరాదు
మోపాయ జవ్వనము మొగి నామేన
యేపునఁ దనకు నన్ను నీడేర్చఁదగును ॥ తలఁ ॥

పొందుసేయరే యాతనిఁ బొలఁతులాల
విందువలెఁ దానె శ్రీవేంకటేశుఁడు
యిందుకే వచ్చి కలసె నిదివో నన్ను
అందమైనయిల్లాల నే నలమేలుమంగను ॥ తలఁ ॥ 115

సాళంగనాట

అన్నిటాను నెరజాణ వౌదువే నీవు
మన్నన లందితివే మగనిచే నీవు ॥ పల్లవి ॥

చొక్కపుఁజూపులఁ బతిఁ జూడనేర్తువే
మొక్కతానే కొనగోరు మోపనేర్తువే
చిక్కనినవ్వులతోడ సిగ్గువడనేర్తువే
చెక్కునొక్కి ప్రియములు చెప్పనేర్తువే ॥ అన్ని ॥

చెప్పక వూడిగాలెల్లాఁ జేయనేర్తువే
చెప్పరానిసన్నలు సేయనేర్తువే
చొప్పులుగా చనుఁగవ సోఁకించనేర్తువే
దప్పిదేర మోవి చూపి తమిరేఁచనేర్తువే ॥ అన్ని ॥

ననుపులుసేసుక పెనఁగనేరుతువే
యెనసి బాగాలు నీ వియ్యనేర్తువే
అనుఁగుశ్రీవేంకటేశునలమేలుమంగవు నీవు
తనియఁగఁ గూడితివి తలఁపించనేర్తువే ॥ అన్ని ॥ 116

మంగళకౌశిక

వీడెమిత్తువు రావమ్మా వీఁడె పానుపుపై నున్నాఁడు
జోడై నవయసులే సొంపులు వుట్టించీని ॥ పల్లవి ॥

సొలసి నీవుచూచినచూపులెల్లాఁ బతికిని
కలువపూవుదండలై కమ్ముకొనెను
నెలఁత నీవు చక్కనినెమ్మోము చూపితేను
వలుదచంద్రబింబమై వలపులు రేఁచెను ॥ వీడె ॥

అరిది నాతనితోడ నాడినమెల్లనిమాట
తరితీపుతేనెలై దైలువారెను
సరుగ నీవప్పుడు [1]సన్న సేసిన సన్న
సురతపులతలై చుట్టుకొనెను ॥ వీడె ॥

యెనసి శ్రీవేంకటేశుయెదుట నవ్వినవ్వు
చెనకి పైఁజల్లినసేస లాయను
పెనఁగి చేతులువట్టి పిలిచినపిలుపులు
తనివోనికంకణదారా లాయను ॥ వీడె ॥ 117

వరాళి

వినోదించవయ్యా ఇందు వేడుకసేసీ నీకు
ఘనసింగారవనము కామిని వెంచెనయ్యా ॥ పల్లవి ॥

తెగరానియాసలు తీగెలువారఁగాను
జిగిమించి చింతలు చిగిరించఁగా
నిగిడి నివ్వెరగులు నీడలు గప్పఁగాను
తగుసింగారవనము తరుణి వెంచెనయ్యా ॥ వినో ॥

---

1. పునరుక్తి. పండిన పండువంటిది.

చిత్తమే జొంపాలుగట్టి చీఁకట్లుగొనఁగాను
హత్తి కోరికవిరులు గుత్తులై మించెఁ
బొత్తుగాఁ బెంజెమటల పూవుఁదేనెలు గురియ
కొత్తసింగారవనము కోమలి వెంచెనయ్యా ॥ వినో ॥

నెయ్యముతోఁ జన్నుల నిమ్మపండ్లు[1] వండఁగాను
పయ్యదవెలుఁగు చుట్టిబయలు గాఁగా
ఇయ్యెడ శ్రీవేంకటేశ యీకె నేలితివి
వొయ్యనె సింగారవన మువిద వెంచెనయ్యా ॥ వినో ॥ 118

## పాడి

నన్నెంత వొగడేవయ్యా నాగుణాలు మంచివంటా
చిన్నదాన నే నీవునేసినమానిసిని ॥ పల్లవి ॥

తనకుబాఁతియైనతరుణులెల్లా నింపులే
మనసెనసినవారిమాట లింపులే
ననుపుగలుగుచోటినవ్వులెల్లా నింపులే
పెనఁగి పైకొనేవారిప్రియములు నింపులే ॥ నన్నెం ॥

సేవలుసేసేవారిసేఁతలెల్లా నింపులే
కైవసమైనవారిగతు లింపులే
వావిగలసినవారివాడికలెల్లా నింపులే
నీవద్దఁ బాయనివారినిండుసిగ్గు లింపులే ॥ నన్నెం ॥

సరసములాడేవారిసంగాతాలెల్ల నింపులే
సురతవేళలమేనిసోఁకు లింపులే
ఇరవై శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
మరిగినయడాటాన మంతనము లింపులే ॥ నన్నెం ॥ 119

1. నిమ్మపండ్లు + వండఁగాను.

## దేవగాంధారి

చూడరే వోచెలులాల సుదతిసింగారము
వేడుకతోడఁ[1] దోడ విలాసము మించెను ॥పల్లవి॥

అలరిననెమ్మోము అద్దమయినకతన
మెలుపునఁ గళల[2] నేమించులు మించె
లలిఁ దురుమెల్లా నీలపురాలైనకతన
కలికిచూపుల నిండుఁగాంతు లిట్టె మించెను ॥చూడ॥

పగటున మోవి బింబఫలమైయున్నకతన
పొగడొందుమాటలతీపులు మించెను
తగునాభి సరసియై తనరినకతమున
నిగిడి మొక్కలకరనీరజములు మించె ॥చూడ॥

వెట్టన మేను లతై నెగడినకతమున
కిట్టి శ్రీ వేంకటేశుకాఁగిటఁ బాఁకెను
అట్టె చన్నులు నిమ్మపండ్లయి వుండినకతన
పట్ట నితనిచేతులఁ బాదుకొని మించెను ॥చూడ॥ 120

రేకు 821

## నారాయణి

అడనుండే చూచి వెరగందితి నేను
యీడ నన్నుఁ గాఁగిలించే వేఁటిదో యెఱుఁగను ॥పల్లవి॥

సొలపుఁజూపులఁ జూచి సుద్దులు నీతోఁ జెప్పి
వలపులు చల్లె(ల్లి?)నాపె వాడికగాను
కలువల వేసి కందువకు రమ్మని
పిలిచితి వెటువంటిప్రియమో నీకును ॥అడ॥

1. తోడన్ + తోడన్ 2. కళలు + అనే

చనుఁగవపై పయ్యద చక్కఁబెట్టుకొంటాను
వినయాన మొక్కీ నాపె వేడుకగాను
ననిచి కై దండవట్టి నగరిలోనికిఁ దీసి
పెనఁగితి వాపె యెంతప్రియమో నీకును ॥ అద ॥

చేరి జాఱుఁగొప్పు చేతఁ జెక్కుకొంటా మోముచూపి
సారె సన్న సేసీ నాకె సమ్మతిగాను
గారవించి నన్నేలితివి గక్కన శ్రీ వేంకటేశ
బీరాన నాపె నెంతప్రియమో నీకును ॥ అద ॥ 121

పాడి

వేగిరించకురే మీరు వెలఁదులాలా
పోగైనమంచిగుణాలబుద్దులవాఁ డతఁడు ॥ పల్లవి ॥

వలపించనేర్చునట వద్దికి రానేరఁడా
తలఁపెందున్నదో కాక తనకు నేఁడు
యెలయించఁగలఁడట యెనయఁగలేఁడా
కలిగినతనబత్తి కందము గాక ॥ వేగి ॥

కోరితెచ్చుకొన్నవాఁడు కూడుకొననేరఁడా
వూరకే పనిగలిగి వున్నాఁడో కాక
వేరులేనిచుట్టరికమట వీడెమంప మరచీనా
తారుకాణలై మనకుఁ దానే వచ్చీఁగాక ॥ వేగి ॥

మంచముపై కిట్టె వచ్చి మాఁటలాడ నేరఁడా
యెంచుక నన్నెంతగా మన్నించీనోకాక
అంచెల శ్రీవేంకటేశుఁ డన్నిటాను నన్నుఁ గూడె
వించినయాపొందు లిట్టె నెరవేరీఁ గాక ॥ వేగి ॥ 122

బౌళి

ఎట్టునేసినా నీచిత్త మెదురాదేదానఁ గాను
పట్టి నీపాదాలసేవే పదివేలు నాకు ॥ పల్లవి ॥

ఆసపడి మోహించినఅతివను నే నీతో
వాసులు వంతులు నెంచవచ్చునా మరి
పోసరించి జవ్వనమే పోఁగై వున్నదానను
వేసరఁజెల్లునా నిన్నే వేఁడుకొనేఁగాక ॥ ఎట్టు ॥

యెప్పుడు వత్తువోయని యెదురుచూచే నేను
తప్పులుఁ దారులుఁ బట్టఁ దగవా నిన్ను
వుప్పతిల్లి నేసపాలు వొడిఁగట్టుకుందానను
నెప్పున నే నలిగేనా నీతో నవ్వేఁగాక ॥ ఎట్టు ॥

నెమ్మది నీ[1]కాఁగిలి నీకే మీఁదెత్తుకుండి
యెమ్మెలు నేతులుఁ జూపనేలా ఇఁక
నమ్మించి శ్రీ వేంకటేశ నన్నిట్టె యేలుకొంటివి
కమ్మటి నే మరచేనా కడుమెచ్చేఁ గాక ॥ ఎట్టు ॥

గౌళ

ఓయమ్మ తానెంత వొడఁబరచీనే నన్ను
చేయి మీఁదాయఁ దనకుఁ జేతిలోనిదాననే ॥ పల్లవి ॥

చెంతనుండి వూడిగము నేనేయిల్లాలఁగాక
పంతమాడేయిల్లాలనా పతితోను
వింతలేక తనమాట విననేరుతుఁ గాక
యెంతైనా తనకు నేనెదురాడనేర్తునా ॥ ఓయ ॥

1. నెమ్మదిన్ + ఈకాఁగిలి

సిగ్గుతోడఁ బాదాలొత్తి చిమ్మిరేఁగేదానఁగాక
యెగ్గుపట్టేదాననా యెంతైనాను
వొగ్గి తనచేఁతలెల్లా వోడిఁగట్టుఁకొందుఁగాక
వెగ్గళించి యేమైనా వేసారుకొందునా ॥ఓయ॥

ఇచ్చకమై నెరపేటిదిది నాగుణము గాక
నచ్చుకొట్టి కొసరేది నాగుణమా
అచ్చపుశ్రీ వేంకటేశుఁ డంతలోనె నన్నుఁగూడె
కొచ్చి తనగుణాలు నేఁ గొ[1]నాడ నావసమా॥ ఓయ ॥ 124

పాడి

చెప్పితి మిప్పుడే నీకు చెలులము బుద్ధులెల్లా
ముప్పిరిఁ జేతమొక్కవే మోసపోతిననక ॥ పల్లవి ॥

మనసార నాతనితో మాటలెల్లా నాడవే
చెనకవే ఇప్పుడేల సిగ్గువడేవు
పెనఁగవే చేయివట్టి పిలువవే యింటికి
వెనక మరచివచ్చి విచారము సేయక ॥ చెప్పి ॥

తలయెత్తి చూడవే తనియ నాతనిదిక్కు
నిలువవే ముందటను నీకేల కొంక
వెలయఁగ నవ్వవే విడెము చేతి కివ్వవే
మలసి యింకొకమారు మరచితిననక ॥ చెప్పి ॥

పానుపుపైఁ గూచుండవే పాదాలొత్తఁగదవే
మౌనముతో నీకఁ దెలమలఁ గేఁటికి
పూని శ్రీ వేంకటేశుఁడు పొందుసేసి నిన్నుఁ గూడె
కానుకమోవి చేకోవే కడమాయననక ॥ చెప్పి ॥ 125

1 కొనాడ=కొనియాడుటయా ?

శుద్ధదేశి

కానవచ్చె నాపై నీపైఁగలమోహమెల్లాను
అనుకొన్న వవి యెట్టియడియాసలో ॥ పల్లవి ॥

చిత్తగించి చూడవయ్య చిరునవ్వు నవ్వీ నాపె
యిత్తల నీయాపె[1]సఁ(సం?)ది నెంత[2]వనికో
కొత్తకొత్తచెమటలు గోర నీపైఁ జిమ్మీని
తత్తరాన నది యెట్టితడఁబాటులో ॥ కాన ॥

వేడుకతో వినవయ్య విన్నవించఁబూనీ నాపె
వోడక నీకాపె కెంత వొడఁబాటులో
వాడికసన్నలవే వలపులు నీపైఁ జల్లీ
యీడుజోడయినసుద్దు లెటువంటివో ॥ కాన ॥

అఁ(అం?)ది కాఁగిలించుకొనవయ్య నీకు మొక్కీ నాపె
విందుల నీకాపె కెట్టివేడుకలో
యిందునె శ్రీవేంకటేశ యేలితి వీకె నింతలో
సందడి నేఁత లేరీతి సరసములో ॥ కాన ॥ 126

రేకు 822. కాఁ(కాం)బోది

ఊరకే వుండేనంటే వుమ్మగిలీ వలపులు
యేరీతి మన్నించేవో ఇఁక నీచిత్తము ॥ పల్లవి ॥

తలెత్తి చూడకుండితే తనివియుఁ దీరదు
సొలసితేఁగాని వాసులు మించవు
తెలియమాటాడకుండితే నొక్కమనసు గాదు
చెలఁగి విన్నపాలెల్లాఁ జేసితి నీచిత్తము ॥ ఊర ॥

1. నీయొక్క ఆపెయొక్క సందున. 2. ఎంత + వనికో

సరసమాడితేఁగానీ చవులెల్లా రేఁగవు
సొరిదిఁ గూచుండక సొంపులు పుట్టదు
తెరలోనికిఁ దియ్యక తీర దెంతైనా సిగ్గు
సరవి నివెల్లా జాడలు నీచిత్తము ॥ ఊర ॥

తనువులు సోఁకక తనివో దెంతైనాను
ననుపునఁ బెనఁగక నాఁటదు ప్రేమ
యెనసితివి శ్రీవేంకటేశ ఇంతలో నన్ను
కనుఁగొంటి నీమేలు గట్టిగా నీచిత్తము ॥ ఊర ॥ 127

ఆహిరి

నీదిక్కే చూచి వాఁడే నీ మగఁడు
సాదించీ, మీమోహములు సందడించీఁజుమ్మీ ॥ పల్లవి ॥

చక్కనినీవదనము సారెనేల వంచేవే
చిక్కనినీనగవులు చిందీఁజుమ్మీ
చెక్కిటిమీఁద నటు చేయి యేల పెట్టేవే
అక్కజపుమోముకళ లంటుకొనీఁజుమ్మీ ॥ నీది ॥

సన్నలనే నీబొమ్మలఁ కెన లేల చూపేవే
మిన్నక వజ్రాలబొట్టు మెరచీఁజుమ్మీ
చన్నులమీఁదిపయ్యద చక్కబిగించుకొనేవే
మున్నే జక్కవపిల్లలు మూఁతులెత్తీఁ జుమ్మీ ॥ నీది ॥

సిగ్గుతో నేల ముంజేతిచిలుకతో మాటాడేవే
వొగ్గి తరితీపులెల్ల నూరీఁజుమ్మీ
అగ్గమై శ్రీవేంకటేశుఁ డంతలోనె నిన్నుఁ గూడె
తగ్గక యీసింగారము దైవారీఁజుమ్మీ ॥ నీది ॥ 128

బౌళి

కానీవయ్యా చుట్టాలమై కలిగితి మిదె నీకు
 వీనులకు చవులు నీవేడుకలే కావా ॥ పల్లవి ॥

తగవులు చెప్పేవు తరుణికి నాకును
 మగఁడవు నీవేకావా మాకిద్దరికి
 వెగటుదీర సరిగా విడెములు వెట్టేవు
 జిగిమించ నిన్నియు నీచేఁతలే కావా ॥ కానీ ॥

వొడివట్టి మొక్కించేవు వొకరొకరిని మాలో
 నడుమ నీవేకావా నాయఁగాడవు
 తొడిఁబడ నీవిట్టె పొత్తులఁ గూచుండుమనేవు
 జడిగొన్న నీగుణాలసహజమే కాదా ॥ కానీ ॥

వొగ్గి కాఁగిటిలో మమ్ము నొద్దికతోఁ గూడేవు
 సిగ్గులు నీవే కావా శ్రీవేంకటేశా
 తగ్గులేకుండా మమ్ము దయతో మన్నించితివి
 వెగ్గళమై నీకుఁగలవిద్య లివే కావా ॥ కానీ ॥ 129

సామవరాళి

చెప్పవయ్య వినేఁగాని చెవులపండుగగాను
 యిప్పుడే మొక్కులు మొక్కి నెంతచుట్టరికమో ॥ పల్లవి ॥

కొమ్మ గేదఁగిరేకులు కొప్పునఁ జెరుగుకొని
 యెమ్మెలు పచరించీ నీయెదుట నదె
 నెమ్మది వద్దఁగూచుండి నీతో మాటలాడీని
 యిమ్మల మీకిద్దరికి నెంతచుట్టరికమో ॥ చెప్ప ॥

సింగారించుకొని వచ్చి చీరునవ్వు నవ్వుకొంటా
కొంగు నిన్ను దాఁకించి కొసరీనదె
సంగతిగా నప్పటిని సారె విడెమిచ్చుకొంటా-
నెంగిలిపొత్తు గలసీ నెంతచుట్టరికమో ॥ చెప్ప ॥

ఆదిగొని కంకణాలు అట్టె గల్లుగల్లనఁగా
పాదాలు గుద్దీ నీకు పాన్పుపై నిదె
పోదితో శ్రీవేంకటేశ పొంచి నన్నుఁగూడితివి
యీదెసఁ దనకు నీకు నెంతచుట్టరికమో ॥ చెప్ప ॥ 130

## హిజ్జిజి

ఏల మూసి దాఁచేవు యిదేమయ్యా
అలుగాదా నీకు నాపె అదేమయ్యా ॥ పల్లవి ॥

బత్తితోడ నిన్నుఁజూచి పదఁతి మాటలాడఁగా
యిత్తల సిగ్గువడేవు యిదేమయ్యా
బొత్తుగాఁ బువ్వులచెండు పూఁచి కానుకియ్యఁగాను
హత్తి చేత నందుకొన వదేమయ్యా ॥ ఏల ॥

ముందరనే నిలుచుండి మోహ మాపె చల్లఁగాను
ఇందుకు రమ్మనరాదా ఇదేమయ్యా
విందువలెఁ జెవిలోన విన్నపాలు సేయఁగాను
అందుకు నేమీనన వదేమయ్యా ॥ ఏల ॥

నెఱతనమున వచ్చి నీపాదము దొక్కఁగాను
యెఱఁగనట్టే వున్నాఁడ విదేమయ్యా
మఱి నన్నుఁ గూడితివి మరిగి శ్రీవేంకటేశ
అఱమఱచే వాపెను అదేమయ్యా ॥ ఏల ॥ 131

రామక్రియ

సందుసుడికత్తెవు జాణవు నీవు
యిందరు నుండఁగా నీ వెంతలాచేవే ॥ పల్లవి ॥

వుంగరము నీదంటా వూరకే వేలువట్టేవు
కొంగు దాఁకించకుమంటా గోరఁ జిమ్మేవు
సింగారించనేర్తునంటా చేరి వద్దఁ గూచుండేవు
ఇంగితము చూపి పతి కెంతలాచేవే ॥ సందు ॥

సున్నము వెట్టుమంటా చుట్టరికాలు సేసేవు
వున్నదా నిమ్మపండంటా నొడివట్టేవు
చన్నులఁ జూచితినంటా సారెఁ దగులనాడేవు
యెన్నికతో రతులకు నెంతలాచేవే ॥ సందు ॥

కోవిల గూసీనంటా కుచ్చి కాఁగిలించేవు
దేవులనైతినంటాఁ దెరవేసేవు
చేవమీర నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు
యీవేళ నీవాసపడి యెంతలాచేవే ॥ సందు ॥ 132

రేకు 823 వరాళి

దండనున్నసతులెల్లా తలలు వంచుకొనేరు
కొండవంటిదొరవు సిగ్గులు దేర్చరాదా ॥ పల్లవి ॥

పచ్చడములోననే పాదాలొత్తీ నాపె నీకు
గచ్చుఁజేఁతల నీవాపెఁ గరఁగించేవు
పచ్చిదేరి మోవెల్ల భావపుఁగళలు దాఁకీ
ఇచ్చటనే ఆఁటదాని నింతసేతురా ॥ దండ ॥

దోమతెరమాఁటుననే తూరి యాపె సేవసేసీ
చేముట్టి మర్మములంటి చిమ్మిరేఁచేవు
మోమునఁ జొక్కులుదేరె మూసీ మంతనపురతిఁ
గామిని నిందరిలోనఁ గడుఁగాకుసేతురా ॥ దండ ॥

పూదండలసందినే పొదిగి కూడీ నాపె
ఆదెసఁ జెమట నోలలార్చేవు నీవు
తోదోపులనే వీడెఁ దురుము శ్రీవేంకటేశ
సాదువంటిజవరాలి సారెఁ గాకుసేతురా ॥ దండ ॥ 133

## బౌళి

ఎఁదుకని సిగ్గువడే వేమే నీవు
కంమవ నాపచ్చడము గప్పుకోవే యిపుడు ॥ పల్లవి ॥

ముదిత జారినకొప్పు ముడుచుకోఁగడఁగితే
పదలి పయ్యెద కానవచ్చెఁ జన్నులు
అది చక్కఁబెట్టుకొనేనంటాఁ గొంగు బిగించితే
పొదిగి కట్టినయట్టిపోఁకముడి వీడెను ॥ ఎందు ॥

సరుగ నావలిపెమే చక్కఁగట్టుకొనఁగాను
గరిమఁ దొడలనిగ్గు గానవచ్చెను
పరగ నందుకు లోఁగి పాపట దువ్వుకొంటే
కరమూలములసొంపు గనుబయలాయను ॥ ఎందు ॥

చెలరేఁగి యందుకు నవ్వి చేత విడెమిచ్చితేను
పులకలే నీమర్మములు దెలిపె
అలమితి నందుకుఁగా నట్టె శ్రీవేంకటేశుఁడ
చెలపలచెమటలు చెమరించె నీకును ॥ ఎందు ॥ 134

లలిత

అందుకేమి దోసముగా దానతీవయ్యా
విందులుగా వీనులను వినే నేను ॥ పల్లవి ॥

మగువలతోనెల్లా మాఁటలు నీ వాడఁగానో
చిగురాకు నీమోవి చేగయెక్కెను
మొగి వారితోడ సాములు నీవు సేయఁగానో
జిగిమించుచెక్కులెల్లాఁ జెమరించెను ॥ అందు ॥

సారె సారెఁ జెలరేఁగి సరసములాడఁగానో
చీరుమూరై మేనెల్ల జీరలాయను
చేరిచేరి లోలోను సేసలు చల్లుకోఁగానో
కూరిములు చూపట్టఁ గురులు చెదరెను ॥ అందు ॥

ననుపులు సేనుకొని నవ్వులు నవ్వఁగానో
నినుపుగా నిట్టూర్పులు నిగుడఁజొచ్చె
ఘనుఁడ శ్రీవేంకటేశ కాఁగిట నన్నేలితివి
కనుపట్టి నీమోమునఁ గళలు దైవారెను ॥ అం ॥ 135

మంగళకౌశిక

[1] అనేకపంతగాఁడవు అందగాఁడవు
మునుకొన్నమావెంగేలు ముంచుకొనీనా ॥ పల్లవి ॥

కొసరితే నేమాయ కొంగువట్టితే నేమాయ
మసలక తగులైనమగవానిని
యెసఁగ నేఁ జెనకితే నేలతప్పించుకొనేవు
కసుఁగందనిచన్నులు కాఁడీనా విన్నును ॥ అనే ॥

1. విరుద్ధసమాసము వీరికలవాటే.

సారె నంటించితే నేమాయ  ంకించితే నేమాయ
వేరులేనిచుట్టరికమైనవిటరాయని
వూరక నవ్వితేను వొడ్డించుకో నీకేఁటికి
ఆరితేరి నాచూపులు ఆయములు రేఁచీనా ॥ అనే ॥

చెక్కునొక్కితే నేమాయ చిక్కించుకొంటే నేమాయ
అక్కరతో నాయకుఁడైనవానిని
యిక్కడ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
మిక్కిలి నారతులివి మేరమీరీనా ॥ అనే ॥ 136

## పాడి

ఏమాయ నందుకునేల వేగిరించేవు
నీమాటలన్నియును ని మయ్యీఁగాక ॥ పల్లవి ॥

సందడిలో నిన్ను నాచన్నులు దాఁకితేను
కందువల నిది యెంతగబ్బి యనేవు
గందవొడి చల్లుకోఁగా గాలి నీపైఁ బారితే
కెందమ్మిపువ్వులనేల కెరలి వేసేవు ॥ ఏమా ॥

కురులు దువ్వుకోఁగా కొప్పు నీపై జారెనంటా
గొరబుసేసి నన్ను గోర గీరేవు
పరగ మేడ యెక్కఁగా పైఁజిందెఁ జెమటలంటా
సరుగఁ గప్పురమేల చల్లేవు నామీఁదను ॥ ఏమా ॥

యిట్టె బంతిఁ గూచుండఁగ నెంగిలి సోఁకెనంటాను
బెట్టుగఁ గాఁగిట గుచ్చి బిగియించేవు
నెట్టన శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
చుట్టమవై నన్ను నెంత చొక్కులఁ బెట్టేవు ॥ ఏమా ॥ 137

మాళవి

ఎంతజాణలే పీరు యింతులాల
వింతలుగ వీదివీది వినోదించేరు ॥ పల్లవి ॥

ఇద్దరుదేవుళ్లుఁ దాము నెదురుదేరులమీఁద
కొద్దిమీర నిమ్మపండ్లఁ గుచ్చి చిమ్మేరు
వొద్దికతో నవ్వుకొంటా నుంటవింట గందపు –
ముద్దలు దాఁకవేసి మోదములు చూచేరు ॥ ఎంత ॥

వెనకాముందరాను వేడుకతోఁ దేరులు
అనువుగా వెంటవెంట నంటఁదోలేరు
తనువులు సోఁకఁ జేతితామరనాళముల
పెనఁగి పైఁబారఁ జాఁచి పిలిచేరు మోవులు(లి?) ॥ ఎంత ॥

సందడిలోపలనే సంగడిఁ దేరులు నిల్పి
కందువతోఁ జొకళించి కాఁగిలించేరు
పొంది శ్రీవేంకటేశుఁడు భూదేవీ నలమేల్మంగా
పెందలికాడనే పెండ్లిపీఁటపై నున్నారు ॥ ఎంత ॥ 138 ॥

రేకు 824 సౌరాష్ట్రం

ఎంతమోహమో నీకీఇంతిమీఁదను
వింతవింతవేడుకల విఱ్ఱవీఁగేవు ॥ పల్లవి ॥

తరుణిగుబ్బలు నీకుఁ దలగడబిల్లలుగా–
నొరగుకొన్నాఁడవు వుబ్బున నీవు
దొరపై పయ్యదకొంగు దోమతెరభాగుగ
సరుగ మాఁటుసేసుక జాణపై వున్నాఁడవు ॥ ఎంత ॥

భామినితొడలు నీకు పట్టెమంచములాగున—
నాముకొని పవ్వళించే వప్పటి నీవు
గోముతోడ పట్టుచీరకుచ్చెల పరపుగాఁగ
కామించి ఇట్టె కోడెకాఁడవై వున్నాఁడవు ॥ ఎంత ॥

వనితకాఁగిలి నీకు వాసన చప్పరముగ —
నునికి సేసుకున్నాఁడ వొద్దికై నీవు
యెనసితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
అనిశము సింగారరాయఁడవై వున్నాఁడవు ॥ ఎంత ॥ 139 ॥

బౌళి

మేలుమేలు నీకతలు మెచ్చితిమయ్యా
యేలుకొంటి విందరిని యెంతవాఁడవయ్యా ॥ పల్లవి ॥

చల్లువెదమాట లాడి సతులవలపులెల్ల
కొల్లగాఁ గలయఁబెట్టి గుంపుసేసేవు
అల్లిబిల్లి సేసి కూడి ఆసలు మోపులుగట్టి
యెల్లవారిమీఁద వేసే వెంతవాఁడవయ్యా ॥ మేలు ॥

హాడికనవ్వులు నవ్వి వనితలమానములు
కూడపెట్టి లోలోనే గుదిగుచ్చేవు
యీడుజోడుగాఁ బెనఁగి యింపులు మచ్చులువేసి
యీదేరించితివి మమ్ము నెంతవాఁడవయ్యా ॥ మేలు ॥

మోవితీపులు మరపి ముదితలజవ్వనాలు
భావముల వడివెట్టి పచ్చిరేఁచేవు
శ్రీవేంకటేశ నాపై సిగ్గులు నానఁబెట్టి
యీవల నన్నుఁ గూడితి వెంతవాఁడవయ్యా ॥ మేలు ॥ 140

పాడి

ఎంతవేడుకకాఁడ వేమిచెప్పేది
అంతేపో నేరుపరివౌదువయ్యా నీవు ॥ పల్లవి ॥

చిక్కనివి నవ్వులు చిమ్మిరేఁగేవి సిగ్గులు
చక్కఁగ మాతోనేల జాణతనాలు
లక్కబుఱ్ఱవంటినోరు లలిఁ బగడపుమోవి
పిక్కటిల్ల గంటిసేయఁ బెనఁగేవు నీవు ॥ ఎంత ॥

గట్టులివి చన్నులు కడుబయలు నడుము
నెట్టన మాతోనేల నెరతనాలు
దట్టపుమేఘము కొప్పు దంతికుంభాలు పిరుఁదు
ముట్టి సరసములాడ మొనసేవు నీవు ॥ ఎంత ॥

వసనితీగె మేను పాయరానివి యాసలు
యెసగి మాతోనేల యేలాటాలు
వసమై నన్నేలితివి వాసితో శ్రీవేంకటేశ
పొసఁగె నన్నిటా నన్నుఁ బొదిగేవు నీవు ॥ ఎంత ॥ 141 ॥

గుజ్జరి

నేసినట్టు సేయవయ్యా చిత్తమువచ్చినట్లల్లా
వాసివంతు లెంచుకొని వద్దన నేఁ జాలను ॥ పల్లవి ॥

పిలిపించినవాఁడవు ప్రియముగలవాఁడవు
చెలఁగి యెంతనవ్వినాఁ జెల్లు నీకు
వలపించినవాఁడవు వసమైనవాఁడవు
అల మెంతభోగించినా నమరు నీకు ॥ నేసి ॥

వాడివట్టినవాఁడవు వొద్దఁబాయనివాఁడవు
తడవి యెంతపైకొన్నాఁ దగు నీకు
విడెమిచ్చినవాఁడవు వేడుకపడ్డవాఁడవు
కడఁగి చన్నులు విసుకఁదగవే నీకు ॥ నేసి ॥

పెనఁగేటివాఁడవు పెండ్లాడినవాఁడవు
ననిచి మోవి యానఁగ నాయమే నీకు
యెనసితివి శ్రీవేంకటేశ యిన్నిటా నన్ను-
నొనగూడి మన్నించను నుచితమే నీకు ॥ నేసి ॥ 142

## పాడి

ఎంత బత్తి సేసీ నీపై ఇదె సందుగాఁ దాను
వింతలేక సేవసేసీ వేడుకెంతో తనకు ॥ పల్లవి ॥

చన్ను లురమున నాని చక్కదిద్దీ నీనామము
మన్నించితే నేమి యెంతమందెమేళము
చిన్నిపెదవులు దాఁక చెవిలోనే మాటలాడీ
యెన్నరాదు చూడు దీని కెంతగర్వము ॥ ఎంత ॥

తొడమీఁదఁ దొడవేసి దొరతనమున నీ-
యడుగులొత్తీ నెంతఅహంకారము
వెడదగోళ్ల సోఁక విడెము నీకిచ్చీని
తడిచెమటలతోనే తన కెంతపగటు ॥ ఎంత ॥

జమళిచంకలు రాయ జవ్వాది నీమేనఁ బూసి
తమకించీ నెటువంటిదంటతనము
అమర శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
సముకాన నీకె కెంతసంగడిదాష్టీకము ॥ ఎంత ॥ 143

రామక్రియ

ఏమే సేసినమేలు ఇయ్యకోవద్దా
సాములేలే గందవొడి చల్లేనంటేను ॥పల్లవి॥

మొక్కేవేమే వద్దంటాను మోహాన నీరమణుఁడు
యిక్కువతో నాకుమడిచి యిచ్చేనంటేను
పిక్కటిల్లుచన్నులతోఁ బెనఁగులాడేవేమే
చుక్కబొట్టు నొసలఁ జక్కఁబెట్టేనంటేను ॥ఏమే॥

అండుకాచే వదియేమే ఆదరించి యాతఁడు
పెండెము నీపాదమునఁ బెట్టేనంటేను
వెండియు నాతనివెనవెనక కేఁగేవేమే
కొండవలెఁ దొడమీఁదఁ గూచుండుమంటేను ॥ఏమే॥

వేవేలుచందముల వేఁడుకొనే వదియేమే
శ్రీవేంకటేశుఁ డక్కునఁ జేర్చేనంటేను
భావించి వినయాలే పచరించే వదియేమే
యీవేళ నిన్నెనసి మోవిమ్మని యంటేను ॥ఏమే॥ 144

రేకు 825 లలిత

తేరిచూడ నిన్నీ నాకు దిష్టమాయను
రారాఁపు లిఁకనేల రమ్మనవే పతిని ॥పల్లవి॥

ఆడఁగనాడఁగ సరసా లాసలు పుట్టించును
చూడఁబోతే మోహములు చుట్టుకొనును
వాడిక దరచైతేఁ గైవశముగాఁ జేసును
యీడనే పంతములాడనేలే నాకిఁకను ॥తేరి॥

వినఁగవినఁగ మాట వేడుకలు వొడమించు
పెనఁగితేఁ దనువులు ప్రేమరేఁచును
ఘనిమని యేకతాలు మర్మములు గరఁగించు
యెనసి పంతములాడనేలే నాకిఁకను ॥ తేరి ॥

సేయఁజేయఁ జెలుములు చిత్తములు మరిగించు
రాయడింపుఁజెనకులు రతి వుట్టించు
పాయక శ్రీవేంకటపతి నన్నుఁ గూడినాఁడు
యేయెడఁ బంతములాడనేలే నాకిఁకను ॥ తేరి ॥ 145 ॥

ఆహిరి

ఎదురుచూచి చూచి యేఁకరినట్టయ్యీని
నిదుర గంటికి రాదు నేనిఁక నేమందునే ॥ పల్లవి ॥

వొప్పఁజెప్పి నాచేతివుం(కుం?)గరము తానే యిచ్చె
అప్పటి వచ్చేనంటా నానవెట్టెను
కప్పురపుఁదమ్ములము కందువగా నోర నించె
యెప్పుడుగాని రాఁడో యేమిసేతుఁ జెలియా ॥ ఎదు ॥

కూరిమితో జారిననాకొప్పు తానె చక్కఁబెట్టె
గారవించి నమ్మించి కాఁగిలించెను
వూరడించి వొకతె నావద్ద నప్పసమువెట్టె
చేర నెప్పుడు వచ్చీనో చెప్పఁగదే చెలియా ॥ ఎదు ॥

ఆదరించి చిక్కువడ్డహారములు తానె దిద్ది
పోదిసేసి మోవియిచ్చి బుజ్జగించెను
యీదెస శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
యేదెస నుండెనోకాని ఇందాఁకా జెలియా ॥ ఎదు ॥ 146

ముఖారి

ఏలే ఆఁటదానికి యెమ్మెలింతేసి
వోలిఁ గడుగుట్టుతోడ నుండవలెఁగాక ॥పల్లవి॥

జవ్వాది యెంతవూసేవే చన్నులేల మూసేవే
చివ్వన నెన్నిచేఁతలు సేసేవే
నవ్వులేమి నవ్వేవే నలిఁ గొప్పేమిదువ్వేవే
రవ్వలాయ నీవలపు రమణునియెదుట ॥ఏలే॥

సిగ్గులేల విడిచేవే చెమటేల తుడిచేవే
మొగ్గవిరు లిన్నేల ముడిచేవే
వొగ్గి కాలేల తొక్కేవే వూరకేల మొక్కేవే
యెగ్గులుఁదప్పు లెవ్వరి నెంచనివాఁ డతఁడు ॥ఏలే॥

మఱి యెందాఁకాఁ బాడేవే మాటలెన్ని యాడేవే
గుఱిగాఁ గాఁగిట నెంత కూడేవే
యెఱుకతో శ్రీవేంకటేశుఁడు నన్నిటు గూడె
మెఱసి యాతనికేల మేఁకులు సేసేవే ॥ఏలే॥ 147 ॥

శంకరాభరణం

ఇందవె యాతఁడు నీకిచ్చినసొమ్ము
కందువ నీమేలులోనికాంతలము గదవే ॥పల్లవి॥

చిప్పిలుఁజెమటలేలే సిగ్గులువడఁగనేలే
తప్పక వినరాదా యాతనిసుద్దులు
రెప్పలు మూసుకొనేవు రిచ్చ లోలో నన్వేవు
వొప్పుగాఁ బెండ్లికూఁతుర విప్పుడే యైతివా ॥ఇంద॥

పయ్యదమరఁగులేలే భావపుఁగరఁగులేలే
ఇయ్యకొనవే చనవులిచ్చినాఁడు
వొయ్యనే మాటాడేవు వొగిఁ బాపట దువ్వేవు
ఇయ్యెడఁ గన్నెపడుచ విందుకే యైతివా ॥ ఇంద ॥

బట్టబయలీఁదనేలే పరాకు లిఁకనేలే
అట్టె వద్దికి రారాదా యాతఁడు వచ్చె
చుట్టమై శ్రీ వేంకటేశుఁడు తానె నిన్నుఁ గూడె
ఇట్టె పట్టపుదేవి వింతలో నయితివా ॥ ఇంద ॥ 148 ॥

## భైరవి

ఇప్పుడే విన్నవించితి నెంచుకో మీఁదటియెత్తు
వొప్పుగ ధీరుఁడవైతే నొనరు నాకాఁగిట ॥ పల్లవి ॥

నాతో మాటాడఁగ నీనాతు లేమందురో నిన్ను
చేతులెత్తి యేమేమిసేతురో
యీతలనాతల నిన్ను నెక్కడనుండి చూచేరో
బీతి(తు?)లేనివాఁడవైతే పెనఁగు నాతోను ॥ ఇప్పు ॥

నీవు నాచన్ను లంటఁగ నిన్నేమందురో వారు
వావాత నెన్నేసి నీకు రేఁతురో
యీవేళ మనమాఁటలు యేడ వింటానున్నారో
ఆవుద్దండాల కోపితే నండకు రా నీవు ॥ ఇప్పు ॥

యీడ నిట్టె వుండఁగా నెంతసాదింతురో తాము
కూడితి శ్రీ వేంకటేశ కోరి నన్నును
వీడే లియ్య నేడ నిన్ను వెదకుతానున్నారో
నీడాక చూపనోపితే నెట్టుకో మాయింటను ॥ ఇప్పు ॥ 149 ॥

సాళంగనాట

ఇట్టె నామోము చూచి యేమినవ్వేవు
చుట్టమవై వూరికెల్లాఁ జూపట్టినవాఁడవు ॥ పల్లవి ॥

ఆసపడేవారి నెంత అలయించేవు పెండ్లి –
సేసుకోరాదా యేల సిగ్గువడేవు
దోసముగా దెందరైనా దొడ్డిఁ బెట్టుకొనవచ్చు
బేసబెల్లిరేపల్లెఁ బెరిగినవాఁడవు ॥ ఇట్టె ॥

తోడనే మాటాడేవారిఁ దోయనేల సరసము –
లాడరాదా యేఁటికి నీవందుకాచేవు
వాడికగా వలపులవల్లెలు వేయఁగవచ్చు
కోడెల నావులఁ గాచేగొల్లమందవాఁడవు ॥ ఇట్టె ॥

ననిచి చుట్టాలై మొక్కినవారిఁ గాఁగిలించు –
కొనరాదా మరియేమి గుట్టుసేసేవు
పెనఁగులాడఁగవచ్చు బెట్టుగా శ్రీవేంకటేశ
యెనసితి గోవర్ధనమెత్తినట్టివాఁడవు ॥ ఇట్టె ॥ 150 ॥

రేకు 826 శుద్ధవసంతం

వేడుకకాఁడవు నీకు వెఱపేఁటికి
యేడ నీవేమిసేసినా నెగ్గులున్నవా ॥ పల్లవి ॥

నిలుచుండి నిన్నుఁ దప్పకచూచితే
చెలరేఁగి సిగ్గులతోడఁ జిమ్మిరేఁగేవు
కలపనసేసి నీకు గందము వూయరాఁగా
బలిమిఁ బచ్చడమేల పైఁగప్పేవు ॥ వేడు ॥

చెంగట నుండి నీసతి చేఁతలెల్లాఁ బొగడితే
వెంగెమంటా నీవేల వింతసేసేవు
వుంగరము చూతమని వొయ్యనే వేలువట్టితే
కొంగువట్టి యాపెనెంత కొచ్చిచేచూవు ॥ వేడు ॥

విడెమిచ్చి తమ్ములము వెలఁది వుమియుమంటే
నడుమ నీవేమిటికి నవ్వునవ్వేవు
యెడయక శ్రీవేంకటేశ యీకెఁ గూడితేను
తడఁబాటులెల్లా మాని దయదలఁచేవు ॥ వేడు ॥ 151 ॥

## దేశాక్షి

చెలియమేనే నీకు సింగారపుఁదోఁటాయ
యెలమితో వినోదింతు విచ్చిడిగ్గె రావయ్య ॥ పల్లవి ॥

వేసవియండలు గానె వెలఁదివిరహమున
వాసికెక్కెఁ జెమటలవాన గురిసె
మోసులెత్తెపులకలు(ల?) మొలచెఁ బైరులెల్ల
యీసతినీమనోరాజ్య మేలుదువు రావయ్య ॥ చెలి ॥

కమ్మటిచన్నుల నారికడపుఁగాయలు గాచె
పమ్మి మోవితేనెల పంటలు వండెను
వుమ్మగిలునూరుపుల నొనరె నాయిటిగాలి
తమ్మికంటిజవ్వనపుఁదతి వచ్చె రావయ్య ॥ చెలి ॥

మఱి తోఁగిచూపుల మంచిచంద్రోదయమాయ
నెఱయ నవ్వులనేవెన్నెల గాసెను
యెఱిఁగి శ్రీవేంకటేశ యిటు వచ్చి కూడితివి
తెఱవ నేలఁగ దినదినము రావయ్య ॥ చెలి ॥ 152 ॥

ముఖారి

[1]వాకిలిగాచేయట్టివనితల మిదె నేము
జోకదప్పకురే మీరు సుదతులాలా ॥ పల్లవి ॥

మచ్చిక నాతఁడు నాకె మాటలాడుకొనఁగాను
అచ్చముగ మీరేల ఆలకించేరే
యిచ్చగించి వేడుకతో నేకతాన నుండఁగాను
కొచ్చి తెరయెత్తేరేలే కొమ్మలాలా ॥ వాకి ॥

కొత్తగా నద్దాలు చూచుకొని వారు నవ్వఁగాను
చిత్తిణిచేఁతలనేల చేరవచ్చేరే
హత్తి పందేలతోడుత నటు చదురంగమాడే
రెత్తులేల చెప్పేరే యింతులాలా ॥ వాకి ॥

శ్రీ వేంకటేశుఁడు లోన దేవులఁ జెనకఁగాను
యీవేళఁ గానుకలేల యియ్యవచ్చేరే
వేవేలురతులఁ గూడి వెసఁ బీఁటపై నుండఁగా
బావంటాఁ బైకొనేరేలే పడఁతులాలా ॥ వాకి ॥ 153 ॥

గౌళ

చెలులాల నేనతని చెంగటనే వుండేఁగాని
పిలిచి బంగారముపీఁట వెట్టరే ॥ పల్లవి ॥

మొగమోటదాన నేను మోహించినదాన నేను
అగడుగాఁ బతి నేమీ నాడఁజాలనే
నగవు వచ్చు నాకు నంటున మాటలాడితే
మిగులాఁ దనతలఁపు మీరే యడుగరే ॥ చెలు ॥

1. 'కురంజి' రాగముతో నున్న 58 వ పాటయే, కొంత భేదముతో నిది.

యెమ్మెలేనిదాన నేను ఇచ్చకపుదాన నేను
వుమ్మడిదంటతనాన నొరయఁజాల
కమ్మకొనీ సిగ్గు నాకుఁ గానుకిచ్చేనంటేను
నిమ్మపండ్లివే రెండు నేఁడు మీరె యియ్యరే ॥ చెలు ॥

దేవులైనదాన నేను తేజపుదాన నేను
శ్రీవేంకటేశ్వరు గోరఁ జెనకఁజాల
కావించి నన్నేలె మతిగరఁగీఁ గొసరేనంటే
యీవల నాపొందు మీరే యీడేరించమనరే ॥ చెలు ॥ 154

ఆహిరి

ఏమిసేతుఁ జెప్పవయ్య యేది నాకు నూడిగము
కామించి వచ్చితివి నాకడకు నేఁడిపుడు ॥ పల్లవి ॥

నిదుర గన్నులఁ దేరీ నిమ్మపండు దెత్తునా
చెదరినవి కురులు చిక్కుదీతునా
పెదవిఁ గెంపులు నిండెఁ బేంట్లు రాలుతునా
మదమువలెఁ గారీఁ జెమటలు దుడుతునా ॥ ఏమి ॥

బడలివున్నాఁడవు పన్నీరు చల్లుదునా
వెడలీ నిట్టూర్పులు విసరుదునా
తడఁబడీ నడపు కైదండ నీకు నిత్తునా
కడువాడె మోము బాగాలు చేతికిత్తునా ॥ ఏమి ॥

భావ మెందో వున్నది పానుపు వరతునా
దైవారీఁ గళలు నీకద్దము దెత్తునా
శ్రీవేంకటేశుఁడ నాసేవ మెచ్చి కూడితివి
నీవు వొంటినున్నాఁడవు నేఁ దోడు వండుదునా ॥ ఏమి ॥ 155

రామక్రియ

ఏల సరసములాడే వెవ్వరితోనైనాను
కాలుదాఁకినాపెతోనే కావలెఁగాక ॥ పల్లవి ॥

చెలిమికత్తెలకెల్లాఁ జెనకఁగవచ్చునా
వొలిసి నీపట్టపుదేవులకుఁగాక
పిలిచి పేరటాండ్లు పెండ్లిబండెక్కుదురా
అలరి నేసవెట్టినయాపె గాక ॥ ఏల ॥

వద్దనున్నవారెల్ల వలపులు చల్లుదురా
వొద్దికై మేనమరఁదు(ద?) లౌరయుఁగాక
పొద్దువోనిచుట్టాలు బువ్వానకు వత్తురా
అద్ది కంకణముగట్టినాపె వచ్చుఁగాక ॥ ఏల ॥

పొరుగు పోరచివారు భోగించవత్తురా
గరిమఁ గాఁగిటిలోనికాంత కౌఁగాక
యిరవై శ్రీవేంకటేశ యేలితి విందుకె నన్ను
అరసి నీవుమన్నించినాపె యాలౌఁగాక ॥ ఏల ॥ 156 ॥

రేకు 827 సామంతం

ఏమిసేతు నమ్మలాల యెందుకౌను నాయకుఁడు
భూమిలోఁ జెప్పఁగొత్త యీపురుషవిరహము ॥ పల్లవి ॥

తొయ్యలిరాకకుఁ బతి తొంగిచూడఁబోతేను
దయ్యమువలెఁ జంద్రుఁడు తలచూపెను
చయ్యన నందు కతఁడు జడిసి తలవంచితే
నుయ్యివలెనే తోఁచె నూలుకొని మనసు ॥ ఏమి ॥

మగువయెలుఁగు విన మతి నాలకించితేను
పగవానిరీతినే పల్కెఁ గోవిల
వెగటై యందు కతఁడు వీనులు మూసుకొంటే
మొగులువలెనే కప్పె ముంచుక విరహము ॥ ఏమి ॥

నలినాక్షిరూపు మనసునఁ దలఁచఁబోతే
చిలుకుగాలమై తోఁచెను మరుఁడు
అలసె శ్రీ వేంకటేశుఁ డంతలోన సతి గూడె
నెలకొని కొండవలె నిలిచె సంతోసము ॥ ఏమి ॥ 157

## భైరవి

ఏమని చెప్పుదునే మీకింతులాల
చేముంచి నాకు వలపు చిమ్మిరేఁచె నతఁడు ॥ పల్లవి ॥

మలసి నాపతిరూపు మతి నెంతదలఁచినా
తలపోఁతలే కాని తమివోదు
కలలోన నెటువలెఁ గాఁగిలించుకొనినాను
వెలినున్న మేనిమీఁదివిరహము దీరదు ॥ ఏమ ॥

యేలినవానిగుణాలు యెంత వీనుల వినినా
ఆలకింపులే కాని ఆసలు వోవు
పాలుపడి యాతఁడుఁ(డుం?)దేపానుపుపైఁ బండినాను
తాలిమితో నావేడుక తనివొందదు ॥ ఏమ ॥

ముంగిటఁ దనరాకకు మొగమెత్తుకుండినాను
తొంగిచూపులే కాని తుందుడుకు వోదు
చెంగట నంతలో వచ్చి శ్రీవేంకటేశుఁడె కూడె
కుంగనినాసంతోసము గురుతువెట్టరాదు ॥ ఏమ ॥ 158

పాడి

కరఁగి యిందు కతఁడు కాఁగిలించుకొనవద్దా
ఇరవెఱింగేల యలఇంచెనోకాక ॥ పల్లవి ॥

మోమునఁ జెమటగారీ మొక్కితేనే కొప్పు జారీ
యేమని వినయాలు పతి కెంతసేసేవే
కోమలపుదానవు సిగ్గులు నీకిఁ(కిం?)కా నానవు
గోమున నేపొద్దుదాఁకాఁ గొలువుసేసేవే ॥ కరఁ ॥

చిగురాకు నీమోవి చెదరీఁ గమ్మనితావి
పొగడి పొగడి యెంత పొందుచూపేవే
దగదొట్టీ నూరుపులు దయరేఁచీ నేరుపులు
నగవు లెందాఁకా నవ్వి నయములు చూపేవే ॥ కరఁ ॥

సారెఁ బయ్యెద వదలీ చనుఁగవ గదలీని
చేరి చేరి యెంతవడి సేవసేసేవే
యీరీతి శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
తారుచు నెం తాతనిచేఁతలకు లోనయ్యేవే ॥ కరఁ ॥ 159 ॥

బౌళి

ఎగసక్కెలే సేసీ నిదే మీతఁడు
నగవు వచ్చీఁ దననాఁటకములకును ॥ పల్లవి ॥

కోరి నేఁ గానుకిచ్చినగొప్పతమ్మిపు వ్వందుక
వేరొకతెచన్ను దాఁకవేసీనే తాను
సారెకు నెవ్వతోమేనిజవ్వాది పైపడిసితే
మేరమీరి యది నామేనఁ దుడిచీనే ॥ ఎగ ॥

చేతికిచ్చినవిడెము సేసి పుక్కిటఁ బెట్టుక
కాతరానఁ బెట్టీఁ [1]దమ్మకడ(డి?) దానికి
రాతిరెల్లా జాగరాలు రతి నెందో సేసి వచ్చి
యీతల నిద్రించీ మాయింటిలోనను ॥ఎగ॥

అద్దము నాచేఁ దెప్పించి యండనున్న సతిమోము
నిద్దమై తనమోమునీడ చూచీనే
అద్దుక శ్రీవేంకటేశుఁ డల్లాకెమేనిగంధము
ఉద్దండాన నాకాఁగిట నొనర నంటించీనే ॥ఎగ॥ 160

సాళంగనాట

సిగ్గుతోడ గొంకితేను చిక్కునా మగవాఁడు
బిగ్గెఁ గాఁగిలించుకొని పెనఁగినఁగాక ॥పల్లవి॥

పెదవిపై మాటలఁ బ్రియములు వుట్టునా
వుదుటుగుబ్బలఁ బతి నూఁదినఁగాక
సదరపుఁజెనకుల చవులు వుట్టీనా
సదమదముగ రతి సలిపినఁగాక ॥సిగ్గు॥

సెలవుల నవ్వితేనే చిత్తము గరఁగునా
సొలయుచు మోవిచవి చూపినఁగాక
ములువాఁడిచూపుల మోహములు వుట్టునా
లలిఁ దమ్మిలముపొత్తు గలసినఁగాక ॥సిగ్గు॥

సరసములాడితేనే సంగాతా లెనయునా
సరుసఁ దనువు లొక్కజ(జం?)తైనఁ గాక
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
పరపుపైనే చాలునా పురమెక్కినఁగాక ॥సిగ్గు॥ 161

---

1. 'తమ్మకడదానికి' నా? 'తమ్మకడి' దానికి నా?

సౌరాష్ట్రం

ఏమిచెప్పేవే మాతో నింపులైననీసుద్దులు
ప్రేమముగలవారికి పెనఁగులా టరుదా ॥ పల్లవి ॥

నవ్వుతా మాటలాదేవు నయగారాలే సేసేవు
యివ్వల నీకతఁడు మోహించు టరుదా
వువ్విళ్లూర నేపొద్దు నొద్దనే కాచుకుందేవు
నివ్వటిల్ల చనవులు నీకు నిచ్చుటరుదా ॥ ఏమి ॥

తేలించి చూచేవు తేనెలమోవి చూపేవు
కోలుముందై పతి మరుగుట యరుదా
తాలిమితో సన్నలనే తరితీపులే చల్లేవు
వాలాయించి నీకతఁడు వసమవు టరుదా ॥ ఏమి ॥

ఇచ్చకములే సేసేవు యిన్నిటా మెప్పించేవు
కొచ్చి శ్రీవేంకటేశుఁడు గూడుటరుదా
నిచ్చలు నన్నేలించేవు నీ వలమేలుమంగవు
యిచ్చట నీకితఁ డిట్టె యిరవౌటరుదా ॥ 162 ॥

రేకు 828 శ్రీరాగం

రాఁడంటా నుంటివి రమణుఁడు నీవద్దికి
పోఁడిమి నీసకినా లిప్పుడు నిజమాయను ॥ పల్లవి ॥

చెక్కుటిచెయ్యేఁటికే చిత్తపునుయ్యేఁటికే
నిక్కిచూడవే పతి నిలుచున్నాఁడు
మొక్కవే చేతులెత్తి మొగము చూచీ నతఁడు
నిక్కలలాయ నేఁడు నీవుగన్నకలలు ॥ రాఁడం ॥

సిగ్గులకరఁగులేలే చెలులమరఁగులేలే
  వొగ్గి కొలువుసేయవే వొంటినున్నాఁడు
  దగ్గరి యెదురుకోవే తానే వచ్చీ నతఁడు
  బగ్గన నీనోములెల్ల ఫలియించె నవిగో ॥ రాఁడం ॥

నేలవాఁ(వ్రాఁ?)త లిదియేమే నీతలపోఁత లిదేమే
  యేలుమనవే శ్రీ వేంకటేశుఁ డున్నాఁడు
  మేలమాడవే అలమేలుమంగ వాతఁ డేలె
  కోలుముందై తలకూడె కోరిన కోరికలు ॥ రాఁడం ॥ 163

దేశాక్షి

చూచి వచ్చితి నీవున్న చోటికిఁ దోడితెచ్చితి
  చేచేతఁ బెండ్లాడు చిత్తగించవయ్యా ॥ పల్లవి ॥

లలితాంగి జవరాలు లావణ్యవతి యీకె
  కలువకంటి మంచికంబుకంఠి
  జలజవదన చక్రజఘన సింహమధ్య
  తలిరుఁబోడిచక్కఁదన మిట్టిదయ్యా ॥ చూచి ॥

అలివేణి మిగులనీలాలక శశిభాల
  మలయజగంధి మహామానిని యీకె
  పెలుచుమరునివిండ్లబొమ్మలది చారుబింబోష్ఠి
  కనితకుందరద చక్కఁదన మిట్టిదయ్యా ॥ చూచి ॥

చెక్కుటద్దముల దిది శ్రీకారకన్న ఁ(ర్ణ?)ములది
  నిక్కుఁజన్నులరంభోరు నిర్మలపాద
  గక్కన శ్రీ వేంకటేశ కదిసె లతాహస్త
  దక్కె నీ కీలేమచక్కఁదన మిట్టిదయ్యా ॥ చూచి ॥ 164

ఆహిరి

తలపోసి తలపోసి తమకించీ నామనసు
చెలులాల ఆతఁ డేమిసేసీనొకో ॥ పల్లవి ॥

యెలయించినవాఁడు ఇంటికి రాఁడొకొ
చెలుల నంపితి మాఁట చేకొనెనొకొ
కలువల వేసినాఁడు కరుణించకుండునొకొ
సొలసి చూచినవాఁడు చుట్టమై చిక్కఁడొకొ ॥ తల ॥

మచ్చికచల్లినవాఁడు మంతనములాడఁడొకొ
ఇచ్చగించినాఁడు చనవియ్యఁడొకొ
కచ్చుపెట్టినవ్వేవాఁడు కప్పురవిడె మీఁడొకొ
వచ్చినవాఁ డిఁకను నావద్దనే వుండీనొకొ ॥ తల ॥

వేడుక సేసినవాఁడు వీడుజోడై చొక్కఁడొకొ
వాడికచూపినవాఁడు వసమౌనొకొ
యీడనె శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
కూడినవాఁడు నాబత్తి గొబ్బన మెచ్చునొకొ ॥ తల ॥ 165

కేదారగౌళ

అతిరాజసపువాఁడు ఆతఁడు దొల్లె
మతకమున నిన్నెంత మన్నించునో సుమ్మీ ॥ పల్లవి ॥

చిగురుల వేసేవు చెనకేవు కొనగోర
మగవానితో నెంతమారుకొనేవే
యెగసక్కేలకు నాతఁ డేమిసేసునో నిన్ను
ఇగురుఁబోడివి నేము యెఱఁగముసుమ్మీ ॥ అతి ॥

చేరి పంతాలాడేవు చెయివట్టి పెనఁగేవు
సారెఁ బతితో నెంత చయ్యాటాలే
మారుకుమా రాతఁడు మరియెంత సాదించునో
నారీమణి యిందరిలో నగుఁబాటుసుమ్మీ ॥ అతి ॥

జంకించేవు బొమ్మలను చలాలకే నవ్వేవు
యింక శ్రీవేంకటేశుతో నింత యేఁటికే
అంకెల నిన్నాతఁ డేలె నటు వొంటిఁ జిక్కించుక
చింకచూపులాడి వీనిచిత్తముసుమ్మీ ॥ అతి ॥ 166

సామంతం

తరుణి జవ్వనపుఁదపము సేయఁగను
వరుసతోడ జాతివైరము లుడిగె ॥ పల్లవి ॥

జక్కవపులుగులు జంటవాయవివె
గక్కన వెన్నెలగాసినను
యెక్కడఁ గోవిలయెలుఁగులు చెదరవు
గుక్కక వానలు గురిసినను ॥ తరు ॥

గుంపుఁదుమ్మెదలు గొబ్బున బెదరవు
సంపెఁగతావులు చల్లినను
ముంపునఁ జకోరములు వసివాడవు
సొంపుఁగళలు(ల?) పెనుసూర్యుఁ డుండఁగను ॥ తరు ॥

చిలుకలు సందడిసేసినఁ దొలఁగవు
కలసినసమరతికయ్యమున
యెలమిని శ్రీవేంకటేశుఁడు గూడఁగ
చెలియంగములని చెప్పఁగఁ బొసఁగె ॥ తల ॥ 167

మధ్యమావతి

మిమ్మె యెఱుగనిచ్చు మీవలపులు
చిమ్మిరేఁగ రట్టుపెట్టి చెనకించుఁగాక ॥పల్లవి॥

వొట్టులు వెట్టుకొంటిరి వొకరొక రిందాఁకా
అట్టె యింతలో నొక్కటైతిరా మీరు
దిట్టవై కాఁతాళించి దీకొంటి రప్పటిని
గుట్టుతోడ లోలోనే కూడుకొంటిరా ॥మిమ్మె॥

తగవుచెప్పుమంటిరి తరుణుల నింతవడి
మొగమోడి మీరుమీరే మొక్కుకొంటిరా
బిగియుచుఁ గొంతవడి పెనఁగుకొంటా నుంటిరి
జిగిఁగూడి బాసలెల్లాఁ జేసుకొంటిరా ॥మిమ్మె॥

వెక్కసాన మంచాలపై వేరేవుంటి రింతవడి
చొక్కపుమీ మొగములు చూచుకొంటిరా
పక్కన మీరిద్దరూను బలిమిఁ బైకొంటిరి
చక్కని శ్రీ వేంకటేశ జాణలైతిరా ॥మిమ్మె॥ 168

దేసాళం

ఒయ్యనే లాలించి చన వొసఁగవయ్యా
నెయ్యపుసాము సేసిననీచేతుల కోపునా ॥పల్లవి॥

మొలకసిగ్గులతోడిములువాఁడిగుబ్బలది
బలిమి సేసి యేల పైకొనేవయ్యా
చిలుకపలుకుల లేఁజిగురాకుమోవిలేమ-
నెలయింపులను నేఁటి కలయించే వయ్యా ॥ఒయ్య॥

కడుఁబచ్చివయసుతోఁ గారుకొన్న మానిని—
నొడివట్టి తీసి యెంత వొరసేవయ్యా
చిడుముడినగవులచిఱుతతనాలబాల
నడుమ నెందాఁకాఁ బెనఁగులాదేవయ్యా ॥ ఒయ్య ॥

పసురుఁబాయమునఁ బరగినజవరాలు
పిసికి కాఁగిట నెంతబిగించేవయ్యా
కొసరి శ్రీ వేంకటేశ కొత్తపెండ్లికూఁతురు
యెసఁగి కూడితి విందు కెంతమెచ్చేవయ్యా ॥ ఒయ్య ॥ 169

## శుద్ధదేశి

ఏలికసానికి నేము యితవరులము తొల్లె
నీలీలకు లోనైతే నీవేపాటి వట్టేవా ॥ పల్లవి ॥

బలిమి మాయక్కవిన్నపములు సేతుముగాక
చెలికత్తెల కేఁటికి సిగ్గువడను
తలకొన్ననీచేఁతలు తారుకాణింతుముగాక
యెలమి నీతో మాకు నేల మొకదాకిరి ॥ ఏలి ॥

కొద్దిమీర నాకెమార్తై కొసరుదు మింతేకాక
వద్దనున్నవారికేల వట్టినేస్తాలు
సుద్దులతో నీగుణాలు సోదించి కందుముగాక
కద్దులేదని మాకేల కప్పిపెట్టి దాఁచను ॥ ఏలి ॥

యీడ నిన్నలమేల్మంగతోడఁ గూరుతుము గాక
వూడిగపువారికేల వొద్దారాలు
కూడితి వింతల్లో నింతిఁ గోరి శ్రీ వేంకటేశ నీ—
వేడుక మెత్తుము గాక వింతలేల సేయను ॥ ఏలి ॥ 170

వరాళి

కాముకునికేల తగవులు విచారించ
ప్రేమగలచోట మేలుపెంచు టింతేకాక ॥ పల్లవి ॥

పున్నమవెన్నెలవలె పొలఁతి నీతో నవ్వితే
సన్నలనేల తిట్టేవు చందురునిని
[1]కన్నులకలువలను గక్కన నిన్నుఁ జూచితే
పన్ని మరునితోనేల పంతమాడేవయ్యా ॥ కాము ॥

ముక్కులైనచన్నులమొనల నిన్నొత్తితేను
జక్కవపిట్టలనేల సాదించేవు
నిక్కినకొనగోరను నీమేను దాఁకించితేను
దక్కక మొగలిరేకుకొన రాచనేలయ్యా ॥ కాము ॥

పలుకుల వెంగేలు పలుమారు నిన్నాడితే
చిలుకలనేల జంకించేవయ్యా నీవు
అలమి శ్రీవేంకటేశ ఆకె రతి మించితే
చెలికత్తెల నెంతసంతోసించేవయ్యా ॥ కాము ॥ 171

ముఖారి

మేలు నీజాణతనము మెచ్చేరి సతులిందరు
యేలికవంటాఁ జేరితే నిక్కువ లంటేవు ॥ పల్లవి ॥

నిమ్మపండ్లు గానుకగా నెలత నీ కియ్యరాఁగా
ఇమ్ముల నాపెచన్నులు యేల పట్టేవు
నెమ్మి మొకదాకిరితో నిన్నెమీ ననకుండితే
సమ్మతించెనంటా నెంత సంతోసించుకొనేవు ॥ మేలు ॥

1. 'కలువకన్ను'లనుట తెనుగుసంప్రదాయము.

తరుణి సూడిదెగాను తామర నీకియ్యరాఁగా
కరకమలమేల గక్కనఁ బట్టేవు
శిరసువంచు కందుకు సిగ్గుతోడ నుండితేను
కరఁగియున్నదంటాను కాఁగిలించుకొనేవు ॥ మేలు ॥

పచ్చపగడము నీచేపట్టుగాఁ జెలియ్యరాఁగా
ముచ్చటతో సందుసుడి మోవి యానేవు
ఆచ్చమై శ్రీ వేంకటేశ అందుకోరుచుకుండితే
ఇచ్చెరిఁగి కూడెనంటా నెంతగారవించేవు ॥ మేలు ॥ 172

పాడి

చెప్పేదేమి ఇఁకను నీచిత్తము గాక
తప్పులెంచి నే నిన్నుఁ దడవఁగఁగలనా ॥ పల్లవి ॥

తూకొని మాటలెల్లాను దొంతులువెట్టేవు గాక
ఆకెతోడ నేకతములాడవా నీవు
సాకిరిచెప్పేవారిని సన్నలేల సేసేవు
దీకొని నీచేఁతలు నేఁ దెలుపఁగఁగలనా ॥ చెప్పే ॥

పాటించి నవ్వులు నవ్వి భ్రమయించే వింతేకాక
సూటిగా నాపె మొగము చూడవా నీవు
నీటున నీకన్నులలో నిద్దురేలణఁచేవు
జూటరినీమహిమలు సోదించఁగఁగలనా ॥ చెప్పే ॥

వేసదారివినయాలు రాసులువోసేవు గాక
ఆసపడి యాపెచన్ను లంటవా నీవు
లాసి శ్రీ వేంకటేశ మెల్లనె యేల చొక్కించేవు
నీసుద్దు లెన్నఁటికిని నే మఱవఁగలనా ॥ చెప్పే ॥ 173

కన్నడగౌళ

పెంచితి నిన్ను నేము పెద్దవైతి వింతలోనె
యెంచిచూడ నీకతలు యెవ్వరు నేరిపిరే ॥ పల్లవి ॥

చిత్తడిచెమలేల చిందీనే
వత్తివలె మేనేల వసివాడీనే
చిత్తిణివిద్యలనేల చిమిదేవే
యిత్తల నేఁడిఁ(డిం?)తేసి యెక్కడఁ గలిగెనే ॥ పెంచి ॥

నెమ్మదినివ్వెరగులు నీకేఁటికే
వుమ్మగిలునిట్టూర్పు లెందుండివచ్చెనే
కుమ్మరింపుఁజింతలేల గుబ్బతిలీ నే
యిం(యి)మ్ముల నీ చేఁతలకు నేరీతి నోమితివే ॥ పెంచి ॥

చెక్కునఁబెట్టినచేతిసిగ్గు లేఁటికే
ముక్కర గదల నవ్వి మొఱఁగనేలే
యిక్కడ శ్రీ వేంకటేశుఁ డేలెనా నిన్ను
యెక్కె మోమునఁ గళలు యిన్నిటా మేలే ॥ పెంచి ॥ 174

రేకు 830 గుజ్జరి

అందులోనే కానవచ్చె నన్నిపనులు
మందలించి యీపెతోడిమాటలు మానుమీ ॥ పల్లవి ॥

మనసిచ్చి నీవు నన్ను మన్నించేవాఁడవైతే
ననిచినయీకెతోడ నవ్వకుండుమీ
యెనసి యేపొద్దూ నన్ను నెడయనివాఁడవైతే
పెనఁగి యీపెయింటికిఁబోక ఇట్టె వుండుమీ ॥ అందు ॥

చేకొని నాచెప్పినట్టు సేసేటివాఁడవైతే
జోకలుగా నాపెదిక్కు చూడకుండుమా
నాకిచ్చినబాసతోడ నమ్మించినవాఁడవైతే
దాకొని యాపెపొందులు తలఁచక వుండుమా ॥ అందు ॥

మిక్కిలి నామీఁదను మేలుగలవాఁడవైతే
అక్కరతో నాపెకొని కందకుండుమా
యిక్కడ శ్రీ వేంకటేశ యే నలమేలుమంగను
అక్కున నన్నుఁబెట్టితి వాకె నంటకుండుమా ॥ అందు ॥ 175

## బౌళి

ఈకె గలిగివుండఁగా నింకా నొకరా నీకు
పైకొని పెండ్లాడితివి పదారువేలను ॥ పల్లవి ॥

కలికితనాల నాపె కతలుచెప్పనేరుచు
వలపులుచల్లుతా నవ్వఁగనేరుచు
మెలుపున వద్దనుండి మేను విసుకనేరుచు
తిలకించి చిటుకలు దియ్యనేరుచు ॥ ఈకె ॥

చక్కనిది జవరాలు సరసమాడనేరుచు
పక్కన మదిగరఁగఁ బాడనేరుచు
చక్కెరమోవి చూపి చవిపుట్టించనేరుచు
మిక్కిలిరతుల నిన్ను మెప్పించనేరుచు ॥ ఈకె ॥

పొందినచిత్తమురాఁ గాఁపురము సేయనేరుచు
ముందుముందే వేఁడుకొని మొక్కనేరుచు
అందపుశ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
యిందె నిన్నుఁ గూడె నన్ను సేవించాఁ దా నేరుచు ॥ ఈకె ॥ 176

వరాళి

నీవే ఇంతసేయఁగాను నే మాపెను దూరేదేమి
వోవలఁ బెట్టఁగా నాపెవోజ చక్కనయ్యానా ॥పల్లవి॥

సంగడిఁబెట్టుక నీవు సరసములాడఁగాను
కంగి యాపె సవతులఁ గైకొనీనా
అంగవించి మూలనుంచు కాపె నీవు వూజించఁగా
సంగతి నెవ్వరినైనా సరకుగొనీనా ॥నీవే॥

ప్రియపడి నీవే ఇంతపెద్దరికానఁ బెంచఁగా
నయాన వినయా లాపె నాకుఁ జేసీనా
దయతో నాపెగుణాలు తగ నీవు వొగడఁగా
నియతాన [1]వంచనలు నేరఁబోయీనా(?) ॥నీవే॥

వలచి యాపెకు నీవు వసమై వుండఁగాను
తిలకించి మొక్కినా తేరిచూచీనా
అలమేలుమంగపతివైన శ్రీ వేంకటేశ్వర
యిల నన్నుఁ గూడితివి యీకె మెచ్చకుండీనా ॥నీవే॥ 177

కురంజి

ఎఱఁగించవయ్య నాకునేల దాఁచేవు
మెఱసి యాపెకు నీకు మేనవాపై యున్నది ॥పల్లవి॥

ముంగిట మొక్కులుమొక్కి మోహము నీపైఁ జల్లి
చెంగలిచూపులఁ జూచీఁ జెలియ నిన్ను
చెంగటఁ దొల్లిటిపొందో నేనేఇప్పటినేస్తమా
ఇంగితాకారమైతే నిటువలె నున్నది ॥ఎఱఁ॥

1. వినయాలు అనువర్థమున వాడినట్లున్నది.

నెలవుల నవ్వు నవ్వి సిగ్గుతోఁ దలవంచి
కలువపూవుల వేసీఁ గమ్మటి నిన్ను
చలపట్టి చెనకీనో సలిగ నీవిచ్చితివో
తలఁచుకొంటే మీలో తగుల మిట్లున్నది ॥ ఎటి ॥

మాఁగినమోవి చూపి మఱఁగున సన్న సేపి
కాఁగిలించుకొనీ శ్రీ వేంకటేశ నిన్ను
దాఁగక యలమేల్మంగతమకమో నీయింపో
వీఁగక నన్నేలితి మీవేడుక యిట్లున్నది ॥ ఎటి ॥ 178 ॥

## దేశాక్షి

ఏల పొద్దులుగడపే వింతికడకు రావయ్యా
నాలినేయ నీఁకవద్దు నమ్మి యాపె వున్నది ॥ పల్లవి ॥

చక్కనిసతిమోమున చంద్రోదయంబాయ
వె[1]క్కసపునవ్వుల వెన్నెల గాసె
చొక్కపుకొప్పువిరుల చుక్కలు గానుపించె
పక్కన నెంచితే పట్టపగలు రేయాను ॥ ఏల ॥

సతికుచగిరులనేజక్కవలు జోడుగూడె
తతి వికసించెఁ గన్నులఁ దామరలు
మితిలేనిరత్నకాంతి మించె సూర్యోదయము
మతి నెంచుకొంటేను మాపే రేపౌను ॥ ఏల ॥

కలికిమెయిచెమటల గడియారపునీరెక్కె
తెలిసిగ్గులనే పెండ్లితెర వేసెను
అలమె శ్రీవేంకటేశ అంతలో నీవు రాఁగాను
నెలవై యిట్టె వుండితే నిచ్చ కల్యాణమవును ॥ ఏల ॥ 179

1. ఈ భాగము చిఱమలిన్నది.

పాడి

కను(గొనే( గానీలేవే కామిని నీజాడలు
మనసే తమకించితే మఱి యేమిసేసేవో ॥ పల్లవి ॥

కలువల వేసితేనే కా(తాళించేదానవు
యెలమి మరునమ్ముల కేమిసేతువో
నెలవుల నవ్వితేనే చీ(దరరే(గేదానవు
లలి వెన్నెలకు నెంతలావుగా రే(గుదువో ॥ కను( ॥

నెమ్మి నే[1] మా(టలాడితే నేరుపులెంచేదానవు
తుం(తు)మ్మిదమో(తల నెంతదూరుదువో
చిమ్ము(జూపుల( జూచితే చేత నొద్దేదానవు
యిమ్ముల మెఱు(గులకు నెంత వొడ్డుకొనేవో ॥ కను( ॥

గట్టిచన్నులు నేనంట(గా సిగ్గువడేదానవు
అట్టె తమ్మిమొగ్గల నెంతాడుకొందువో
నెట్టన నన్ను( గూడితి నేను శ్రీవేంకటేశు(డ
మట్టున నింకా నన్ను మఱి నెట్టు గూడేవో ॥ కను( ॥ 180 ॥

రేకు 831 రామక్రియ

కొత్తగా నాతో పొందుగూడి నిన్ను భ్రమయించి
ఇత్తల నిన్నొకతె యెలయించీ(గాక ॥ పల్లవి ॥

కన్నులనాచూపు నిన్ను( గా(డిపారెనటవే
వున్నతి నీమోహ మటువున్నది గాక
సన్నలు నే( జేసితేనే జల్లనీనా నీగుండె
కన్నెరో నీమతి నిన్నే కర(గించీ(గాక ॥ కొత్త ॥

---

1. ఇది చింయు తిన్న భాగము.

వేడుక నానవ్వు నిన్ను వెన్నెలై వేఁచీనటవే
కూడుదాఁకా విరహము గొసరీఁగాక
ఆడిననామాట జిగురై నిన్ను నంటించీనా
యేడలేనినీకోరిక లింత సేసీఁగాక ॥ కొత్త ॥

యిట్టె నాతో పొందు బయలీఁదించెనటవే
చుట్టుకొన్ననీకాఁగిలే చొక్కించెఁగాక
దిట్ట శ్రీ వేంకటేశుఁడు రట్టు సేసెనా నిన్ను
చుట్టరికపునీమేలే జట్టిగొనెఁ గాక ॥ కొత్త ॥ 181

## కాంబోది

ఏల సిగ్గులువదేవే యెలయించినట్టయ్యాని
వాలాయించి నీకుఁగానే వలచినాఁ డతఁడు ॥ పల్లవి ॥

పాడి చూపఁగదవే నీపతి వేడుకపడీని
వీడ(డె?) మందుకొనవే వేవేగమే
చూడవే యాతనిదిక్కు సుద్దు లడుగఁబూఁచీని
కూడేటికూటములకు గుబ్బతిల్లీ నతఁడు ॥ ఏల ॥

అట్టె పాదాలొత్తవే అందుకే తమకించీ
పెట్టుకోవే తానిచ్చినపెనుసొమ్ములు
గుట్టుతోడఁ గూచుండవే కొంగువట్టి వేఁడుకొనీ
గట్టిగా నీ పొందులే కడుఁగోరీ నతఁడు ॥ ఏల ॥

నెలవుల నవ్వవే శ్రీ వేంకటేశుఁడు నవ్వి
పిలిచీ నూఁకొనవే ప్రియముతోడ
లలి గుబ్బలనొత్తవే లాలనసేసీ నిన్ను
తలఁపించి నీరతికే తమకించీ నతఁడు ॥ ఏల ॥ 182

భైరవి

ఏమాయనే రమణుని నీ వెంతదూరినాను
నేమమున నీపైనేల నేర మెంచుకొనీనే ॥ పల్లవి ॥

వేడుక వెగ్గళమైతే విసువు గొంత గలుగు
వీడెములోనే కారము వెదకితేను
నీడలోనే వుండినాను నిందింపించుఁ జలువను
కూడినవా రొకవేళ గుంపించు టేమరుదు ॥ ఏమా ॥

సరసమాడేయందే చలమూఁ గొంత గలుగు
విరులలోనే కాదా మరుబాణాలు
సురతము సేయఁగానే చొక్కి మేను మరపించు
సరినున్న దంపతులు జంకించు టేమరుదు ॥ ఏమా ॥

కలసినకాఁగిటిలో కడువలపు గలుగు
వెలసితేఁ దురుమందే వేఁకము నుండు
యెలమి శ్రీవేంకటేశుఁ డేలె నీ వొక్కపైతివి
వలచినవారు గొంతసొలయు టేమరుదు ॥ ఏమా ॥ 183 ॥

మాళవిగౌళ

వసుధలో నిటువంటివారూఁ గొందరు గలరు
కొసరక రమణుఁడు గుట్టుతో నోరుచునే ॥ పల్లవి ॥

సిగ్గరిక త్తెకుఁగాని చెక్కిటిచెయ్యమరదు
యెగ్గులాఁడిగాని మరి యీసునేరదు
బగ్గడికిఁగాని వట్టిపంతము లీడేరవు
వెగ్గళించ నీతలనే వేగెనటవే ॥ వసు ॥

కతలకారికిఁగాని కాఁతాళము గలుగదు
మతకరిగాని మర్మము లంటదు
అతిగర్వికిఁగాని గయ్యాళితనము రాదు
గతిమాలి కొసర నీకడమాయనటవే ॥ వసు ॥

మాయదారికిఁగాని మాటలు నోరికి రావు
కాయాటుదిగాని రతికాఁక కోర్వదు
యీయెడ శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్నుఁ గూడె
చాయనేసుకొని నీవే జాణ వైతివటవే ॥ వసు ॥ 184

బౌళి

ఇన్నిటా దొరవు నీవు యేమినేసినాఁ జెల్లు
యెన్ని చూచితే నే నీయిచ్చలోనిదానను ॥ పల్లవి ॥

మంతనాన నీవు నాపె మాటలాడుకొన్న వెల్లా
వింతగా మాటునసుండి వింటిమి నేము
చెంత నామొగము చూచి సిగ్గువడ నిఁకనేల
అంతటా సంతోసము నీకైతేనే మంచిది ॥ ఇన్ని ॥

సరసాన మీరిద్దరు సన్నలునేసుకొన్నవి
గరిమతోఁ గన్నులారఁ గంటిమి నేము
శిరసెత్తి నీవందుకు చిఱునవ్వు నవ్వనేల
సరుస నీకవియెల్లా చవులైతే మంచిది ॥ ఇన్ని ॥

సులభాన మీరింతలో చుట్టాలైనందుకు
కొలువులోఁ జూచి ఇయ్యకొంటిమి నేము
వెలయ శ్రీవేంకటేశ వేఁడుకొన నిరత యాల
యిల నన్నుఁ గూడితివి యెట్టున్నా మంచిది ॥ ఇన్ని ॥ 185 ॥

నాట

[1]మేలురా నీకతలకు మెచ్చితి నేను
మేలములాడితి నీవు మెచ్చులాఁడివంటానే ॥ పల్లవి ॥

వెన్నలేల తీసేవురా చిన్నవాఁడా నీ –
చన్నులపై పయ్యదేల జారెనె నీకు
యెన్నిక నేమాటకు నీవేమాడేవు అవి
బన్నెపాలువట్టినమాచాదెలంటానే ॥ మేలు ॥

వుట్టులేల యెక్కేవురా వుద్దండీఁడా చక్కఁ –
గట్టుకోవె పోఁకముడి కదలె నీకు
వొట్టుక నేనొకటంటే నొకటాడేవు అది
తొట్టి రతులసిగ్గులదొడ్డియంటానే ॥ మేలు ॥

చేరి యిల్లు చొచ్చేవేరా శ్రీవేంకటేశ నీవు
తారసిల్లి వొంటినే వుందానవంటానె
కోరి నన్నుఁ గాఁగిలించి కొత్తలుగా నాడేవు
దూరనేలె గొల్లవారిదోమటంటానే ॥ మేలు ॥ 186 ॥

రేకు 832 రామక్రియ

కన్నెగొల్లపడుచులఁ గాకుసేతురా ఇంత
మిన్నకే వయసులెల్లా మీఁగడలుగట్టెను ॥ పల్లవి ॥

వుమ్మడివలపులు నీవువిదలపైఁ జల్లఁగ
పమ్మచుఁ గుచములై కుప్పలుగట్టెను
తెమ్మలుగా సారెఁ దరితీపుల మాటలాడఁగ
దిమ్మరేఁగి మోవులను తేనె లూరఁజొచ్చెను ॥ కన్నె ॥

1. ఇది వాకో వాక్యము.

అప్పటి దాఁగిలిముచ్చటలాడి సతులనంటఁగా
కొప్పులై చీఁకట్లు గుంపుగూడెను
తప్పక నఖచంద్రులు తనువులపై నించఁగా
విప్పుచు చిరునవ్వుల వెన్నెలలుగానెను ॥ కన్నె ॥

కారుకమ్మినరతులఁ గరఁగించి కూడఁగాను
యేరులై చెమటలు యీఁతలఁ బారె
యీరీతి శ్రీవేంకటేశ ఇంతచనవియ్యఁగాను
కోరినకోరికలెల్లా గొబ్బున నీడేరెను ॥ కన్నె ॥ 187 ॥

వరాళి

చెప్పనరుదాయఁగదె చెలిసింగారము నేఁడు
వొప్పగుమరుబండార మొనగూర్చినట్లు ॥ పల్లవి ॥

తొడిఁబడ సేమంతులు దురిమెఁ గొప్పునఁ జెలి
కడుఁజీఁకటీ వెన్నెలాఁ గలసినట్లు
గుడిగొన నొసలఁ గుంకుమతిలకము వెట్టె
యెడయక సూర్యచంద్రు లేకతమాడినట్లు ॥ చెప్ప ॥

నెమ్మదిఁ ఁన్నులమీఁద నీలహారముల్ వేసె
తుమ్మిదలు జక్కవలు దొరలినట్టు
వుమ్మడి నడుమఁ బైఁడివొడ్డాణము గట్టుకొనె
నెమ్మది మెరువు(పు?)మిన్ను నేస్తము సేసినట్టు ॥ చెప్ప ॥

అంచితపుఁజేకట్లు హస్తముల ధరియించె
యెంచఁ జిగుళ్లుఁదామర లెనసినట్టు
పొంచి శ్రీవేంకటేశుతోఁ బొసఁగె సమరతుల-
నంచల బొమ్మపెండ్లి యమరినయట్టు ॥ చెప్ప ॥ 188

హిజ్జిజి

మఱచి వూరకుండితే మనసే కఱకుపడు
యెఱుకఁ దలపెట్టితే నీదేరుఁ బనులు ॥ పల్లవి ॥

మొగములు చూడఁగాను మోహములు గడుఁబుట్టు
నగఁగానే పాయరానిననుపు లౌను
తగిలి మాటలాడఁగా తమకము లుప్పతిల్లు
బగివాయ కెప్పుడూఁ బతివద్ద నుండవే ॥ మఱ ॥

చేరి జూజాలాడఁగానే చిమ్మిరేఁగు వేడుకలు
సారె సన్నలుసేయఁగ చవులు వుట్టు
నేరుపుతోఁ జెనకఁగా నిండుకొను మచ్చికలు
వూరకే యాతనివద్ద నూడిగాలు సేయవే ॥ మఱ ॥

కందువఁ బాదాలొత్తఁగా కౌఁగిళ్లు సమకూడు
అంది విడెమియ్యఁగానే ఆసలు మించు
చెందె నిన్ను నింతలోనే శ్రీ వేంకటేశ్వరుఁడు
ముందుగా నింపులతోడ మోవితేనె లియ్యవే ॥ మఱ ॥ 189

మేఁచబౌళి

నన్ను నేల దూరేవు నడుమ నీవు
యెన్నిలేవు నీవేసాలు యెంత సేసేవే ॥ పల్లవి ॥

చలపట్టి నీవతని సాదించి నేరుపుతో
వలపించుకోఁగాను వద్దంటినా
మొలకనవ్వులు నవ్వి ముందె యాతనిచిత్త-
మలర వలపించఁగా నడ్డము వచ్చితినా ॥ నన్ను ॥

గొంటరితనాన నీవు కొంగువట్టుకొని పతి-
నింటికి రప్పించుకోఁగా నేలంటినా
జంపునీచన్నులనొత్తి సమరతులకుఁ దీసి
అంటి దక్కఁగొనఁగా నేనందుకుఁ గాదంటినా ॥ నన్ను ॥

ఇరవుగ నప్పటి నీయెంగిలిమోవి చూపి
మరపుకోఁగాఁ బెట్టిమాటాడితినా
గరిమ నింతలో శ్రీ వేంకటేశుఁడు నన్నుఁ గూడె
వొరసి నీవూఁ గూడఁగా నొడివట్టితినా ॥ నన్ను ॥ 190

నారాయణి

ఇంతులకుఁ బతులకు నివే తారుకాణలు
వింతలేక మెలఁగేటివేడుకలే మేలు ॥ పల్లవి ॥

పెక్కుమాట లాడితేను ప్రియములు చప్పనౌను
కక్కసించితే వలపు గడుసుపడు
వెక్కసానఁ జెనకితే విరుగు నట్టె మనసు
యెక్కువతక్కువలేనియిచ్చకమే మేలు ॥ ఇంతు ॥

వట్టిపంతా లాడితేను వడిఁబడుఁ జలములు
వెట్టగాఁగ నవ్వితేను వేసటలౌను
బెట్టుగాఁ గొసరితేను బెండుపడుఁ దమకము
గుట్టుతోడఁ బొందుసేసేగుణమే మేలు ॥ ఇంతు ॥

కడువెంగే లాడితేను కాఁతాళము లెసఁగు
యెడయనిసిగ్గులైతే నింపు వుట్టదు
అదరి శ్రీ వేంకటేశుఁ డాదరించి నిన్ను నేలె
విడువకు చెలి నీకు వినయమే మేలు ॥ ఇంతు ॥ 191 ॥

ఆహిరి

పాసివున్న విరహపుబడలికేల చూచేవు
వేసరక ఇచ్చకమే వేమారుఁ జేయవే ॥ పల్లవి ॥

చెక్కునొక్కి బుజ్జగించి చెలువుఁడు వేఁడుకొనీ
మొక్కవే పాదాలకు మొగమెత్తి
అక్కరతో నవ్వుమని ఆనవెట్టీఁ దనమీఁద
మక్కళించి యతనితో మాటలాడవే ॥ పాసి ॥

కొంచక తొడపై నిన్నుఁ గూచుండఁబెట్టుకొనీ
ముంచి వినయానఁ బ్రియములు చెప్పవే
పొంచి తములమెల్లా నీపుక్కిటనిండాఁ బెట్టీ
వంచనలెల్లాఁ జేసి వలపులు చల్లవే ॥ పాసి ॥

సారె శ్రీవేంకటేశుఁడు చన్నులపైఁ జేయిచాఁచీ
గారవించి మోవితేనె కప్పమియ్యవే
యీరీతి నిన్నుఁ గూడి యితవులెల్లాఁ జేసీ
వూరడించి రతులను వోలలాడఁజేయవే ॥ పాసి ॥ 192 ॥

రేకు 833 సామంతం

తానైతే నన్నిటా నుత్తమగుణవంతుఁడు
నేనెంతటిదానను నేరిచి పెనఁగను ॥ పల్లవి ॥

పలుకుల నెంతవొడఁబరచీనే తా నన్ను
చలముకొని (నఁ?) త(ద?)నతో సరిదాననా
యెలమిఁ దొడపైనేల ఇడుకొనీనే నన్ను
ఇలఁ దనకేమిబాఁతే ఇందరిలో నేను ॥ తానై ॥

మన్నించి నాపై నెంత మచ్చికచల్లీనే తాను
తన్ను మెచ్చ సేవసేసేదాననా నేను
చన్నులంటి నన్నునెంత సరకుసేసి నవ్వీనే
కన్నులఁ జూడ నంతచక్కనిదాననా ॥ తానై ॥

చనవిచ్చి ననునెంత సమరతికిఁ దీసీనే
ననచినమేనదాననా తనకు
చెనకి నన్నిట్టె కూడె శ్రీవేంకటేశుఁడు తాను
వినయాల వేఁడుకొని విన్నవించనేర్తునా ॥ తానై ॥ 193 ॥

దేసాళం

చెలికత్తెలము నేము చెనకవచ్చేవు మమ్ము
చెలిమి చెట్టడిచితే చేటఁడవునయ్యా ॥ పల్లవి ॥

కోరి నిన్నుఁ బిలువఁగ కొమ్మ వంపఁగా వచ్చితి
వూరకే సుద్దులడిగే వొట్టుక నన్ను
మారుకు మాటాడఁబోతే మాటలెంనై (లెన్నై)నాఁ గలవు
గోర గీరితే నేరు కొచ్చిపారునయ్యా ॥ చెలి ॥

గందము నాచే నంపఁగా కానుక దెచ్చితి నీకు
అంది నాతో నవ్వవచ్చే వప్పుడే నీవు
చిందిచింది యెత్తఁబోతే చేరి మాపుదాఁకాఁబట్టు
చెందితేఁ జిగురుఁగొమ్మ చేఁగలవునయ్యా ॥ చెలి ॥

తనమారు నన్నంపఁగా దండముపెట్టితి నీకు
యెనసి కాఁగిటఁ గుచ్చియెత్తే వేమయ్యా
వెనక నాపె రాఁగా శ్రీవేంకటేశ కూడితివి
ననిచి పైకొంటేను నవ్వు నిజమవునయ్యా ॥ చెలి ॥ 194 ॥

గౌళ

నీ వేమిసేసినాను నీకుఁ జెల్లును
మోవులు గిరుపనేల మోహించినదానికి ॥పల్లవి॥

చెలఁగి పతి ముట్టితే చేతికి లోనౌటగాక
ఓలపాదితనమేల జవరాలికి
పిలిచి పేరుకొంటే బెరసి వూఁకొంటగాక
వలననిబిగువేల వలచినదానికి ॥నీవే॥

వొగ్గి విడెమిచ్చితేను వొడి నించుకొంటగాక
సిగ్గులువడఁగనేల చిన్నదానికి
దిగ్గన సరసమాడితేఁ జెనకుట గాక
యెగ్గులుపట్టఁగనేల యిచ్చకపుదానికి ॥నీవే॥

చనుఁగవ లంటితేను సమ్మతించుకొంట గాక
పెనఁగులాడఁగనేల ప్రియురాలికి
యెనసితివి శ్రీ వేంకటేశ యింతలో నన్ను
తనిసితిఁ గొంకనేల తమకపుదానికి ॥నీవే॥ 195

ధన్నాశి

ఎవ్వ రెఱుఁగుదురయ్య ఇటువంటినీమసు
పువ్వువంటియాఁటదాన బుద్ధిచెప్పవయ్యా ॥పల్లవి॥

ఇందమని విడెమిచ్చే విప్పుడు నీవు
అందుకొంటి నాసకత్తెనని యందువో
పందెము వేసీఁ(సేఁ?) జెయిపట్టుమనేవు
సందడిఁ జేయొగ్గితేను సాహసురా లందువో ॥ఎవ్వ॥

పైకొని పాదములు నాపై వేసేవు
చేకొని యొత్తఁగ నెంతచిత్తిణందువో
ఆకుమడిచిమ్మనుచు నానవెట్టేవు
యీకడ నియ్యకొంటే నిదెంత లాచీనందువో ॥ఎవ్వ॥

గుట్టుతోడఁ గాఁగిలించుకొమ్మనేవు
గట్టిచన్నులు నాఁటించఁగా నేమందువో
యిట్టె శ్రీ వేంకటేశ నన్నేలితివి
నెట్టన మొక్కఁగా నెంతనేరుపరి నందువో ॥ఎవ్వ॥ 196

శంకరాభరణం

[1] పిలువాఁగదరే ప్రియునిని
చలువా లాతఁడు చల్లీఁగాని ॥పల్లవి॥

తలఁపారా దింతి తమకమురేఁగి
చెలపాచెమటాయ చెక్కులను
పొలపావెన్నెలపోగులకు । మతి —
గొలుపా దీకె కెక్కుడువిరహమునా ॥పిలు॥

కెరలి మును మరిగినపొందూ । లోలో
మరలీ కాఁకలై మనసుననూ
పొరలీఁ బూఁబానుపున నీపెకు । వాడు —
దొరలీఁ దియ్యఁరె తొలువిరులెల్లా ॥పిలు॥

అలసె మోహపుటాసల । కడు —
బలిసెఁ జన్నులు పైపైనే
కలసె శ్రీ వేంకటపతి । మారు —
మలసే విదివో మరుబలములకూ ॥పిలు॥ 197

1. ఈపాటలో 'పిలువా' ఇత్యాదులు పనిబూని దీర్ఘాంతములు వాడినారు. సంగీత సారళ్యము కానవచ్చుచున్నది.

దేవగాంధారి

కాదనఁగవచ్చునా ఘనుఁడ నీతోడిపొందు
యేదైనా నియ్యకొంటే నెక్కుడేకాదా ॥ పల్లవి ॥

నీకు సెలవైతేఁజాలు నీమోహపుసతులకు
చేకొని ప్రియములెల్లాఁ జెప్పేమయ్యా
యీకడనాకడ నీకు హితవైతేఁ జాలుఁగాక
మాకేమి వారినేరాలు మరచేమయ్యా ॥ కాద ॥

నట్టనడుమను నీకు నవ్వువచ్చితేఁజాలు
వొట్టి వారిచేఁతలకు నోరిచేమయ్యా
మట్టుమీర నేఁడు నీమనసువచ్చితేఁ జాలు
గట్టిగా నెంగిలిపొత్తు గలసేమయ్యా ॥ కాద ॥

చక్కఁగ నీకేపొందు సంతోసమైతేఁజాలు
వొక్కచోట నిద్దరము నుండేమయ్యా
యిక్కువతో శ్రీవేంకటేశ మమ్ముఁ గూడితివి
చిక్కించుక నీపాదాలసేవ సేసేమయ్యా ॥ కాద ॥ 198 ॥

రేకు 834 పాడి

ఆపెనేల వుప్పతించే రమ్మలాల
యేపున వయసువచ్చి యెదుట నుండఁగను ॥ పల్లవి ॥

యెలమి నెవ్వరిభాగ్య మెట్టు దెలియఁగవచ్చు
మొలకచన్నులెకావా మోపులయ్యేది
కలిగినయట్టికాలగతు లెట్టు చెప్పఁగవచ్చు
పలచనిమోవిఁగాదా పండి తేనె లూరేది ॥ ఆపె ॥

యెఱఁగి యెవ్వరికోలఁ దెట్టు గురిపెట్టవచ్చు
నెఱులు పెరిగికాదా నిడుపయ్యేవి
మెఱసి దొరతనముమితి యెట్టువెట్టవచ్చు
పిఱుఁదు బలిసికాదా పిక్కటిల్లేది ॥ ఆపె ॥

యెన్నఁగ నెవ్వరిబీర మేరుపరచే దెట్టు
కన్నులచూపులేకావా కాఁడిపారేవి
యిన్నిటా శ్రీ వేంకటేశుఁ డీకెను నన్నును గూడె
వున్నతిఁ జేదోయేకాదా వొక్కటాఁగి లయ్యేగి ॥ఆపె॥ 199

బౌళి

సేసవెట్టి పెండ్లాడె చెనకి తొల్లే నన్ను
దోసముగాకుండాఁ బతిఁ దోడుకరారే ॥ పల్లవి ॥

పట్టరానిది వయసు పాయరానిది నేస్తము
గుట్టుతోఁ దిప్పరానిది గుణము
మట్టుపెట్టరానిది మనసులోఁ దలపోఁత
యిట్టె విభుఁడు రాఁడు యెట్టుసేతునే ॥ సేస ॥

ఆఁపరానిది వలపు అణఁచరానిది చూపు
దాఁపరానిది లోలో తమకము
రూపించరానిది రుచులై నతరతీపు
యీపొద్దే రమణుని కెజిఁగించరే ॥ సేస ॥

తుంచరానిది యాస తొలఁగరానిది వావి
కొంచించరానిది కూడినరతి
అంచెల శ్రీ వేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
ముంచీ నాకు సిగ్గులు మొక్కతిననరే ॥ సేస ॥ 200

శ్రీరాగం

ఆఁడువారిగుణ మిది యటువంటిదానఁ గాను
నేఁడు నన్నేలుకో వారు నిన్ను దూరఁజూతురు ॥పల్లవి॥

మటమాయతనమున మగువలు మగవారి
సటకారితనమున సాదింతురు
తటుకన వలచితేఁ దగిలించుకొని యట్టె
యిటునటు భ్రమయించి యెలయించఁజూతురు ॥ఆఁడు॥

వేసదావరినితలు వెంగెము లప్పటిఁ జూపి
కాసువీసములకుఁగాఁ గరఁగింతురు
ఆసపడి లోనైతే నండవాయకుండాఁ జేసి
బాసగొని మోసపుచ్చి పంతమాడఁజూతురు ॥ఆఁడు॥

యేతులాఁడికాంతలు యెందునైనా సందుచూచి
వాతరొట్టుమాట లాడి వంచుకొందురు
యీతల శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
చేతఁజిక్కకున్న వారు సిగ్గువడఁజూతురు ॥ఆఁడు॥ 201

వరాళి

ఏమీనేరనినంగ వెంతవేసాలు సేసేవు
యీమేరనే రతివేళా నిట్టే వుండేవా ॥పల్లవి॥

ముసిముసినవ్వులతో ముందర నిలిచి చెలులఁ
బిసిపిసియెలుఁగులఁ బిలిచేవు
కసుగాటుమాటలు కలచి కలచి యాడే—
వెసఁగి ప్రియునియొద్దకెంతగోలవే ॥ఏమీ॥

చిన్ని చిన్ని సిగ్గులతో చెలువునివద్ద నుండి
సన్నలెల్లాఁ జేసేవు సతులతోను
చన్నులపై పయ్యద సాఁచి బిగించుకొంటాను
కన్నెవలె నొదిగేవు కడునెంతగోలవే ॥ ఏమీ ॥

జలజల చెమటలుజార నింతులమాఁటున
నిలుచుండి పతిమోము నిక్కిచూచేవు
వెలయ నన్నుఁ గూడె శ్రీ వేంకటేశుఁడు తొలుతె
వొలిసి యీతనిపాదా లొత్తే వెంతగోలవే ॥ ఏమీ ॥ 202

## దేసాళం

ఎంత వేగిరకాఁడవు యేమయ్యా నీవు
చెంతనుండి వూడిగాలు సేయనియ్యవా ॥ పల్లవి ॥

సముకాన మొక్కఁగానే సరసపుమాట లాడి
చెమరించఁజేసేవు చెక్కులెల్లాను
తమితో వీడినకొప్పు తగ నే ముడువఁగానే
కొమరెనాచన్ను లంటి భ్రమయించేవు ॥ ఎంత ॥

వొత్తఁగానే పాదాలు నావొడిమీఁద నీవు వేసి
చిత్తమెల్లాఁ గరఁగించి చిమ్మిరేఁచేవు
హత్తి బాగా లందిచ్చి ఆకుమడిచియ్యఁగానే
తత్తరాన మోవి యాని తమకింపించేవు ॥ ఎంత ॥

కలయఁగ నీమేనఁ గస్తూరి వూయఁగానే
బలిమిఁ గాఁగిట నించి పచ్చిసేసేవు
నిలిచి శ్రీ వేంకటేశ నీకుఁ గప్రమియ్యఁగానే
వెలయ వింతరతుల వెరగందించేవు ॥ ఎంత ॥ 203

దేసాక్షి

పాయరానిచుట్టమవు పడఁతికిని
సోయగపునీకన్నులఁ జూతువు రావయ్యా ॥పల్లవి॥

వినయపుకాఁగిలి వీడుఁబట్టుసేసీ నీకు
వొనరినమోవితేనె వులుప వట్టె
ఘనకుచములు నీకు కానుక లెత్తుకున్నది
పెనఁగక చెలి నిన్నుఁ బిలిచీని రావయ్యా ॥పాయ॥

పలుకుల కప్పురాలబాగా లొసగీ నీకు
మలసి మైతావి[1] పరిమళ మున్నది
బలుచెమటపన్నీటఁ బాదాలు గడిగి నీకు
తలియుఁబోడి ఇదె దగ్గరీ రావయ్యా ॥పాయ॥

చొక్కపుఁదనకన్నులచూపుల నెదురుకొనె
పక్కన వలపులనే పాన్పు వరచె
అక్కన శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
యిక్కడఁ గూడితివి నీ వెప్పుడు రావయ్యా ॥పాయ॥ 204

రేకు 835 ఆహిరి

ఎన్నిచేఁతలదానవే ఇన్నిటా నీవు
విన్నకన్నజాడ గాదు వెరగయ్యీ మాకు ॥పల్లవి॥

మొక్కి కొలువుసేసేవు ముందటనుండి పతితో
మక్కళించి మక్కళించి మాటలాడేవు
చక్కవచన్ను లొరయ సారెఁ బాదాలొత్తేవు
నిక్కి వలపులుచల్లసేయుతువే నీవు ॥ఎన్ని॥

1. శరీరమువాసనలో విశేషగంధ్యమా?

సెలవుల నవ్వేవు సిగ్గువడ కాతనితో
సొలసి సొలసి మేను సోఁకించేవు
తళుకుఁజూపులఁ జూచి దండఁ గూచుండవచ్చేవు
యెలయింప జాణవైతి విపుడే నీవు ॥ఎన్ని॥

కూరిమి శ్రీవేంకటేశుఁ గొనచూపులనుఁ జూచి
చేరి చేరి వూడిగాలు సేయవచ్చేవు
యీరీతి నన్నీతఁడేలె యే నలమేల్మంగను
తారుకాణలాయ మంచిదానవే నీవు ॥ఎన్ని॥ 205

## వరాళి

మంచిదయ్యా వలపులు మారుబేరా లాడేవు
పొంచి నెట్టువడినది పొరుగాపెమీఁదను ॥పల్లవి॥

కచ్చుపెట్టి యాపె నిన్నుఁ గతలెల్లా నడుగఁగా
మచ్చిక నీ వెవ్వరితో మాటలాడేవు
అచ్చముగ నీమొగము అట్టె తప్పకచూడఁగా
ఇచ్చకము సేసుకొని యెక్కడ చూచేవు ॥మంచి॥

చెలరేఁగి యాపె నీతో సెలవుల నవ్వఁగాను
నలువంక నెవ్వతెతో నవ్వులు నవ్వేవు
సలిగెతో నిట్టె నిన్ను సారె సారెఁ జెనకఁగా
వెలినున్న యాపెనేల వెలిగోర నూఁచేవు ॥మంచి॥

కప్పురపువిడెము కలికి నీకు నొసఁగఁగా
దప్పిదేర నాపెకేల తమ్మ వెట్టేవు
అప్పుడె శ్రీవేంకటేశ అలమేలుమంగ గూడె
చొప్పుననే యాపె కెంతచుట్టమయేవు ॥మంచి॥ 206

సామంతం

కానీలేవే యందుకేమి కందము నీసరితలు
నానఁగానే వలపులు నయమిచ్చీని ॥ పల్లవి ॥

నెలకొని రమణుఁడు నీపై బత్తిగలఁడంటా
సలిగెలు చూపేవు సవతులకు
బలిమినే మంచమెక్కి పాదాలు పైఁదీసుకొని
వలవనిదొరతనములు సేసేవు ॥ కానీ ॥

చేరి నిన్ను మెచ్చీనంటా చేకొని నీ ప్రియునికి
నేరుపుతో నూడిగాలు సారెఁ జేసేవు
కోరి చిటికలుదీసి కొత్తగా వచ్చితినంటా
వూరకే చుట్టరికము లొనర నవ్వేవు ॥ కానీ ॥

యేపున శ్రీవేంకటేశు నెన్నఁడో కూడితినంటా
కాఁపురాలు సేసిసేసి కడ గానవు
వోపిక నలమేల్మంగ నురముపై నున్నదాన
పైపైఁ జాయసేసుక పక్కన మెచ్చేవు ॥ కానీ ॥ 207

ధన్నాశి

ఏల తలవంచుకొనే వెదురుకట్టుకు రావే
నాలితో సిగ్గువడితే ననుపులయ్యీనా ॥ పల్లవి ॥

సరసములాడఁగానే చవులువుట్టీఁగాక
విరసాన నుండితేను వేడుకయ్యీనా
సరుసఁ గూచుండఁగానే సమేళము లౌఁగాక
యెరవై మాఁటునసుంటే ఇంపులు వుట్టీనా ॥ ఏల ॥

వొనర మాటాడితే నే మనసు గరఁగుఁగాక
మునుపే వెంగెమాడితే ముచ్చటారునా
చెనకి పైకొంటేను చెల్లుబడి యౌఁగాక
పెనఁగి బిగిసితేను ప్రియములయ్యీనా ॥ఏల॥

కలకల నవ్వఁగానే ఘనత లీడేరుఁగాక
చలము సాదించితేను సమ్మతమయ్యీనా
యెలమి శ్రీ వేంకటేశుఁ డింతలో నిన్ను నేలె
కలసీఁగాక చుట్టరికము లిఁక వీడునా ॥ఏల॥ 208

నాట

[1]సగము మానిసిరూపు సగము మెగమురూపు
అగణితప్రతాపుఁ డహోబలేశుఁడు ॥పల్లవి॥

గద్దెమీఁదఁ గూచున్నాఁడు కంబములోఁ బుట్టినాఁడు
కొద్దిమీరఁ గడునవ్వుకొంటా నున్నాఁడు
వొద్దనె శ్రీసతిచన్ను లొరయుచు నున్నవాఁడు
అద్దివో చూడరమ్మ అహోబలేశుఁడు ॥సగ॥

పెనుమీసాలవాఁడు పెదపెదగోళ్లవాఁడు
ఘనునిఁగాఁ బ్రహ్లాదునిఁ గాచుకున్నాఁడు
మనసిచ్చినసురలతో మాటలాడుచున్నవాఁడు
అనుపమతేజుఁడమ్మ అహోబలేశుఁడు ॥సగ॥

వేవేలుచేతులవాఁడు వెన్నెలచాయలవాఁడు
భావించి కొల్చినవారిపాలిటివాఁడు
శ్రీవేంకటగిరిమీఁదఁ జేరి భవనాశిదండ —
నావల నీవల మించె నహోబలేశుఁడు ॥సగ॥ 209॥

---

1 అధ్యాత్మకీర్తనలచాయలోనిది.

మాళవి

ఏమని చెప్పఁగవచ్చు నిద్దరిజాణతనాలు
కామించి చూడరే కడుఁగన్నులపండుగలు ॥ పల్లవి ॥

యెదురుగొండలెక్కి ఇందిరా సౌఖశేఖుఁడు
మదము చెక్కిళ్ళఁ గార మాటలాడేరు
పొదిగొన్న వేడుకెంతో పూవులఁ దమలోఁ దాము
చెదరనియాసలతో సేసలు చల్లేరు ॥ ఏమ ॥

రేఁగిరేఁగి భవనాశి రెండుదరులా నుండి
మాఁగినమోవులు చూపి మతిఁ జొక్కేరు
తోఁగి[1] తోఁగి చూచుకొంటా తొడిఁబడి రతులకు
దాఁగని ముచ్చటలతోఁ దమకించేరు ॥ ఏమ ॥

సమదిష్టి నొండురులు సంగడివనాలనీడ
జమళికాఁగిళ్లకు సమకూడేరు
అమర శ్రీవేంకటాద్రి నందూనిందూఁ దావుకొని
చెమటమేనులతోడ సెలవుల నవ్వేరు ॥ ఏమ ॥ 210

రేకు 836 కాంబోది

మానాపతివై(నై?) వుండఁగా మన్నింతువుగాక నీవే
నానారీతులఁ గెలసి నవ్వ నాకుఁ దగునా ॥ పల్లవి ॥

కొత్తకొత్తమాట లాడి గుట్టుదెలుసుక నీపై
బత్తిచూపి వలపులు పైఁజల్లీ నాకె
పొత్తుల నీడువెట్టేవు పొరుగాపెతో నన్ను
ఇత్తల నే నిల్లాల నింతసేయఁదగునా ॥ మానా ॥

1. 'తొంగి' కి 'తోఁగి' అని రూపాంతర మీవాఙ్మయమున కనబడుచున్నది.

మేసోఁక సేవలు సేసి మెప్పించుక నీకుఁ గడు –
నాస రేఁచి వీడెము లందిచ్చీ నాకె
ఆసేఁతలు నేరుచుకొమ్మనేవు నీవు నన్ను
నేసపెండ్లికూఁతురను సిగ్గువడఁదగనా ॥ మానా ॥

కన్నుచూపులు నాఁటించి కైవసముగాఁ జేసుక
చన్నులద్ది కూచున్నది సంగడి నాకె
ఇన్నిటా శ్రీవేంకటేశ ఇంతలో నన్నేలితివి
కన్నెదాన నాపెవలె గర్వించవచ్చునా ॥ మానా ॥ 211

రామక్రియ

ఈపనికి నేము వచ్చి యెంతవద్దైనాఁ గద్దు
కాపాడి ఇంతటను కరుణించవయ్యా ॥ పల్లవి ॥

ఫాకున నేగతినైనా వలపులు చెప్పఁగవచ్చు
పైకొని వెలిఁ దచ్చిచూపఁగరాదు
చీకాకుపడినట్టిచిత్తమే యెఱుఁగును
ఆకె నీకెదురుచూచీ నండకురావయ్యా ॥ ఈప ॥

వేడుకతో నాపెచెప్పేవిందుకు రమ్మనవచ్చు
వాడిక నందలిరుచి వర్ణించరాదు
కూడిమాడి యారగించేకోరికలే యెఱుఁగును
జాడతో నాపె చెప్పెంపెఁ జనవియ్యవయ్యా ॥ ఈప ॥

పొలఁతికి నీపైఁగలపొందు లెరిఁగించవచ్చు
చెలిమి కాఁగిటఁదెచ్చి చిక్కించరాదు
వెలిసి కూడితిరి మీవాడఁబా ల్లెరుఁగును
అలరి శ్రీవేంకటేశ ఆదరించవయ్యా ॥ ఈపని ॥ 212

సామంగం

ఇద్దరును మేనవారే ఇయ్యకోలే ఇందరికి
పొద్దువొద్దుకు నిచ్చల భోగింతురుగారా ॥ పల్లవి ॥

మెలుఁతకు నీవైతే మేలువాఁడవు తొల్లె
నెలకొని యాపెయును నీకు వలచు
యెలమిఁ జెలికత్తె లెడమాట లేమాడేరు
తలఁచుక మీరే రతిఁదగులుట గాక ॥ ఇద్ద ॥

ఆకెమనసుమర్మము లన్నిటా నీవెరుఁగుదు
దాకొని నీమన సాకె తా నెరుఁగును
యీకడాకడిచుట్టాలు యేమిబుద్దులుచెప్పేరు
మేకొని సరసములు మీరే యాడుట గాక ॥ ఇద్ద ॥

నీదేవులమంచముపై నీవు పాదాలు చాఁచితే
ఆదటఁ జేయి నీమంచాన నాపె చాఁచేను
యీదెస శ్రీవేంకటేశ యేమని యెచ్చరించేము
పోదితోఁ గూడితి రిట్టె[1] పొసఁగుట గాక ॥ ఇద్ద ॥ 213

శ్రీరాగం

ఇంపుగలిగినచోట నెగ్గులుపట్టఁగనేల
గుంపించి మీరేల ఆడుకొనేరే సవతులు ॥ పల్లవి ॥

కూరిమితో రమణునిఁ గొంత సొలసినసతి
వేరులేనిమాటల వేఁడుకొనును
బీరముతో రతివేళ బిగిసి పెనఁగులాడి
చేరి యంతతోఁ గరఁగి చెక్కునొక్కును ॥ ఇంపు ॥

---

1. రేకు విరిగిన భాగమిది.

చనవున బొమ్మలను జంకించినకాంత
మునుకొని యాసరేచి మోవి చూపును
కొనగోరఁ జిమ్మిచిమ్మి గుట్టుతో నొట్టువెట్టి
తనివారాఁ గాఁగిలించి దప్పిదేర్చును ॥ ఇంపు ॥

శిరసువంచుక లోలో సిగ్గులువడినలేమ
సరికిబేసికి సరసములాడును
ఇరవై శ్రీవేంకటేశుఁ డిన్నిటాఁ గూడెఁ గనక
పరగఁ బెండ్లిపీఁటపైఁ గొలువుండును ॥ ఇంపు ॥ 214

సౌరాష్ట్రం

ఔనయ్యా మంచివాఁడ వాకెచిత్త మెఱఁగవు
మానాపతైనదాని మరి రట్టుసేతురా ॥ పల్లవి ॥

సిగ్గరిపెండ్లికూఁతురై శిరసువంచుకుండఁగ
దిగ్గన నొడివట్టేల తీసేవు నీవు
తగ్గి చెలిమఱఁగునఁ దప్పించుకొనఁగానే
వెగ్గళించి గోరుసోఁక వేఁడుకొనేవు ॥ ఔన ॥

కడలేనిముద్దరాలై కంబమువట్టుకుండఁగా
అడరి కూచుండుమంటా నానవేట్టేవు
చిడుముడితోడ నీకుఁ జేతులెత్తి మొక్కఁగానే
గుడిగొనఁ బయ్యదకొంగు జారించేవు ॥ ఔన ॥

పట్టపుదేవులై బడివాయకుండఁగానే
జట్టిగొని తొడమీఁదఁ బెట్టుకొనేవు
ఇట్టె శ్రీవేంకటేశ యీకె నిన్నుఁ గూడఁగానె
చుట్టరికాలెల్లాఁ జెప్పి చొక్కించేవు ॥ ఔన ॥ 215

శంకరాభరణం

వెరగయ్యీ నీచేఁతకు విట్ఠలేశ్వరా
విరులుచల్లే వప్పటి విట్ఠలేశ్వరా ॥ పల్లవి ॥

వేడుకకాఁడవు నీవు విట్ఠలేశ్వరా మాకు
వీడె మియ్యఁగదవోయి విట్ఠలేశ్వరా
వీడవు మనపొందులు విట్ఠలేశ్వరా
వీడుదోడాడీ వలపు విట్ఠలేశ్వరా ॥ వెర ॥

వెన్నదిన్ననోరితోడివిట్ఠలేశ్వరా
వెన్నెలనవ్వు నవ్వేవు విట్ఠలేశ్వరా
వెన్నుఁడ నీకు మొక్కేము విట్ఠలేశ్వరా మా -
విన్నపము లాలించు విట్ఠలేశ్వరా ॥ వెర ॥

విచ్చేయు మాయింటికి విట్ఠలేశ్వరా యెంత
విచ్చి చెప్పేవు కతలు విట్ఠలేశ్వరా
కుచ్చి శ్రీవేంకటాద్రిపైఁ గూడితివి నన్ను
విచ్చనవిడాయ నిఁక విట్ఠలేశ్వరా ॥ వెర ॥ 216 ॥

రేకు 837 రీతిగౌళ

ఎందరు లేరు సతులు యెన్నెన్నిచందాలవారు
చెంది నీనాపొందువలెఁ జెప్పరాదు గాని ॥ పల్లవి ॥

వేడుకమాట లెన్నైనా వేవేలు నాడఁగవచ్చు
కూడిమాడివుండేది గురుతుగాని
చూడఁజూడ వినయాలు సూడిదెలు వట్టవచ్చు
యీడుజోడైనవలపు లెక్కుడు గాని ॥ ఎంద ॥

ననిచి యెంతవడైనా నవ్వులు నవ్వఁగవచ్చు
మనసెనసి వుండుటే మర్మము గాని
చెనకి వినోదపుచేఁతలు సేయఁగనచ్చు
కొనసాగెడుకూటమే కోరయోఁగాని ॥ ఎంద ॥

యెదురుబడి నుండి ఇంపులు చల్లఁగవచ్చు
వదలనికాఁగిళ్లే వైపులుగాని
ఇదివో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
పొదిగొన్నసంతోసాలే పోదులోఁ గాని ॥ ఎంద ॥ 217 ॥

## లలిత

కడుఁగడుముద్దరాలు కామిని నీకు మేలుది
అడుగవయ్యా నీవేయైనా నాపెమనవి ॥ పల్లవి ॥

పడఁతి సిగ్గున విన్నపము సేయకున్నదేమో
వడి నిన్నింటికిఁ బిలువఁగవచ్చెను
వొడికాన వేళచూచుకున్నభావమో యేమో
చిడుముడి చెక్కుచేతఁ జిమ్మిరేఁగుచున్నది ॥ కడుఁ ॥

అట్టె మానాపతి గాన అడఁకువ నున్నదేమో
గుట్టునఁ గానుక చేతఁబట్టుకున్నది
దిట్టయై నీతలఁపులు దెలియవలసియేమో
యెట్టయెదుటనుఁ జేతులెత్తి మొక్కుచున్నది ॥ కడుఁ ॥

యేకతాన నూడిగాలు ఇట్టె సేసేనంటానేమో
దాకొని నీపానుపుదండ నున్నది
యీకె నింతలో శ్రీవేంకటేశుఁడ కూడితివి
మేకొని నిన్నిన్నిటాను మెచ్చుకొంటా నున్నది ॥ కడుఁ ॥ 218

గౌళ

ఇంతులాల చూడరమ్మ యెన్నఁగొత్తలు
సంతతము నీపెజవ్వనవనమందు ॥ పల్లవి ॥

చెలియమోవినే సింగారము చిగిరించె
అలకల ననలుఁగొనలు సాగెను
మలసి కరములను మారాకులు వెట్టె
వలపులయీపెజవ్వనవనమందును ॥ ఇంతు ॥

మచ్చికతోడుత మంచిమాటలనే నీడలొత్తె
పెచ్చు రేఁగి చన్నులను పిందెలు వుట్టె
విచ్చనవిడి నవ్వుల వెన్నెలపంటలు వండె
వచ్చె నామని యీపెజవ్వనవనమందును ॥ ఇంతు ॥

పిఱిఁదిచక్కఁదనము పెద్ద పెద్దరాసులాయ
కొఱగలతొడలే కొమ్మలాయను
చిఱుఁజెమటలతోడ శ్రీ వేంకటేశుఁడు గూడి
వఱలుచు మించె నీజవ్వనవనమందును ॥ ఇంతు ॥ 219

శుద్ధవసంతం

కలిగెఁగా నీకు నాపె కామనిధానమువలె
యెలమి నీభాగ్య మిఁక నేమిచెప్పేదయ్యా ॥ పల్లవి ॥

వొద్దిక నెట్టనెదుర నుంచుకొని కొలువులో-
నద్దమువలెఁ జూచేవు ఆపె మొగము
గద్దించి తానిచ్చినబాగాలు పుక్కిటఁ బెట్టుక
చద్దివలె దాఁచుకొని చవులుగొనేవు ॥ కలి ॥

అతిముదమున నాపె నడుగుకొంటాఁ బురాణ-
కతలువలె వినేవు కాంతమాటలు
తతి నాపెచూపులు పూదండలువలెనే నీమై
సతము భావించుక సంతోసించుకొనేవు ॥ కలి ॥

నీకుఁ గానుకవచ్చిననిమ్మపండ్లవలెనే
పైకొని సారె నంటే వాభామచన్నులు
యీకడ శ్రీ వేంకటేశ యిట్టె నన్ను రతిఁ గూడి
సాకిరిగాఁ బెట్టుకొని జంటపెండ్లాడేవు ॥ కలి ॥ 220

## పాడి

చెల్లఁబో ఆఁటదానికి సిగ్గు దలఁచుకోవద్దా
చెల్లుబడిగానిచోట చెనకఁగవచ్చునా ॥ పల్లవి ॥

ఆతఁడూ నేనూ మాటలాడుతా నుండఁగానే
యీతల నీవేల కానుకియ్యవచ్చేవే
రాతిరిఁబగలు నాకు రమణుఁడై వుండఁగా
చేతుల్తెత్తి నీవేల సేసలుచల్లేవే ॥ చెల్లఁ ॥

పొదలి నే మిద్దరముఁ బొత్తుల నుండఁగానే
సదరాన నీవేల కొసరవచ్చేవే
ముదమున మాలో నేము మొగములు చూచుకోఁగా
అదన నీకు నిఁక నడ్డాలు రాఁదగునా ॥ చెల్లఁ ॥

కలసి నే మింతలోనే కాఁగిలించుకొనఁగాను
సొలసి మమ్ముఁ దప్పకచూచే విదేమే
యెలమి శ్రీ వేంకటేశుఁ డిటు నన్నుఁ గూడినాఁడు
వెలి నుండి నీ వెంత వెరగందేవే ॥ చెల్లఁ ॥ 221

హిందోళం

ఎందాఁకా సరసమాడే వేమయ్యా
పొందుగా నలపుదీర్చి భోగించరాదా ॥ పల్లవి ॥

చక్కనిజవ్వని నీవు సారెకు నవ్వించఁగాను
చెక్కులునిండాఁ గడుఁజెమరించెను
ఇక్కువ లంటుకొనుచు నీవు యిట్టె పెనఁగులాడఁగా
ముక్కున నిట్టూర్పులు ముంచుకొనెను ॥ ఎందాఁ ॥

గారాపుదానిచేతఁ గతలు చెప్పించుకోఁగా
పేరి పెదవిపైఁ దమ్మ బేంట్లు రాలెను
గోరనంటి పయ్యదలో గుబ్బలు గదలించఁగా
జారి కొప్పులో విరులు జల్లనరాలీని ॥ ఎందాఁ ॥

కోమలి నింతలో నీవు కొసరి కాఁగిలించఁగా
అముక విరిబాగులాయ మేనెల్లా
కామించి శ్రీవేంకటేశ కలికిని నీ వేలఁగా
వేమారు మోవితేనెలు వేడుకలు రేఁచెను ॥ ఎందాఁ ॥ 222 ॥

రేకు 838 రామక్రియ

ఔనయ్యా మంచివాఁడ వతివ నింతసేసితి
కానీవయ్యా యీకె నిట్టె కరుణించు మిఁకను ॥ పల్లవి ॥

మనసిచ్చి నీ వాపెతో మాటలాడఁగానేపో
తనివోనివలపులతమి పుట్టెను
కనుచూపు లటు నీవు కాఁడిపారించఁగాఁబో
కొనసాగి వాక్కొకపె కోరికలు రేఁగెను ॥ ఔన ॥

నాముగొన నీ వూరకె నవ్వులు నవ్వఁగాఁబో
మోమున రతికళలు మొలవఁజొచ్చె
చేముంచి నీవు సారెఁ జెనకఁగానే పో
యేమినెఱఁగనిబాల ఇంత రట్టుకెక్కెను ॥ ఔన ॥

ఇంటికే వచ్చి నీవు ఇట్లాఁ గూడఁగాఁ బో
దంటయై ఇంతేసికతలఁ గరఁచె
జంటయై శ్రీ వేంకటేశ సరసమాడఁగాఁ బో
పెంటయైనసంతోసాలఁ బెనగొనె నిపుడు ॥ ఔన ॥ 223

## హిందోళం

అచ్చివచ్చు నీ కెప్పుడు నంగనతోడిపొందు
కొచ్చికొచ్చి ఇందు కెంతకోరుకొంటా నుంటివో ॥ పల్లవి ॥

సరుస నిలుచుండఁగా సతితురుములోనుండి
విరులు నీ మీఁద రాలె వింతలుగాను
గరిమఁ దమకమునఁ గమ్మిననిట్టూర్పులు
వరుసతో నీకు నాలవట్టములాయను ॥ అచ్చి ॥

మాటలాడుకొనఁగాను మనసులేకమై లోలో
వాటములై తగిలెను వావులుగాను
సూటిదప్పకుండా నిన్నుఁ జూడఁగఁజూడఁగాను
కోటికొండలై వలపు గుదిగొనె నీకును ॥ అచ్చి ॥

ముట్టి కొలువుసేయఁగ మునుకొని నీపూజకు
గుట్టునఁ జన్నులు పూవుగుత్తులాయను
ఇట్టె శ్రీ వేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
తొట్టి యాపెకూటమి దోమటాయను ॥ అచ్చి ॥ 224

పాడి

వలపులకు గురైనవాఁడే మన్నించీఁగాక
చెలులతో దూరి దూరి చెప్పఁగనేమిటికి ॥ పల్లవి ॥

తలపోఁతలే నాకు తమకము రేఁచఁగాను
వెలినున్న చిలుకతో విసుగనేలే
పలునాచూపులె నన్ను భ్రమయించఁజేయఁగాను
కలువల నిటు దూరఁ గారణమేమిటికి ॥ వల ॥

జవ్వనమదమె నాకు చవులు వుట్టించఁగాను
ఇవ్వలఁ బున్నమచంద్రుఁ డేమిసేసునే
నివ్వటిల్ల నాయాసలే నివ్వెరగు నొందించఁగా
పువ్వువిలుతునితోఁడఁ బోరాడవలెనా ॥ వల ॥

కమ్మి శ్రీ వేంకటేశుఁడే కాఁగిటిలో నుండఁగాను
కొమ్మలాల చలిగాలిఁ గొసరేదేమే
నిమ్మపండ్లంతలై నిక్కి చన్నులు రాఁగా-
నిమ్ముల నాభాగ్యము నెంచిచెప్పవలెనా ॥ వల ॥ 225

నాగవరాళి

నీ కెంతపరాకైనా నెలఁత మరవలేదు
చేకొన్న నీమీఁదిబత్తి చిగిరించుఁగాక ॥ పల్లవి ॥

వేడుకగలవారలు వేసర రెంతైనాను
చూడఁజూడ వలపులు జొబ్బిలుఁగాని
వాడికైనపొందులు వదల వెన్నటికిని
యీడు జోడై మీఁదమీఁద హెచ్చుఁగాని ॥ నీకెం ॥

యెనసివుండినవారు యెగ్గుపట్ట రేమిటికి
వెనుకొన్న ముచ్చటలు వెలయుఁగాని
మనసువచ్చినచోట మానవు తీరితీపులు
వినయపుఁబ్రియములు వెగ(గ్గ?)ళించుఁగాని ॥ నీకెం ॥

సమ్మతించినవారు జడియ రేపనికిని
వుమ్మగిలుకాఁగిళ్ల వొద్దికొఁగాని
యిమ్మల శ్రీ వేంకటేశ ఇంతి నిట్టె కూడితివి
చిమ్ముసరసము లింకాఁ జెలరేఁగుఁ గాని ॥ నీకెం ॥ 226

ధన్నాసి

చెప్పరాదు చూపరాదు చిత్తగించవయ్యా నీవు
ముప్పిరి నింకా నెంత మోపుగట్టీనో ॥ పల్లవి ॥

కానుకవట్టీఁ జూపులు కలికి నీయెదుటను
వానలుగఁ జెమటలు వడిసీ మేన
నానఁబెట్టి సెలవుల నవ్వులు నవ్వీ నీతో
పూని మోహ మింకానెంత పోగువోసీనో ॥ చెప్ప ॥

వెదవెట్టీ మాటలు వేడుకతో నీముందర
గుదిగుచ్చీ సిగ్గులు నీకొలువునను
పొదిగొన్నతమకము పొంచి నీపై దిగఁబోసీ
యెదుటఁ దనకోరిక లింకానెంత చూపీనో ॥ చెప్ప ॥

విందువెట్టీ మోవితేనె వింతలుగా నిందరిలో
అందిచ్చీ కాఁగిలి నీకు నటు చేతుల
కందువ శ్రీ వేంకటేశ కైకొని కూడితివి
పొంది రతు లింకానెంత భోగించీనో ॥ చెప్ప ॥ 227

నాదరామక్రియ

ఏమని చెప్పుదునే యిదివో నావలపు
దోమటి మోవితేనెలఁ దొట్టుకొనె వలపు ॥ పల్లవి ॥

తలపోఁతలచేత దట్టమవును వలపు
సొలపులు నెరపితేఁ జుట్టుకొను వలపు
పలుకులఁ గొసరితేఁ బదనెక్కు వలపు
నెలకొని నవ్వితేను నిలుకడౌ వలపు ॥ ఏమ ॥

చెనకులు గనమైతే చిమ్మిరేఁగు వలపు
తనువసోఁకులను తగులౌను వలపు
పెనఁగఁగాఁ బెనఁగఁగా బెచ్చురేఁగు వలపు
మనసురా మెలఁగితే మక్కళించు వలపు ॥ ఏమ ॥

తప్పకచూచితేనే తలకొను వలపు
ముప్పిరివినయముల ముంచుకొను వలపు
అప్పఁడు శ్రీ వేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
చెప్పరానిరతులను చెట్టుకట్టు వలపు ॥ ఏమ ॥ 228

రేకు 839 సాళంగనాట

వీఁడె చూడరే యెంతవేడుకకాఁడు
తీఁడుకొనీ మీసాలు తిరువేంగళేశుఁడు ॥ పల్లవి ॥

భూపతిచెరువుకాడ పువ్వులమాకులనీడ
రాపైనమిక్కిలిసింగారాలతోడ
చూపట్టుఁగొంతలనెల్లాఁ జొక్కించి చొక్కించి తరి —
తీపులఁబెట్టీ నిదే తిరువేంగళేశుఁడు ॥ వీఁడె ॥

కట్టుఁగాలువదండ కడుమచ్చికలు నిండ
మట్టుక వున్నదే తిరుమలకొండ
జట్టిగొని సతులతో సరసములాడుకొంటా
దిట్టయై నవ్వులు నవ్వీఁ దిరువెంగళేశుఁడు ॥ వీఁడె ॥

ముప్పిరిగొన్నవీదుల ముంచి మోహముపోదుల
విప్పుచుఁ బైఁజల్లేటివిరివాదుల
యెప్పుడు శ్రీవేంకటేశుఁ డితఁడె ఇంతులఁ గంటేఁ
దెప్పరము పెండ్లాడీఁ దిరువేంగళేశుఁడు ॥ వీఁడె ॥ 229

బౌళి

చూడఁ బిన్నవాఁడు గాని జూటుఁదనాలు తనవి
యేడఁజూచినాఁ దానే యేమని చెప్పుదునే ॥ పల్లవి ॥

దొంగాడుఁ గృష్ణుఁడు తొయ్యలుల మొగములు
తొంగిచూచీ ముంగురులు దూలాడఁగా
ముంగిట ముద్దులువెట్టి మోవితేనె లానుకొంటా
ఘెంగిలిసేసీ నిదె యిందరి నొక్కమాఁటె ॥ చూడఁ ॥

వెన్నముద్దకృష్ణుఁడు వేడుకతో జవరాండ్ల —
చన్నులంటి సారె సారె సాముసేసీని
చిన్నిచేతు లటుచాఁచి సిగ్గులురేఁచి చెనకి
సన్నలుసేసి పిలిచి సరసములాడీని ॥ చూడఁ ॥

వుద్దగిరికృష్ణుఁడు వొడివట్టి మానినుల
అద్దుకొని కాఁగిలించి ఆసలురేఁచీ
వొద్దిక శ్రీవేంకటాద్రి నొనగూడి మాచేఁతలు
సుద్దులుగాఁ జెప్పి చెప్పి సొలసి నవ్వీనే ॥ చూడఁ ॥ 230

పాడి

నీవు సరసుఁడవు నే నీవూడిగపుదాన
భావించి నీ చిత్తము పట్టరాక కాక ॥ పల్లవి ॥

వాడిపట్టితియ్యఁగా నే నోపననేదానవా
అడరి మందెమేళము లౌనని కాక
తడవి చెనకఁగాను తప్పించుకొనేనా
సుడిసి కొనగో రెందుసోఁకునో యనికాక ॥ నీవు ॥

తగిలి నీవు చూడఁగాఁ దలవంచేదానవా
వాగి నీతో గర్వమని వుందానఁగాక
పగటున నవ్వఁగాను పరాకయ్యేదానవా
[1] చిగిరించేనాలోనిసిగ్గులకుఁ గాక ॥ నీవు ॥

సరసములాడఁగాను సమ్మతించనిదానవా
సరికి బేసికి నీతో జరయఁ గాక
యిరవై శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
వొరసి నానీమన్నన నొద్దికయ్యేఁగాక ॥ నీవు ॥ 231

గౌళ

ఒకటి కినుమడాయ నొద్దిక నీవలపులు
మొకమిచ్చలనాపొందు మున్మడించె నిపుడు ॥ పల్లవి ॥

పీడెమిచ్చినాపె నీపై వేడుకలు సేయఁగాను
వాడవారిపైఁ జల్లేపు వసంతము
వోడఁగట్టినదూలమై వొకతె నీకుండఁగాను
ఆడనే వేరొకతెకు నంటుబచ్చలైతివి ॥ ఒక ॥

---

1. 'నాలోఁజిగిరించేసిగ్గులు' అనుట సహజము.

పాదాలొత్తేయాపె నిన్నుఁ బలుకులఁ గొసరఁగ
వీదివారితో నాడేవు వెడమాటలు
తోదోపుల వేరొకతె తోడునీడై వుండఁగాను
సోదించి వేరొకతెకు సూదిరాయి వైతివి ॥ ఒక ॥

కాఁగిలించుకొన్నయాపె కందువలఁ గరఁగఁగా
లోఁగిటిలోనియాపెకు లోనైతివి
చేఁగదేరొకతె నీకు జిగురుఁగండై వుండఁగా
పాఁగి శ్రీ వేంకటేశ నాపాలిభాగ్య మైతివి ॥ ఒక ॥ 232

## లలిత

ఏడకుఁ బోనేల నీకు నిందు రావయ్యా
వాడుదేర నామోము చూడవయ్యా ॥ పల్లవి ॥

చుట్టమవైనవాఁడవు సుద్దులు చెప్పేవాఁడవు
ఇట్టె మాయింటికి వచ్చి యెనయవయ్యా
దిట్టవైనవాఁడవు తీరనిపంతగాఁడవు
బెట్టగునాచన్నులతోఁ బెనఁగవయ్యా ॥ ఏడ ॥

వలచినవాఁడవు వసమైనవాఁడవు
ఇల నాచేసేసేవలు సేయించుకోవయ్యా
సెలవి నవ్వేవాఁడవు చెందినమేనవాఁడవు
వలసినట్లఁ గూడి వద్దనుండవయ్యా ॥ ఏడ ॥

నమ్మికిచ్చినవాఁడవు నాపాలివాఁడవు
ఇమ్ముల నాకిట్టె కాఁగి లియ్యవయ్యా
నెమ్మది శ్రీ వేంకటేశ నేఁడు నామేలువాఁడవు
కమ్మటి నన్నుఁ గూడి కరుణించవయ్యా ॥ ఏడ ॥ 233

ధాయానాట

చేరి నన్నుఁ జూచి యేల సిగ్గువడేవు
గారవిం చందుకోవయ్యా కప్పురమిచ్చీని ॥ పల్లవి ॥

ముదిత, చన్నుదోయిమొనలు నిన్నునోఁకఁగా
చెదరిననీనెరుల చిక్కుదీసీని
పెదవులపై తమ్మబేంట్లు రాలఁగాను
కదిసి నీకప్పటి నీకత చెప్పీని ॥ చేరి ॥

పొంచి తనకొప్పులోనిపూవులు నీపై రాలఁగా
కుంచెవేసి నిలుచుండి కొలిచీ నిన్ను
కంచు వాఁగినట్టు పైఁడిగాజులు రవళించఁగా
మంచముపైఁ బాదాలొత్తి మనసు మెప్పించీని ॥ చేరి ॥

పొదిగి బాహులతలె పూవులదండలు గాఁగ
కదిసి నీపై వేసి కాఁగిలించీని
యెదుట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీ—
పెదవితేనెల కాపె పెనఁగీ నీతోను ॥ చేరి ॥ 234

రేకు 840 ఆహిరి

నీకు నాకు సరి[1]వాలై నిండె వలపు
కైకొందము రావయ్యా కందువైనవలపు ॥ పల్లవి ॥

యెమరుచూడఁగానే ఇంటికి విచ్చేసితివి
పదనుదప్పకుండాను పండె వలపు
వదలుఁబయ్యెదలోనివట్రువగుబ్బ లంటేవు
యెదుటనే కొటారుకు నెక్కెనిదె వలపు ॥ నీకు ॥

---

1. సరి+పాలై

అట్టె తలవంచఁగానే ఆసమాట లాడితివి
నెట్టుకొన్నకణఁజాల నిండె వలపు
తెట్టఁదెరువున మోవితేనెలు చవిచూపేవు
గుట్టుతోడుత నామనిగుంపులాయ వలపు ॥ నీకు ॥

కవకవనవ్వఁగానే కాఁగిలించుకొంటివి
చివురులో చేఁగలై చిక్కె వలపు
యివల శ్రీవేంకటేశ ఇన్నిటా నన్నేలితివి
జవళిసోబనముల జంటలాయ వలపు ॥ నీకు ॥ 235

## ముఖారి

నామనసెందాఁకాఁ జూచినాఁడే నావిభుఁడు తాను
యీమాట గురుతుచెప్పి ఇంటికిఁ బిలువవే ॥ పల్లవి ॥

చెల్లుబడిమాటకు సిగ్గువడ నేమిటికి
వెల్లవిరైనపనికి వెగటుగాదు
వుల్లముగలసినందు కొదఁబాటు మరివద్దు
యెల్లవారు నెఱఁగిరి ఇంటికిఁ బిలువవే ॥ నామ ॥

పక్కన నవ్వినమీఁద పంతమాడ నేమిటికి
మొక్కినవెనక గర్వములు దగదు
నిక్కిచూచినప్పుడే నిండుకొనె నడియాస
ఇక్కువలు సరివచ్చె నింటికిఁ బిలువవే ॥ నామ ॥

చుట్టరికమైనయందు చొప్పులెత్తనేమిటికి
నెట్టుకొంటే వలపులో నెరుసేదది
గుట్టుతోడ నన్నిట్టె కూడె శ్రీవేంకటేశుఁడు
యెట్టయెదుటనే వున్నాఁ డింటికిఁ బిలువవే ॥ నామ ॥ 236

కుంతలవరాళి

పతులకు సతులకుఁ బాయరానిజాడ లివి
ఇతవుసేసుకొంటే నేమీ నెంచనేఁటికి ॥ పల్లవి ॥

వయసే చక్కఁదనము వర్ణించి చూచితేను
ప్రియమే వలపులకుఁ బెనుఁబోది
నయగారితనములే ననుపులకు మూలము
చెయిఁజెయిసోఁకులే చెలిమికి గురుతు ॥ పతు ॥

మనసే పొంతనము మచ్చికలుసేసుకొంటే
పెనగొన్నచూపులే పెడరేఁపులు
వినయపుమాటలే వేడుకతగులాయాలు
వినుకలియానందమే వియ్యపుసమ్మందము ॥ పతు ॥

నెలవులనవ్వులే సిగ్గులలోనిచవులు
వులివచ్చిచెనకులే వొడఁబాటులు
యెలమి శ్రీ వేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
వెలయ మోవితేనెలు వెలలేనివిందులు ॥ పతు ॥ 237

దేవగాంధారి

తప్పు లెంచకుము దండము వెట్టెద
చొప్పుగ నను దయఁజూడుము నీవు ॥ పల్లవి ॥

చనవున నీతో సరసములాడితి
పెనఁగితిఁ గాఁగిటఁ బ్రియమునను
ననుపున నూరక నవ్వులు నవ్వితి —
నెనయఁగ నాగర్వ మేమనఁగలదు ॥ తప్పు ॥

మరుగవలసి నీమనసు గరంచితి —
నరుదుగ మర్మము లంటితిని
సురతవేళలను చొక్కించితి నిను
యిరవుగ నాగుణ మిటువలె నుండె ॥తప్పు॥

సంగడిఁ గూచుండి చన్నుల నొత్తితి —
నెంగిలిపెదవుల నెదిరితిని
అంగపుశ్రీ వేంకటాధిప యలమేల్ —
మంగపతివి నను మన్నించు మిఁకను ॥తప్పు॥ 238

రామక్రియ

అన్నియుఁ గూడఁగాను అలమేలుమంగయాయ
కన్నుల నిట్టికొత్తలు కనుఁగొనవయ్యా ॥పల్లవి॥

చిగురుమరుకాశెలు జిగిగలయరఁటులు
సొగసైనయట్టియిసుకదిబ(బ్బ?)లు
తగినబిలము మంచితరఁగలు సింహము
మొగిచినచక్రవాళములపిల్లలు ॥అన్ని॥

ఃవళితామరతూండ్లు చక్కనిశంఖము పోఁక
పవడాలు వజ్రాలు పసిడియద్దాలు
నువుఁబూవు కలువలు నూలుకొన్నశ్రీకారాలు
అవిరళమైనవిండ్లు అరచంద్రుఁడూ ॥అన్ని॥

తమ్మివిరి నీలాలు తళుకుమెఱుఁగులు
[1] తుమ్మెదలు(ల?)బెదరనితోరపుగుంపు
ఇమ్ముల శ్రీ వేంకటేశ యిదె నీవురముమీఁద
నెమ్మదిఁ దావుకొని నిండెను యీసిరులు ॥అన్ని॥ 239

1. 'బెదరనితుమ్మెదలగుంపు' అనుట సహజము.

సాళంగం

మఱి తరవాతఁ దానే మన్నించీ నన్ను
యెఱిఁగించి రమణుని నీకుఁ దోడితేరే ॥పల్లవి॥

వేడుకలు తనపేరు వీనుల వింటేఁ గలుగు
సూడిదె కోరిక తన్నుఁ జూచితేఁ గల్గు
ఆడుకొన్న బాపమాట లాడుకొనఁగానే కలుగు
వాడిక తనకాఁగిటఁ గూడితేఁ గలుగును ॥మఱి॥

జమళిసిగ్గులు దన్ను చన్నుల నొత్తితేఁ గల్గు
తమకము దనపొందు దక్కితేఁ గల్గు
సమరతులెల్లా మోవి చవిగొంటేనే కలుగు
చెమటలసాములు పెనఁకితేఁ గలుగు ॥మఱి॥

మనసు మచ్చిక తాను మన్నించితేఁ గలుగు
ననుపులు నటనలు నవ్వితేఁ గల్గు
యెనసె శ్రీ వేంకటేశుఁ డే నలమేల్మంగను
పను లీడేరెను తనుఁబాయకుండాఁ గలుగు ॥మఱి॥ 240

రేకు 841 రామక్రియ

మేరమీరకువె యలమేలుమంగను నేను
యేరీతిఁ బెనఁగనేలే యీతఁడు నామగఁడు ॥పల్లవి॥

చెక్కుల జవ్వాది వదిసీఁ జుడుచుకొనవే
అక్కర నేమిచూచేవు ఆతనిదిక్కు
వెక్కసపువలపుల వేడుకకత్తె వౌదువు
ఇక్కువ లంటకువే యీతఁడు నామగఁడు ॥మేర॥

కోరి జారినపయ్యదకొంగు చక్కఁబెట్టుకోవే
కూరి మేమిగొనరేవు కొంక కాతని
చేరుగొండితనముల చెలిమికత్తె వౌదువు
యీరుదియ్యఁ బేను వచ్చు నితఁడు నామగఁడు ॥ మేర ॥

కు(కొ?)మ్మిడి వీడె నిదె కొప్పుముడుచుకొనవే
యెమ్మెల కాతనితోడ నేమినవ్వేవు
నెమ్మది నన్నేలె నిట్టె నీవూఁ జుట్టమ వౌదువు
ఇమ్మల శ్రీవేంకటేశుఁ డితఁడు నామగఁడు ॥ మేర ॥ 241

## భైరవి

మాయింటికిఁ దానే వచ్చి మన్నించుఁగాక
సేయఁగలవిన్నపాలు సేసేదేమే ॥ పల్లవి ॥

నేసవెట్టి యేలినాఁడు చేరి బాసలిచ్చినాఁడు
లాసి మాటలాడినాఁడు లాలించినాఁడు
ఆసలెల్లాఁ జూపినాఁడు ఆలిఁజేసుకొన్నవాఁడు
వేసరించి ఇఁకనేమి వేఁడుకొనేదేమే ॥ మాయిం ॥

మనసుమర్మా లెఱుఁగు మరి నావల పెరుఁగు
తనువుపైత(త్య?)మెరుఁగు తగవెరుఁగు
ననిచినపొందెరుఁగు నాఁటుకొన్నచూ పెరుఁగు
పెనఁగి యింకా నేను ప్రేమ రేఁచేదేమే ॥ మాయిం ॥

మునుపనే నను జూచె మొక్కినమొక్కులు చూచె
తనగురుతులు చూచె దయఁజూచె
యెనసె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
చెనకి ఇంకాఁ దనకుఁ జెప్పేటిదేమే ॥ మాయిం ॥ 242

## సామంతం

చెలులాల యెట్టిదో యీచెలివలపు
మొలకలపులకలు మోఁపులాయ మేనను ॥ పల్లవి ॥

మొగమెల్లఁ గన్నులై ముంచుకొనెఁ జూడరే
వెగటుగఁ బతిఁజూచేవేడుకలను
నగవెల్లాఁ గప్పురాలై నలుగడఁ జిందెనదే
పగటుల నీకెదిక్కు భావించఁగదరే ॥ చెలు ॥

నిలువెల్లాఁ గళలై నిండుకొనెఁ జూడరే
లలి నాతఁడిచ్చినతమ్ములమువల్ల
పలుకులెల్లాఁ దేనెలై పైపైఁ గురిసీ నదే
నెలఁత యెంతనేరిచె నెట్టుకొని వినరే ॥ చెలు ॥

వురమెల్లఁ జన్నులై వుదుటెక్కెఁ జూడరే
పొరి శ్రీవేంకటేశుఁ బొందినందున
సరులెల్లా గుంపుగట్టె సారె నల్లమ్రోఁగఁగను
సురతచిన్నలు మించెఁ జొక్కిచొక్కి మెచ్చరే ॥ చెలు ॥ 243

## నాగవరాళి

ఇందరిలో సిగ్గయ్యీ నీమాట నాకు
అంది ఇది యెంతజూటు అనేవుసుమ్మీ ॥ పల్లవి ॥

వలచిననీతో వడిగా మాటలాడుదు
తళుకుఁగన్నుల నిన్నుఁ దప్పక చూతు
బలిమిసేసి యట్టె పాదాలఁ బెనఁగుదు
అలరి ఇదెంత రట్టడనేవు సుమ్మీ ॥ ఇంద ॥

నలిరేఁగి వేడుకతో నవ్వు నీతో నవ్వుదు
　　చలపట్టి నీమోవి చవిగొందును
　　కలువల వేసి నిన్నుఁ గాఁగిలించుకొందును
　　అలరి ఇదెంతదంటయని నన్ననుకుమీ ॥ఇంద॥

సారె సారె నీమేను చనుఁగవ నొత్తుదును
　　కూరిమి రతుల నిన్నుఁ గూడుదును
　　యీరీతి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
　　గారవించి నన్నాసోదకత్తె యిదనుకుమీ ॥ఇంద॥ 244

నారాయణి

కన్నుల నీసంతోసము గంటిమయ్యా
　　సన్నల నివెల్ల మాకు పాతెఁ జూపవయ్యా ॥పల్లవి॥

సెలవుల నవ్వులు చెక్కుళ్ళ చెమటలు
　　కలిగెఁగా నేఁడు నీకుఁ గడుమేలయ్యా
　　మొలకకెంపులు మోవి, మోమున నిండుఁగళలు
　　తొలఁకీ నీవన్నెగాను దొడ్డవాఁడవయ్యా ॥కన్ను॥

కడగన్నుల నిద్దుర కాయమునఁ బులకలు
　　తడఁబడీ నీకు నేఁడు తగునయ్యా
　　అడియాలాలు సందున నక్కునఁ జనులొత్తులు
　　అదరె జాణఁడవు నీ వౌదువయ్యా ॥కన్ను॥

శిరసుపై సేసలు కురుల చెదరులును
　　పరగె నీయందు నేఁడు బాపురే యయ్యా
　　యిరవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
　　సరుగ నన్నేలితివి సరసుఁడవయ్యా ॥కన్ను॥ 245

హిజ్జిజి

[1]ఎచ్చట చూచినాను యివిగో నీ సుద్దులే
అచ్చుగ నీదాసులే భాగ్యవంతు లందరు ॥ పల్లవి ॥

అన్నిటాఁ జక్కనివాఁడవని నిన్ను నందరు-
నెన్న నీదేవుల సిరు లెక్కుడందురు
సన్నుతి నీసుతుల నెంచఁగ లోకేశు లందురు
పన్ని నీకూఁతురు లోకపావని యందురు ॥ ఎచ్చ ॥

అట్టె నీచేతిచక్రము అతిప్రతాపి యందురు
పట్టినసంకు వేదాలపార మందురు
జట్టిగ నీపానుపు సర్వాదా(ధా?)ర మందురు
వొట్టి నీవాహనము దేవోపకారి యందురు ॥ ఎచ్చ ॥

పరగ నీవున్నచోటే పరమపద మందురు
యిరవై శ్రీవేంకటాద్రి యెక్కువందురు
మరిగి యలమేలుమంగమగఁడవు నీవందురు
ధర నన్ను నీదాసాన (ను?) దాసుఁడందురు ॥ ఎచ్చ ॥ 246

రేకు 842 మంగళకౌశిక

తగ వెఱఁగవద్దా తమకించి చెనకేవు
మగువలతలనేల మహిఁ [2]బూరిగట్టేవే ॥ పల్లవి ॥

కందువ నాతఁడు నాతోఁ గతలు చెప్పఁగాను
సందుసుడినీమాటలు చవులౌనటే
యెందును మావలపులు యేకములై యుండఁగాను
మందమిరియాలు చల్ల మరియేఁటికే ॥ తగ ॥

1. ఇది అధ్యాత్మకీర్తనయే.
2. తలలో పూరిగట్టుట అపవాదుకు పర్యాయముగ తోచుచున్నది.

ఇంగితాన నిద్దరము నేకతములాడఁగాను
తొంగి చూచి యెవ్వతెకుఁ దొరలనేలే
చెంగటనే మాపొందు చెట్టుకట్టి వుండఁగాను
పొంగిపొంగి వుప్పవేసి పొత్తుగలయనేలే ॥తగ॥

చేరి శ్రీవేంకటేశుఁడు కోరి నాకు విడెమీఁగా
పోరచివారు చెయిచాఁచఁ బొసఁగునటే
మేరతో నన్నేలె నలమేలుమంగనైనదాన
సారె నడుమఁ బసపు [1]నూర నీకేఁటికే ॥తగ॥ 247

బౌళి

నేరుపరినంటాను నిక్కె విందరిలోన
గారవించి రమణునిఁ గరఁగించవలదా ॥పల్లవి॥

మలసి మలసి కడుమాటలాడనేర్తునంటా
సొలసే వాతని సారె జూటుఁదనాన
వలచి ఇంతేసిబత్తిగలిగినదానవు
యెలమి నాతనియిచ్చ యెఱఁగఁగవలదా ॥నేరు॥

చేరి చేరి నీవప్పటి చెనకఁగనేర్తునంటా
గోరు దాఁకించవచ్చేవు గుట్టుతోడను
కూరిమితో నింతేసికూటమిగలదానవు
బోరున నాతని నిట్టె బుజ్జగించవలదా ॥నేరు॥

ననిచి ననిచి నీవు నవ్వఁగనేరుతునంటా
చనుఁగవ దాఁకించేవు సమరతుల
యెనసీ శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
ననువలెఁ గాఁగిటఁ బెనఁగఁగవలదా ॥నేరు॥ 248

1. పెండ్లికి పసుపు నూతుటా?

బౌళి

సారె నిన్నలమేల్మంగ జవ్వనవనమునను
చేరి యవధరింతు(చు?) విచ్చే(య)వయ్య జాజర ॥ పల్లవి ॥

వసంతకాలము వచ్చె వనితమోవి ఇగిర్చె
కొసరేయెలుఁగులను కోవిల గూసె
ముసరీఁ జూపులతేంట్లు [1]మోఁతుగ్గై వలపు వూచె
రసికత నాడుదువు రావయ్య జాజర ॥ సారె ॥

పున్నమవెన్నెలగాసె కన్నుఁగలువలు విచ్చె
పిన్నలై చన్నులనేటిపిందెలు వుట్టె
సన్నపుఁజెమటలను జాలువారెఁ బన్నీరు
చెన్నుమీర నాడుదు విచ్చేయవయ్య జాజర ॥ సారె ॥

మరుఁడు విల్లందుకొనె మచ్చికలు గూడఁజేసె
పొరిపొరి సిగ్గులనేపుప్పొడి రాలె
ఇరవై శ్రీ వేంకటేశ యీకె నిట్టె కూడితివి
సరుగ మీమీఁద మీరే చల్లరయ్య జాజర ॥ సారె ॥ 249

గుండక్రియ

కొత్తకొత్తవలపులకోడెచేఁతలవాఁడు
హత్తి ఇచ్చకములనే అట్టె లోఁగొనెనె ॥ పల్లవి ॥

ననిచితే నామగని నవ్వించెను
పెనఁగులాడఁగలితే బెల్లించెను
మనసిచ్చి మాటాడితే మతి గరఁగించెను
చెనకఁగవచ్చితేను చిక్కించుకొనెనె ॥ కొత్త ॥

1. మోఁదుగకు రూపాంతరమా?

అగపడితేఁ జాలు నాసలెల్లా రేఁచేను
నగ నీవె పాయరానినంటు సేసెను
మొగము చూచితేను మోహములు పుట్టించెను
తగులుగా నియ్యవె తలఁపించుకొనెను ॥కొత్త॥

సముకముగా నీవె చవులెల్లా నించెను
జమళిఁ గూచుండితేనే సాదించెను
అమర శ్రీవేంకటేశుఁ డలమేలుమంగను నేను
సమరతిఁ గూడె నింకా సరసములాడీనే ॥కొత్త॥ 250

కురంజి

ఇద్దరికిఁ జుట్టరిక మీరీతిఁ గలిగె మీకు
చద్దికివేఁడికి సరసములాడరే ॥పల్లవి॥

కలువరేకులవంటికన్నులాతఁడు నీపతి
తొలుతనే నీమోముఁ జందురుఁ జూపవే
బెళుకులేనియట్టిబింబాధరుఁ డాతఁడు
చిలుకపలుకుల రంజిలఁ జేయవే ॥ఇద్ద॥

మించులనీలమేఘముమేనిచాయవాఁ డతఁడు
కొంచక నీచూపుమెరుఁగులు చల్లవే
పొంచి తామరపువ్వులఁబోలినపాదాలాతఁడు
వంచి తుమ్మిదలకొప్పు వడి సోఁక మొక్కవే ॥ఇద్ద॥

గందపుమానికొమ్మలచేతులతఁడు
అందుకొని లతాంగివి అలముకోవే
అందపుశ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
చెందితి రిన్నిటా నిఁక సేసచల్లుకొనరే ॥ఇద్ద॥ 251

కన్నడగౌళ

ఏమీనెఱఁగనినన్ను నింత సేసెను
నామగఁడై యిట్లానే నన్ను నేలమనవే ॥ పల్లవి ॥

నవ్వులునవ్వి నన్ను నమ్మించెను
పువ్వులు వేసి కొంత బుజ్జగించెను
చివ్వనఁ జెనకి మేను చిమ్మిరేఁచెను
తవ్వితవ్వి వలపులు తలఁపించెను ॥ ఏమీ ॥

లాసి లాసి మెల్లనే మేలములాడెను
వాసికెక్క నాచే సేవలుగొనెను
ఆసలు వుట్టించి విడెమంది యిచ్చెను
సేసచల్లి నన్ను నిట్టె సిగ్గుల నోలార్చెను ॥ ఏమీ ॥

వాడికసేసి నాకు వరుసిచ్చెను
వీడుదోడుగానే మోవివిందు చెప్పెను
కూడె శ్రీవేంకటగిరి గోవిందరాజు
వేడుకల నన్నుఁ గడువెలయించెను ॥ ఏమీ ॥ 252

రేకు 843 సౌరాష్ట్రం

గుట్టుతోడ మరిగించుకొని కూడుచే మేలు
మట్టుమీరఁ బెనఁగితే మరి రట్టుపెట్టవా ॥ పల్లవి ॥

జలజాక్షిచన్నులతో సాముతోంత సేసేవు
కొలఁదిమీరినయట్టికొండలు గావా
నలువంక పిడికిట నడుమేమి గొలచేవు
చెలరేఁగేయటువంటిసింహము గాదా ॥ గుట్టు ॥

కొమ్మచూపులనేల గుఱియై పొలనేవు
పమ్మికొన్న పువ్వులబాణాలు గావా
ఇమ్మల నొరశొరసి యేలపలికించేవు
కొమ్ము(మ్మ?)మీఁదిమదనునిగుఱ్ఱాలు గావా ॥ గుట్టు ॥

యీకె యలమేల్మంగ నెట్టు గాఁగిటఁ గూడితి
దీకొని చుట్టుకొనేటితీగే గాదా
యీకడ శ్రీవేంకటేశ యేల తురుమందితివి
చేకొన్నవలపులచీఁకటే గాదా ॥ గుట్టు ॥ 253 ॥

కాంబోది

రావయ్య ఇఁకనైనా రమణి యలమేల్మంగ
మోవనిపాదాలమీఁద మొక్కీ నీకు ॥ పల్లవి ॥

వదలుఁబయ్యెదతోడ వాడికచేఁతలతోడ
కదలుఁగన్నులఁ జూచె కలికి నిన్ను
వుదుటుగుబ్బలతోడ నొరసి వేఁడుకొంటాను
పెదవులెత్తి ఇంటికిఁ బిలిచీ నిన్ను ॥ రావ ॥

నెలవినవ్వులతోడ చెక్కిటిచేతితోడ
కొలువుసేసె నీకుఁ గోమలి నేఁడు
మొలకసిగ్గులతోడ మోహములు చల్లి చల్లి
వెలయ నిందరిలోన విందుచెప్పీ నీకు ॥ రావ ॥

చెంపచెమటలతోడ చిప్పిలుఁగళలతోడ
ఇంపువుట్ట సేవసేసె నిదె నీ వొద్ద
దింపనికాఁగిటితోడ తిరమై శ్రీవేంకటేశ
సంపదల విఱ్ఱవీఁగి సమరతి నీయందు ॥ రావ ॥ 254

లలిత

మఱియేల చెప్పేవే మాతో నీవు
గుఱుతుగా సంతోసించుకొంటిమే నేము ॥ పల్లవి ॥

సంతతము రమణునిచనవు గలిగితేను
పంతమాడఁ జెల్లునే పడఁతీ నీకు
చెంతనుండి యాతఁడే నీచెప్పినట్టు సేసితేను
వంతులకు గర్వింపవచ్చునే నీకు ॥ మఱి ॥

గారవించి పతి నీకుఁ గైవశమై వుండఁగాను
చేరి యంతనవ్వినాను చెల్లునే నీకు
మేరమీరి నిన్నేపొద్దూ మెడఁగట్టుకుండఁగాను
అరితేరి బిగిసినా నందమౌనే నీకు ॥ మఱి ॥

అలమేల్మంగవు నీవు ఆతఁడు శ్రీవేంకటేశుఁ-
డలరి నిన్నేలెఁ దగు నన్నియు నీకు
చెలులము నిన్నతఁడు చేకొని మన్నించఁగాను
మెలుపునఁ జూచితిమి మేలే నీకు ॥ మఱి ॥ 255

గౌళ

ఎంత నీవు మోహించినా ఇల్లాల నేను
చెంత నీయానతి నేను సేసేనయ్యా ॥ పల్లవి ॥

పాయక నీవు మన్నించి పలుమారు బోధించినా
సేయరానివిన్నపాలు సేయవచ్చునా
వేయిమారులు నన్ను వేఁడుకొంటివంటాను
నాయముగానిరతులు నడపఁగవచ్చునా ॥ ఎంత

వొయ్యన నీవెటువలె నూరడించి పెనఁగినా —
నియ్యరానియీవులు ఇయ్యవచ్చునా
నెయ్యానఁ బెద్దరికము నీవెంత సేసినాను
చయ్యన మందెమేళాలు జరపఁగవచ్చునా ॥ ఎంత ॥

నగుతాఁ జనవులిచ్చి నన్నింత నీవు గూడినా
తగునీచేఁతలను పొందఁగవచ్చునా
నిగిడి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
తగులై ఇఁక నీవేడ తప్పించుకొనవచ్చునా ॥ ఎంత ॥ 256

రామక్రియ

పిన్నది యిది కన్నెపిన్నది
మన్నించి యెట్లయినా మరిగించుకోవయ్యా ॥ పల్లవి ॥

జలజాక్షి నీపై సేసచల్లినవెనకనె
మొలచినచన్నుల మొలకలవి
సొలసి కన్నుల నిన్నుఁజూచినవెనకనె
కళలు నెమో(మ్మో?)మునఁ గలిగినవి ॥ పిన్న ॥

వరుసకు నీ వొద్దికి వచ్చినవెనకనె
నిరతపుసిగ్గులెల్లా నేరిచినవి
అరుదుగ నీతో మాటలాడినవెనకనె
గరిమ లేఁతనవ్వులు గడించినవి ॥ పిన్న ॥

యీయలమేలుమంగ నిన్నెనసినవెనకనె
పాయమువచ్చి యీరీతిఁ బెడఁగినది
చాయల శ్రీవేంకటేశ[1] నీయింతైనవెనకనె
కాయపు విలాసాలగని యైనది ॥ పిన్న ॥ 257

---

1. "నీయొక్క యింతైన వెనకనె" అని వ్రాఁతపాఠము

దేవగాంధారి

నీవైనాఁ జేరఁగవచ్చి నేరుపవయ్య చేఁతలు
యీవేళ నా కనరాదు యే నలమేల్మంగను ॥ పల్లవి ॥

మొక్కలపుటాసలతో మొగమెత్తి నిన్నుఁ జూచి
చెక్కుచేతితో నింతి సిగ్గువడీని
మక్కువలు చల్లుకొంటా మాఁటలాడఁ బూఁచిపూఁచి
తొక్కుమెట్టుచెమటలఁ దొప్పఁదోఁగీని ॥ నీవై ॥

జంటనిమ్మపండ్లు నీకు సతి గానుకియ్యవచ్చి
నంటుఁజన్నులు చూచుక నవ్వుకొనీని
ఇంటికి రమ్మని నిన్ను నిట్టె పిలువఁగవచ్చి
దంటతనముచాలక తలవంచీని ॥ నీవై ॥

గట్టిగా నీకాఁగిటఁ గలయఁగఁ దమకించి
గుట్టుతోడ వలపుల గుబ్బతిలీని
యిట్టె శ్రీవేంకటేశ యిద్దరి మమ్ముఁ గూడితివి
నిట్టూరుపులతో నొప నవ్వొలికీని ॥ నీవై ॥ 258

రేకు 844 మాళవశ్రీ

ఒడఁబాటు సేసుకొమ్మీ వొప్పుగా వెనకనైనా
యెడయక వాఁడెంత మోహించినవాఁడో ॥ పల్లవి ॥

ఇత్తల నేను నిన్ను నేకతానకుఁ దీయఁగ
చిత్తము లెట్టుండునో నీచెలులకును
బత్తిసేసి యేపొద్దూ(ద్దూ?) నీపాదాలు నే నొత్తఁగాను
హత్తి వారివారియాసలవి యేమైవుండునో ॥ ఒడఁ ॥

నెమ్మది నీమన్ననలు నేనే చేకొనఁగాను
కొమ్మలిందరూ నేమనుకొంటా నుందురో
కమ్మి నీకాఁగిలి మీఁదుకట్టుక నేనుండఁగాను
ఇమ్ములఁ దమకము లెట్టోరుచుకొందురో ॥ ఒడఁ ॥

శ్రీవేంకటేశుఁడ నిన్నుఁ జేరి నేనే కూడఁగాను
కావిరి వారెంతవేళ గాచుకున్నారో
దేవి నలమేల్మంగను నావిన్నపమే విని
యీవలఁ గూడితివి వారెంత మెచ్చుకొన్నారో ॥ ఒడఁ ॥ 259

పాడి

అటువలెఁ జూతమా అదీ నొక్కవేడుక
కుటిలకుంతలు లెంతకూరిమి గొసరేరో ॥ పల్లవి ॥

చిక్కించుక నీమేనఁ జెనకులు నించితేను
ఇక్కువనున్ననీసతు లేమందురో
అక్కున నాచన్నులు నీ[illegible]చ్చులుగా న[illegible]త్తితేను
తెక్కులుగా నిన్ను నెంతదిసంతు లాడుదురో ॥ అటు ॥

వన్నె నారూపులు వ్రాసి వలువ నీకుఁ గప్పితే-
నెన్నిక నీచెలులెల్లా నేమందురో
పన్ని నీమోవి యెంగిలిపరచి పిప్పిసేసితే
కన్నులు (లఁ?) జూచి వారెంత కాఁతాళింతురో ॥ అటు ॥

చిమ్మరేఁగఁ గూడి నీమై చెమరించఁజేసితేను
యెమ్మెలనీకాంతలు యేమందురో
నెమ్మి శ్రీవేంకటేశుఁడ నే నలమేల్మంగను నీ-
తమ్ములమిప్పించుకొంటిఁ దామేమిసేతురో ॥ అటు ॥ 260

గౌళ

ఇంతటగాని నీపగ టిందర్యూ నెరఁగరా
వింతవారు చూచి యిది యెంతరాఁగనరా ॥ పల్లవి ॥

చిక్కనితేనెలు గార చెలువుఁడు నోరూర
మక్కళించి యెటువంటి మాటలాడేవే
జక్కవ చన్నులు నీవు సారెఁ గదలించుకొంటా-
నుక్కుమీర నెంతేసివూడిగాలు నేసేవే ॥ ఇంత ॥

కొప్పులో పువ్వులు రాల కుచ్చులపయ్యద వేల
ఇప్పుడే యీతనికొలు వేమిసేసేవే
చప్పుడుగా మీఁదమీఁదఁ జవులుగా సెలవుల-
నప్పటి వేసటలేక యదేల నవ్వేవే ॥ ఇంత ॥

చెమట చెక్కుల మించ శ్రీవేంకటేశుఁ డాలించ
భ్రమయించి యెందాఁకాఁ బాటవాడేవే
అమరఁ గూడితి నేనే అలమేల్మంగ నాపేరు
తమి నాతని నీవెంతతతిఁ గాఁగిలించేవే ॥ ఇంత ॥ 261

ధన్నాశి

రాజసపువాని నింతరవ్వసేతురా
వోజతో గుట్టుసేసుక వుండవలెఁ గాక ॥ పల్లవి ॥

కెలసి నీవిభుఁడు నీకే వలచునంటాను
చెలులతోనెల్లాను చెప్పుకొనేవే
తొలుత నతఁడు నీపొత్తున నారగించెనంటా
చెలరేఁగి సంతోసానఁ జిమ్మిరేఁగేవే ॥ రాజ ॥

వొగ్గి యాతఁ దప్పటి నీవాడిపట్టి తీసెనంటా
సిగ్గువిడిచాతనిపైఁ జేయివేతురా
యెగ్గుపట్ట కెప్పుడూ నీయిచ్చలోనే వచ్చునంటా
వెగ్గళించి సరసము వేమారు నాడుదురా ॥ రాజ ॥

యీతఁడు శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
నీతో నవ్వెనంటాను నీలుగనేలే
ఆతుమగా నన్నునేలె ఆస నీకు నిచ్చెనంటా
కాతరించి యిటువలెఁ గాకుసేయనేలే ॥ రాజ ॥ 262

## పాడి

అద్దమరేతిరికాడ నౌలే తాను
అద్దో నీకింతచుట్టుమాయఁబో తాను ॥ పల్లవి ॥

వీడెము చేతఁబట్టుక వేళగాచుకొని వుండి
వాడికమాఁట లాడవచ్చెఁబో యీకె
వోడక వేఁడిచెమటనూనినచేఁతఁ గానిక
తీఁడుకొంటా నిమ్మపండ్లు తెచ్చెఁబో నీకు ॥ అద్ద ॥

దొరతనము నేసుక తోడువెట్టుక యీపొద్దు
వరుసకు నీతో నవ్వవచ్చెఁబో యీకె
గరిమఁ దననిట్టూర్పుగాలిచేఁ గడివోయిన-
[1]సురవొన్నలు సూడిదె చూపించెఁబో నీకు ॥ అద్ద ॥

కలుపుకోలుఁదనాన కడుఁదమిరేఁచుకొంటా
వలపుల నిన్నుఁ గూడవచ్చెఁబో యీకె
యెలమి శ్రీవేంకటేశ యేవల మేలుమంగను
కలసితిఁ దానొకత గలిగెఁబో నీకు ॥ అద్ద ॥ 263

1. సుర + పొన్నలు.

సామవరాళి

ఎన్నటిచుట్టమో యాకె నెఱఁగ నేను
అన్నిటా నేనే నీకు నాలనంటా నుందును ॥ పల్లవి ॥

నెలఁత యెవ్వతోకాని నిన్నుఁ బొడఁగనవచ్చె
చెలపచెమటలతో సిగ్గులతోడ
చెలులఁ జెప్పు మనుచుఁ జేరి వాకిట నున్నది
తొలుత నీ వాపెమోము తోఁగి చూడవయ్యా ॥ ఎన్న ॥

వావి నీకేమౌనోకాని, వలపులమాఁటలాడి
వేవేగఁ దురుముజార విరులురాల
దేవులవలెఁ దలుపుదెరచి లోనికేతెంచె;
భావించి యాపెగురుతు పరికించవయ్యా ॥ ఎన్న ॥

యెంతవనికోగాని యేకతము గద్దనీని
సంతోసాలు గడునిండఁ జవులురేఁగ
యింతలో శ్రీవేంకటేశ యేనలమేలుమంగను
చెంత నన్నేలితి వాకెఁ జిత్తగించవయ్యా ॥ ఎన్న ॥ 264

రేకు 845 ఆహిరి

చేరి కరుణించుమంటాఁ జేతులెత్తి మొక్కేవు
యీరీతి నాతఁడు నిన్ను నేమిసేసెనే ॥ పల్లవి ॥

సన్నపుటెలుఁగునను సఖుపుమాట లాడేవు
కన్నులు దేలించుకొంటాఁ గమ్మిచూచేవు
వున్నతిఁ జెక్కుచెమట లూరిచి కడఁ జల్లేవు
యెన్నఁగ నాతఁడు నిన్ను నేమిసేసెనే ॥ చేరి ॥

దప్పిదేరఁ బెదవులపై దైన్యముఁ జూపేవు
కొప్పు వీడఁజేసుకొని గుబ్బతిలేవు
చిప్పిలి విడెమిమ్మంటే చెలిచేత నంపేవు
యిప్పుడే యీతఁడు నీకు నేమిసేసెనే ॥ చేరి ॥

వాడిచట్టి తీసితేను వుసురంటా నలసేవు
వెడమాయలాఁడివి శ్రీవేంకటేశుతో
అడరి నన్నితఁడేలె నలమేల్మంగను నేను
యెడనెడ నిన్నుఁగూడీ నేమిసేసెనే ॥ చేరి ॥ 265

## ఆహిరి

కొత్తపెండ్లికూఁతురవై గుట్టుసేసుకోవుగాక
మత్తిలి, నీమగఁడట మరియేమిసేసునే ॥ పల్లవి ॥

పంతమాడి యాతఁడు నీ పాదము దొక్కీనంటాను
చెంతనున్నచెలులతోఁ జెప్పుదురటె
మంతనాన నీచన్నులు మళ్లిమళ్లి చూచీనంటా —
నింతలో సాకిరివెట్టే విదియేమే నీవు ॥ కొత్త ॥

నేరుపుతోఁ దానప్పటి నీతో నవ్వీనంటా
పేరుకొని నీదాదిఁ బిలుతురటే
చేరిచేరి చేయిముట్టి చెనకవచ్చీనంటా
బీరముతో నానలువెట్టేవేమే నీవు ॥ కొత్త ॥

అరుదై శ్రీవేంకటేశుఁ డట్టె నిన్నుఁ గూడీనంటా
సొరిది చిలుకలకుఁ జూపుదురటే
వురముపై నేపొద్దునుండేయలమేల్మంగవు
బెరసి మాకు విడేలువెట్టేవేమే నీవు ॥ కొత్త ॥ 266

## నాదరామక్రియ

మునిముచ్చవలపుల మునగస లేమిటికి
పెనఁగి యచ్చమై యిట్టె బెరయఁగరాదా ॥ పల్లవి ॥

సందడిఁగొలువుసేసి సన్నలు మోవినే చూపి
చిందుకొనేవు చెమట చెక్కులవెంట
పొందు లింత గలిగితే బోరున సేసలుచల్లి
పెందలకాడే నీవూఁ బెండ్లాడరాదా ॥ ముని ॥

చిఱునవ్వు నవ్వుతాను సిగ్గులువడుకొంటాను
కఱఁగేవు లోలోనే కాంతునిఁ జూచి
మొఱఁగులింత నీకేల మోహించినదానవైతే
మెఱసి కాలుదొక్కి మేలమాడరాదా ॥ ముని ॥

పేరటాలవై వచ్చి బిగ్గెఁ బసపు నలఁచి
కోరి చన్నులనొరసుకొనే వాతని
యీరీతి శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
చేరి నన్నుఁ గూడె నీవూ సేవసేయరాదా ॥ ముని ॥ 267

## సౌరాష్ట్రం

ఏపొద్దూఁ గొలువుసేసీ నింతులతోను
యేపున మేడలోనికి యిట్టె రమ్మనవే ॥ పల్లవి ॥

వింతవారిమాటలైతే వినవేడుకలై యుండు
సంతవారిఁ జూడనైతే జరగు మతి
చింతలపులుసులకు చెలరేఁగి నోరూరు
యెంతలేదు రమణుని నీడకు రమ్మనవే ॥ ఏపొ ॥

నవ్వేవారివద్దనుంటే ననుపులఁ బొదు(ద్దు?)లెక్కు-
దవ్వుల సన్నలకై తేఁ దమివుట్టును
పువ్వులవాసనగాలి పొలసితే నాసవుట్టు
వువ్విళ్లూర నెంతలేదు వొద్దికిరమ్మనవే ॥ ఏపొ ॥

మేనవారివావులకు మేలములు పెచ్చురేఁగు
కానికనిమ్మపండ్లకుఁ గడఁగుఁ జేయి
యే నలమేలుమంగను యిట్టై తా శ్రీవేంకటేశుఁ –
డానుక నన్నేలె నిట్టే అప్పటి రమ్మనవే ॥ ఏపొ ॥ 268

లలిత

తానేల సిగ్గువడీని దండకిట్టె వచ్చుఁగాక
యేనెపమూవేయఁ దనకేమిటికే కొంకను ॥ పల్లవి ॥

చేరి చేఁతసేయక చేతులెత్తి మొక్కితి
మేరతోడ శిరసెత్తి మెచ్చితిఁ దన్ను
నేరము లెంచనేరక నెట్టుకొని పొగడితి
యీరసించేదానఁ గాను యిఁకనేమిసేతునే ॥ తానే ॥

కమ్మి కోపగించక కన్నులనే చూచితి
నమ్మిక లడుగక నవ్వు నవ్వితి
పిమ్మట నలుగక పెనఁగి పాదాలొత్తితి
యెమ్మెలదానఁగాను యేమిసేతునే ॥ తానే ॥

తనకెదురాడక తమ్ములమడిగితిని
మనసునొప్పించక మర్మమంటితి
యెనసె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
యినుమడించె వలపు లేమిసేతునే ॥ తానే ॥ 269

తెలుఁగుఁగాంబోది

ఇంతి సేసినభాగ్యమో యిట్టిది నీకరుణో
యెంతకెంత చెలులము యేమని పొగడెదము ॥ పల్లవి ॥

తలపోఁతలు రేఁచేవు తగ విడే లిప్పించేవు
నెలఁతకు నీకొలువు నిధానము
చలివాయ నవ్వేవు చదురఁ(రం?)గా లాడేవు
చెలఁగి నీమన్ననలు చిగురులో చేఁగలో ॥ ఇంతి ॥

మొగ మెప్పుడూఁ జూచేవు మోహములు చల్లేవు
మగువకు నీ పొందు లామనిపంటలు
తగుల మాటలాడేవు తనివిఁ బొందించేవు
వెగటులేనిమేలాలు వెన్నెలవులుఁగాలు ॥ ఇంతి ॥

చన్ను లేపొద్దూ ముట్టేవు సరసములాడేవు
కన్నెకు నీరతి తరగనిధాన్యము
యెన్నఁగ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
యిన్నిటా భోగములు యింటిలోనిసిరులు ॥ ఇంతి ॥ 270

రేకు 846 కన్నడబంగాళం

వేవేగఁ [1]బ్రియాలు చెప్పి వేఁడుకొనీఁగాక నన్ను
చేవమీరి విన్నపాలుసేసేనా నేను ॥ పల్లవి ॥

చెక్కులే నొక్కితిఁగాని చేతిగోర నూఁదనైతి
మొక్కితిఁగాని కాఁకల మొరయనైతి
నిక్కి చూచితిఁగాని నెరుసు వెదకనైతి
చి'కిం(క్కిం?)చుక విన్నపాలుసేసేనా నేను ॥ వేవే ॥

1. ప్రాపతింగము

విరులవేసితిఁగాని వెట్టగాఁ జెనకనైతి
సరుగ నవ్వితిఁగాని జంకించనైతి
తిరిగిచూచితిఁగాని దీకొనిమాటాడనైతి
సిరిమించి విన్నపాలు సేసేనా నేను ॥ వేవే ॥

అలమితిఁగాని నే నదలించి దూరనైతి
పిలిచితిఁగానీ మరి బిగియనైతి
యెలమి శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
చెలరేఁగి విన్నపాలుసేసేనా నేను ॥ వేవే ॥ 271

రామక్రియ

కాంత నీపై ప్రేమగాని గర్వముగాదు
మంతనాన నెచ్చరించి మన్నించు మీకెను ॥ పల్లవి ॥

సందడిలోఁ గాఁగాను సాగిలి మొక్కమరచె
పందెమాడుతాఁ గానుకపట్ట మరచె
విందువెట్టి వేడుకను విడెమియ్యఁగ మరచె —
నిందుముఖితమకము లింతసేసె నిపుడు ॥ కాంత ॥

నేసవెట్టి నిబ్బరాన సిగ్గులువడ మఱచె
ఆసల నవ్వుతా వినయము మఱచె
పాసికూడేసంతోసాన పాదములొత్త మఱచె
యీసతివుల్లాసము లింతసేసె నిపుడు ॥ కాంత ॥

నీమొగము చూచి చూచి నేరుపులెల్లా మఱచె
చేముంచి కాఁగిటి నించి చింత మఱచె
వేమరు నలమేల్మంగవిభుఁడ శ్రీవేంకటేశ
యీమగువ వేగిరము లింతసేసె నిపుడు ॥ కాంత ॥ 272

గౌళ

పట్టరానివయసుతో పచ్చియై వున్నాఁడవు
నెట్టుకొన్నగుట్టు నీకు నేర్పదాయనా ॥పల్లవి॥

కందువ నీతో నిందాఁకాఁ గాఁపురము సేసినది
దిందుపడ నీగుణము దిద్దదాయనా
సందడి నందరిలోన చనవుగలిగినది
పొందుగా నాచారాలు బోదించదాయనా ॥పట్ట॥

కఱఁగించి నిన్ను నింత కడువలపించినది
మఱి యితరచింతలు మాన్పదాయనా
మెఱయ నీతో నేపొద్దు మేలములే యాడేది
జఱసి నీతులు నిన్నుఁ జదివించదాయనా ॥పట్ట॥

యెలమి నీకిన్నిటాను ఇచ్చకురాలైనది
యిల నన్ను నీవేలిన దెంచదాయనా
అలమేలుమంగపతివైన శ్రీ వేంకటేశ్వర
కలసిన దిట్టై జలకములార్చదాయనా ॥పట్ట 273

దేసాళం

అట్టె తెరవేసుకోరే యాతఁడు నీవు
యెట్టయెదుట సతులు యెవ్వరున్నానేమి ॥పల్లవి॥

నిగ్గులచన్నులు గాఁగ నిన్ను నాతఁడు వొగడె
సిగ్గులెంత నెరపేవే చెలియా
వొగ్గి జవ్వనివిగాఁగా నుప్పతించి నీతో నవ్వె
యెగ్గులెంచ నేమిటికి ఇచ్చకము సేయవే ॥అట్టె॥

తురుము గొప్పదిగాఁగా దోసిటిసేసలువెట్టె
విరులనేలవేసేవే వెలఁదీ
సరులుపెనగొనఁగ చక్కఁగిద్దె నాతఁడు
సరిఁబయ్యెద మయ్యేక చిక్కనుండఁగదవే ॥ అట్టె ॥

మేలిమి నీమోవిగాఁగా మెచ్చి మెచ్చి చేరవచ్చె
మేలము లాడవే యలమేలుమంగ
యీలీల శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁగూడె
పోలును మీకిద్దరికి భోగించఁగదవే ॥ అట్టె ॥ 274

నాట

ఇట్టివట్టిపేసాలు యెంత సేసేవే
పట్టితే బలువుకొద్ది పంతమౌతెఱఁగవా ॥ పల్లవి ॥

నీమగనివద్ద నేను నిలుచుండితినంటాను
యేమే సాదించవచ్చే వెంతపగతే
ఆముకొని యేపొద్దూ నాతనినీపై మోహము
మే మెఱఁగకుండా సికే మీఁఎకట్టి వున్నదా ॥ ఇట్టి ॥

మనసిచ్చి యాతనితో మాటలాడితినంటా
కనువిచ్చి చూచే వెంతకాఁతాళమే
యెనయ నాతనికాఁగి లిందరుఁ జూడఁగాను
తనివార నీకుఁగానే దాఁచఁబెట్టి వున్నదా ॥ ఇట్టి ॥

యెలమి నేను శ్రీవేంకటేశుఁగూడితినంటా
అలరి సోదించే వెంత ఆసకత్తెవే
అలమే[1]లుమంగపతి యతనిచుట్టరికము
పలుమారు నీకెప్పుడూఁ బాలువెట్టివున్నదా ॥ ఇట్టి ॥ 275

1 శ్రీవేంకటేశపర్యాయములూ ముకుటములే.

వరాళి

ఎవ్వరిఁ బోలదు నేను యిందరిలోన
నివ్వటిల్ల నాభాగ్యము నీచిత్తముగాక ॥ పల్లవి ॥

కందువఁ బెక్కుసతులు గలుగఁగా నీమీఁద
సందడిఁబడె వలపు సారెసారెకు
అందరు నీతో మాఁటలాడఁగా నాడఁగాను
అందందె గుత్తులుగట్టె(ట్టి?) నాడీ ముచ్చటలు ॥ ఎవ్వ ॥

చెలరేఁగి వారు వారిచేతులు చాఁచఁగాను
కలగూరవలె నాయ కాఁగిటిరతి
సొలసి యప్పటిఁ దాము చూడఁగఁ జూడఁగాను
పిలువనిపేరటమై పిరిగొనె వేడుక ॥ ఎవ్వ ॥

సరి నిన్నిందరుఁ గూడి జాణతనాలాడఁగాను
గరివడె నవ్వులెల్లాఁ గడుఁగడును
పరగ నలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
నిరతి నన్నేలఁగాను నిండెను సోబనము ॥ ఎవ్వ ॥ 276

రేకు 847 భూపాళం

ఏమని విన్నవించేనే యిఁకఁ చనతో నేను
నేమాన వచ్చేఁగా నన్నుఁ జిత్తగింపు మనవే ॥ పల్లవి ॥

మక్కువఁ దనపై నామతితలపోఁతలకు
చెక్కుపై నిడుకొన్ననాచెయ్యే సాక్షి
అక్కరతో విరహపుటసురుసురులకును
ముక్కునఁబెట్టిననాము త్తెమే సాక్షి ॥ ఏమ ॥

తన్నుఁబాసి నిద్రలేక తగ వేగించినందుకు
కన్నులనుండినయట్టికాటుకే సాక్షి
వున్నతపుఁగోరికల నుమ్మగిలినందుకు
పన్నీటిచెమటలపయ్యదే సాక్షి ॥ఏమ॥

నిబ్బరపుఁబరపుపై నేఁ బొరలాడినందుకు
గుబ్బలగందపుబేంట్లగురు(తు?)లే సాక్షి
పబ్బి యలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
అబ్బురాన నన్నుఁగూడేయానందమే సాక్షి ॥ఏమ॥ 277

## దేశాక్షి

పరుసవేదివంటిది భామలకు నీకరుణ
మరిగిననాచిత్తమే మరవనీదు గాక ॥పల్లవి॥

చేతులెత్తి నాపై నీవు సేసవెట్టితేఁ జాలదా
రీతితో నాయాస కొసరించీఁ గాక
నాతో నీవొకమాఁటు నవ్వితేనే చాలదా
కాతరపునాగుణము కడిమించీఁగాక ॥పరు॥

మనసిచ్చి నీవించుక మాటాడితేఁజాలదా
యెనసేవేడుక సొలయించీఁగాక
చెనకి నీవు నన్నుఁ జూచితేనే చాలదా
తనియనినావలపు తగిలించీఁగాక ॥పరు॥

వొబ్బిడిగా నాయింట నీవుండితేనే చాలదా
గుబ్బలగర్వము నిన్నుఁ గూడించీఁగాక
అబ్బిన శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
వుబ్బించే విది చాలదా వొరసేఁగాక ॥పరు॥ 278

నట్టనారాయణి

చెక్కిటిచే యిఁకనేల చింతలేల
అక్కరతో నాపె నీయలపారిచీఁగాక ॥ పల్లవి ॥

ఉవ్వనపుసతితోడిసరసము
చివ్వన నీమేనెల్లాఁ జెమరింపించె
పువ్వులవసంతాలు పొలయాటలూ
నవ్వినవ్వి నీమనసు నాము లెక్కించె ॥ చెక్కి ॥

చక్కెరబొమ్మవంటియీసతిపొందులు
చిక్కించి నీకు వలపు చిమ్మిరేఁగించె
నిక్కినిక్కి యాపెఁ జూచె నీవేడుకలు
చెక్కుల చెనకులయి సిగ్గువిడిపించె ॥ చెక్కి ॥

అలమేలుమంగతో నెయ్యపురతులు
నిలువెల్ల సింగారమై నీకునమరె
నెలవై శ్రీవేంకటేశ నీతమకము
అలరినచుట్టరికమై తగిలించె ॥ చెక్కి ॥ 279

సింధురామక్రియ

ఏల తప్పించుకొనేవు ఇట్టె నాకాఁగిటినుండి
యేలితివి నే నీకిటు మొక్కరాదా ॥ పల్లవి ॥

పంతమాడరాదుగాక బత్తితోడ నే నీకు
చెంతనుండి వూడిగాలు సేయఁగరాదా
రంతుతోడఁ గడుదూరరాదుగాక వేడుకతో
సంతతము నీమేను చన్నుల నొత్తరాదా ॥ ఏల ॥

జంకించవలదుగాక సరుసఁ బానుపుమీఁద
కొంకక నీపాదములు గుద్దఁగరాదా
మంకు చూపవద్దుగాక మంతనాన సారెసారె
కింకలేక నీమోవియెంగిలి యానరాదా ॥ఏల॥

అలుగఁదగదుగాక ఆసల నీతోఁ గూడి
పొలసి నిన్ను రతులఁ జొక్కించరాదా
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
బెళకకేపొద్దూఁ బ్రేమఁ బెనఁగఁగరాదా ॥ఏల॥ 280

సామంతం

అప్పఁడు[1] వేంకటరాయఁ డలమేలుమంగఁ గూడి
కుప్పలుగా భోగించీఁ గోడతిరునాళ్లు ॥పల్లవి॥

చీనిచీనాంబరములసింగారపుమేడనుండి
వీనుల సన్నగాళెలు వినుకొంటాను
పూని విహరించి వచ్చి పొందుగా నుయ్యాలలూఁగి
కోనేటిదరి మెరసీఁ గోడతిరణాళ్లు ॥అప్పఁ॥

ఆముకొన్నపన్నీట నద్దినదుప్పటితోడ
దోమటి పూవుదండలు దూలాడఁగా
కోమలపుటెలుఁగులకొమ్మలు లావులువాడ
గోమున నవధరించీఁ గోడతిరుణాళ్లు ॥అప్పఁ॥

అడుగడుగుకు విడేలందుకొంటా సంకీర్తన —
లెడయక భాగవతు లెచ్చిపాడఁగా
గొడుగులుఁ బడగలు కోరి చామరము లిడ
గుడిగొన వినోదించీఁ గోడతిరుణాళ్లు ॥అప్పఁ॥

1. ఇది అధ్యాత్మ కీర్తనల చాయలోనిది.

నానావాద్యాలతో నట్టువలు గడించఁగా
పానిపట్టి మంచిమంచి పాత్ర లాడఁగా
ఆనుక కోలాటములు అంత నింతఁ జూచుకొంటా
కోనేటిరాయఁడు మెచ్చీఁ గోడతిరుణాళ్లు ॥ అప్పఁ ॥

వరుసతో విణ్ణపఁజివారు తాళము లొత్తుచు
పొరిఁబొరి ద్రావిడానఁ బొగడఁగాను
విరులు యేకాంగులు వినువీధిఁ జల్లఁగాను
గురుతరముగ మించీఁ గోడతిరుణాళ్లు ॥ అప్పఁ ॥

పప్పులు నిడ్డెనలును పానకాలు ఫలములు
అప్పటప్పటికిఁ బైపై నారగింపుచు
చెప్పరాని మహిమల శ్రీవేంకటేశ్వరుఁడు
కుప్పళించీ వాసనలఁ గోడతిరుణాళ్లు ॥ అప్పఁ ॥ 281

రేకు 848 పడవంజరం

నీతల నే వేగెనా నెలఁతలసొజ మిది
చేతులెత్తి మొక్కి యేమే సెలవుల నవ్వేవు ॥ పల్లవి ॥

చెమరించె మేనంటా సిగ్గుల నేల లోఁగేవే
తమిరేఁగె మతినంటా తల యేలవంచేవే
తిమిరీ వలపులంటా తెరయేల చొచ్చేవే
రమణునిఁ జూచితేఁ గరఁగరా మానినులు ॥ నీత ॥

కడునుబ్బెఁ జన్నులంటా కప్పనేలే పయ్యదను
అదరీ నిట్టూర్పులంటా నవేల నీవణఁచేనే
పొడమీఁ బులకలంటా పొందులేల దాచేవే
బడి నే మగఁడంటేను భ్రమయరా చెలులు ॥ నీత ॥

భావము దెలిసీనంటా పరాకులేల సేసేవే
దేవు లనేరంటా నెంతతేరి సింగారించేవే
నీ వలమేల్మంగవు నిన్నితఁడే రతిఁగూడె
శ్రీవేంకటేశ్వరుఁ బొంది చెలఁగరా సతులు ॥నీత॥ 282

వరాళి

తలవంచుకొననేల దండనే వున్నాఁ డాతఁడు
చెలఁగి నోరార నీవే సేయవే విన్నపాలు ॥పల్లవి॥

తలపోఁత లెక్కుడైతే తాలిమి గలుగునా
చలము సాదించఁబోతే సరసమౌనా
సొలపులే తరచైతే సొగయునా నేస్తాలు
పిలిచి మాటాడఁగదే ప్రియునితో నీవు ॥తల॥

వట్టిగుట్టున నుండేసు వాడిక లౌనగూడునా
దిట్టతనమే పెంచితేఁ బుట్టునా దయ
నెట్టుకొన్న సిగ్గులైతే నిలుచునా మచ్చికలు
చుట్టరికములెల్లాను చూపవే మగనికి ॥తల॥

పంతములే నెరపితే భావములు గరఁగునా
వంతువాసు లెంచితేను వలపంటునా
వింతగా నలమేల్మంగ విభుఁడు శ్రీవేంకటేశుఁ-
డింతలో నిన్నేలె మెచ్చి ఇచ్చకములాడవే ॥తల॥ 283

సామంతం

ఎట్టు గల్గెనయ్యా యీ యెమ్మెలాఁడి నీకు నేఁడు
చుట్టపువరుసలనే కూడువట్టీ నిన్నును ॥పల్లవి॥

సన్నలనే నినుఁ గొంత సాదించీని
కిన్నెరమీఁటులనే గిలిగించీని
చన్నులమొనలనే జాడచూపీని
యెన్నేసిచేఁతలు సేసీ నీపె నీఎదుటను ॥ ఎట్టు ॥

నవ్వులనే తలఁపులు నాఁటవోసీని
రవ్వలమాటలనే కరఁగఁజేసీని
జవ్వనపుమే నంటించి చవిరేఁచీని
యెవ్వరు నేరిపిరో యీయింతికి నేరుపులు ॥ ఎట్టు ॥

పూని పూని చూపులనే పొందుసేసీని
నానఁబెట్టి నయాలనే నమ్మించీని
యే నలమేల్మంగను నన్నేలితి శ్రీ వేంకటేశ
కానుకిచ్చి తా నెన్నఁడు కలసీనో నిన్నును ॥ ఎట్టు ॥ 284

సాళంగం

ఏలినపతివి నీవు ఇల్లాల నేను
తాలిమితో నుండుఁగాక తమకించేనా ॥ పల్లవి ॥

మంతనాన బుజ్జగించె మంచిమాట లాడేవు
వింతదాననా నేను విచారించితే
యెంతవడి రాకుండినా నెక్కడెక్కడ నుండినా
పంతము తోడుత నిన్ను బాస లడిగేనా ॥ ఏలి ॥

వీడెము చేతికిచ్చి వేఁడుకొనేవు
ఆడుకొనేదాననా నిన్నందరిలోన
యేదోసతుల నంటినా యెన్నిచేఁతలు సేసినా
జాడ దెలియక నిన్ను సాదించేనా ॥ ఏలి ॥

కలసి రతుల నన్ను గారవించేవు
చలమరిదాననా నీ సముకమున
యెలమి శ్రీ వేంకటేశ యే నలమేలు మంగను
కలసితి మిఁక నిన్నుఁ గమ్మటి నవ్వేనా ॥ఏలి॥ 285

బౌళి

చేసినట్లాఁ జేయవే చెల్లునే నీకు
యేసుద్దులునేల కత లిఁకనేమి చెప్పేమే ॥పల్లవి॥

వచ్చెఁగా రమణుఁడు నీవద్దికి నేఁడు
హెచ్చిన నీతలఁపోత లీడేరెఁగా
యిచ్చెఁగా నీకుఁ జనవు లింతటిలోనే నీ—
యిచ్చకములు ఫలియించె నిఁకనేమి చెప్పేమే ॥చేసి॥

వున్నాఁడుగా యితఁడు నీవొద్దఁబాయక
తన్నుఁదానే నీకోరిక తలకూడెఁగా
విన్నపాలెల్ల వినెఁగా వేడుకతోడ
యెన్నికలు సరివచ్చె నిఁకనేమి చెప్పేమే ॥చేసి॥

కలసెఁగా నిన్ను శ్రీ వేంకటవిఁభుడు
అలమేలుమంగవు నిన్నాదరించెఁగా
అలరి మమ్మేలెఁగా నీయప్పణచేత
యిల నీవే జాణవైతి విఁకనేమి చెప్పేమే ॥చేసి॥ 286

తెలుఁగుఁగాంబోది

ఎంతని పొగడేము నె మింతిభావములు నీతో
చెంతఁ దెరలో నున్నది చిత్తగించు మీకెను ॥పల్లవి॥

విన్నవించనేమిటికి వెలఁదిజవ్వనములు
చన్నులే చెప్పీఁగాక సారె సారెకు
పన్ని చక్కఁదనములు పచారించనేమిటికి
కన్నులతీరులోనే కానవచ్చీ నీకును ॥ ఎంత ॥

వ్రాసిచూపనేమిటికి వనితవొద్దుఁబొడవు
సేసనెట్టఁగానే నీవు చేరి మెచ్చేవు
ఆసవుట్టించనేఁటికి ఆపెగుణా లిట్టివని
చేసేపూడిగాలకు సంతోసించేవు నీవు ॥ ఎంత ॥

తెలుపఁగనేమిటికి తెలవమోహము నీకు
తలిరుఁబోడిఁ జూచితే దయవుట్టీని
అలమేలుమంగపతివయినశ్రీ వేంకటేశ్వర
కలసితి వెంచనేల కాఁగిట నీకున్నది ॥ ఎంత ॥ 287

రేకు 849 ఆహిరి

అప్పుడు చూతముగాక అఁటదానిబిగువెల్లా—
నిప్పుదేమి చెప్పేవే ఇందరిలోఁ గతలు ॥ పల్లవి ॥

కూరిమితో రమణునిఁ గొసరి యాదేనంటే
సారె సారె నెన్నిలేవే జాణతనాలు
కోరికోరి నీవాతని గొబ్బుననే వలపించి
నీరువలెఁ గరఁగించనేరవలెఁ గాక ॥ అప్పు ॥

నగినగి మగవాని నాఁటఁజెనకేనంటే
తగఁజేయ నెన్నిలేవే తరితీపులు
మొగము చూపి విభుని మునుకొని తమి రేఁచి
బిగిసి యింటికిని రప్పించవలెఁ గాక ॥ అప్పు ॥

శ్రీ వేంకటేశుఁ గూడి చెలఁగి మెప్పించేనంటే
వేవేగ నెన్నిలేవే వింతరతులు
యీవేళ నన్నేలినాఁడు యే నలమేలుమంగను
చేవల నీవూ నతనిఁ జెందవలెఁ గాక ॥ అప్పు ॥ 288

సామంతం

చిత్తమురానే మెలఁగి సేవఁ సేయుటగాక
బత్తిగలయీాకె నిట్టె పాలించవయ్యా ॥ పల్లవి ॥

మగవానిపురిగినమానవతులకు మరి
పగచాటఁ జోటేది పంతమేడది
నగుతానే సరసము నటియించేవారికి
తెగువలెట్లఁ జెల్లు దీకొనుట యెట్లు ॥ చిత్త ॥

పతివ(వ్ర?)తలై నయట్టిపడఁతులకును భువి —
నతికడుచుట యెట్టు అలిగేదేమి
రతిసేసి వలపుల రమియించేవారికి
మితిమీరఁ బనియేమి మేకుసేయనేల ॥ చిత్త ॥

పెనిమిటివద్దనున్నప్రియురాండ్లకును
కినియఁగ నెట్టువచ్చు కెరలనేది
యెనసితి శ్రీ వేంకటేశ యల(యేనల?) మేల్మంగను
చెనకికొసరుటెంత సిగ్గులువడుటేడ ॥ చిత్త ॥ 289

పాడి

ఏల సిగ్గులువడేవు యెదుటికి రాఁగదవే
సోలిగా నీసింగారాలు చూచుఁగాని యీతఁడు ॥ పల్లవి ॥

కొప్పువెట్టుకొంటివిగా కుప్పెసవరముతోడ
కప్పితివిగా పయ్యద కడు(డుఁ?[1]) బోలుగా
చిప్పిలఁ బూసితివిగా చెంపలునిండా జవ్వాది
యిప్పుడె గక్కనఁ బతి నిఁక వలపించవే ॥ఏల॥

కట్టుకొంటివిగా చీర కళబెళమనఁగాను
వొట్టుకొంటివిగా సొమ్ము లొళ్లనిండాను
గట్టిగా నిడుకొంటిగా కన్నులనుఁ గాటుక
దట్టముగా నీతనికి తమి రేఁచఁగదవే ॥ఏల॥

సేసితిగా విడేలు చెంగావిమోవెల్లాఁ గప్ప
వేసితివిగా మెడను విరిదండలు
వేసర కలమేల్మంగవిభుఁడు శ్రీవేంకటేశుఁ —
డాసతో నన్నేలె నీవూ నంటవే యీతనిని ॥ఏల॥ 290॥

## ముఖారి

నీవేల దాఁచేవు నీకెంత సంపదైనాను
సోవలుగాఁ గన్నులారఁ జూచేము గాక ॥పల్లవి॥

పొద్దునసే వచ్చి యాపె పొందులెల్లఁ జెప్పఁగాను
గద్దించి యేలసేసేవు కనుసన్నలు
[illegible]ద్దనేమా నేము నిన్ను వూరల్లాఁ జుట్టాలైతే
[illegible]ద్దికతో వలపులు వుట్టిఁబట్టవచ్చును ॥నీవే॥

కొలువులోఁ దెచ్చి నీగురుతు లాపె చూపఁగా
కెలన నీగోరనేల గీఁటుకొనేవు
మలసి నిన్ను దూరెదమా మనసు నీ కందుండితే
కలగూరవేడుకలు గంపఁబెట్టవచ్చును ॥నీవే॥

---

1. 'బోలుగా' అనియు నర్థము కావచ్చు. చూ. 282 పాట:— బోలుఁగొప్పు.
1. 'పొద్దనేమా' అనే వ్యవహారరూపముతోనే యతి.

తఱితోడ నాపె నీపాదములకు మొక్కఁగా
చెఱినవ్వేల దాఁచేవు శ్రీవేంకటేశ
యెఱఁగమా నీవావులు యే నలమేలుమంగను
గుఱిగాఁ గూడితి నేర్పు గూఁటఁబెట్టవచ్చును ॥ నీవే ॥ 291

భైరవి

ఎన్నిచందాలదానవే ఇంతిరో నీవు
ఇన్నేసి నేరుచుకొంటి విందరిలో నీవు ॥ పల్లవి ॥

నిక్కించేవు నీవురము నేఁడు నీపతియెదుట
పిక్కటిల్లి చన్నులిట్టె పెరిగినచే
పక్కనఁ జెమట పూవుబంతినే అద్దుకొనేవు
చిక్కనినీసింగారము చిందీనచే ॥ ఎన్ని ॥

పొడవుగ నేడలేనిబోలుఁగొప్పు వెట్టితివి
నిడుపులు సాగినచే నీనెరులు
మడుగుఁజీర మడిచిమడిచి కట్టుకొంటివి
తొడిఁబడఁ బిరుఁదిది దొడ్డాయనటవే ॥ ఎన్ని ॥

వెరగువడి యీతని వేమారుఁ జూచేవు
బెరసి నీకన్ను లింకాఁ బెద్దవౌనచే
పరగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశుఁడు
మరిగి నన్నేలె నీకూ మగఁడయ్యీ నటవే ॥ ఎన్ని ॥ 292

నాగవరాళి

ఊరివారిగుణములు వొడ్డి మాకేల చెప్పేవు
నేరిచిన ట్టూడిగాలు నేఁ జేసేఁగాక ॥ పల్లవి ॥

యెవ్వరికైనాఁ జనవు లిత్తువు నీవు
నవ్వుతాఁ జుట్టరికము నానవేతువు
వువ్విళ్లూరఁ జేయుదువు వొద్దివారిని
నివ్వటిల్లేనీకతలు నేమెఱఁగమా ॥ ఊరి ॥

పొరుగువారిపొందులు పొగడుదువు
తరమెఱఁగి సేతువు తరితీపులు
వొరసి మాఁటలనే నోరూరింతువు
గరిమ నీవోజలు కన్నవేకావా ॥ ఊరి ॥

మెత్తు వేమిటికినైనా మెలుఁతలను
హత్తి కౌఁగిలించుకొందు వంతలోననే
యిత్తల శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
పొత్తుల నన్నేలితివి కొత్తలు గావా ॥ ఊరి ॥ 293

రేకు 850 మనోహరి

సతులకుఁ బతులకు సహజమిది
తతెరిఁగి యెవ్వరికిఁ దప్పించుకోవసమా ॥ పల్లవి ॥

వలపే చక్కఁదనము వర్ణించి చూచితేను
వలపే సింగారమై వన్నెకెక్కును
వలపే చుట్టరికమై వాడికసేయుచునుండు
వలపే చవులుసేయు వడిఁ దరితీపులు ॥ సతు ॥

జవ్వనమే చెలువమై సరసములాడించు
జవ్వనమే భోగమై యాసలురేఁచును
జవ్వనమే పొంతనాలై జంటలుగాఁ బెనఁగించు
జవ్వనమే వేడుకలై సారెఁ దగిలించును ॥ సతు ॥

ఇచ్చకమే మూలధన మెడయనివొందులకు
ఇచ్చకమే రతులకు నెలయింపులు
ఇచ్చల నలమేల్మంగనేలిన శ్రీవేంకటేశ
ఇచ్చకమే మోహనమై ఇంపులు వుట్టించును ॥ సతు ॥ 294

## భైరవి

ఏమీ నెఱఁగనిబాల నింతసేతురా
నామోము చూచి ఇట్టె నవ్వులు నవ్వీని ॥ పల్లవి ॥

కొత్తలుగా వనిత నీకొలువుకు వచ్చితేను
హత్తి చెనకితివట యప్పుడే నీవు
బత్తిసేసి యప్పటి నీపాదాలొత్తవచ్చితేను
చిత్తగించి మోవి గంటిసేసితివట ॥ ఏమీ ॥

మొకము చూచి నీకు మొక్కేనంటా వచ్చితేను
వొకటొకటే నేరిపి వొరసితివి
వెకలియై మచ్చికతో విందుచెప్పవచ్చితేను
వికవిక నవ్వి సిగ్గు వెసరేఁచితివట ॥ ఏమీ ॥

నీకు నలమేలుమంగ నివాళియ్య వచ్చితేను
యీకడ శ్రీ వేంకటేశ యేలుకొంటివి
జోకతోడ వేడుకకు జూజమాడ వచ్చితేను
మేకొని నీచేఁతలెల్లా మెరఇంచితివట ॥ ఏమీ ॥ 295

## కాంబోది

తొల్లి నీవుచేసుకొన్నదొరతోడినేస్తమిది
యిల్లిదె యీతఁడే వచ్చి యీడేర్చీఁగాక ॥ పల్లవి ॥

చిగిరించినవలపు చేగలెక్కకుండునా
తగులైనపొందులు తప్పిపోవునా
నగినచిరునవ్వులు నామువారకుండునా
వెగటువిరహమున వేఁగనేలే యిపుడు ॥ తొల్లి ॥

మేనిమీఁదిజవ్వనము మేరమీరకుండునా
తానకపుకోరికలు దాఁగనిచ్చునా
పూని చూచినచూపులు బుద్దిపుట్టించకుండునా
సూనాస్త్రములకేల జోడించేవే ఇపుడు ॥ తొల్లి ॥

సిగ్గరినీవేడుకలు చిమ్మిరేఁచకుండునా
అగ్గలపుచక్కఁదన మడఁగించునా
వెగ్గళించెలమేల్మంగవిభుఁడు శ్రీవేంకటేశుఁ-
డగ్గమై నిన్నేలె నీయాస లూరకుండునా ॥ తొల్లి ॥ 296

కేదారగౌళ

ఊరకున్నవారినేల వొకటొక టడిగేవు
చేరి నీదూతికలు చెప్పేరుగాక ॥ పల్లవి ॥

పనివడి నీతో మాటపలు కాడుదుముగాక
యెనలేనినీపొందు లెరుఁగుదుమా
చనవున నీసేవలు సారెకుఁ జేసేముగాక
మనసులోనిమర్మాలు మాకుఁ దెలుసునా ॥ ఊర ॥

బంతినుండి నీకు నేము పాదాలొత్తుదుముగాక
వింత నీవలపులెల్లా విచారించేమా
చెంతనుండి నీమీఁద నేసలుచల్లేముగాక
వంతు నీచుట్టరికాలు వా(వ్రా?)సుకొనేమా ॥ ఊర ॥

వొట్టి రాణివాసాలమై వొద్దనే వుండుముగాక
దిట్టనీగుణములెల్ల దిద్దవచ్చేమా
అట్టె శ్రీ వేంకటేశ అలమేల్మంగపతివి
యెట్టయినా నీరతులు యెంచుకోవచ్చేమా ॥ ఊర ॥ 297

సౌరాష్ట్రం

ఎంతతమకమే నీకు నీతఁ డిట్టే కూడీఁగాక
పంతపునీభావమేల పచ్చిచేసుకొనేవే ॥ పల్లవి ॥

మలయుచుఁ బతితోడ మాటలు నాడఁగానే
చెలియరో నీమేనెంత చెమరించీనే
చలివాసి యతఁడు నీసంగడి నుండఁగానే
చెలఁగి నిట్టూర్పులఁ జిమ్మిరేఁగీనే ॥ ఎంత ॥

ననిచి యాతనితోడ నవ్వులు నవ్వుతానే
వనిత నీవింతలోనే వావిచెప్పవే
కొనచూపుల నాతఁడు కొచ్చి నిన్నుఁ జూడఁగానే
ఇనుమడించినమోహ మెంత యాఁపేవే ॥ ఎంత ॥

వొలిసి శ్రీ వేంకటేశునురమున నుండఁగానే
అలమేలుమంగవు నీ వాసవెంచేవే
పలురతుల నాతఁడు బలిమితోఁ గూడఁగానే
కలికితనము లెంత కడుమెరసేవే ॥ ఎంత ॥ 298

సామంతం

కమ్మి నీ వొకటొకటె గడించుకొనేవు గాక
నమ్మితిఁ దొల్లె నిన్ను నవ్వ లేఁటికయ్యా ॥ పల్లవి ॥

తీరనియాసలతోడ దిష్టించి చూచితిఁ గాక
నేరమెంచి కోపగించ నీ వేమిసేసితివయ్య
నేరుపుతోఁ గస్తూరి నీమేనఁ బూసితిఁగాక
కారుకొని సోదించఁ గారణమేమయ్య ॥ కమ్మి ॥

మన్నించఁగాఁ గతలు వేమారు నేఁ జెప్పితిఁగాక
నిన్ను వెంగెములాడఁగ నీవల్లఁ గల్ల యేదయ్య
యెన్న నామగఁడవని యెరకసేసితిఁగాక
పన్ని మోవి గంటిసేయఁ బనియేమయ్య ॥ కమ్మి ॥

గుట్టునఁ గాఁగిటఁగూడి గుబ్బల నొత్తితిఁగాక
నెట్టుకొని సాదించ నీయందు వెలితేదయ్య
ఇట్టె శ్రీవేంకటేశ యే నలమేల్మంగను
చుట్టరిక మిఁకఁ జెప్పిచూప నేఁటికయ్య ॥ కమ్మి ॥ 299

రేకు 851 సాళంగనాట

అంబుజాక్ష నమో ప్రహ్లాద[1] వరద పీ –
తాంబరధర ప్రహ్లాద[2] వరద ॥ పల్లవి ॥

హరివేషావతార ప్రహ్లాదవరద
హరి(ర?)విరించినుత ప్రహ్లాదవరద
అరిదానవాంతక ప్రహ్లాదవరద
పరమపురుష నమో ప్రహ్లాదవరద ॥ అంబు ॥

అమితగుణాకర ప్రహ్లాదవరద
అమరవందిత ప్రహ్లాదవరద
అమృతమయరూప ప్రహ్లాదవరద
ప్రమదాంక నమో ప్రహ్లాదవరద ॥ అంబు ॥

---

1. 1 వచనముల మూడవపాదము తప్పు, అంతట 'ప్రంహ్లాద' అనియే రేకువ్రాత.
2. ఇక్కడ నుండి మూఁడుపాట లాధ్యాత్మికములు.

అహిరాజశయన ప్రహ్లాదవరద
అహోబలేశ ప్రహ్లాదవరద
సహజ శ్రీవేంకటాచలనివాస నిత్య
బహురవితేజ నమో ప్రహ్లాదవరద ॥ అంబు ॥ 300

మాళవి

వినోదకాఁడైనాఁడు విట్ఠలేశుఁడు
అనాదిదేవుఁడనేయాతఁ డీతఁడా ॥ పల్లవి ॥

మాయరోలఁ గట్టువడి మద్దులు విరిచివేసి
ఆయతమైయున్నయట్టియాతఁ డీతఁడా
పేయలఁ గాచినాఁడు పెరుగువంటకములు
ఆయెడ నారగించినయాతఁ డీతఁడా ॥ వినో ॥

తల్లిబిడ్డలైనగొల్లతరుణులనెల్లాఁ గూడి
అల్లుకొనఁజేసె వావు లాతఁ డీతఁడా
తొల్లి గోవర్ధనమెత్తి దొరతనాలెల్లాఁ జేసి
అల్లవాఁడె నిలుచున్నాఁ డాతఁ డీతఁడా ॥ వినో ॥

చందముగ రుకుమిణి సత్యభామాదిసతుల—
నందంద పెండ్లాడినఆతఁ డీతఁడా
ఇందిరయుఁ దానుఁ గూడి ఇదె శ్రీవేంకటాద్రిపై—
నందరికి వరాలిచ్చి నాతఁడీతఁడా ॥ వినో ॥ 301

రామక్రియ

బలవంతుఁ డితనిబంట్లమై బ్రతుకుదుము
కిలకిలనవ్వీ సుగ్రీవనరసింహుఁడు ॥ పల్లవి ॥

దేవదేవుఁ డితఁడు తేజోరాశి యితఁడు
భావించ నలవిగానిబ్రహ్మ మీతఁడు
శ్రీవల్లభుఁ డితఁడు జీవరక్షకుఁ డితఁడు ॥ బల ॥
కేవలమయినసుగ్రీవనరసింహుఁడు

పరమాత్ముఁ డితఁడు భయహరుఁ డితఁడు
నిరుపమగుణముల నిత్యుఁ డితఁడు
వరదుఁ డితఁడు సర్వవంద్యుఁడు నీతఁడు
గిరిగుహాలోనిసుగ్రీవనరసింహుఁడు ॥ బల ॥

కాలరూపుఁ డితఁడు కరుణానిధి ఇతఁడు
మేలిమిజగత్తులకు మేఁటి యీతఁడు
మూలమై శ్రీవేంకటశైలనిలయుఁ డితఁడు
కీలక మిన్నిటికి సుగ్రీవనరసింహుఁడు ॥ బల ॥ 302

## దేశాక్షి

ఇదివో నీరమణుఁడు యెనయవమ్మా
పొదిగి కాఁగిట నిట్టె భోగించవమ్మా ॥ పల్లవి ॥

వనితరో కొత్తగాఁగ వంచినశిర సెత్తవు
నను పాయ నిఁక నీవు నవ్వవమ్మా
మునుపనెల్లా కొంకి మోనాననే వుంటివి
మనసు గంటివి ఇఁక మాటాడవమ్మ ॥ ఇది ॥

గుట్టుతోడ ముసుఁగిడుకొని వుండితివి తొల్లి
చుట్టమవైతివి చక్కఁజూడవమ్మ
చిట్టకపుసేఁతలతో సిగ్గులు నెరపితివి
అట్టె ఇంతట సరస మాడవమ్మా ॥ ఇది ॥

వాసిఁ బెండ్లికూఁతురవై వంతులిట్టె కోరితివి
 ఆసతోడ మోవితేనె లానవమ్మా
 బాసడిగి కూడితివి పాయ కలమేల్మంగవు
 లాసి శ్రీవేంకటేశ్వరు లాలించవమ్మా ॥ ఇది ॥303

## ముఖారి

తానేల విఱ్ఱవీఁగివే తరుణులిందరిలోన
 నేనెఱిఁగినవే తననేరుపు లన్నియును ॥ పల్లవి ॥

పంతమాడవచ్చుఁగాక పదనెరిఁగి విభుని-
 చెంత నుండి యిచ్చకము సేయవచ్చునా
 వంతులకు ఝంకించవచ్చుఁగాక లోలోన
 అంతరంగమెల్లాఁ దానై వుండవచ్చునా ॥ తానే ॥

పెనఁగవచ్చుఁగాక ప్రియము గైకొని నిఁడుఁ-
 ఝనవుతో వలపులు చల్లవచ్చునా
 చెనకఁగవచ్చుఁగాక చెల్లుబడి సేసుకొని
 పనిగొని కూరిములు పచారించవచ్చునా ॥ తానే ॥

నాటఁజూడవచ్చుఁగాక నంటున శ్రీ వేంకటేశు-
 కూటపురతులెల్లాఁ జేకొనవచ్చునా
 నీటు చూపవచ్చుఁగాక నిక్కముగా నావలెనే
 సాటికి బేటికి మోవి చవిగొనవచ్చునా ॥ తానే ॥ 304

## శ్రీరాగం

చెప్పరాదు చూపరాదు చిత్తములో తమకము
 కప్పిన యవ్వనమిది గంపఁ గమ్మవచ్చునా ॥ పల్లవి ॥

నెలవి నవ్వఁగరాదు చేతులు చాఁచఁగరాదు
యెలమిఁ దనపొందులు యెట్టుసేతునే
బలిమిఁ బెనఁగరాదు పై గోరుసోఁకించరాదు
మొలకవలపు లెట్టు మూఁటగట్టవసమే ॥ చెప్ప ॥

దగ్గరఁ గూచుండరాదు తాఁకించరాదు పాదము
వెగ్గళించి నేనెట్టు వీడె మిత్తునే
సిగ్గులువడఁగరాదు చెయ్యెత్తి మొక్కఁగరాదు
వొగ్గి నా నేర్పులు వొడిఁబెట్టుకుందునా ॥ చెప్ప ॥

మో వెంగిలిసేయరాదు మోనాన నుండఁగరాదు
వోవరిలో నెటువలె నూరకుందునే
శ్రీ వేంకటేశుఁడు తానే చేకొని నన్నిటు గూడె
సోవలుగా రతులెల్లాఁ జొప్పులెత్తఁదగవా ॥ చెప్ప ॥ 305

రేకు 852 దేవగాంధారి

గద్దెమీఁద నుందానవు కాఁపురము సేసేవు
పెద్దరికము చూపక పిరితీసేవా ॥ పల్లవి ॥

సేవచేసేదానవు చేరి నవ్వేదానవు
నీవేకా ఆతనికి నేరుపుతోడ
చేవదేరి వుందానవు సిగ్గులెల్లా నారితేరి
మావంటిసవతుల మదిఁ దలఁచేవా ॥ గద్దె ॥

యేకతమాడేదానవు ఇంపుచల్లేదానవు
జోకతోడ నీవేకా చుట్టమవు
చేకొని నీకిన్నిటాను చెల్లుబడి గలిగెను
దీకొని నీతోడివారిదిక్కు చూచేవా ॥ గద్దె ॥

కలసినదానవు కంమువ నున్నదానవు
ఇల నీవేకా యితని ఇంపుదానవు
యెలమి శ్రీ వేంకటేశుఁ డితఁడే మమ్మెల్ల నేలె
నెలవై నీచెల్లెండ్ల మన్నించక మానేవా ॥ గద్దె ॥ 306

## పాడి

చూచినవారికిఁ జూడ[1] సోద్యములై తోఁచు నివి
కాచుక తిరుగఁగాను కాఁతాళ మవుఁజుమ్మీ ॥ పల్లవి ॥

నీ మాటలోనిదాన నీవు నాకుఁ గూరుతువు
యేమిటికి వేఁడుకొనే వింతెరఁగనా
కోమలము నామనసు గుట్టుతో దొరవు నీవు
చేముట్టి పెనఁగఁగాను జీరవారీఁ జుమ్మీ ॥ చూచి ॥

పట్టపుదేవులభావమెల్లా నీసొమ్ము
వొట్టేల పెట్టుకొనేవు వుండఁబట్టదా
మట్టులేదు నాయాస మగఁడవు నీవు నాకు
గట్టిచన్నులంటఁగాను కాఁకరేఁగీఁ జుమ్మీ ॥ చూచి ॥

ఇచ్చకురాలను నీకు ఇట్టె నన్నుఁ గూడితివి
పచ్చిగా నేలనవ్వేవు పంతగాఁడవా
నిచ్చపెండ్లికూఁతురను నీకు శ్రీవేంకటేశుఁడ
మెచ్చిమెచ్చి మోవానఁగా మిక్కుటమౌఁ జుమ్మీ ॥ చూచి ॥ 307

## సామంతం

కనుఁగొనవయ్యా కలికిని
కాలు[1]వు(కొనుపు?)నఁ జిలుకలకొలికివి ॥ పల్లవి ॥

---

1. ఇక్కడ 'గసడదవాదేశము' వింత. 'సోద్య' మనియైనా కావచ్చు.
2. ప్రావరంగము.

వదనకమల మటువంచి
పొదిగొనుచూపులఁ బొంచి
మెదలేటికళలను మించి
అదె నీపయిఁ జెలి యాసలునించీ ॥ కను ॥

మునుకొని చేతుల మొక్కి
నినుపుఁదమకముల నిక్కి
తనియనిమాఁటల దక్కి
పనివడి నీపాదము దొక్కి ॥ కను ॥

పలురాగంబులఁ బాడి
వలవంతల వసివాడి
యెలమిని శ్రీవేంకటేశ పైయాడి
అలమేల్మంగ నిన్నంకెలఁ గూడీ ॥ కను ॥ 308

## మధ్యమావతి

ఎందాఁకా సిగ్గువడే రిద్దరు మీరు
సందడింపువలపులె చవులు గాక ॥ పల్లవి ॥

చలమరితనమేల సరి నాలిమగనికి
వెలలేనికూటమే వేడుకగాక
తలవంచుకొని లోలో తడఁబా ట్లిఁకనేల
సొలపుఁజూపులు నేఁడు సొంపులు గాక ॥ ఎందాఁ ॥

పెట్టనిబిగువులేల ప్రియముగలవారికి
నెట్టుకొన్ననవ్వులే నేర్పులు గాక
రట్టుతో యెడమాఁట వట్టిరాఁపు లవియేల
దట్టపుఁగాఁగిళ్లు శుభదములై యుండుఁగాక ॥ ఎందాఁ ॥

తచ్చనలు చూపనేల తమకించేవారికి
పచ్చిమోవు లొసఁగుటే పంతాలుగాక
యిచ్చగించి శ్రీవేంకటేశ కూడితిరి మీరు
విచ్చలవిడిపొందులే వేడుకలుగాక ॥ఎందాఁ॥ 309

కురంజి

ఇన్నేసి నేరకుండితే నింతులు వలతురా
మన్నించె నన్నింతలోనే మతకము లేఁటికి ॥పల్లవి॥

చూడనేర్చునట లోను చొచ్చి రానేరఁడా తాను
ఆడనుండే అప్పణ లేలడిగంపీని
పాడనేర్చునట తనపదాలు రాకున్నవా
వేడుకయ్యీ నేర్పుమని వేఁడనేలే నన్నును ॥ఇన్నే॥

సేసవెట్టనేర్చునట చెలిమిసేయ నేరఁడా
ఆసవెట్టి నామన సేమరసీఁ దాను
బాససేయనేర్చునట పాయక వుండనేరఁడా
వాసితోఁ బిలిపించుకొనవలెనా తానిపుడు ॥ఇన్నే॥

తమకించనేర్చునట తనివందించనేరఁడా
సముకాన వలపురేఁచఁగ నేఁటికి
కొమరెనై ననన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు
సుముఖుండై ఇంకానేమి సుద్దులడిగీనే ॥ఇన్నే॥ 310

మాళవిగౌళ

ఆపెనేమీ ననరాదు అందములు చేసుకోనీ
యీపాటిచనవు చెలికియ్యవయ్య ఇఁకను ॥పల్లవి॥

చేరి చేరి యింతి నీకు సేవలెల్లాఁ జేయఁగాను
గోరు దాఁకించెనంటాను కొచ్చి చూచేవు
ఆరసి దూరవచ్చునో అవ్వలఁ జెప్పవచ్చునో
వోరుచుక గుట్టుతోడ నుండవయ్య యిఁకను ॥ఆపె॥

అంగన నీవద్ద నుండి ఆకుమడిచియ్యఁగాను
యెంగిలిసేసిచ్చెనంటా నీసడించేవు
ముంగిటఁ జూపవచ్చునో ముంచి కడుగవచ్చునో
చెంగలించి విడెము సేయవయ్య ఇఁకను ॥ఆపె॥

వురముపై నుండి నిన్ను వువిద గాఁగిలించఁగా
సరిఁ బాదా లూఁదెనంటా సారె నవ్వేవు
మరిగి పాయవచ్చునో మచ్చిక శ్రీవేంకటేశ
సొరిది మోవిచవుల చూపవయ్య యిఁకను ॥ఆపె॥ 311

రేకు 853 ముఖారి

నీవే పాడిపంతాలకు నేరుపరివి
కైవసము చేసుకొని కలపే విద్దరిని ॥పల్లవి॥

మొగము చూచి చూచి మోవిలంచా లొడఁబడి
తగవులుదిద్దేవు తరుణులకు
బిగిసి నీ విక్కువ చెప్పించుకొని వొండొరుల-
జగడాలు దీర్చి తీర్చి సంతసముచేసేవు ॥నీవే॥

పొంచి చనుజక్కవలపొందులపూఁటలు గొని
కంచముపొత్తు సేసేవు కాంతలను
మంచముపై నెక్కించుక మరి తారిఁ దమి(మ?)కించి
అంచెల నొక్కటిచేసి ఆదరించేవు ॥నీవే॥

వేడుకనవ్వులు నవ్వి విడే లిప్పించుకొని
జోడుగాఁ గాఁగిటఁ గూడి చొక్కించేవు
వోడక శ్రీ వేంకటేశ పురమున వీఁపునను
చేదెల నిలుపుకొని చెలుములు సేసేవు ॥ నీవే ॥ 312

## బౌళి

ఎప్పటి కప్పుదేకాక ఇఁకనేఁటికే
చొప్పులెత్తి చూచేమంటే సుద్దులెన్ని లేవే ॥ పల్లవి ॥

చన్నుల నొత్తఁగరాదా సారెకు నవ్వఁగరాదా
చిన్నఁబోయి వుండనేలే చెలియ నీకు
సన్నలునేసి యతఁడు సరసములాడీని
నిన్ననెల్లా రాకుండినా నేఁడు వచ్చెఁగదవే ॥ ఎప్ప ॥

కలకలనవ్వరాదా కాఁగిలించుకొనరాదా
తలవంచుకొననేలే తరుణి నీకు
బలిమినేసి యతఁడు పంతమిచ్చి బుజ్జగించీ
పలుకకుండినవాఁడు బత్తిసేసెఁగదవే ॥ ఎప్ప ॥

పువ్వులు ముడువరాదా పొందులుచూపఁగరాదా
నివ్వెరగందఁగనేలే నెలఁత నీకు
ఇవ్వల శ్రీ వేంకటేశుఁ డిప్పు డిట్టె నిన్నుఁ గూడె
యెవ్వరిఁ బెండ్లాడినా నీ కిరవాయఁగదవే ॥ ఎప్ప ॥ 313

## వరాళి

ఎదుట నూరకే వుండి యేమి గట్టుకొంటివి
సదరాన వలపులు చవిచూపరాదా ॥ పల్లవి ॥

పూనిననీచన్నులె పోఁడైననిమ్మపండ్లు
కానుక వట్టఁగరాదా కాంతునికి
తేనెగారేపెదవిపై తీయనినీమాటలు
వీనులలరఁగ నిట్టె విందు సేయఁగరాదా ॥ ఎదు ॥

నెలవులనవ్వులే చేరఁడేసికప్పురాలు
వులుపా వట్టఁగరాదా వొగిఁ బతికి
తలకొన్ననీచేతులు తామరలవంటివి
పొలుపొందఁ బాదాలొత్తి పూజసేయరాదా ॥ ఎదు ॥

ముప్పిరినీకాఁగిలే ముంగిటినిధానము
కప్ప మియ్యరాదా శ్రీవేంకటపతికి
అప్పసము నీచెక్కులే అద్దములవంటివి
తప్పక చూపి కూడితి తమిరేఁచరాదా ॥ ఎదు ॥ 314

కేదారగౌళ

కానవచ్చె మీసుద్దులు కన్నులపండువగాను
తానకమైనపనులు దాఁచనేల ఇఁకను ॥ పల్లవి ॥

చెలి నీకొప్పు దువ్వఁగా చిన్నిగోరు సోఁకఁబోలు
పులకలు మేన నిండెఁ బొదిగొనుచు
చెలరేఁగినమాటలు చెవులు నిండఁగఁబోలు
నెలవుల నవ్వులిట్టె చిమ్మిరేఁగీని ॥ కాన ॥

సతి వీడెమియ్యఁగాను చన్నులు నిన్నొత్తఁబోలు
తతిగొని చెమటలు దైవారీని
మతకానఁ గరములు మర్మము లంటఁగఁబోలు
కతలుగా సిగ్గు నీకుఁ గడుమించీని ॥ కాన ॥

వెలఁది మోవితేనెల విందులు వెట్టఁగఁబోలు
కళలు నీమోమునఁ గానుపించీని
యెలమి శ్రీవేంకటేశ యీకెఁ గలసితి విట్టె
పలుమారు నీరతులు పచ్చిదేరీని ॥కాన॥ 315

## రామక్రియ

ఇంతేసి కొయ్యతనాలు యేఁటికి నీకు
సంతము గావలెఁగాక చలపట్టవచ్చునా ॥పల్లవి॥

చనవరితనమున సతి నీతోఁ బెనఁగఁగ
యెనలేనిపంతమున నేలతిట్టేవు
మనసిచ్చి యాపె నిన్ను మారుకు మారాడితేను
వినవలెఁగాక నీకు వెగ్గళించవచ్చునా ॥ఇంతే॥

నవ్వుచేసుకొని నీపై నాతి చేతులు చాఁచఁగా
పువ్వులచెండుననేల పూఁచివేసేవు
చివ్వన నాకె నిన్ను చేఁతకుఁ జేఁత సేసితే
నివ్వటిల్లవలెఁగాక నేరమెంచవచ్చునా ॥ఇంతే॥

కలపకోలున నిన్ను కాంత గాఁగిలించఁగాను
అలయించి యాపె నెంత యాసరేఁచేవు
అలరి శ్రీవేంకటేశ ఆపె నిన్నుఁ గొసరితే
చెలరేగఁవచ్చుఁగాక సిగ్గువడవచ్చునా ॥ఇంతే॥ 316

## నాదరామక్రియ

ఏమి సేయవచ్చు నిఁక నెరిఁగినపనులకు
నామనసు నమ్మికగా నడవుమీ యిఁకను ॥పల్లవి॥

మగువతో నిందాఁకా మాఁటలాడి మాఁటలాడి
నగేవు యింతటిలోనే నాదిక్కు చూచి
వొగి మొదల నే నీడ వుండుట తెలియవద్దా
పగటు నీగుట్టెల్లా పచ్చిదేరె నిపుడు ॥ ఏమి ॥

చెలి నీవు నేడాలేనిచేఁతలెల్లాఁ జేసుకొని
తలఁకే వింటిలో నన్నుఁ దలఁచుకొని
యెలమి నామెలఁకువ యింతుల నడుగవద్దా
కలిగిననీగుణాలు కానవచ్చె నిపుడు ॥ ఏమి ॥

కాంతఁ గూడి తెరదండఁ గాచుకున్ననన్ను ముట్టి
చెంతఁ గాఁగిలించితివి శ్రీ వేంకటేశ
వింతలుగా నావునికి విచారించుకోవద్దా
సంతమై నీనేర్పులెల్లా సరివచ్చె నిపుడు ॥ ఏమి ॥ 317

రేకు 854 నాగవరాళి

చెలపచెమటలతో చింత యేఁటికే
పిలిచి ప్రియముచెప్పి పెనఁగఁగరాదా ॥ పల్లవి ॥

యేలే తలపోఁతలు యెదుటఁ బతివుండఁగ
వాలుఁజూపులఁ జూచి నవ్వఁగరాదా
జాలిఁబడ నిఁకనేలే చనవితఁ డియ్యఁగాను
మేలమాడి సారెసారె మెప్పించరాదా ॥ చెల ॥

హత్తి వుండి మోనమేలే ఆయములు సోకఁగ
చెత్తగించి మాటలాడి చేకొనరాదా
కొత్తకొత్తసిగ్గులేలే కొంగువట్టి యీతని-
బత్తినేసి రతులను పనిగొనరాదా ॥ చెల ॥

మేటివి తలవంచనేఁటికే యలమేల్మంగ
సూటిగ శ్రీవేంకటేశుఁ జూడఁగరాదా
నీటులేమిటికి మీరు నెట్టనఁ గూడితిరిట్టె
యీటుతో మదనరాజ్య మేలఁగరాదా ॥ చెల ॥ 318

దేశి

ఊరకే దూరేవుగాక వొద్దనున్నవారిని
సారె సారె నీవేల జంకించేవయ్యా ॥ పల్లవి ॥

మరిగించి మరఁగును(నః) మాట లాకె యాడఁగాను
గరిమఁ బంజరాల చిలుకలు నేర్చెను
సొరిదినీకామినులు సుద్దులెల్లాను వినిరి
ఇరవై నీచెలికత్తె లేమిసేయరయ్య ॥ ఊర ॥

మోవితేనె చెలియ నీమోవికి నందియ్యఁగాను
పావురాలు నేరుచుక పచ్చిసేసెను
యీవలావలానున్న ఇంతులెల్లాఁ దెలిసిరి
వావిరి నూడిగములవా రేలచెప్పేరయ్యా ॥ ఊర ॥

అలమేలుమంగ నీపైనటు పాటలువాడఁగా
యెలమిఁ గోవిల నేర్చె నీపాటలు
కలసినమీకూటమి కాంతలెల్లా నెరిఁగిరి
మెలఁగి శ్రీవేంకటేశ మేమేమి సేతుమయ్యా ॥ ఊర ॥ 319

సాళంగనాట

పలువేడుకలతోడ బ్రహ్మా[1]దులు గొలువ
కెలని విందులె ఆరగించీ వీధులను ॥ పల్లవి ॥

1. 'బ్రంహ్మాదులు' అని రేకుప్రాఁత.

పన్నీట మజ్జనమాడి పట్టుదట్టి గట్టుకొని
వున్నతపుతేరెక్కి వుంటవింటను
కన్నెలచన్నులు దాఁక కస్తూరివుంటల వేసి
మిన్నక దేవుఁడు నేఁడు మెరసీ వీథులను ॥ పలు ॥

తట్టుపుణుగు మైఁ బూసి తగుసొమ్ములు నించుక
దట్టపు సింగారాలతో తమ్మిపువ్వుల
ఁట్టిగొని యిరుమేలగా సతులపై నేసచల్లి
ఇట్టె పెండ్లికి దేవుఁ డేఁగీ వీథులను ॥ పలు ॥

అలమేలుమంగ నురమందుఁ గట్టుకొని నిల్చి
యెలమితో శ్రీవేంకటేశ్వరుఁడు
మలసి దేవుళ్లఁ దాను మారుదేరు లెక్కకొని
వలపులతో దేవుఁడు వచ్చీ వీథులను ॥ పలు ॥ 320

మధ్యమావతి

ఎటువంటివేడుకలో యెలమితో మాకివి
తటుకున మీసుద్దులు తలచే రిందరును ॥ పల్లవి ॥

అందలముమీఁదనుండి అతివమోము చూచి
పందేలువేసుకొంటాఁ బఱమారును
సందడిఁ గొలిచివచ్చేసతులతో నవ్వుకొంటా
పొందుగ నీవేఁగిరాఁగాఁ బొగడే రిందరును ॥ ఎటు ॥

మలఁగుపై నొరగుండి మాటలాడి దేవులతో
వలపులు చల్లుకొంటా వాడవాడల
లలి నూడిగపుకాంతలను సన్న సేసుకొంటా
పొలసి నీవేఁగిరాఁగాఁ బొగడే రిందరును ॥ ఎటు ॥

అంకె పరపుపైనుండి అలమేల్మంగఁ బెండ్లాడి
లంకెలై శ్రీ వేంకటేశ లాలించుకొంటా
వుంకువ నాటపాటలవువిదల మెచ్చుకొంటా
పొంకమున నీవేఁగిరాఁగాఁ బొగడే రిందరును ॥ ఎటు ॥ 321

పాడి

ఏఁటికి మీగుజగుజ లెరఁగరాదు
తేటపరచఁగరాదా దిద్దేము తగవు ॥ పల్లవి ॥

సొలపులమాటలాడి చూపుల నిన్నుఁ గొసరి
తలుపుమాటున నుండి తమకించీని
చెలియ నేమిటి కింతసేసితివి యిటువలె
తెలియఁజెప్పఁగరాదా దిద్దేము తగవు ॥ ఏఁటి ॥

వెక్కసాలు నీకుఁ జూపి వేడుకలు నీపైఁ జల్లి
వక్కణలు నిన్నడిగి వద్దనే వుండీ
అక్కరపడ్డకాంతలనే అలయించే విటువలె
దిక్కయి మమ్మడుగరాదా దిద్దేము తగవు ॥ ఏఁటి ॥

తరితీపు నీకుఁజేసి తడవి యలమేల్మంగ
వరుస నిన్నుఁ గూడి నీవద్దనే వుండీ
సరి శ్రీ వేంకటేశుఁడ సతి నెంత వొరసేవు
తెరవేసుకొనరాదా దిద్దేము తగవు ॥ ఏఁటి ॥ 322

శంకరాభరణం

నిజము నెరపరాదా నేఁడు మాతోను
గజరులు దెలిసితే కాఁతాళించేవు ॥ పల్లవి ॥

శిరసుపై తలఁబాలు చెంపలవెంటఁ గారి (రెః)
తరుణిపేరడిగితే దాఁచేవు నాతో
గొరబైనవుంగరాలు కొంకక నీవేళ్ల నివె
యిరవాయఁ బనులెల్లా నేలలోఁగేవు ॥ నిజ ॥

కుంకుమగుబ్బలొత్తులు కుమ్మెలై రొమ్మున మించె
వుంకువేమిచ్చితివంటే నూరకుండేవు
అంకెఁ బగడాలదండ అదె నీమొల నున్నది
లంకెలఁ బట్టఁబోతే నేలపెనఁగేవు ॥ నిజ ॥

మెడఁగట్టుకొంటి వలమేలుమంగ నింతలోనే
వాడి నెవ్వరున్నారంటే వొట్టువెట్టేవు
నడుమ శ్రీవేంకటేశ నన్నేలితి విపు డిట్టె
చిడుముడిఁ గదిమితే సిగ్గువడేవు ॥ నిజ ॥ 323

రేకు 855 పడవంజరం

బడలివుందాన నేను పైపై నడియాసల
జడిగొన్నకరుణతోఁ జనవియ్యరాదా ॥ పల్లవి ॥

యెగసక్కేలసేసే వేల బయలీఁదించేవు
మగుప నింతే నన్ను మన్నించరాదా
నగవు లేమినవ్వేపు నాలిసేయ నేమిటికి
తగనీవిచ్చినబాస దలఁచుకోరాదా ॥ బడ ॥

చిత్తమేమిసోదించేవు చీఁకటేల తవ్వించేవు
బత్తిగలదాన నింతే పాలించరాదా
కొత్తలేల సేసేవు గుట్టువెట్టే వేమిటికి
యిత్తల నీదొరతన మెంచుకోరాదా ॥ బడ ॥

చెక్కులేల నొక్కేవు సిగ్గులేలాయకట్టేవు
లక్కవంటిదాన నింతే లాలించరాదా
ఇక్కువతో శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
చొక్కించినరతు లెంచిచూచుకొనరాదా ॥ బడ ॥ 324

సాళంగం

ఏమని విన్నవించేను ఇదివో నీకు
ఆమనివలపులను ఆరడైతి నేను ॥ పల్లవి ॥

నవ్వులు నీవు నవ్వఁగా నమ్మివుంటిని
పువ్వులను వేయఁగానుఁ బోఁదై(బొందై?)తిని
యివ్వల నీదయ నాపై నెట్టున్నదో
నివ్వటిల్లుఁగోర్కులకు నెలవైతి నేను ॥ ఏమ ॥

పైపైఁ జేయివేయఁగాను భ్రమసితిని
తీపుమోవి చూపఁగా నందితి ముదము
యేపున నిన్నెటువలె నేలేవో నీవు
మాపురేపు నీసుద్దులే మరిగితి నేను ॥ ఏమ ॥

పక్కన నీవు గూడఁగా బతికితిని
చెక్కునొక్కి వేఁడుకోఁగాఁ జెలఁగితిని
యిక్కువ శ్రీ వేంకటేశ యెట్టు మెచ్చేవో
తక్కక నీమన్ననల దాకొంటి నేను ॥ ఏమ ॥ 325

రీతిగౌళ

తెలిపి చెప్పేనంటే తేటతెల్లమి నాగుట్టు
కలసినవాఁడవు కరుణించవయ్యా ॥ పల్లవి ॥

మోముచూచినవాఁడవు మోహించక మానేవా
కోమలపుదాననై కొసరేఁగాక
చేముట్టినవాఁడవు సేవగొనక మానేవా
దామెనకోరికలతోఁ దమకించేఁగాక ॥ తెలి ॥

సేసవెట్టినవాఁడవు చెనకక మానేవా
ఆసపడ్డదాననై యడిగేఁగాక
బాసయిచ్చినవాఁడవు పైకొనక మానేవా
చేసూటివలపులఁ జిమ్మిరేఁగేఁ గాక ॥ తెలి ॥

యీడ నన్నేలినవాఁడ వింటికిరాక మానేవా
జోడైనదాననయి సొలసేఁగాక
కూడితి విట్టె నన్ను గొబ్బున శ్రీవేంకటేశ
జాడెఱఁగక మానేవా చాటిచెప్పేఁగాక ॥ తెలి ॥ 326

హిజ్జిజి

ఏల నన్ను నొరసేవు యిందరిలోన
కేలి నిన్నిటా నూడిగెపుదాన నేను ॥ పల్లవి ॥

పంతమాడఁగలనా పతివి నీతో నేను
కాంతను ఇచ్చకమాడఁగలఁగాక
చెంత నీతో బలిమిసేసి చూపవచ్చునా
మంతనాన నోర్చుకుండే మనవచ్చుఁగాక ॥ ఏల ॥

ఉంకించేదాననా సరసుఁడవైననిన్ను
అంకెల నవ్వులు నవ్వేయందుకుఁ గాక
సంకెలేక నిన్ను మరి సాదించఁదగవా
వుంకు నీవు చెప్పినట్టాడఁబడేఁగాక ॥ ఏల ॥

జీరదీసేదాననా శ్రీ వేంకటేశ నీకు
మేరతోడ నిన్నుఁగూడి మించితిఁ గాక
ఆరజము సేసి నిన్ను అవుఁగాదనఁగలనా
చేరి నీమన్ననలనే చెలఁగుదుఁగాక ॥ఏల॥ 327

మంగళకౌశిక

గయ్యాళితనము నాది కడుశాంతము నీది
ఇయ్యెడ నీమంచితన మేమని పొగడుదు ॥పల్లవి॥

మిక్కిలిదొరవు నీవు మేనదాననంటా నేను
చిక్కఁగా నవ్వితిని సెలవులను
మక్కువతో నందుకును మన్నించితివి నన్ను
యెక్కువ నీగుణములు యేమని పొగడుదు ॥గయ్యా॥

అన్నిటా జాణవు నీవు ఆలనైతినంటా నేను
కన్నుల జంకించితిఁ గాఁతాళానను
వున్నతి నూరకే మెచ్చి వుంగర మొసఁగితివి
యెన్నికైన నీకరుణ కేమనిపొగడుదు ॥గయ్యా॥

గుట్టుతోవాఁడవు నీవు కూడితివంటా నేను
రట్టుసేసితిని మోవి నెట్టన నిన్ను
జట్టిగా శ్రీవేంకటేశ చనవిచ్చితివి నాకు
యిట్టె సేసిననీమేలు కేమని పొగడుదు ॥గయ్యా॥ 328

దేవగాంధారి

నవ్వుగాదు నీచిత్తము నాభాగ్యము
దవ్వుల నిన్నుఁ గొసరఁదగవా నాకు ॥పల్లవి॥

జంకించితి బొమ్మలను సణఁగులు రాలించితి
మంకుఁదనమున నీతో మచ్చరించితి
యింక నీవు నన్ను నేఁడు యెట్టు లాలించేవోకాని
సంకెలేక నిన్ను దూర సంగతే నాకు ॥ నవ్వు ॥

కక్కసించి పిలిచితి గబ్బితనాలు చూపితి
చిక్కించుక కొనగోరఁ జెనకితిని
పక్కన నీవెట్లాను పాలించేవోకాని
వుక్కన బలిమి సేయ నుచితిమా నాకు ॥ నవ్వు ॥

చన్నుల నిన్ను నొత్తితి సమరతిఁ గూడితి
అన్నిటాను రతుల నిన్నలయించితి
యెన్నఁగ శ్రీవేంకటేశ యెట్టు మెప్పించేవోకాని
నిన్ను వరుసలడుగ నేరుపా నాకు ॥ నవ్వు ॥ 329

రేకు 856 భైరవి

నెట్టన నెప్పుడు నాకు నీవే దిక్కు
గుట్టుతోడ నుండఁగానే గురుతాయ వలపు ॥ పల్లవి ॥

నంటున నీవాకెతో నవ్వులెల్ల నవ్వఁగాను
ఇంటికిఁ బిలిచే నిన్ను నిదివో నేను
గొంటరిని పరాకుతోఁగూడేనాతమకము
జంటనేసి పెనచఁగా సకులు నవ్వేరు ॥ నెట్ట ॥

తొడిఁబడ వేరొకతె తొడపై నీకుండఁగ
వాడివట్టి తీసేను వూరకే నిన్ను
అడరి నీయెమ్మెతో నట్టె నాయడియాస
కడఁగి లంకెఁబెట్టఁగా కాంతలు నవ్వేరు ॥ నెట్ట ॥

పొరుగింతితో నీవు పొసఁగ మాఁటలాడఁగా—
నరుదుగాఁ గాఁగిలించే నప్పటి విన్ను
యిరవై శ్రీ వేంకటేశ యిద్దరిభావములు
సరివెట్టి చూడఁగాను సతులు నవ్వేరు ॥ నెట్ట ॥ 330

సామంతం

వీదులనెల్లాఁ దానే గోవిందరాజు
అదిగాని నేసచల్లీ నదె గోవిందరాజు ॥ పల్లవి ॥

చెక్కుటద్దము లిద్దరు చెలులకుఁ జూపుతాను
వెక్కసమై మెరసీ గోవింధరాజు
చిక్కనివెన్నెలతేట సెలవులఁ జిందుతాను
అక్కరతో మాఁటలాడీ నదె గోవిందరాజు ॥ వీదు ॥

కదిసి చనుమొనలఁ గాయమొరసుకుంటాను
వెదచల్లీ వలపు గోవిందరాజు
వదనాంబుజముమోవివాసనలు చూపుతాను
అదిమీఁ దొడలు చేత నదె గోవిందరాజు ॥ వీదు ॥

పరిమళములు చూచి పడఁతులతురుములు
విరుల వేసీని గోవిందరాజు
సురతమర్మములెల్లాఁ జూపి కాఁగిళ్ళనుఁ గూడీ—
నరుదై శ్రీ వేంకటాద్రి నదె గోవిందరాజు ॥ వీదు ॥ 331

ఆహిరి

ఎట్టు మన్నించేవోకాని ఇదివో నీచిత్తము
మెట్టిపట్టుకొని నవ్వ మేనదాననా ॥ పల్లవి ॥

కొలువుసేసి నిన్నుఁ గొసరుదు నింతేకాక
చలపట్టి దూరఁగ నీసరిదాననా
పిలిచి నీ కప్పటిని ప్రియము చెప్పదుఁగాక
బలిమిసేయఁగ నీతోఁ బంతగత్తెనా ॥ ఎట్టు ॥

కై కొమ్మనుచు నీకుఁగా నీకొసఁగుదుఁగాక
దీకొని మాఁటలాడఁగ దిట్టదాననా
మేకొని సేవలుసేసి మెప్పించఁగలఁగాక
కాకుసేయ నేమైనాఁ గడదాననా ॥ ఎట్టు ॥

దేవులనై నీచేతఁ దేజము చేకొందుఁగాక
వావాత నానవెట్ట వంతుదాననా
శ్రీ వేంకటేశ యిట్టె చేరి నన్నుఁ గూడితివి
సేవతో మొక్కుదుఁగాక జీరదీసేదాననా ॥ ఎట్టు ॥ 332

## దేసాళం

చేతికి లోనైతే నీవు సేయకుందువా
నీతెరువువచ్చేవారినేర మింతేకాక ॥ పల్లవి ॥

మగువలు విన్నవించేమాటలు వినకతొల్లె
తగపులు చెప్పేవు తలవిశ్కనె
యెగసక్కెఁడ విన్నిటా నేమిచేప్పేదిటు నిన్ను
తగిలేటివారియెడ్డతన మింతేకాక ॥ చేతి ॥

పడఁతులపూడిగాలు పచ్చిదేరకతొల్లె
వుడుగర లిచ్చేవు వూరకైనాను
గడుసుకాఁడవు నిన్నుఁ గాదనేవారెవ్వరు
బడిఁదిరిగేటివారిభాగ్య మింతేకాక ॥ చేతి ॥

చెలులమోవులతేనె చేరికొనకతొల్లె
కలసేవు కాఁగిళ్ళ కందువలనె
యిల శ్రీ వేంకటేశుఁడ వెదురాదేవారెవ్వరు
వలచినమావంటివారితమి గాక ॥ చేతి ॥ 333

## ముఖారి

చాటిచెప్పితిమి నీకు జడియరాదు
మాటలివి నాయకుఁడ మఱవరాదు ॥ పల్లవి ॥

సరసమెంతాడినాను చన్నుల నెంత వొత్తినా
తరుణి కిచ్చినబాస తప్పఁగరాదు
విరులనెంత వేసిన వెంగెములెన్నాడినాను
తిరమై చల్లినసేస తియ్యఁగారాదు ॥ చాటి ॥

మునిగోర గీరెనంటా ముప్పిరిఁ బెనఁగెనంటా
వనితపొందులు ఇఁక వదలరాదు
కనుఁగొన నవ్వెనంటా కడునెలయించెనంటా
యెనసి కూడుండి మరి యెడయరాదు ॥ చాటి ॥

మంకులు చూపినందుకు మర్మము లంటినందుకు
కంకణము గట్టి అతికడవరాదు
లంకెలై శ్రీ వేంకటేశ్వర లలనఁ గూడితి విట్టె
అంకెలవలపు లిఁక నడఁచరాదు ॥ చాటి ॥ 334

## మాళవిగౌళ

ఎవ్వరికి దొరకును యీభాగ్యము
జవ్వనికి మోవితేనె చవిచూపరాదా ॥ పల్లవి ॥

జక్కవచన్నులమీఁద జారినపయ్యదతోడ
చెక్కులపైఁదొరిగేటిచెమటతోడ
మొక్కిమొక్కి నీకుఁ దనమోహమెల్లా విన్నవించీ
అక్కరగలచెలియ నాదరించరాదా ॥ ఎవ్వ ॥

వాసనపువ్వులతోడివదలుఁదురుముతోడ
ఆసలనిట్టూర్పులయలపులతోడ
పోసరించఁ బాదాలొత్తి పొందులెల్లాఁ దెలిపీని
వాసితోడిసతికిఁ గైవసముగారాదా ॥ ఎవ్వ ॥

జడికొన్న పులకలుజాజుకొన్న మేనితోడి(డ?)
కడలేనిరతి నిండుఁగళలతోడ
అడరి శ్రీవేంకటేశ ఆకె నిన్నుఁ గూడీని
యెడయనికాంతను నీవిట్టె మెప్పించరాదా ॥ ఎవ్వ ॥ 335

తెలుఁగుఁగాంబోది

**ఇదివో** నానోముఫల మేమిచెప్పేది
కదిసి వోరమణుఁడ కలవుగా నాకు ॥ పల్లవి ॥

సొరిది నామీఁదను నీచూపులు నిండెఁగనక
విరహవేదనచేత వేఁగనైతి
అరుదై యప్పటి మాటలాడితివిగనక
మరుబాణములయలమటఁ బొందనైతి ॥ ఇది ॥

నగవువెన్నెల నీది నాపై వారెఁగనక
తగిలి చీఁకటిచింతఁ దలఁకనైతి
నిగిడి నీమనసుకు నేనే గురైతిఁగనక
జిగిఁ గన్నీటివానలఁ జిక్కువడనైతి ॥ ఇది ॥

నెలవై శ్రీ వేంకటేశ నీకాఁగి లబ్బేఁగనక
పలుమారు నలపుల బడలనైతి
చలువ నీమోవితేనెచవి దొరకెఁగనక
పెలుచుఁదమకములఁ బిరితియ్యనైతి ॥ ఇది ॥ 336

ముఖారి

ఎంచిచూచితే నావల్ల నేమున్నది గుణము
పంచల నాపాలన గడపవయ్య ఇఁకను ॥ పల్లవి ॥

పిలిపించుకొందురా ప్రియుఁడవు నిన్ను నేఁ
దలఁచినప్పుడె రాఁ దగవుగాదా
వలపించితివి తొల్లె వద్దఁ బాయకుండాఁజేసి
నిలుకడగాఁ గరుణించవయ్య యిఁకను ॥ ఎంచి ॥

గుట్టుచేసుకొందురా కోరి నే నీకు మొక్కఁగా
నెట్టన నీవే నవ్వుట సేరుపుగాదా
చుట్టమవు నాకు నీవు సుద్దులు నాతోనే చెప్పి
యిట్టె నావ్రత మీడేర్చి యేలవయ్య యిఁకను ॥ ఎంచి ॥

మనసు సోదింతురా మర్మము నాకు నీవు
ఘనుఁడ శ్రీ వేంకటేశ్వర కలయరాదా
మునుపే నీయాలను నాముచ్చటెల్లా నీవు విని
యెనసి నాకిట్టె చనవియ్యవయ్య ఇఁకను ॥ ఎంచి ॥ 337

బౌళి

మొక్కేనిదివో నేను ముమ్మాటికి
నిక్కము నీప్రియములే నెరపుమీ పిభుఁడ ॥ పల్లవి ॥

యెఱుకగలవాఁడవు యెవ్వరు బత్తిసేసినా
మఱవ వందరి నిట్టె మన్నింతువు
జఱసి నిన్ను నెంత చండిపరచితినో
యెఱఁగనైతి నాతప్పు లెంచకుమీ విభుఁడ ॥ మొక్కె ॥

ఇచ్చకమే ఆడుదువు యేసతితోనైనాను
పచ్చిదేర నవ్వుదువు పంతమిత్తువు
కొచ్చి కొచ్చి నే నెంత కుచముల నొత్తితినో
మచ్చరపుచేఁత లిఁక మానుమీ విభుఁడ ॥ మొక్కె ॥

కడు మెచ్చనేరుతువు కదిసినవారిని
విడువక చనవిచ్చి వెలయింతువు
యెడయక నిన్ను రతి నెంత బడలించితినో
కడఁగి యేలుమీ శ్రీ వేంకటగిరివిభుఁడ ॥ మొక్కె ॥ 338

కాంబోది

ఏమిసేతు నావోజ ఇటువంటిది
కోమలపుదానఁగానఁ గొసరేఁగాక ॥ పల్లవి ॥

నిరతి నెఱఁగనా నీవు నన్ను లాలించేది
కెరలి మోహానఁ దమకించేఁగాక
సరినెంచిచూడనా సతమైననీగుణము
తరవాయి వచ్చుదాఁకాఁ దగిలేఁగాక ॥ ఏమి ॥

తలఁచనా తొల్లి నీవు దక్కె నన్ను నేలినది
అలసినవిరహాన నాడేఁగాక
తెలియనా నీనిజము తేటతెల్లమిగా నేను
తిలకించి చూచి వేడ్కఁ దివిరేఁగాక ॥ ఏమి ॥

ననుచనా నిన్నుఁ గూడి నాఁటనుండి కాఁగిట
మనసుచొక్కించినదాఁకా మరిగేఁగాక
యెనసితి విటు నన్ను నిదివో శ్రీ వేంకటేశ
తనిసి మందెమేళానఁ దడవేఁగాక ॥ఏమి॥ 339

నట్టనారాయణి

పాయపుమదమునను భావించి చూడవుగాక
ఆయమెరిఁగినసతి యట్టె నవ్వవలదా ॥పల్లవి॥

పరగ నాపె వద్దఁబవళించి వుండఁగాను
సరసములాడేవు సారె నాతోను
మరిగియున్నదాన మాటాడ సిగ్గువడితే
సరినున్నఁవరాలు సాదించకుండునా ॥పాయ॥

తొలుతే వచ్చినయాపె తొడమీఁదఁ గూచుండఁగా
పలుమారు నామీఁద బత్తిసేసేవు
తలుపుమాఁటుదాన తలవంచుకుండితేను
బలిమిగలదేవులు పంతములు మానునా ॥పాయ॥

గట్టిగా నాపె నిన్నుఁ గాఁగిలించుకుండఁగాను
ఇట్టె చేతులు చాఁచే విటు నాపైని
దిట్టవై శ్రీ వేంకటేశ తెరవేసి నేఁ గూడితే
పట్టపుదేవులు నిన్నుఁ బంగించఁదగదా ॥పాయ॥ 340

శంకరాభరణం

ఇయ్యకొంటి రావయ్య ఇంటికి నీవు
నెయ్యముగలచోటికి నేరము లెక్కడివి ॥పల్లవి॥

సిగ్గువడి నీయెదుట చెక్కుపైఁ జెయ్యిడుకొంటే
దిగ్గన నీ వంతలోనే తీసివేసేవు
యెగ్గులెంచఁ దప్పులెంచ నేలసిబ్బితిపడేవు
నిగ్గుల నింత గలిగితే నేరము లెక్కడివి ॥ ఇయ్య ॥

ముక్కుపై వేలిడుకొని ముందర నిలిచితేను
చక్కనుండుమని వేలు సారెఁ బట్టేవు
కక్కసించితినా నిన్ను కమ్మటి నేలలోఁగేవు
నిక్కపుఁజుట్టములైతే నేరము లెక్కడివి ॥ ఇయ్య ॥

తఱితోఁ జన్నులుమోవఁ దలవంచుకొంటేను
గుఱిగాఁ గాఁగిలించేవు కొప్పువట్టిత్తి
యెఱఁగవా శ్రీవేంకటేశ నన్నేలితివి
నెఱజాణతనములో నేరము లెక్కడివి ॥ ఇయ్య ॥ 341

రేకు 858 భైరవి

కాకున నేఁ బొరలితి కాతరాన బడలితి
నీకు మొక్కే నాకు బుద్ధి నేరుపఁగఁగలవా ॥ పల్లవి ॥

అడ్డమాడఁజాలను అవుఁగాదనఁజాలను
దొడ్డదొరవు నీమాట తోయఁజాలను
వెడ్డువెట్టి తొల్లి నీవే వేసాలు నేర్పితివి
యెడ్డతన మిఁక నాకు నెట్టు మానిపేవు ॥ కాకు ॥

మనసులోదానను మచ్చికైనదానను
ఘనుఁడవు నీతో నేను గయ్యాళించను
చనవిచ్చి అన్నిటాను చవులుమరపితివి
యెనలేక నన్ను నెట్టు యీడేర్చేవో ॥ కాకు ॥

వేవేలకు దూర నేను వేడుక చెల్లింతు నేను
శ్రీవేంకటేశుఁడవు చెలఁగింతును
వావులు దెలిపి నాఁడే వలపులు చల్లితివి
కైవసమై నన్ను నెట్టు గరుణించేవో ॥ కాకు ॥ 342

శుద్ధవసంతం

ఎంత గుట్టుగలవాఁడ విదివో నీవు నీ–
యంతరంగురాల నాతో నానతియ్యరాదా ॥ పల్లవి ॥

వలచితినని నాతో వాకున నాడవు గాని
చెలపచెమట లుబ్బీఁ జెక్కున నీకు
నెలకొన్నతమకము నీలోనే దాఁచేవుగాని
వెలయ నిట్టూర్పు వెల్లవిరిసేసీని ॥ ఎంత ॥

చెనకి నన్నుఁ గలయ సిగ్గులువడేవుగాని
మనసులో గుబ్బతిల్లీ మచ్చికలెల్లా
గొనకొన్నచూపులు గురులుసేయవుగాని
తనువునఁ బులకలు తతిగొనీని ॥ ఎంత ॥

పచ్చిదేరేయాసలు బయలుసేయవుగాని
నిచ్చలపువెరగులే నిలువెల్లాను
ఇచ్చకపుశ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
అచ్చపుమదనకళ లవిగో మోమునను ॥ ఎంత ॥ 343

సాళంగనాట

ఇంతదానవౌత నేఁడే యెఱిఁగితి మే
కాంతుని కిన్నిటా నీవే కలిగితివే ॥ పల్లవి ॥

పచ్చిదేరేమోవిమీఁదిపలుకుఁదేనె లొసగ
యిచ్చకురాలవు నీవు యెఱుఁగుదువే
ముచ్చట సెలవినవ్వు ముత్యాలదండలుగట్టి
నిచ్చలానఁ జిన్ననాఁడే నేరిచితివే ॥ ఇంత ॥

సరస కనుచూపుల చల్లువెన్నెల గాయించి
తరితీపు చూప నీవే దంట వౌదువే
నిరతి గుబ్బచన్నుల నిమ్మపండ్ల సూడిదెలు
సరవితో నియ్య నీవే జాణవవుదువే ॥ ఇంత ॥

జిగిమించుంగరముల శ్రీవేంకటేశు నలమి
మిగులా వలపించఁగ మేఁటివౌదువే
మగఁడు నీవును గూడి మన్నన లిచ్చితి రిట్టె
జగములో మాకేలికసానివిగదవే ॥ ఇంత ॥ 344

## సామంతం

ఎఱఁగనివానివలె నేమిచూచేవు
జఱయక కెమ్మోవి చవిచూపఁదగదా ॥ పల్లవి ॥

యెదురుగా నిలుచుండి ఇంతి ప్రియములుచెప్పి
వదలుఁదురుము కడువంచి మొక్కీని
సదరానఁ గొంగువట్టి జాణతనాలెల్ల నాడి
కదిసి యాకెమనసుఁ గరఁగించఁదగదా ॥ ఎఱఁ ॥

కొలువు లట్టె చేసి కూరిములు పైనించి
చలువగాఁ బువ్వుల నేసలువెట్టీని
తలకొన నవ్వునవ్వి తతిఁ గుచగిరు లంటి
లలిమీర మదనకళలు రేచఁదగదా ॥ ఎఱఁ ॥

అండ నుండి చెక్కు నొక్కి అంకెల సన్నలుచేసి
మెండుకొన్నవూడిగాన మెప్పించీని
దండితో నలమేల్మంగఁ దగిలి శ్రీ వేంకటేశ
నిండుకొనఁ గూడితివి నీవు మెచ్చఁదగదా ॥ ఎఱఁ ॥ 345

దేశి

ఇచ్చక మెఱఁగవద్దా ఇంతవాఁడవు
కచ్చుపెట్టుకున్నదానిఁ గాకుసేతురా ॥ పల్లవి ॥

చెలియను నవ్వించఁగా చిరుచెమటలు గారీ
అలయింతురా నీవు ఆఁటదానిని
సెలవులనవ్వులతో సిగ్గులు వడియఁగాను
బలిమి నాపెచన్నులు పట్టవచ్చునా ॥ ఇచ్చ ॥

అట్టె మాటలాడించఁగా నదరము వసివాడీ
పెట్టుదురా గాసి నింత ప్రియురాలిని
చుట్టరికములెల్లాను చూపులనే తెలుపఁగా
గుట్టులేక కొప్పువీడఁ గొంగువట్టితీతురా ॥ ఇచ్చ ॥

సారెఁ గాఁగిటఁ గూడఁగా జడిసీ మైఁబులకలు
మేరమీరుదురా యలమేలుమంగను
యీరీతి శ్రీ వేంకటేశ యీకె నిన్నుఁ గూడఁగాను
పేరెడిసరసములఁ బెనఁగ సంగతులా ॥ ఇచ్చ ॥ 346

పాడి

ఎదురాడరాదు నాకు ఇల్లాల నేను
అదన నెన్నఁడు జాణవయ్యేవో యిఁకను ॥ పల్లవి ॥

కాఁపురముసేసి యాకె కతలెల్లాఁ జెప్పఁగాను
యేపుమీర వింటివి నీవిందాఁకాను
రేపుమాపు నిట్లానే యేపురేఁగి తిరుగఁగ
చేపట్టి బుద్దు లెవ్వరు చెప్పేరు నీ కిఁకను ॥ ఎదు ॥

చెలరేఁగి జవరాలు చేరి నిన్ను నవ్వించఁగా
యెలమి సుకించితివి ఇందాఁకాను
వెలయఁగ నీవిట్లా వేడుకకాఁడవు గాఁగా
చెలఁగి సంసారముసేయు టెన్నఁ డిఁకను ॥ ఎదు ॥

విచ్చనవిడిఁ గలికి వేవేలుగాఁ గూడఁగాను
ఇచ్చగించి నేర్చితివి ఇందాఁకాను
మచ్చిక శ్రీ వేంకటేశ మరి నన్ను నేలితివి
తచ్చివే సిద్దరి మేలు తలఁచేవు యిఁకను ॥ ఎదు ॥ 347

రేకు 859 ధన్నాసి

తనమర్మ మొకరితోఁ దడవేవారు గలరా
పనిలేనివారికేల పచరించేవయ్యా ॥ పల్లవి ॥

చెల్లుబడిగలచెలి చెప్పినదెల్లా మాట
యెల్లచోటఁ బతికిఁ దోయఁగరాదు
పల్లదాన నిన్ను నాకె పలికినందుకుఁగాను
చెల్లఁబో సతులకేల చెప్పేవయ్యా ॥ తన ॥

నేసవెట్టినమగువ నేసినదెల్లాఁ జేఁత
వాసిఁ బెండ్లికొడుకు వద్దనరాదు
చేసూటి కొనగోరఁ జెనకినంతటిలోనె
యీసరిత లొరులకు నేలచూపేవయ్యా ॥ తన ॥

ననిచికూడినకాంత నవ్వినదెల్లా నవ్వు
వానరి ప్రాణేశ్వరున కొడ్డుకోరాదు
యెనసి శ్రీవేంకటేశ యీకె నిన్నుఁ గేరెనంటా
తనిసినవారికేల తలపించేవయ్యా ॥ తన ॥ 348

సాళంగం

ఎఱఁగరా దేవులౌత యేల దాఁచేవు
మెఱయ నాకెమనసు మెప్పించరాదా ॥ పల్లవి ॥

ముచ్చటాడవలెనంటా ముంగిటికి వచ్చె నాకె—
నెచ్చరించి యేల లోనియింటి కంపేవు
వచ్చివచ్చి తొంగిచూచి వాఁటముగా నవ్వీ నీతో
పచ్చడమేల కప్పేవు పైపై నీవు ॥ ఎఱఁ ॥

వూడిగము సేసేనంటా వొద్దనే కూచుండె నాకె
పాడితోడ నీవేఁటికిఁ బని చెప్పేవు
వీడెము చేతఁబట్టుక వేళలుగాచుకున్నది
వాడికెఁ దెరలో నెంతవడి మూసేవు ॥ ఎఱఁ ॥

కందువఁ గూడేనంటా కైదండ ఇచ్చె నాకె
అందముగా మెచ్చి [1]యంత ఆసవెట్టేవు
గందమిచ్చి శ్రీవేంకటేశ పెండ్లాడె నిన్ను
యిందె నన్నేలితివి యేకాంత మేలాడేవు ॥ ఎఱఁ ॥ 349

ఆహిరి

ఘనుఁడవు నీవొళ్ళఁ గపట మేది
ననిచి నీప్రియములు నమ్మివున్నదానను ॥ పల్లవి ॥

---

1. 'ఎంత'ను 'యంత'గా వాడి యతి గూర్చబడినది. 'అద్వ్యక్రియాను భూతార్థద్యోతిన మాద్యగం వినా సర్వః' అను వియమమును దాటిన వ్యవహారసిద్ధి యిది.

తలపోసి నీనిజాలు తారుకాణించ నేఁటికి
సెలవినవ్వులలోనే చేఁగదేరీని
వొలిసినట్ల నీవు వొట్టువెట్టుకోకు మింక
నలుగడ నీసుద్దులు నమ్మివున్నదానను ॥ ఘను ॥

పనివడి నన్ను నొడఁబరచఁగనేమిటికి
కనుసన్నలనే మేలు గానిపించీని
చెనకి పొందులు చూపి చేతులు చాఁచకు మిఁక
నను నెంత పొదిగేవు నమ్మివున్నదానను ॥ ఘను ॥

పైకొని నీవల పింత పచరించనేఁటికి
యీకడ నీకూటమిలో నేరుపడీని
జోకల శ్రీవేంకటేశ చొక్కించితివి నన్నిఁక
నాకడవాఁడవని నే నమ్మివున్నదానను ॥ ఘను ॥ 350

## శుద్ధవసంతం

ఏలోయి నటకాఁడ యెఱఁగనా నీసుద్దులు
పోలించి యాపెవలపు పూసేవు నామీఁదను ॥ పల్లవి ॥

పువ్వులచెండున వేసెఁ బొరుగున నుండి చెలి
ఇవ్వల నాదిక్కు చూచే వేమీ నీవు
నవ్వేవు నీకితవైతే నాచేతి కిటు చూపు
నివ్వటిల్ల నిజాలకు నే వేసేఁగాని ॥ ఏలో ॥

కుంకుమ నీపైఁ జల్లె కొలువుననున్న కాంత
అంకెల నాచేయి దట్టే వప్పటి నీవు
జంకించే వంతగలితే నింకా నదే నాకు నిమ్మా
కొంకుగొసరెల్లాఁ దేర కోరి చల్లే నిపుడు ॥ ఏలో ॥

మెచ్చి నిమ్మపంటఁ జిమ్మె మేడమీఁదనున్నసతి
కొచ్చి యడిగి కాఁగిటఁ గూడేవు నన్ను
పచ్చిగా శ్రీవేంకటేశ బత్తి నాపైఁ గలిగితే
మచ్చిక నదె ఇచ్చితే మరివేసే నిన్నును ॥ ఏలో ॥ 351

## భైరవి

ఇట్టిదివో నాగుణము యెరిఁగివుందువు గాని
గుట్టుతోడ నుందుఁగాని కొసర నిన్నెపుడు ॥ పల్లవి ॥

యీసడించనోపఁగాని ఇచ్చలాడఁ జాలుదును
సేసినరేపల్లెలోనిసేఁతలకును
ఆసగించవచ్చుఁగాని ఆదరించరాదు నిన్ను
వేసాలగందమువారివెలఁదిపొందులకు ॥ ఇట్టి ॥

నిందలాడఁజాలఁగాని నిన్ను మెప్పించఁగలను
అందపునీమధురలో ఆసుద్దులకు
మందటాడ నేమిటికి మచ్చిక సేయఁదగును
అంది పదారువేలఁ బెండ్లాడినందుకు ॥ ఇట్టి ॥

కాదననేరఁగాని కలయఁగనేర్తును
సోదించి నీకొలనిలోసుద్దులు విని
సాదించి శ్రీవేంకటేశ చనవిచ్చి నన్నేలితి–
వాదరించు టొప్పుఁగాని అలఇంచ కిఁకను ॥ ఇట్టి ॥ 352

## సౌరాష్ట్రం

ఎరపరిక మున్నదా యిద్దరిలోన
తరుణిపంతము నీపెద్దరికము గాదా ॥ పల్లవి ॥

పవ్వళించి నీతొడపై నింతి యున్నదంటా
రవ్వలేల సేసేవు రమణులతో
నివ్వటిల్ల నింతగా మన్నించినవాఁడవు నీవె
జవ్వనివేడుకలకు సమ్మతించఁదగదా ॥ఎర॥

కలికి నీయెదుటను గద్దెమీఁద నెక్కెనంటా
కొలువులో నిటులాడుకొందురా నీవు
చెలఁగి వేడుకచెల్లించినవాఁడ విటు నీవె
చెలిదొరతనము నీసింగారము గాదా ॥ఎర॥

రతుల నీదేవులు పురముమీఁద మించెనంటా
కతగాఁ జెప్పేవు పూడిగపువారికి
యితవై శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
సతివినోదము నీవు సారె మెచ్చవలదా ॥ఎర॥ 353

రేకు 860 రీతిగౌళ

ఎట్టు నేరుచుకొంటిరి ఇద్దరు మీరు
దట్టమైన మీసుద్దు లిందరు మెచ్చేరయ్యా ॥పల్లవి॥

సన్నపుగుబ్బలమీఁద చంద్రవంకలుగా నొత్తి
వెన్నెలపులుఁగాలాదేవేడుకకాఁడా
కిన్నెర వాయించేనంటా కెరలినసిగ్గుతోడ
కన్నె మూసుకొనెను నీకంటే జాణయ్యా ॥ఎట్టు॥

మమతఁ జెక్కులమీఁద మళ్లుగా గోరను గీరి
చెమటనీళ్లుగట్టేసేదెగాఁడ
తమిఁ బాదాలొత్తేనంటా తనబుజాల నిడుక
కొమరె చెంపల నొత్తుకొనె మేలయ్యా ॥ఎట్టు॥

1. ఇది ౹కీగీతగలది చిఱుమదిన్నభాగము.

చొక్కపుమోవిపైఁ గస్తూరి నిగరాలు నించి
పెక్కువలపులమ్మేటిబేరగాఁడ
నెక్కొని శ్రీవేంకటేశ నిన్నుఁ గాఁగిటఁ గూడీకె
మొక్కలాన సీతమ్మలానఁ గప్పెనయ్యా ॥ ఎట్టు ॥ 354

బౌళి

కంటిమిగా నీనేఁతలు కన్నులపండువగాను
దంటతన మిన్నిటాను తగునే నీకిపుడు ॥ పల్లవి ॥

చెప్పినటు సేసితఁడు చేతికి లోనై వుండఁగా-
నిప్పుడు గాక నీపగ టిఁక నెన్నఁడే
కొప్పువట్టితీసేవు కొంగువట్టి పెనఁగేవు
చిప్పిలీ నీగర్వ మేమిచెప్పేదే ఇపుడు ॥ కంటి ॥

నెమ్మది నింటిలోఁ బతి నీసొమ్మయి వుండఁగాను
యెమ్మెలు చూపుదువుగా కిఁక నెన్నఁడే
చిమ్మేవు కొనగోర చేతులు పైఁజాఁచేవు
కమ్మకొనీ నీమదము కడలేదే ఇపుడు ॥ కంటి ॥

ఇచ్చలఁ గూడి శ్రీవేంకటేశుఁడు మన్నించఁగా
హెచ్చి నీపంతములెల్లా నిఁక నెన్నఁడె
మెచ్చుగా నన్ను నేలించి మేలములాడించేవు
రచ్చల నీసంపదలు రాఁగదవే ఇపుడు ॥ కంటి ॥ 355

లలిత

కొత్తపెండ్లి కూఁతురవా కోమలి నీవు
పొత్తుకుఁ బిలువఁగాను పొద్దు గడపుదురా ॥ పల్లవి ॥

1. త్రిగీతగంధి చివుముదిన్నభాగము.

చిత్తములోపలిమాట సిగ్గులువదఁక పతి—
కొత్తి విన్నవించఁగదే వువిద నీవు
హత్తి చేయివట్టుకొని యతఁడు పెనఁగఁగాను
ఇత్తల నీవెంతకెంత గుట్టుసేసేవే ॥కొత్త॥

చేసినసేఁతలకెల్లాఁ జేరి మొగమోడితేను
వ్రాసి చూపఁగదవే వనిత నీవు
సేసవెట్టి నీమగఁడు చెంచి తప్పక చూడఁగా
రాసికెక్కె ఇంకాను శిరసు వంతురటవే ॥కొత్త॥

తగిలి వేడుకైతే తతి శ్రీ వేంకటేశుతో
నగవే యలమేల్మంగ ననిచి నీవు
జిగి నిన్ను నీతఁదే చెలరేఁగి కూడఁగాను
మిగులా సన్నలు సేసి మేలమాడేవటవే ॥కొత్త॥ 356

దేశాక్షి

అప్పుడే యెఱఁగనైతి ననవద్దు
తప్పక రక్షించేటిపెద్దరికముసుమ్మీ ॥పల్లవి॥

పట్టినచలముతోడిపంతగాఁడవు నీవు
రట్టుసేయకుమీ రతిదిట్టను నేను
ఇట్టిదొరఁగాఁ జేసి యేలుకొంటివి
నెట్టనఁ బేరుఁగీరితి నీదేసుమ్మీ ॥అప్ప॥

ఇన్నిటా బలిమిచూపేయెమ్మెకాఁడవు నీవు
చన్నుల జీర దియ్యకు సతిని నేను
పిన్ననాఁడే మరిగించి పెండ్లాడితివి
ఇన్నిటా మన్నించుటే యెక్కుడుసుమ్మీ ॥అప్ప॥

---

1. ఈ కీర్తన గలవి చిఱుమఱిన్నభాగములు.

వెఱపులేనిపొందులవేడుకకాఁడవు నీవు
మఱవకుమీ యలమేల్మంగను నేను
గుఱిగా శ్రీవేంకటేశ కూడితివి
మెఱయ నాపైకరుణ మేలేసుమ్మీ ॥ అప్పు ॥ 357

రామక్రియ

అంగడిమావలపు నీ కనువాయను
వుంగరము వెట్టవయ్య వొక్కమనసాయను ॥ పల్లవి ॥

తమకించి నీవు ముందే తగవులు చెప్పఁగాను
అమర సాకి రెవ్వరి నడిగేము
రమణుల మిద్దరము రతికి లోనైతిమి
జమళిఁ బెండ్లాడవయ్య చలము లీడేరెను ॥ అంగ ॥

పొదిగి నీవే మాకు బుద్దులు నేరుపఁగాను
కదిసి మా కిఁకనేల కాఁతాళాలు
సదరాన నీకు నేము చనవరుల మైతిమి
ఇదె సేసవెట్టవయ్య యెంచినటులాయను ॥ అంగ ॥

శ్రీవేంకటేశ నీవు చేరి మమ్ముఁ గూడఁగాను
చేవదేరె నెవ్వరేమి చెప్పే రింక
భావనిత యాకె నెప్పుడూ నలమేల్మంగను
నీవే కాఁగిలించవయ్య నిండెను వేడుకలు ॥ అంగ ॥ 358

ఛాయానాట

నిన్నటిపంతాలకు నేఁడేఁటికే
మన్ననలు చేకొనుటే మంచిదివో చెలియా ॥ పల్లవి ॥

వాడివట్టి తియ్యఁగాను వోపననేఁటికే
బడిబడిఁ దిరుగఁగాఁ బాయనేఁటికే
అడియాలా లొసఁగఁగా నానవెట్టనేఁటికే
వాడఁబాటు సేసుకొను టుచితమే వనిత ॥ నిన్న ॥

సెలవుల నవ్వఁగాను సిగ్గులింకా నేఁటికే
మలసి పెనఁగఁగాను మంకులేఁటికే
వలపులు చల్లఁగాను వాసు లింతయేఁటికే
కలపుకోలుఁదనమె కందువ వోమగువా ॥ నిన్న ॥

కాఁగిలించుకొనఁగాను కడపఁగనేఁటికే
మాఁగినమో వియ్యఁగాను మఱఁగేఁటికే
చేఁగదేరఁ గూడె నిదె శ్రీవేంకటేశ్వరుఁడు
పీఁగనిరతులఁ గడువెలయవే సకియ ॥ నిన్న ॥ 359

రేకు 861 నాగగాంధారి

ఏఁటికి సిగ్గులువడే వెదుటను నన్నుఁ గని
కూటము లిద్దరికిఁ గైకొలుపుదునా ॥ పల్లవి ॥

సముకాన నుండఁగాను సతిమోము చూచి చూచి
తమకించి లోలోనే తడఁబడేవు
చెమరించెఁ జెక్కులెల్లా చిత్తడాయ పచ్చడము
తిమిరేవు ఇద్దరికిఁ దెరవేతునా ॥ ఏఁటి ॥

ఎంతగా మాటలాడఁగ వీనులను విని విని
దొంతరయాసలచేతఁ దొక్కులాడేవు
చింత నిట్టూర్పులు రేఁగి జిగిమించెఁ బులకలు
బంతినే మీఇద్దరికి బాగా లొసఁగుదునా ॥ ఏఁటి ॥

శ్రీగీతలు గలవి చిలుమదిన్నభాగాలు.

సారెసారె నవ్వఁగాను సవర నీమోవి సోఁకి
మేరమీరి వేడుకతో నోరూరేవు
యీరీతి శ్రీవేంకటేశ ఇంతలో నన్నేలితివి
చేరితి రిద్దరికిని సేస లందిఇత్తునా ॥ఏఁటి॥ 360

పాడి

చూడవయ్య ఇవి ఇంతిసొంపులెల్లాను
తోడనే కూచుండవయ్య తొయ్యలిసంగడిని ॥పల్లవి॥

నీవు విచ్చేసేవనుచు నెలఁతతోఁ జెప్పితేను
చేవదేరి మిగులానుఁ జెంగలించెను
లేవె (?)గని పవ్వళించె నోవరి సింగారించె
ఆవటించి పరిమళా లాయిత్తము సేసెను ॥చూడ॥

తనుఁ బెండ్లాడేవనుచు తరుణి కెరిఁగించితే
ఘనమైనసంతోషాన కళ రేఁగెను
మునుకొని ముంగిటను ముత్యాలముగ్గులు వెట్టి
యెనలేని ఆరతు లాయిత్తముగఁ జేసెను ॥చూడ॥

నెలకొని తెరలోన నీదిక్కు చూపితేను
నలువంక నెలవుల నవ్వు నవ్వెను
యెలమి శ్రీవేంకటేశ ఇదె నీవు గూడితివి
అలరినమోవివిందు లాయిత్తము సేసెను ॥చూడ॥ 361

వరాళి

నమ్మితిఁ దనచిత్తము నాభాగ్యమే
తెమ్మలుగాఁ దనలోనే తెలుసుకొమ్మనవే ॥పల్లవి॥

మనసుమర్మ మెరుఁగు మాటలసంగ తెరుఁగు
యెనసి విన్నపములు ఇఁకనేఁటికే
చెనకులు నామేనివి చేఁతలు తనకు దక్కె-
ననఁ దనసొమ్మయి వున్నదాననే ॥ నమ్మి ॥

చదివించినవాఁడు దానె చనవు దా నిచ్చినదే
యిదె నామతి సోదించే దెందాఁకనే
మొదలఁ బెండ్లాడినాఁడు మోహము సేయించుకొనె
కదిసి కంకణ మిదె కట్టుకొంటినే ॥ నమ్మి ॥

కాయముపైఁ జెయివేసి కళలంటి కూడినాఁడు
యీయెడ నొడఁబరచే దెంతటిపనే
పాయఁడు శ్రీవేంకటాద్రిపతి దా నన్నెప్పుడును
పాయమెల్లాఁ గానుకగాఁ బట్టితి నేఁ గదవే ॥ నమ్మి ॥ 362

## శ్రీరాగం

మగువరో ఇందుకే నీమగఁడు మోహించినాఁడు
పగటున రాఁగదవే బాఁతిపడీని ॥ పల్లవి ॥

కప్పురాలవంటినీకందువపలుకులనే
దప్పిదేరి తమకము దైలువారీని
రెప్పలచూపులలో మీరినమెరుఁగులనే
కుప్పళింపువలపులు గురులయ్యీని ॥ మగు ॥

బంగారునిగ్గులుదేరేబాహుమూలపుకాంతుల-
కంగవించి వొడిగట్టి యాసగించీని
కుంగనినీవురముపైకుచదుర్గములనే
సంగతిఁ దావుసేసుక సంతోసించీని ॥ మగు ॥

తేటలైననీమోవితేనెలవిందులకే
వాటముగ నోరూరి వచ్చియున్నాఁడు
మేటి శ్రీవేంకటేశుఁడు మెచ్చ నీకాఁగిటఁ గూడి
కోటికోటిరతులఁ జొక్కుచు నవ్వీని ॥మగు॥ 363

కాంబోది

మాపుదాఁకా నొడఁబాటుమాటలు గద్దా
యీపని తొల్లే తానెఱుఁగు రమ్మనవే ॥పల్లవి॥

కూరిమిగలుగుచోట కోప మేమిసేయునే
నేరిచినవారికి నేరమేడదే
ఆరితేరినపొందులు ఐతే వేసటెక్కుడిదే
ఆరజముసేయ కింటి కాతని రమ్మనవే ॥మాపు॥

వేడుకలే సతమైతే విసువు లెందుండునే
పాడితో నడచితేను భయమేఁటికే
వాడికైతే వలపులు వద్దంటే మానునా
యేడసుద్దులు చెప్పీని ఇంటికి రమ్మనవే ॥మాపు॥

చేతికిలోనై వుండఁగా చేసన్న లమరునా
కాతరమే కలిగితేఁ గసటు లేదు
యేతుల శ్రీవేంకటేశుఁ డిప్పు డిట్టె నన్ను నేలె
యీతగవు తా నడపె నింటికి రమ్మనవే ॥మాపు॥ 364

వసంతవరాళి

ఏఁటికి నెంచేవు మమ్ము నితవరివలెనే
నాటకపునీగుణము నానఁబోయీనా ॥పల్లవి॥

అగపడి కొలువులో నతివలెల్లా నుండఁగా -
నెగసక్కెమువలె నన్నేమి చూచేవు
మగఁడవైనా మెత్తనిమనసువాఁడవు నీవు
నగుబాటునీవలపు నాటుకొనీనా ॥ ఏఁటి ॥

కతలుచెప్పినసతులు కాచుకుండఁగా నాతోనే
మతకమువలె నేమిమాటలాడేవు
పతివైనాఁగాని యఁ (యం?) టుబచ్చలివంటివాఁడవు
సతమై నీకొకవంక చవిపుట్టీనా ॥ ఏఁటి ॥

కొమరెలు వరుసకు కోరి వేఁడివుండఁగాను
భ్రమసినట్టె నాకెంత బత్తిసేసేవు
రమణుఁడవైనా మీరవు శ్రీ వేంకటేశుఁడ
తమకపునీరతులకు దారదప్పీనా ॥ ఏఁటి ॥ 365

రేకు 862 శుద్ధవసంతం

ఆసుద్దు లన్నియుఁ జెలి నడుగరాదా
నేసవెట్టితివి నీచేతిదాయ వలపు ॥ పల్లవి ॥

పొంకముగా నెవ్వతెతో పొందుసేసి వచ్చితివో
జంకెనచూపుల నీకె సాదించీని
లంకెల నప్పటి మరి లచ్చన లేమిగనెనో
వుంకువ మోవెంటించితే వొద్దుకొనీని ॥ ఆసు ॥

మేరమీరి వింతసొమ్ము మేన నీ కెంత వున్నదో
నారుకొన సెలవుల నవ్వు నవ్వీని
పేరుకొని యేవనిత పిలువఁగ వినెనో
వూరకే మాటాడఁగాఁ జెవులు మూసుకొనీని ॥ ఆసు ॥

పురముగంద మెవ్వరివాడల మెత్తినదో
గరిమఁ గాఁగిలించితే కడులోఁగిని
మరిగి శ్రీ వేంకటేశ మనసెట్టు దెలిసెనో
సరుగ నిన్నుఁ గూడి సన్న సేసీని ॥ అసు ॥ 366

సామంతం

చేపట్టుఁగుంచమపై చేరి ఇట్టె నాతోను
కాఁపురము సేయవోయి గండిగోటకేశవా ॥ పల్లవి ॥

మన్ననలనే చొక్కి మంతనాన నీవొద్ద
కిన్నెర వాయించితిఁ గెల్లురేఁగి
చన్నులపై నీవు లేఁతచందురుల నించితివి
కన్నుల మెచ్చితినోయి గండిగోటకేశవా ॥ చేప ॥

ఒంటవాయలేక మోవిచవి చూపి నిన్ను నిమ్మ-
పంటఁ గొని వేసితిఁ బంతముతోను
నంటుచేసి పువ్వుదండ నాపై వేసితివి
కంటిమోయి నీజాడలు గండిగోటకేశవా ॥ చేప ॥

కడుమంచితనములఁ గాఁగిట నిన్నెలయించి
అడరి పెండ్లాడితి నన్నిటా నిన్ను
యెడయక శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
కడలేదు నీమోహము గండిగోటకేశవా ॥ చేప ॥ 367

లలిత

ఈ గుణాలు మీకె కల విద్దరికిని
చేగదేరఁ బొగదేరు చెలులెల్లా మిమ్మును ॥ పల్లవి ॥

యెగసక్కెలకుఁ బతి యేమేమి సేసినాను
వొగరులాడక పూరకున్నదే సతి
సొగసేయాఁటది యెంత సోఁక సరసమాడినా
వెగటులేకున్న యట్టివిభుఁడేజాణఁడు ॥ ఈగు ॥

అవల రమణుఁ డెంత యగ్గలికఁ దిరిగినా
చవిసేసుకుండేది సకియ
జవరాలు తను నెంతచలము సాదించినాను
అవుఁగాదననివాఁడే అందపురమణుఁడు ॥ ఈగు ॥

కమ్మకొని ప్రియుఁడెంత కాఁగిట నలయించినా
సమ్మతించి వుండేది అచ్చపుదేవులు
నెమ్మి శ్రీ వేంకటేశ నెలఁత రతి మించినా
నెమ్మది మన్నించితిటు నీవే నాయకుఁడవు ॥ ఈగు ॥ 368

సాళంగనాట

మొక్కలీఁడవయ్య నీవు ముద్దు విట్టలా మా-
పక్క వాయ వెప్పుడును పండరంగివిట్టలా ॥ పల్లవి ॥

చెక్కనిచల్ల లమ్మఁగాఁ జేరి విట్టలా మా-
జక్కవచన్నులంటేవు సారె విట్టలా
తొక్కేవు మాపాదాలు దొమ్మివిట్టలా
పక్కన మై చెమరించెఁ బండరంగివిట్టలా ॥ మొక్క ॥

వేళగాచి వచ్చేవు మావెంట విట్టలా కడు-
మేలములాడఁ జేరేవు మేటివిట్టలా
కోలుముందై చెనకేవు గొంటువిట్టలా
పాలుగాంచి(చేః)వేళనే పండరంగివిట్టలా ॥ మొక్క ॥

సొరిగి గచ్చకాయలు చూపి విట్ఠలా
సరిబేసు లాడేవు జాణవిట్ఠలా
గొరబై శ్రీవేంకటాద్రిఁ గూడి విట్ఠలా
పరగ మావద్ద నుంటి పండరంగివిట్ఠలా ॥ మొక్క ॥ 369

మాళవిగౌళ

చక్కఁదనాల మించీ నిచ్చటఁ గృష్ణుఁడు
వెక్కసీఁడు గదవమ్మ వెన్నముద్దకృష్ణుఁడు ॥ పల్లవి ॥

గొల్లెతలఁ గొంగువట్టీఁ గోరి కోరికృష్ణుఁడు
వెల్లవిరిగా నవ్వీ వేడుకతోఁ గృష్ణుఁడు
పల్లదపుమదమునఁ బచ్చిదేరీఁ గృష్ణుఁడు
వెల్లివలపులు చల్లీ వెన్నముద్దకృష్ణుఁడు ॥ చక్కఁ ॥

మంతనములాడుతానే మరిగించీఁ గృష్ణుఁడు
బంతిమోవు లడిగీని బాలకృష్ణుఁడు
దొంతివెట్టి ముద్దులెల్ల దొరకొనీఁ గృష్ణుఁడు
వింతనేర్పులెల్లాఁ జూపీ వెన్నముద్దకృష్ణుఁడు ॥ చక్కఁ ॥

బలిమిఁ గాఁగిట నించీ పాయకిదే కృష్ణుఁడు
తిలకించి చూపు చూచీ దిట్టకృష్ణుఁడు
కలసి మన్నించె నిదే కైవసమై కృష్ణుఁడు
వెలసె శ్రీవేంకటాద్రి వెన్నముద్దకృష్ణుఁడు ॥ చక్కఁ ॥ 370

బౌళి

చేవదేరె వలపులు చేతిలోని పీడెము
తేవోయి భూపతిచెర్వుతిరువెంగళప్పఁడా ॥ పల్లవి ॥

బీరములాడఁగ నీతోఁ బెనఁగులాడేమా
చేరి నీవు నవ్వఁగానే చెనకేఁ గాక
రారాదా ఇంకనైన రంతులేల మాయింటికి
ధీరుఁడ విన్నిటా నీవు తిరువెంగళప్పఁడా ॥ చేవ ॥

గుట్టుతోడ నుండఁగాను కొంగువట్టి తీసేమా
జట్టిగొని పెండ్లాడఁగా జరసేఁ గాక
పొట్టఁబొరుగబ్బె నీకు పొత్తునఁ గూచుండవోయి
దిట్టవౌదు వన్నిటాను తిరువెంగళప్పఁడా ॥ చేవ ॥

చలపట్టితే నీతో సారె బలిమిసేసేమా
అలరి కాఁగిలించఁగా నలమేఁ గాక
సులభమాయఁగదోయి చొక్కపునాతోడిరతి
తెలిసి(సె?) శ్రీ వేంకటాద్రి తిరువెంగళప్పఁడా ॥ చేవ ॥ 371

రేకు 863 ధన్నాసి

నీవేల సిగ్గువదేవు నీకు మోహించె నితఁడు
చేవదేర పొందుసేసి నేసచల్లఁగదవే ॥ పల్లవి ॥

పరగ నీదిక్కు తప్పకచూచీ నితఁడు
గరిమ నీవేళనే కానుకియ్యవే
సరసము లప్పటిని సారె సారె నాడీని
తెరలోనికిఁ బిలిచి తేనెమో వానగవే ॥ నీవే ॥

ననుపునఁ దమి రేఁచి నవ్వులు నవ్వీ నితఁడు
మనసు రంజిల్ల మర్మము లంటవే
పెనఁగుచు నింతలోనే ప్రియములు వచరించీ
చనుఁగవ నప్పళించి జట్టిగొనఁగదవే ॥ నీవే ॥

వూరకే నీవాడివట్టి వుంకువవెట్టీ నితఁడు
　　గారవపుఁగాఁగిటను కళరేఁచవే
　　కోరి విజనగరపుకోనేటి శ్రీ వేంకటేశుఁ—
　　డీరీతి నిన్నుఁ గూడె నిన్నిటాను మెచ్చవే　　॥ నీవే ॥ 372

## నారాయణి

నమ్మిక గావలె నిన్ను ననిచినదాఁకాను
　　కొమ్మ నీపాలఁ గలిగె కొత్తపెండ్లికూఁతురు　　॥ పల్లవి ॥

మచ్చిక నప్పు డాకెతో మాటలేమేమాడితివో
　　యెచ్చటా మఱవకుమీ యెదలోనను
　　నిచ్చ నీవొద్దిచెలులు నీవోజ యెఱుఁగుదురు
　　కొచ్చి యానెలఁత నీకు కొత్తపెండ్లికూఁతురు　　॥ నమ్మి ॥

సరవి నేకతమున చనవు లేమిచ్చితివో
　　తరవాతఁ జెల్లించుమీ తప్పకుండాను
　　పొరుగిరుగువారు నీబూటకాన కోపుదురు
　　గొరబుల నీవనిత కొత్తపెండ్లికూఁతురు　　॥ నమ్మి ॥

ఁట్టిగా నన్నునేలి సరి నాపెఁ గూడితివి
　　ఇట్టె మన్నించుమీ యెన్నికగాను
　　నెట్టన శ్రీ వేంకటేశ నీదేవులెల్లా దిట్టలు
　　గుటున నీకన్నెయైతే కొత్తపెండ్లికూఁతురు　　॥ నమ్మి ॥ 373

## దేసాళం

తనంత నెఱఁగడు తా నీకెమాయ
　　ఇనుమడిగా మీరే యెచ్చరించరే　　॥ పల్లవి ॥

పువ్వులవాట్లు మేనఁ బుప్పొడిచొప్పు లెత్తిచ్చి
యివ్వల నూరకే నిజాలేల చేసీనే
చివ్వనఁ దనమై తానే జగిఁ జూచుకోఁడో యేమో
యివ్వల మీరైనాఁ జెలు లెచ్చరించరే ॥ తనం ॥

పన్నీరువసంతాలు పైచారలు చూపిచ్చీ
చెన్నుమీర సాకిరేల చెప్పించీనే
అన్నిటా దనసింగారా లద్దములోఁ జూడఁడేమో
యిన్నిటా మీరైనాఁ జెలు లెచ్చరించరే ॥ తనం ॥

కూడినచన్నులతాఁకులకుమ్మ(మ్మె?)లే పట్టియిచ్చీ
యీడనే శ్రీ వేంకటేశుఁ డేల దాఁచీనే
యీడుగా నన్నేలె నాయెఱుక దెలియఁడేమో
యీదేరె మీరైనాఁ జెలు లెచ్చరించరే ॥ తనం ॥ 374

## శ్రీరాగం

కడలేనికీరితి గట్టుకొంటివి
చిడుముడి నింకా సంతోసించేము నిన్నును ॥ పల్లవి ॥

బలిమికాఁడ వౌదువు పంతమెల్లా నీకుఁ జెల్లె
చలము లింతులనే సాదించితివి
చెలియభావము నీవు చిత్తగించి మన్నించు
వొలుపుమిగుల నేము వొగడేము నిన్నును ॥ కడ ॥

నేరుపరి వౌదువు నేమాన నడచితివి
యీరీతిఁ గాంతల గెల్చి యీదేరితివి
సారెకు నీవనితకు చనవిచ్చి దయఁజూడు
మేరమీర బత్తిసేసి మెచ్చేము నిన్నును ॥ కడ ॥

తగవరి వౌదువు తప్పు దేరుచుకొంటివి
తగిలి చొక్కించితివి తరుణులను
నగుతా శ్రీ వేంకటేశ నలినాక్షిఁ గూడితివి
జగములో జాణవని చాటేము నిన్నును ॥ కడ ॥ 375

## మధ్యమావతి

చూతము నీనేరుపు సుదతియెదుట నేఁడు
కాతరీఁడ వీగుట్టు కనుకొనవయ్యా ॥ పల్లవి ॥

పడఁతి మాఁటలనే బయలువందిలి వెట్టె
జడియక నీవది విచారించవయ్యా
వెడఁగునవ్వులనే వెన్నెలలు వెదవెట్టె
కడలేక పోదిసేయఁగదవయ్యా ॥ చూత ॥

కుమ్మరింపుఁజూపులనే కుచ్చె నీలాలపేరులు
కమ్మి యిట్టె నీవు మెడఁగట్టుకోవయ్యా
బొమ్మల జంకెనలనే పొదిగి ముసుఁగువెట్టె
పిమ్మటఁ దెలిసి తప్పించుకొనవయ్యా ॥ చూత ॥

జవ్వనమదములు సరుస రాసులువోసె
చివ్వన నింతటనైనా చేపట్టవయ్యా
రవ్వగా శ్రీ వేంకటేశ రమణిఁ గూడితి విటు
ఇవ్వల మమ్మేలితివి ఇట్టె మెచ్చవయ్యా ॥ చూత ॥ 376

## పాడి

ఇంతులాల చూడరే యీతనియెగసక్కేలు
రంతుసేసి వీఁపుగానరాఁగాఁ దాఁగీని ॥ పల్లవి ॥

ఆనలువెట్టఁగనేలే ఆనోరిపెదవుల
కానుకలై లచ్చనలు గానరాఁగాను
మోనాన నుండఁగనేలే మంచినయాగుట్టుతోనే
ధ్యాన మాపెమీఁదట తగులై యుండఁగను ॥ ఇంతు ॥

బొమ్మల జంకించనేలే పూఁచి యానొసలనె
కమ్మి లత్తుకచిహ్నాలు గానరాఁగాను
ఇమ్ములను నిట్టచూపులేలే యాకన్నుల-
కమ్మినమదరాగము గప్పియుండఁగను ॥ ఇంతు ॥

అప్పటిఁ బెనఁగనేలే ఆయురముమీఁదనే
ముప్పిరిఁ న్నులంటినముద్ర లుండఁగను
యిప్పుడె శ్రీ వేంకటేశుఁ డిటు తానె నన్నుఁ గూడె
యెప్పుడూ నాపెఁ దాను యెనసి వుండఁగను ॥ ఇంతు ॥ 377

రేకు 864 నాగవరాళి

నడుమ వలసితేను నవ్వేము నేము
చిడుముడి నిఁక మీరు సేసినట్టె చెల్లును ॥ పల్లవి ॥

మగువ కన్నుల మొక్కె మనసున దీవించు
యెగసక్కెమాడెనా యేమిచూచేవు
తగవరి యాపె నీవు తలఁపుకొద్దివాఁడవు
జిగిమీర మీరిఁకఁ జేసినట్టె చెల్లును ॥ నడు ॥

కొమ్మ నవ్వు గానుకిచ్చె గుట్టుననే అందుకో
పమ్మి నిన్ను దూరెనా భయ మేఁటికి
వుమ్మడిఁ జెప్పెంపె నాపె వొడఁబడితివి నీవు
చిమ్మిరేఁగి మీరిఁకఁ జేసినట్టె చెల్లును ॥ నడు ॥

దేవులై కలలోఁ గూడె దిష్ట మిట్టె సేస చల్లు
  మోవనాడెనా నన్ను ముట్టికూడేవు
  వావులు చెప్పె నాకె వసమయితివి నీవు
  శ్రీ వేంకటేశ మీకుఁ జేసినట్టె చెల్లును ॥ నడు ॥ 378

కురంజి

ఎవ్వరి నేమడిగేవు యెందాఁకాను
  రవ్వలేల సేసేవు రతిఁ గూడరాదా ॥ పల్లవి ॥

చిగిరించె వలపులు చేగదేరె సిగ్గులు
  నగవు సెలవి నిండె నలినాక్షికి
  అగడేల సేసేవు ఆసలేల దాఁచేవు
  తగు మీకిద్దరికిని తలఁచుకోరాదా ॥ ఎవ్వ ॥

పచ్చిదేరె కళలు బలువాయఁ దమకము
  రచ్చకెక్కె విన్నపాలు రమణికిని
  కొచ్చి యెంతపెనఁగేవు కోరికలెట్టుడిపేవు
  హెచ్చుఁగుందు లేదు మీకు నెనయఁగరాదా ॥ ఎవ్వ ॥

తారుకాణాయఁ జూపులు తతిగొనెఁ బాయము
  మేరతో నీపొందు లబ్బె మెలుఁతకును
  యీరీతి శ్రీవేంకటేశ యీగురు లెట్టు మూసేవు
  యీరసములేదు మీకు యిచ్చనుండరాదా ॥ ఎవ్వ ॥ 379

ఆహిరినాట

బాపురే యింత గాకుంటె భ్రమతురా గొల్లెతలు
  యేపున జాణతనాలు యింతేసి నేర్చితివి ॥ పల్లవి ॥

ప్రియురాలనై నీకు పెక్కుసేవలు సేయఁగా
నయగారిమాటలాడి నవ్వించేవు
బయకారివాఁడవని పడఁతులచే వింటి
నియతితో సరివచ్చె నీగుణములెల్లను ॥ బాపు ॥

అచ్చలాన నే నీకు నాలనై వుండఁగాను
యిచ్చకములెల్లాఁ జేసి యెలయించేవు
తచ్చనకాఁడవని తగుల నిన్నాడుదురు
వచ్చెఁ దారుకాణలు వరుస నీసుద్దులు ॥ బాపు ॥

యేకతాన నే నిన్ను యెలమిఁ గూడుండఁగాను
కాకరితనాలఁ దమి కడురేఁచేవు
మేకులవాఁడవని మెత్తురు శ్రీవేంకటేశ
జోకలతో నీడువచ్చె సొరిది నీకతలు ॥ బాపు ॥ 380

కాంబోది

విన్నపించరే పతికి వెలఁదులాల
సన్నయెరిఁగితేఁ దానే సమ్మతించుఁగాక ॥ పల్లవి ॥

దిట్టయైనయట్టివాఁడు తిట్టితేఁ గోపించునా
నట్టనడుమ సెలవి నవ్వుఁగాక
అట్ట(ట్ట?)డైనవాఁడు యాఅడి కట్టై లోఁగునా
జట్టిగొని పైపైని సంతసించుఁగాక ॥ విన్న ॥

కడుజాణఁడైనవాఁడు కదిమితే దూరునా
తడయక పిలిచి యాదరించుఁగాక
చిడుముడి పంతగాఁడు సిగ్గులకు లోనౌనా
విడువనిరతులకు వేగిరించుఁగాక ॥ విన్న ॥

వలచినయట్టివాఁడు వాసులెల్లా నెంచునా
కలసి కాఁగిట నించి కైకొనుఁ గాక
యెలమి శ్రీ వేంకటేశుఁ డీతఁ డిట్టె నన్నుఁ గూడె
తలఁపెల్లా నీడేర్చి దక్కియుండుఁ గాక ॥ విన్న ॥ 381

పాడి

ఊరకుండవయ్య నాకు నొక్కమనసాయ నేఁడు
ధీరత నీగుణము సోదించినదే కాదా ॥ పల్లవి ॥

సుదతి నీకేమైనా చుట్టముగాదా తొల్లి
యెదిరించి మాటాడితే నేమాయను
వుదుటున నన్ను నెంత వొడఁబరచవచ్చేవు
కదిసి నీమనసు నేఁ గన్నదేకాదా ॥ ఊర ॥

పొలఁతి యెప్పుడు నీపొరుగింటిదే కాదా
యెలమి నిక్కిచూచితే నేమాయను
కలగొన నిందుకేల కారణాలు దెలిపేవు
వెలయఁగ నీసుద్ది నే విన్నదే కాదా ॥ ఊర ॥

వనిత నీ కెప్పుడును వావి నీవదినే గాదా
యెనసి నేసవెట్టితే నేమాయను
ననుపై శ్రీ వేంకటేశ నన్ను నమ్మించి కూడితి
చెనకి నీవోజ తెలిసినదే కాదా ॥ ఊర ॥ 382

రామక్రియ

మెచ్చితిమి తొలుతే నీమేకులెల్లాను నీ-
యిచ్చకమే చాలదా యింపులు వుట్టించను ॥ పల్లవి ॥

తీపులు వుట్టించ నీతియ్యనిమోవే చాలదా
మాపురేపుఁ జెలులకు మంతనానను
కోపున నాటలు చూప కొనచూపులే కావా
యేపొద్దు నాసలు చూపి యెలయించను ॥ మెచ్చి ॥

గొరబై వలపించ నీ కొనగోరే చాలదా
సరికిబేసికిని జవరాండ్లకు
సిరులసేసలు చల్ల చిరునవ్వులే కావా
తెరలోనిరతులను తీగెలువారించను ॥ మెచ్చి ॥

కడువేడుకలు రేఁచ కాఁగి లిదే చాలదా
అడరినమావంటిఅతివలకు
బడినె శ్రీవేంకటేశ పలునీసుద్దులే కావా
వుడివోనిరతులను వోలలాడించఁగను ॥ మెచ్చి ॥ 383

రేకు 865 సాళంగనాట

ఔనయ్యా మంచివాఁడ వన్నిటా నీవు
యీనవ్వులవంక నీకు నేమి గూడె నిపుడు ॥ పల్లవి ॥

తచ్చనకాఁడవై నీవు తరుణుల నెగవోసి
అచ్చలాన యెచ్చుగుందు లాడుమనేవు
ఇచ్చకురాండ్లు నీకు నిద్దరు సరేకాదా
కచ్చుపెట్టి యిందు నేమిగట్టుకొనే విపుడు ॥ ఔన ॥

వినోదకాఁడవై నీవు వీరి వారి సన్నసేసి
పెనఁగులాటకుఁ బెట్టి పెచ్చురేఁచేవు
యెనయ నీ కీపెనాపె నితవరులే కారా
పనివడి యిందు నెంతఫల మబ్బె నీకు ॥ ఔన ॥

యెమ్మెకాఁడవై నీవు యిరుమేలా నిడుకొని
వుమ్మడిఁ గాఁగిటఁ గూడి వుబ్బించేవు
కమ్మి యక్కచెల్లెండ్లు గారా శ్రీవేంకటేశ
సమ్మతి నీ కెటువంటిచవివుట్టె నిపుడు ॥ ఔన ॥ 384

సామంతం

ఆనతీవయ్యా నాకు నది విననేడుకయ్యా
సోనగాఁ గురిసీ నీమై సొరిదిఁ బెంజెమట ॥ పల్లవి ॥

పొట్టఁబొరుగున నీవు పొందులుసేసేయందుకు
నెట్టన నే నవ్వినదే నెపమాయను
ఇట్టె గుట్టుననుండితే నేమనఁగలవాఁడవు
వుట్టిపడీ వలపులవుద్యే(ద్యో?)గాలెల్లను ॥ ఆన ॥

సిరులనాపై నీవు సేసలు వెట్టేయందుకు
సరసము నే నాడుటే సందాయను
తెరలో నుండితే నెట్టు దిష్టించఁగలవాఁడవు
సైరిగీని యడియాసప్రియము లన్నియును ॥ ఆన ॥

మలయుచు నీవు నన్ను మన్నించేయందుకు
నొలసి నేఁ గూడినదే చొప్పాయను
తలవంచితే నెవ్వరిఁ దడవఁగలవాఁడవు
మొలచీ శ్రీవేంకటేశ మోహనములెల్లను ॥ ఆన ॥ 385

వేళావళి

వేగి లేచి నేసేదెల్లా వెలఁదులతోడిపొందే
ఆగడపుతలపోఁత లాఁప నెట్టు వచ్చును ॥ పల్లవి ॥

ఆసోదాన జవరాలు ఆపొద్దటనుండియును
వేసరక చేసీని విన్నపములు
వా(వ్రా?)సుకో[1] పొస్తకాన నివ్వల మఱవకుండాను
యేసుద్దులకైనాను యెచ్చరిక వలెను ॥ వేగి ॥

సారె సారె నీదేవులు సముకాననే వుండి
వూరటలేక చేసీని వూడిగములు
గారవించి రేపటికి కణఁజాలనిండాఁ బెట్టు
దారదప్పకుండాఁ గొంత దాఁపిరికము వలెను ॥ వేగి ॥

తొలఁగక పెండ్లికూఁతురు నిన్నుఁ గలయుచు
గిలిగింపుచుఁ బెంచీ కాఁగిట రతులు
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నెలకొన్న నవ్వులకు నేరుపులు వలెను ॥ వేగి ॥ 386

శ్రీరాగం

దయఁ జూచి రక్షించేదే తగవు నీకు
ప్రియములు చెప్పఁగాను పెనఁగఁగనేఁటికి ॥ పల్లవి ॥

ఱంకెన లెంతచూపినా చలమెంత సాదించినా
అంకెల నీచేపట్టినఆఁటదే కదా
వుంకువఁ బెండ్లాడితివి వూడిగము గైకొంటివి
బింక మెంత నెరపినా పిన్నదే కదా ॥ దయఁ ॥

వెక్కసాలెన్నాడినాను వేమారు సొలసినాను
మిక్కిలి నీవు మన్నించేమేనదే కదా
పక్కన నవ్వితి విట్టె బాసలెల్లా నిచ్చితివి
చొక్కి యెంత మీరినా జోడుదే కదా ॥ దయఁ ॥

1. పుస్తకానకు వ్యావహారికరూపము ?

పైపై నెంతగొసరినా పంతా లెట్టు నొడిగినా
యేపొద్దు నిన్నుఁ బాయనిఇంటిదే కదా
రాఁపుగా శ్రీ వేంకటేశ రమణి నేలితి విట్టె
యేపనులు చెప్పినా నీయింపుదే కదా ॥ దయఁ ॥ 387

దేసాళం

ఏఁకరీని మిమ్ముఁ జూచి ఇదెవ్వరోయి
తాఁకించీఁ దనచన్నులఁ దా నెవ్వరోయి ॥ పల్లవి ॥

దేవులు నీవును నిట్టే తెరవేసుకుండఁగాను
యీవల తొంగి చూచీని ఇదెవ్వరోయి
పూవులదండలు మీరు పూఁచి వేసుకోఁగాను
తావి మూరుకొనవచ్చీఁ దా నెవ్వరోయి ॥ ఏఁక ॥

చెప్పరానిమాటలెల్లా చేరి మీరాడుకొనఁగా
యిప్పుడే పొంచులు వినీ నిదెవ్వరోయి
విప్పుచు సురటి మీరు వేమారు విసరుకోఁగా
దప్పిదేరీ నడుమను తా నెవ్వరోయి ॥ ఏఁక ॥

కలసి మీరిద్దరును కాఁగిటనే కూడఁగాను
యెలుఁగెత్తి పాటవాడీ నిదెవ్వరోయి
అలరి శ్రీ వేంకటేశ అట్టె నన్ను నేలితివి
తలఁపించీ రతులెల్లాఁ దా నెవ్వరోయి ॥ ఏఁక ॥ 388

హిందోళం

ఆదవయ్య సరిగా నీ వాపెతో వసంతము
వేడుక నవ్వులలోనివెన్నెల వసంతము ॥ పల్లవి ॥

యెదయక నీమీఁద నింతి కొనచూపుల
వడిఁ జల్లీ వలపులవసంతము
వుడుకుఁజెమటలనే వూర్చి కొనగోరఁ జిమ్మీ
కొడిసాగ బుఱ్ఱటకొమ్ములవసంతము ॥ ఆద ॥

గొరబైనమాటలు కుమ్మరించి కుమ్మరించీ
వరుసఁ జిరుసిగ్గులవసంతము
సొరిది సరసములఁ జూపి మోపి పెనఁగుచు
సరుగఁ జాఁచీ గుబ్బచన్నులవసంతము ॥ ఆద ॥

పొంచి పొంచి కలయుచు బుసకొట్టునేఁతలనే
వంచీ కౌఁగిటిరతుల వసంతము
యెంచి శ్రీవేంకటేశ నన్నేలితివి ఆకె నీపయి
నించీఁ గలయికలనే నెయ్యపువసంతము ॥ ఆద ॥ 389

రేకు 866 మాళవశ్రీ

మగవాఁడు వలచితేను మగువలజాడ లిట్టె
అగడుగానేల అడియాసలఁ బెట్టేవే ॥ పల్లవి ॥

ఇచ్చకముతోడఁ బతి ఇంటికిఁ బిలువఁగాను
పెచ్చురేఁగి నీవేల పెనఁగేవే
కచ్చుపెట్టి రతులకుఁ గాచుకుండితి నిం(విం?)దాఁకా
తెచ్చుకోలై యేల తరితీపుసేసేవే ॥ మగ ॥

ననుపు చూపి యతఁడు నవ్వులు నవ్వఁగాను
గునియుచుఁ దలవంచుకొననేఁటికే
వొనరఁ గానుకలు నీవొసఁగితి విందాకా
పనివూని నీ వెంత బయలీఁదించేవే ॥ మగ ॥

శ్రీవేంకటేశుఁడు చేరి నిన్నుఁ గూడఁగాను
చేవదేర నీవేల సిగ్గువదేవే
యీవల నన్నితఁడే యేలి మన్నించినాఁడు
భావ మెఱఁగిఁకనేల భ్రమయించేవే ॥ మగ ॥ 390

దేశాక్షి

చెప్పినట్టెల్లాఁ జేసి చేకొని మన్నించుఁగాక
వొప్పుగ నీపొందు మాని వూరకుండఁగలఁడా ॥ పల్లవి ॥

కామించి నీపై వలపుగలిగినరమణుఁడు
యేమే నీమాటకు యెదురాడీనా
గోమున నీరాకలే కోరుక వుండె నిందాఁకా
భామరో యీవేళను పరాకుసేసీనా ॥ చెప్పి ॥

పలుమారు నీకును బాసలిచ్చినవిభుఁడు
తలఁచుకొనక యిట్టె తక్కించీనా
యెలమి నీకాఁగిటికి యెదురుచూచె నిందాఁకా
తలకొని యేలుఁగాక తా మరచీనా ॥ చెప్పి ॥

చిత్తగించి నీపాలిటిశ్రీ వేంకటేశుఁడు
కొత్తగా భోగించుఁగాక గుట్టు చూపీనా
బత్తిసేసి బాగాలిచ్చె నిందాఁకా
హత్తి రతిఁ జొక్కించుఁగా కారడిఁబెట్టీనా ॥ చెప్పి ॥ 391

బౌళి

నేసవెట్టి పెండ్లాడినచెలియ నేను
వేసరక నీవెంత వేఁడుకొనేవయ్యా ॥ పల్లవి ॥

పైపైఁ జన్నులమీఁదిపయ్యదేల తీసేవు
రాపుగా నొండొకటితో రాసీనవి
మోపులుగా జవ్వనము మూటగట్టుకున్నదాన
చూపెట్టుక మమ్ము నెంత సోదించేవయ్యా ॥ నేస ॥

చెలరేఁగి చెలరేఁగి చేతులేల పట్టేవు
చలివాసి తీగెలుసాగినవి
మెలుపుఁగాఁగిటి కివే మీఁదెత్తు కున్నదాన
పెలుచుఁజేఁతల నేల పెనఁగాదేవయ్యా ॥ నేస ॥

అఁ(అం?)డనె నాపిరుఁదుల కాసలేల నేసేవు
బండికండ్లవలెనే బలుము లవి
నిండుక శ్రీ వేంకటేశ నీ సొమ్ములు నేసితి
దుండగపురతి నెంత దొమ్మి నేసేవయ్యా ॥ నేస ॥ 392

ముఖారి

కంటి నీమనసు నేను కడమలేనివాఁడవు
అంటి ముట్టి పెనఁగేవు అలపు లేదెపుడు ॥ పల్లవి ॥

యెంతయినా మన్నింతువు ఇటు నీకు వలచిన-
కాంతలను మొగమోటఁ గాదనఁబోవు
పంతములైనా నిత్తువు బత్తినేసినవారికి
చెంతఁ బెండ్లికొడుకవై సిగ్గువడ వెపుడు ॥ కంటి ॥

చెప్పినట్టు నేతువు చెలిమికత్తెలకును
వుప్పతిల్లు నేస్తమున నోపననవు
కుప్పళింతువు ప్రియము కూటమిగలవారికి
చిప్పిలు మేలువాఁడవై సిగ్గువడ విపుడు ॥ కంటి ॥

కందువలఁ గూడుదువు కామించినమావంటి—
ఇందుముఖుల మేలాన నీదే ర్తువు
ఇందరిలో శ్రీ వేంకటేశ నన్ను నేలితివి
చెందినతమకముల సిగ్గువడ వెపుడు ॥ కంటి ॥ 393

## బౌళి

ఏకరాజ్య మయ్యె నీకు నింపులాయ నిదే నాకు
రాకవెన్నెలలు వచ్చె రావయ్య లోనికి ॥ పల్లవి ॥

విచ్చనవిడాయ నీకు వేడుకలెల్లాఁ జెల్లె
పచ్చిదేరి నామోవి ఫలమందెను
కచ్చుపెట్టి నెచ్చెలులు కందువఁ బొందుసేసిరి
రచ్చల నిండె వలపు రావయ్య లోనికి ॥ ఏక ॥

నవ్వులు నిజములాయ నారుకొనెఁ బంతములు
ఇవ్వల నాజవ్వనము యీడుజోడాయ
వువ్విళ్లూరె మనసులు వొద్దికఁ బెండ్లిసేసె
రవ్వసేసెఁ దమకము రావయ్య లోనికి ॥ ఏక ॥

కతలాయ నీమాటలు కాఁపురము సతమాయ
తతిఁ గూడె నాకూటమి తనివిచ్చెను
యితవై శ్రీ వేంకటేశ యింపులు వొత్తుగలనె
రతు లిట్టె వొనగూడె రావయ్య లోనికి ॥ ఏక ॥ 394

## తోండి

తరుణులసహజాలు తలఁచుకో వోయి నీవు
సరసుఁడవు బుద్ధు లిచ్చట నేము చెప్పేమా ॥ పల్లవి ॥

ఆసలఁబెట్టుదురు అట్టై లోనయినదాఁకా
వాసుల మీరుదురు వలచితేను
బేసబెల్లిచేఁతలఁ బెనఁగుదు రేడనైనా
బాసలు గొందురు తముఁ బాయకుండాను ॥తరు॥

కాఁపురాలు సేతురు కాణాచయినదాఁకా
తీపులఁబెట్టుదురు దిక్కుచూచితే
మాపు రేపుఁ బైకొందురు మనసు నమ్మికలకు
రాఁపుగా నవ్వుదురట్టై రతుల కొరకును ॥తరు॥

పచ్చిగాఁ జెనకుదురు పరాకు మానినదాఁకా
తచ్చనలు సేతురు తగిలితేను
ఇచ్చట శ్రీ వేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
ఇచ్చకపుసతులు తా మెదురై కలతురు ॥తరు॥ 395

రేకు 867. సామంతం

మొక్కవే చెలువునికి ముమ్మాటికి
వెక్కసమైతే సిగ్గులు [1]వెల్లులై నిగుడును ॥పల్లవి॥

పంతమాడవలెనా పతితోడ సతికిని
వంతుకుఁ బ్రియము చెప్పవలెఁగాక
దొంతులు పేరుచఁబోతే తుదకెక్కుఁ జలములు
సంతోసించితే వలపు చవులై నిలుచును ॥మొక్క॥

బిగియఁగవలెనా పెనఁగేటివిభునితో
జిగిమించ నూడిగాలు సేయుట గాక
చిగిరింపించఁగఁబోతే చిమ్మిరేఁగును మంకులు
నగితే మచ్చికలతో నాటుకొను మనసు ॥మొక్క॥

1. వెల్లువలు రూపాంతరమా?

గుట్టుచూపవలెనా కోరి శ్రీవేంకటేశుతో
ఇట్టె కలయుటే యెన్నికగాక
రట్టుసేయఁబోతే రతులిట్టె పెచ్చుపెరుగు
చుట్టరికమున నుంటే సులభమౌ భోగము ॥ మొక్క ॥ 396

ఆహిరి

పతిఁ బాసి విరహానఁ బడనేలే
మతిలో నున్నాఁ డతఁడు మక్కువఁ దలఁచవే ॥ పల్లవి ॥

పున్నమవెన్నెలలవే పూచినవనాలవిగో
కన్నెరో నీవేల యింతకాఁకఁ బొందేవే
పన్నీటియేరులు వారీ పచ్చకప్రము రాలీ
వన్నెలతో నింత వసివాడు లేఁటికే ॥ పతిఁ ॥

చలిగాలి విసరీని జడిముంచె మేఘము
అలయుచు దప్పిఁబడనదేలే నీవు
మొలకపైరులు నిండెఁ బొదలె నిసుకదిబ(బ్బ?)లు
వలవంత నిపుదేల వడఁబడేవే ॥ పతిఁ ॥

గందవొడిదుమ్ము రేఁగె కదిసె విరులతావి
అందముగనేల వుస్సురస్సురనేవే
పొందె శ్రీవేంకటేశుఁడు పొంచి ఇంతలోనే వచ్చి
విందు మోవితేనె, నెట్టు వెరగందేవే ॥ పతిఁ ॥ 397

లలిత

ఎదురు మెచ్చ నీసుద్దులేమి చెప్పేది
కదిసి కొసరఁగాను కాకుసేతురా ॥ పల్లవి ॥

యింతి నీవు మచ్చికతో నేకతములాడఁగాఁ బూ-
బంతిఁగొని వేసి యాకె పంతమాడెను
చెంతనుండి నీవందుకు సిగ్గువడవలెఁగాక
బంతి నుండి నీవు నిమ్మ పంట వేతురా ॥ ఎదు ॥

బడినే మీరిద్దరును బాసలు చేసుకొనఁగ
నడుమఁ బన్నీరు చల్లి నవ్వీ నాపె
తడఁబడి నీ వందుకు తల వంచవలెఁ గాక
జడిగొని గందవొడి చల్లఁజొత్తురా ॥ ఎదు ॥

కమ్మి వొందొరులు మీరు కాఁగిలించుకొనఁగాను
దొమ్మి నాపె నిన్నుఁ గూడి తొక్కెఁ బాదము
యెంమ్మె(యెమ్మె?)తో నన్నేలే వందు కిచ్చగించవలెఁగాక
వుమ్మడి శ్రీవేంకటేశ వుర[1] మెక్కుకుందురా ॥ ఎదు ॥ 398

దేసాళం

అవునే భాగ్యమంతురాల వైతివే నీవు
వివరించి నీసుద్దులు వింటిమే నేము ॥ పల్లవి ॥

తలఁపులో మెలఁగేటితగినపతి గలితే
వలపే ధనము గాదా వనితలకు
యెలమిఁ జక్కఁదనాన నిన్నిటాను మించితేను
నిలువు నూరువందుట నిజము గాదా ॥ అవు ॥

సరవి సింగారాలతో జవ్వనము సతమైతే
సురతమే సంపదగా సుదతులకు
ఇరవై ఇన్నిటాఁదన కేకచిత్తమైతేను
వరుస వేయిటిపై జవ్వాదికొమ్మ గాదా ॥ అవు ॥

1. అంతర్వానితథ్యంతమా?

తతితోడఁ గాఁగిటఁ దగిలి పాయకుండితే
రతియే సామ్రాజ్యము రమణులకు
ఇతవై శ్రీవేంకటేశుఁడేలె నిన్ను నిట్టయితే
మితిఁ గోటికిఁ బడగె మించెత్తుట గాదా ॥ అవు ॥ 399

ఆహిరి

వలచినవలపెల్లా వడి నీకే నెలవు
పలెనని యెచ్చరించవలెనా ఇంకాను ॥ పల్లవి ॥

కన్నులయెదుట నీకుఁ గాచుకవున్నదానను
విన్నవించవలెనా వేమారు నీకు
చన్నులు మీఁదెత్తుక యాసలతోడ నున్నదాన
వన్నెలఁ గానుకలియ్యవలెనా ఇంకాను ॥ వల ॥

అంది మోవితేనెలు నీకని దాఁచుకున్నదాన
విందుచెప్పవలెనా వింతగా నీకు
పొంది నీపాదాలపైఁ జూపులు నిలిపినదాన
వందనములు సేయఁగవలెనా యింకాను ॥ వల ॥

కలసి మెలసి నీకాఁగిటిలో నున్నదాన
తలఁపించవలెనా తగవు నీకు
వెలయ శ్రీవేంకటేశ వేడుకైనయట్టిదాన
వలనుగాఁ గడునవ్వవలెనా యింకాను ॥ వల ॥ 400

రామక్రియ

ఏరుపడె నింతలోనే యిదివో నీనిజమెల్లా
పూరకే బుజ్జగింపుచు నొరసేవు గాక ॥ పల్లవి ॥

అవునయ్య నీగుణాలు ఆదేమంటే నెన్నిలేవు
వువిదలు మొగమోట నున్నారుగాక
తవిలి నవ్వుతా వచ్చి తారుకాణించుమనుచు
కవిసి యేకతమునఁ గదిమేవుగాక ॥ ఏరు ॥

మేలయ్య మచ్చములు నీమేనఁ జూప నెన్నిలేవు
కోల గాచి పందెమాడఁ గొంకేరు గాక
వేలఁ జూపి యిట్టె వెల్లవిరిగాఁ జేయుమనుచు
చేలకొంగంటుచు నన్నుఁ జెనకేవు గాక ॥ ఏరు ॥

కానీవయ్య రతులు వింగడించఁగ నెన్నిలేవు
ఆనందించి నివ్వెరగు లందేరుగాక
మోనాన శ్రీ వేంకటేశ మొక్కుచు మెచ్చుమనుచు
గోనాలగొందుల నన్నుఁ గూడేవు గాక ॥ ఏరు ॥ 401

రేకు 868 భైరవి

ననిచి నీమాటలు నమ్మితి నేను
చెనకనేమిటికి నీచిత్తము నాభాగ్యము ॥ పల్లవి ॥

యెంచిచూచితేఁ గోరిక లెంతైనాఁ గలవు
అంచెఁ గడువలచినయట్టివారికి
పెంచి నాతమకము పిక్కటిల్లె, యీమనసు
చించిచెప్పరాదు నీ చిత్తము నాభాగ్యము ॥ నని ॥

సేయించుకొంటె బాసలు చేటలకొల(లఁ?)దులు
చాయలఁ బొందులునేనేసరసులకు
పాయరానిజవ్వనము పట్టరాదు కానికెగా
చేయెత్తి మొక్కేను నీచిత్తము నాభాగ్యము ॥ నని ॥

కుమ్మరించితే రతులు కోటానఁగోట్లు
నెమ్మనము గలసిన నీకు నాకును
ఇమ్ముల శ్రీవేంకటేశ ఇఁక నీపై సిగ్గు గొంత
చిమ్మరాదు సారెకు నీచిత్తము నాభాగ్యము ॥వని॥ 402

పాడి

కంటిని మన్ననలెల్లాఁ గడపరాయ మొల-
గంట లెంతవాయించేవు కడపరాయ ॥పల్లవి॥

కప్పుర మీఁగదవోయి కడపరాయ మోవి-
కప్పు లేల రేఁచేవు కడపరాయ
కప్పవోయి పచ్చడము కడపరాయ నీకుఁ
గప్పము నావలపులు కడపరాయ ॥కంటి॥

గరిసించకు రతిఁ గడపరాయ నీ-
కరుణెల్లా నాసొమ్ము కడపరాయ
కరఁగించకు మనసు కడపరాయ నాకు
గ్గరిడీ నీకాఁగిలి కడపరాయ ॥కంటి॥

కలసి కాఁగిట నిట్టె కడపరాయ నన్నుఁ
గలికిఁ జేసితి వింత కడపరాయ
కలకాలమును మాకుఁ గడపరాయ
కలవు శ్రీవేంకటాద్రి కడపరాయా ॥కంటి॥ 403

మాళవిగౌళ

ఎమ్మెలు మాముందర నీ వెంత చూపేవే
బొమ్మల జంకించి రతిఁ బొదిగేవు నీవు ॥పల్లవి॥

చనవరి వౌదువే సరిఁ బతిబుజముపై—
నొనరఁగఁ జెయివేసుకుందానవు
ననుపు గలదె నీకు నంటున నీతని నిట్టె
కొనగోరఁ జెనకుచుఁ గొసరేవు నీవు ॥ఎమ్మె॥

చుట్టమ వౌదువె కాంతుఁ జొక్కించి మెదసంది నీ—
వొట్టుక గడ్డ మానించుకుందానవు
ఇట్టిగొంటివె యీతనిజంటఁ బాదము పాదాన
మెట్టి బలిమి చూపుచు మేలములాదేవు ॥ఎమ్మె॥

దేవులవౌదువె నీవు తెప్పలఁ దేలఁగఁ గూడి
శ్రీవేంకటేశుపొత్తునఁ జెలరేఁగేవు
తావుకొంటివే నేఁడీతని నన్నుఁ బెండ్లి సేసి
వేవేలువేడుకలతో వినోదాలాదేవు ॥ఎమ్మె॥ 404

గంభీరనాట

ఎమ్మెలునేతులు నేఁడు యీకెతోడనా
యిమ్ముల నీసుద్దులు నే మెఱఁగనివా ॥పల్లవి॥

ముచ్చటైనగుట్టుతోడి ముదితను ఇంతేసి—
పచ్చిదేర నవ్వేవు పంతమా నీకు
అచ్చలాన సిగ్గువడేయాఁటదానితో నింత—
పెచ్చువెరిగేది నీకుఁ బెద్దరికమా ॥ఎమ్మె॥

సాదుఁదనాన నిల్లాలై సంగడినే వుండఁగాను
పీదిలోనఁ జెనకేవు వేడుకా యిది
ఆదరించి ఇచ్చకములాడేదానితో నింత—
తోదోపులాదేది దొరతనమా ॥ఎమ్మె॥

వాడికాననుండేటివువిదపయ్యాద దీసి
కడుఁ జన్ను లంటేవు గర్వమా నీకు
అదరి శ్రీ వేంకటేశ అలమేలుమంగఁ గూడి
జడిగొని మెచ్చేదే జాణతనమా ॥ ఎమ్మె ॥ 405

కుంతలవరాళి

ఎంత లేదు నీసుద్దు లేమిచెప్పేది
వింతవానివలెనే నివ్వెరగందేవు ॥ పల్లవి ॥

బలురాణివాసమై లోపలనే వున్నది గాక
చలము సాదించెనా సతి నీతోను
వెలినుండి నీవే వచ్చి వేఁడుకొనఁగా వద్దనెనా
అలరి యీడనుండే యాఁజడిఁబెట్టేవు ॥ ఎంత ॥

యిల్లాలుగనక తా నిలువను(నః)న్నది గాక
కల్లరివని కొంకెనా కాంత నీతోను
వొల్లనే నీవు వద్దఁ గూచుండఁగా వద్దనెనా
వుల్లము దెలియ నీవు వొరసి చూచేవు ॥ ఎంత ॥

యిచ్చ నీదేవులుగన కెదుట జంకించెఁ గాక
మచ్చరమా అలమేలుమంగ నీతోను
కొచ్చి శ్రీ వేంకటేశుఁడ కూడితివి వద్దనెనా
మెచ్చుచు నీలోనే నీవు మేకులఁ బెట్టేవు ॥ ఎంత ॥ 406

తెలుఁగు కాంబోది

మగవాఁడ విన్నిటాను మరిలేదు వెరపు
సొగిసి యేడఁ జూచినా చుట్టములే నీకు ॥ పల్లవి ॥

పలచనియెలుఁగునఁ బాడీ నెవ్వతో కాని
కెలన నుండి ఆలకించేవు నీవు
పిలిపించుకొనరాదా ప్రియమైతే నీకదకు
మలసి యీడానాడ మఱఁగేల నీకు ॥మగ॥

పొరుగిరుగుల నుండి పొలసీ నెవ్వతొకాని
సొరిది నీమేడలెక్కి చూచేవు నీవు
అరసి మాఁటాడరాదా ఆస నీకుఁ గలితేను
సిరులనవ్వుల వట్టిసిగ్గులేల నీకు ॥మగ॥

ఇదివో సన్నలుసేసీ నింటిలో నెవ్వతొకాని
కదియ నూఁకించేవు కంమ్మ(కమ్మ?)టి నీవు
అదన శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
వదలక కూడితివి వంతులేల నీకు ॥మగ॥ 407

రేకు 869 ఆహిరి

చెలులాల యేమిసేతుఁ జెప్పఁగదరె
తలపోఁతలే చిత్తము తడఁబరచీని ॥పల్లవి॥

మాటాడునాకో పతి మనసిచ్చి వొకపరి
యీటునఁ జేతికి విడె మిచ్చునాకో
గాఁటపునాచన్ను లంటి కందువఁ జెనకునాకో
వాటపునాకోరికలు వలలఁ బెట్టీనే ॥చెలు॥

తప్పకచూచునాకో తతిగొని రమణుఁడు
కప్పురము నోరికిచ్చి కలసునాకో
దప్పిదేర నవ్వు నవ్వి దండకు వచ్చునాకో
చిప్పిలుఁదమకములు చిమ్మిరేఁచీనే ॥చెలు॥

చెలఁగి మోవిచ్చునొకో శ్రీవేంకటేశ్వరుఁడు
అలమేల్మంగనైన నన్నలము నొకో
కలపుకోలుగ నుండి కతలు చెప్పునొకో
నలి నింతలోనె విచ్చేసి నన్నుఁ దానె కూడెనే ॥ చెలు ॥ 408

ముఖారి

కొమ్మ నీచక్కఁదనము కోటిసేసును
ఇమ్ముల నీపతిభాగ్య మెంతని చెప్పేదే ॥ పల్లవి ॥

నెలవి నవ్వివనవ్వు చెక్కిటఁ బెట్టినచెయ్యి
చెలి నీమొగమునకు సింగారమాయ
తిలకించి చూచేచూపు తేనెగారేమోవిమాట
కలికితనాలకెల్లా కందువలై తోఁచెను ॥ కొమ్మ ॥

మొనచన్నులకదలు మొగిఁ గమ్మలతళుకు
వనిత నీవయసుకు వన్నెవచ్చెను
పొనుగులేఁతసిగ్గులు బొమ్మముడిజంకెనలు
తనివోనియాసలకుఁ దగినగురుతులు ॥ కొమ్మ ॥

బలుపిరుఁదులసొంపు పాదపుమట్టెలరొవ
అలమేల్మంగ నీరతి కడియాలము
లలి శ్రీవేంకటేశుఁ గలయునీచేతులగోళ్లఁ—
దలకొన్నతాఁకులు తారుకాణలు ॥ కొమ్మ ॥ 409

సామంతం

మాటలేల రావయ్యా మా యింటికి
యీటువెట్టి కొసరితే నిందరును నగరా ॥ పల్లవి ॥

కూర వండి కసవేరఁగూడునా నిన్ననేల
గోరగీరితే నేరౌను కూచుండవయ్యా
చేరలాను దోసిటాను సేసవెట్టి పెండ్లాడి
ఆరజము సేయఁబోతే నందరును నగరా ॥ మాట ॥

మంచమెక్కి వావులెంచ మరేల జంకించ నిన్ను
కంచుఁ బెంచు సరిగాదు కానీవయ్యా
కొంచనేల యెంచనేల కుసుమాస్త్రుబారిఁ జిక్కి
అంచెలఁ గాఁతాళించితే నందరును నగరా ॥ మాట ॥

నానఁబెట్టితే గొడ్డలి నయమౌనా బలిమేల
తేనెమోవి తీపుగాదా తెలిసే నీ(వ?)య్యా
నే నలమేల్మంగను నీవు శ్రీవేంకటేశుఁడ-
వాన దోసి కూడితివి అందరును నగరా ॥ మాట ॥ 410

## రీతిగౌళ

వేడుకయ్యా మీయిద్దరి వినోదాలుఁ జూడ మాకు
తోడనే మోవిపై గురుతులు నించరాదా ॥ పల్లవి ॥

బలిమి చూతము గాని పతిచెక్కులమీఁదట
ములువాఁడికొనగోరు మోపరాదా
మలసి నీవతనిమర్మ మెరుఁగుదు నందుపు
కిలకిలనవ్వేఅట్టు గిలిగించరాదా ॥ వేడు ॥

యెట్టిదో నీచనవు నే నెరిఁగేఁ గాని యతని
దిట్టవై పచ్చితిట్లు తిట్టఁగరాదా
ముట్టిన మీజాణతనములు గానవచ్చీఁ గాని
గుట్టుతోడ పూబంతిఁ గొని వేయరాదా ॥ వేడు ॥

మెచ్చెను నీపగటు యెమ్మెలకు శ్రీ వేంకటేశు
యెచ్చరికగాఁ బాదాన లచ్చించరాదా
యిచ్చ నలమేల్మంగనయిననన్నుఁ గూడె నాతఁ-
డిచ్చకుఁడై నిన్ను నేలె నెమ్మె చూపరాదా ॥ వేడు ॥ 411

### కాంబోది

ఏమయ్య నీవు దొల్లి యెఱఁగనితగవా
చేముంచి మావిన్నపము చిత్తగింతువు గాక ॥ పల్లవి ॥

నమ్మినట్టివారిని నగుఁబాటు సేతురా
నెమ్మది నందరిలో మన్నింతురు గాక
సమ్మతించి వుండఁగాను జరపేవా వినోదాలు
యిమ్ముల లాలించి కీర్తి కెక్కింతువు గాక ॥ ఏమ ॥

మరిగి కొల్చినవారి మంకులఁ జేయుదురా
పొరి మంచిగుణాలు నేర్పుదురు గాక
సరివలచినవారిఁ జలము సాదింతురా
పరగ లోలో నొడఁబరతురు గాక ॥ ఏమ ॥

కైవసమయినవారిఁ గాకుసేయఁ జెల్లునా
నీవే యెరిఁగి కరుణింతువు గాక
యీవేళ శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
దేవులై నీకు మొక్క దీవింతురు గాక ॥ ఏమ ॥ 412

### దేవగాంధారి

తెలుసునో తెలియదో దిష్టముగ రమణుఁడ
పిలుతుఁజుమ్మీ కృపవెట్టేవని; కాని ॥ పల్లవి ॥

మునివేళ్ల సోఁక నీకు మొక్కుదుఁజుమ్మీ నేను
కొనగోరు దాఁకీనంటాఁ గొంకేఁ గాని
ననుపుచేసుక నీతో నవ్వుదుఁ జుమ్మీ ఇట్టె
వొనరఁ దగిలీనని వూరకుండితిఁ గాని ॥ తెలు ॥

పచ్చిదేరఁ బెండ్లాడి పాదము దొక్కుదుఁ జుమ్మీ
వొచ్చెమనేవని వూరకుందానఁ గాని
ముచ్చటదీర నీమోవి చవిచూతుఁజుమ్మీ
మచ్చమంటేనని యనుమానించితిఁ గాని ॥ తెలు ॥

చెలరేఁగి కతలెల్లాఁ జెప్పుదుసుమ్మీ యెవ్వతెఁ—
దలఁచుకొందువో యని తక్కితిఁ గాని
లలి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
కలసితి విందుకె నేఁ గానిమ్మంటిఁ గాని ॥ తెలు ॥ 413

రేకు 870 శంకరాభరణం

గోవులఁ గాచి యలసీ గోవిందుఁడు
గోవాళితనాలు సేసీ గోవిందుఁడు ॥ పల్లవి ॥

పానుపుమీఁదటఁ దాను పవళించి వున్నవాఁడు
గోనాలగొంది నిదె గోవిందుఁడు
ఆనుక చేతులు చాఁచీ నట్టె చన్నులమీఁద
పూని యేడోనుండి వచ్చి భోగించీ గోవిందుఁడు ॥ గోవు ॥

బట్టబాయిట నింతులఁ బాదాలు విసుకుమనీ
గుట్టు సేయఁ డించుకంతా గోవిందుఁడు
ఙట్టిగాని మోవితేనె సారెకు నియ్యఁగ వచ్చి
చుట్టమువలెనే వచ్చి సొలసీ గోవిందుఁడు ॥ గోవు ॥

యెంమిఁ దెరవేసుక ఇద్దరిఁ గాఁగిటఁ గూడి
కొలువులోపలనే గోవిందుఁడు
వెలయ గొల్లెతలము వేడుకతో మమ్ము నేలె
అలరినశ్రీ వేంకటాద్రి గోవిందుఁడు ॥ గోవు ॥ 414

పాడి

ఇంకనేల మరఁగులు ఇన్నియు బాఇటఁబడె
సంకెలేక ఇంతలోనే చన్నులంటఁగాను ॥ పల్లవి ॥

రవ్వలాయ నావలపు రామలెల్లా నెరిఁగిరి
నవ్వు లీడనే నీవు నాతో నవ్వఁగా
జవ్వనులు తమలోన సన్నలు చేసుకొనిరి
పువ్వులవాట్ల నీవు పొంచి వేయఁగాను ॥ ఇంక ॥

పచ్చిదేరె నావయసు పనులు వెల్లవిరాయ
విచ్చనవిడిని నీవు విడెమియ్యఁగా
కచ్చుపెట్టి సవతులు కడువెంగే లాడేరు
మచ్చికల నీవు నాతో మాటలాడఁగాను ॥ ఇంక ॥

తగులాయ నీకు నాకు తలపోఁత లీడేరె
తగవుతో నీవు నన్ను దయఁజూడఁగా
మిగులా నాతోడివారు మెచ్చేరు శ్రీవేంకటేశ
మగఁడవై పలుమారు మన్నించఁగాను ॥ ఇంక ॥ 415

బౌళి

ఇందుకే నవ్వు వచ్చీ నిదివో మాకు
కందువ నుండి తానేల కన్నుల మొక్కీని ॥ పల్లవి ॥

ముంగిట నుండి నీవు మోము దప్పకచూచితే
అంగడినుండినచెలి యాసచేసెను
ఇంగిత మెరిఁగితేను ఇద్దరికిఁ దగవే కా
సంగడినున్నయాకేల సరసమాడీని ॥ఇందు॥

గౌరబుగా నీవు వీధి గుఱ్ఱమునెక్కి యాడితే
పొరుగుననున్నయాకె పొందు గోరీని
అరసితే నిద్దరికి నమరుఁగాఁయీ సేఁతలు
విరులుగోసేయాకేల వేడుకపడీని ॥ఇందు॥

వొంటి నీవు పానుపుపై నూరకె పవ్వళించితే
వెంటవచ్చేయాకె నిన్ను వెసఁ గూడీని
అంటేఁ జెల్లుఁగా యిద్దరి కందమౌ శ్రీవేంకటేశ
యింట నన్నేలితి వేడోయాకె తా మెచ్చీని ॥ఇందు॥ 416

## వేళావళి

ఘనుఁడ నీనేరుపులు కనే మిందులోననే
పనిమాలినపని పంతము లేలాడేవు ॥పల్లవి॥

తెరమఱఁగున నుండే తేనెలమాటలాడీ
ఇరవై యెదుట నెంత యెలయించునో
తరుణి తరితీపులఁ దగులకుండేవా నీవు
యెరవుల నీమనసు యెట్టున్నదో ॥ఘనుఁ॥

మోము వంచుకొని వుండే ముత్యపునవ్వులు నవ్వీ
సాముసేసితే నీకెంత చవిరేఁచునో
భామవిలాసములకు భ్రమయకుండేవా నీవు
నీమహిమ దెలియదు నెట్టుకొనె వలపు ॥ఘనుఁ॥

కాఁగిలించుకొని వుండే కరఁగించీ నిక్కువలు
మాఁగినమోవి స్తే నీమర్మ మెట్టుంటునో
చేఁగదేరి యాపె నన్ను శ్రీ వేంకటేశ యేలితి
దాఁగదు నీతమకము తతి చెప్పఁగొత్తలు ॥ ఘనుఁ ॥ 417

భైరవి

ఎడమాట లేమిటికి నెందాఁకాను
బడివాయకుండరయ్య పడఁతియు నీవును ॥ పల్లవి ॥

తెలియ నింతికి నీకు దేహములు రెండైతే
తలఁ పొక్కటే కాదా తగులైనది
పిలిచితే మీకి(యి?)ద్దరి పేరులు వేరులైతే
వల పొక్కటే కాదా వర్ణింపను ॥ ఎడ ॥

చక్కఁదనా లిద్దరికి సరికిబేసికినైతే
చొక్కఁజేసేపొందికలు జోడే కావా
ఇక్కువైనచూపులు యెదురుబడి నైతే
యెక్కువతమకములు యీడైనవే కావా ॥ ఎడ ॥

పేరడిమీసుద్దులు పెన్నుద్దులై వుండినాను
యీరసములేనిరతి యేకమే కాదా
యీరీతి శ్రీ వేంకటేశ యెనసితి రీపె నీవు
పోరచి మోవితీపులు పొత్తులవే కావా ॥ ఎడ ॥ 418

ముఖారి

నవ్వవే నెలవులను నంటుతోడను
చివ్వనఁ దమకమునఁ జిమి(మ్మి?)రేఁగి నితఁడు ॥ పల్లవి ॥

రంతుసేసి పతిని నేరము లెంతురటవే
అంతరంగమెఱిఁగినయాఁటదానవు
వింతదానవా నీవు విడె మందుకొనవే
వొంతరప్రియములెల్లా దొరలించీ నితఁడు ॥నవ్వ॥

బలిమిని మగవాని బాసగొందురటవే
అలరినచుట్టరికపాఁటదానవు
లలిఁ బోరచిదానవా లాచి దండఁ గూచుండవే
వెలలేనివేడుకలు వెదవెట్టీ నితఁడు ॥నవ్వ॥

శ్రీవేంకటేశ్వరుని సిగ్గువరతురటవే
ఆవటించి కాఁగిటిలో ఆఁటదానవు
వావి నెరవులదానవా మోవి చవిచూపవే
చేవమీర వేఁడుకొని చెక్కునొక్కీ నితఁడు ॥నవ్వ॥ 419

రేకు 871 ముఖారి

కరుణించవయ్యా మమ్ముఁ గంభమురాయ
పెరదేవునికాలువపెద్దకంభము రాయ ॥పల్లవి॥

కలకలనవ్వు చేరెఁ గంభమురాయ ఇంతి—
కలికితనాలు చూడు కంభమురాయ
కలిమికాంత తొడెక్కెఁ గంభమురాయ నీపైఁ
గలువదండలు వేసెఁ గంభమురాయ ॥కరు॥

కనకపువన్నె మేనికంభమురాయ ఇంతి
కనుఁగవలనే మొక్కెఁ గంభమురాయ
ఘనుఁడ వన్నిటా నీవు కంభమురాయ
కనుకో వలపులెల్లాఁ గంభమురాయ ॥కరు॥

కందర్పకోటిరూప కంభమురాయ ఇంతిఁ
గందువలఁ గూడితివి కంభమురాయ
గంద మిచ్చి నన్నేలితి కంభమురాయ మేలు
గందము శ్రీవేంకటాద్రి కంభమురాయ ॥ కరు ॥ 420

బౌళి

నీవు సేసినచేఁతలు నీవే తెలుసుకోరాదా
కావరపుచలములు గాత సేసుఁ గాక ॥ పల్లవి ॥

పంతమాడఁదగదా పడఁతి నీతోడుత
వింతదానితో నీవు వెస నవ్వఁగా
దోంతులై నవలపులు దొరతనా లెరుఁగుగా
బంతిఁ దగ వెంచమికిఁ బచ్చిసేసుఁగాక ॥ నీవు ॥

జంకించఁదగదా సకియకు నిన్నుఁ జూచి
పొంకముగ వింతవారిపొందు సేయఁగా
సంకెలేనితమకము సత్తువ లెరుఁగునా
లంకె పరాకై నందుకు లలి రేఁచుగాక ॥ నీవు ॥

కొసరఁగఁదగదా కొమ్మ శ్రీవేంకటేశుఁడ
వెసఁ బొరుగాపెఁ గూడి [1]విందియ్యకోఁగా
పసగానిజవ్వనము వంచన చూచునా తను
యెసగికూడినమేలు కిచ్చగించుఁగాక ॥ నీవు ॥ 421

పాడి

[2]ఎప్పుడు వత్తువోయంటా యెదురుచూచె నీకు
కప్పురవిడెము గక్కున నియ్యవయ్యా ॥ పల్లవి ॥

1. పందియ్యఁగా కోఁగా?. 2. దీనిభావము అపాతరమణీయముగ మనసున మెదలును: పదాన్వయము తోచుటలేదు.

బయలుపందిలివెట్టి పడఁతి నెన్నడు మను
ప్రియమున నీపై సేసవెట్టే నంటాను
నయమునఁ బచ్చతోరణము గట్టెఁ గరముల
రయమున నింటికి కిట్టె రావయ్య నీవు ॥ఎప్పు॥

పొందైనకుచములనుబూజగుండలు దెచ్చె
అందముగఁ గాఁగిలించేనంటా నిన్ను
విందాయితముసేసె వేడుకఁ దనమోవిని
కుందణ(న?)పుమంచముపైఁ గూచుండవయ్యా ॥ఎప్పు॥

తోరపుఁబెండ్లిపీఁటగా తొడలనే పొసఁగించె
ఆరసి రతి కాయితమంటాను నీకు
చేరి కూడితి వీకెను శ్రీవేంకటేశుఁడ నేఁడు
గారవించవయ్య ఇఁక గనముగా నీవు ॥ఎప్పు॥ 422

## కొండమలహరి

ఇల్లాలయినదాని కిది గురుతు
చెల్లుబడి నాది నీచిత్తము నాభాగ్యము ॥పల్లవి॥

పంతువెట్టుకొని నీకు వలచినదానను
పంతమాడవచ్చునా బలిమితోను
చింతదీర నెప్పుడు నీసేవలెల్లాఁ జేయఁగాను
చెంత నుంటి ఇఁకను నీచిత్తము నాభాగ్యము ॥ఇల్లా॥

యెనయ జవ్వనము మీదెత్తుకున్నదానను
పెనఁగఁగవచ్చునా బింకాన నీతో
మనసిచ్చి యెప్పుడు నీమాటలోనిదాననై
చెనకఁగా నిఁక నీచిత్తము నాభాగ్యము ॥ఇల్లా॥

దిట్టతనమున నీకు దేవులనైనదానను
రట్టుసేయవచ్చునా యిట్టి నీతోను
ఇట్టె శ్రీవేంకటేశ యెనసితివి; నీవు రాఁగా
చిట్టకము తేలెఁక నీచిత్తము నాభాగ్యము ॥ ఇల్లా ॥ 423

రామక్రియ

తానే తేరీఁగాని తరవాతిపనులెల్లా
మోనముతోడుతనే మోము చూపుమనవే ॥ పల్లవి ॥

సరసమాడఁగాఁ దన్ను సమ్మతిఁ జేకొందుఁ గాక
గరిమలఁ బెనఁగుచుఁ గాదనేనా
మరిగితి నెన్నిమాట లాడించీనే
మురిపెపుఁజూపులను మోము చూపు మనవే ॥ తానే ॥

నగవులు నగఁగాను నంటున మొక్కుదుఁ గాక
వెగటులు వచరించ వింతదాననా
అగడున నెంతేసియాసలు రేఁచీనే
మొగి విచ్చక మన్నించి మోము చూపుమనవే ॥ తానే ॥

మాటలు తానాడఁగాను మక్కువఁ గూడుదుఁ గాక
చీటికిమాటికిఁ గొచ్చి సిగ్గురేఁచేనా
యీటున శ్రీవేంకటేశుఁడేలెఁ గతలేమిటికే
మూటవలపుల నాకు మోము చూపుమనవే ॥ తానే ॥ 424

నట్టనారాయణి

ఎంత యిచ్చకురాలో యేమి చెప్పేది
బంతినే నీకెరుకగా పాటవాడీ నొకతె ॥ పల్లవి ॥

యెన్నికతో నాకె నీవూ నేకతమాడఁగాను
కన్నులనే సన్న సేసీ కాంత యొకతె
వెన్నెలబయట మీరు వేడుకలు జరుపఁగా—
నున్నతితో నీపైఁ బువ్వుల వేసీ నొకతె ॥ఎంత॥

గుట్టున నీ వాకెవద్దఁ గూచుండఁగా నెచ్చరించి
అట్టుగాఁ జన్నులనే జఱసీ నొకతె
పట్టెమంచముమీఁద జాగాలు మీ రందుకోఁగా
చుట్టుక నిన్నెలయించి చూచీ నొకతె ॥ఎంత॥

పచ్చిగా నీ వాకెఁ గూడి పరవశమై చొక్కఁగా
కుచ్చి నిన్ను గోర నూఁది కూడె నొకతె
మెచ్చి శ్రీ వేంకటేశుఁడ మేడలో మీరుండఁగాను
తచ్చి బాసలు గొని ముందర నున్న దొకతె ॥ఎంత॥ 425

రేకు 872 సాళంగం

చిత్తగించవయ్య యీపెచేఁతలెల్లాను
గుత్తపురతులు చూడ కొత్తలాయ నిపుడు ॥పల్లవి॥

సెలవుల నగవులు చిప్పిలులేఁతసిగ్గులు
మొలకవలపు నీపై ముంచీఁ జెలి
పిలుపులకొసరులు పెనఁగేటిసరసాలు
పలుమారు నీమీఁదఁ బచరించీని ॥చిత్త॥

బొమ్మముడిజంకెనలు పొద్దువోనిఅలపులు
చిమ్ములకనుచూపులు చిలికీఁ జెలియ
వుమ్మగిలుకోరికలు వుసురసురుఁగాఁకలు
కుమ్మరించి నీయెదుట కుప్పలువోసీని ॥చిత్త॥

సన్నలలో మాటలు జవళిఅడియాసలు
పన్నెలుగా నీమీఁద వంచీఁ జెలి
యెన్నఁగ శ్రీ వేంకటేశ యెనసితి వింతలోనె
కన్నె వేడుకలు నీకుఁ గానుక వట్టీని ॥ చిత్త ॥ 426

నాట

చండిసేసి పెనఁగకు సతమౌ నిట్టె
నిండుక వుండినదే నేరుపువో చెలియా ॥ పల్లవి ॥

తారుకాణగాఁగ నాతనికి విన్నవించవే
పూరకుండినా అది వొడఁబడ్డట్టే
వోరలేక నేరుపున నొడఁబరచవే చేరి
గారవించి చూచినాను కైకొన్నట్టే ॥ చండి ॥

కొలువులో నాతనిఁ గూరిములు గొసరవే
తెలిసి నవ్వినా సమ్మతించినయట్టే
పలుమారు పేరుకొని బత్తితోడఁ బిలువవే
యెలమి నూఁకొనినాను ఇయ్యకొన్నయట్టే ॥ చండి ॥

శ్రీ వేంకటేశ్వరుని చేతికిఁ గానుకియ్యవే
వావిరి నందుకొనినా వచ్చినయట్టే
యీవేళ నన్నుఁ గూడె యీడకుఁ దానె విచ్చేసి
వావులు చెప్పించుకోవే వలచినయట్టే ॥ చండి ॥ 427

కన్నడగౌళ

ఇన్నియు నీకు నేరిపె నీతఁడే కదే
కన్నెతనము వెలసెఁ గాఁగిలించఁగాను ॥ పల్లవి ॥

శిరసేల వంచేవే సిగ్గులేల పెంచేవే
సిరులనవ్వుతోఁ బతి నేసవెట్టఁగా
తెర యేల వేసేవే గురులేల వా(వ్రా?)సేవే
పొరిఁ బువ్వులు ముడిచి పూజించఁగాను ॥ఇన్ని॥

బొట్టులేల పెట్టేవే పూరకేల తిట్టేవే
యిట్టిగొని యాతఁడు చన్నులంటఁగా
గుట్టులేల పెట్టేవే కొసరేల కలపేవే
చుట్టరికాన నిన్నుఁ జొక్కించఁగాను ॥ఇన్ని॥

పాదమేల తొక్కేవే పైపై నేల మొక్కేవే
యీదెస శ్రీ వేంకటేశుఁ డేలుకోఁగాను
పోదులేల నెరపేవే పొందులెన్ని గరపేవే
ఆదిగొని నన్నేలి నీకప్పగించఁగాను ॥ఇన్ని॥ 428

రామక్రియ

కంటివయ్య యీభాగ్యము కన్నులతుదల నేఁడు
జంటమాటలు మోవుల చవులా ఇవి ॥పల్లవి॥

చెలరేఁగి నవ్వేవు చెలికి పీడె మిచ్చేవు
వలపులపెడరేఁపువాడికా ఇది
పిలిచేవు పేరుకొని ప్రియములు చెప్పేవు
తలపోఁతమచ్చికల తగులా ఇది ॥కంటి॥

చనవాపె కొసగేవు సంగడినే కూచుండేవు
మనసులు గలసినమర్మమా యిది
మొనగోర సోఁకేవు ముచ్చటలు జరపేవు
తనియనిజవ్వనమదములా యివి ॥కంటి॥

కడుఁదమకించేవు కాఁగిలించి కూడేవు
ఒడియనిరతులలో చలమా యిది
యెడనెడ శ్రీవేంకటేశ నన్ను నేలితివి
గుడిగొన్నవేడుకలగురుతా యిది ॥ కంటి ॥ 429

సౌరాష్ట్రం

వివేకించుకొనవయ్యా వింతవింతలాగులు
కవగూడినగుట్టిది గర్వానకా ॥ పల్లవి ॥

చెలిబొమ్మలజంకెన సింగారాన కింతేకాక
చలములు నీతోడ సాదించుటకా
మొలచినచిరునవ్వు మురిపేన కింతేకాక
సొలసినకోపము చూపుటకా ॥ వివే ॥

అంగననివ్వెరగులు అణఁకువ కింతేకాక
పంగించి నీతో సరిపంతమునకా
ముంగిటినిట్టూర్పులు మోహమున కింతేకాక
వెంగెములు నీమై భావించి సోదించుటకా ॥ వివే ॥

వనితచెనకులెల్లా వలపించుటకుఁ గాక
కినిసి ని న్నింతలోనే గెలుచుటకా
యెనసె నీకె శ్రీవేంకటేశ నీచనవే కాక
అనుఁగురతుల ని న్నలయించుటకా ॥ వివే ॥ 430

శంకరాభరణం

ఔనె భాగ్యవంతురాల వన్నిటా నీవు
దీననే తలఁపెల్లాఁ దెలిసె మాకు ॥ పల్లవి ॥

చనవులు నెరపేవు సలిగెలు మెరసేవు
గొనకొని పతితోడ కొలువులోనె
ననుపులు నేసేవు నవ్వులు నవ్వేవు
ఘనమైననీయెమ్మెలు కంటిమే నేము ॥ ఔనె ॥

పలుమారుమురిసేవు పంతములు చూపేవు
పొలసి యాతఁడు మోము చూడఁగానే
కళల విఱ్ఱవీఁగేవు కనుసన్నలు సేసేవు
చెలియ నిన్నిటా సంతసించితిమే నేము ॥ ఔనె ॥

చుట్టమవై కలసేవు సుద్దులెల్లాఁ జెప్పేవు
గట్టిగా శ్రీ వేంకటేశుకాఁగిటనే
మెట్టేవు పాదములు మేనరికమే పెంచేవు
గుట్టున నన్నితఁదేలె కోరితిమే నేము ॥ ఔనె ॥ 431

రేకు 873 వరాళి

ఆలిమగనిసందికి నడ్డమున్నదా
మేలములాడఁగదవె మేకు లేఁటికి ॥ పల్లవి ॥

తలవంచుకొననేల దండనే కూచున్నవాఁడు
చెలువునిఁ జూడఁగదే సిగ్గులేఁటికి
వలవనిమోనమేల వచ్చి తా వేడుకపడి
పలుకఁగదవే వట్టి పంతమేఁటికి ॥ ఆలి ॥

సన్నలుఁ జాయలునేల సమ్మతించి వున్నవాఁడు
విన్నవించఁగదవే నివ్వెర గేఁటికి
యెన్నిక లింతేసేల యింటిలోనికిఁ బిలిచి
చన్నుల నొత్తఁగదవే జాగు లేఁటికి ॥ ఆలి ॥

వారయఁగ నిఁకనేలే వొడివట్టుకున్నవాఁడు
గొరబుగా నవ్వఁగదే కొసరేఁటికి
ఇరవై శ్రీ వేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
సరిమో వియ్యఁగదవె సాములేఁటికి ॥ అలి ॥ 432

కన్నడగౌళ

వేగిరించ నాకేల వేసరనేల
చేగదేర మొక్కఁగా నీచిత్తము నాభాగ్యము ॥ పల్లవి ॥

విన్నుఁ జూచి చూచి నేను నేరము లెంచనేర
సన్నలనే చలములు సాదించనేర
కిన్నెరమీటుచు నిన్ను గిలిగించి పాడిపాడి
విన్నపము సేసుకోఁగా వెసఁ గరుణించేవు ॥ వేగి ॥

తలవులు పెట్టి పెట్టి తమి నలయించనోప
గుఱిలేనిమాటలకుఁ గొసరనోప
అఱిముఱి నీపై వల పాకులలో వా(వ్రా?)సి వా(వ్రా?)సి
యెఱుకసేసి యంపఁగా నిట్టె నన్నేలేవు ॥ వేగి ॥

పొలసి పొలసి సారె బొమ్మల జంకించఁజాల
బలిమిసేసి నిన్నుఁ బంగించఁజాల
యెలమి శ్రీ వేంకటేశ ఇదె నీకాఁగిటఁ గూడి
నిలుచున్నదాన నిఁక నీవే మెచ్చేవు ॥ వేగి ॥ 433

దేశాక్షి

చేరి వీమొగము చూచి సిగ్గయ్యీ నాకు
తారుకాణలాయ అన్నీఁ దలఁచుకోరాదా ॥ పల్లవి ॥

నెలఁతను లాలించేవు నెరులచిక్కు దీసేవు
వలపులు రేఁచేవు వద్దఁ గూచుండి
పిలిచినాఁ బలుకవు పిక్కటిల్లుఁబరాకుతో
చెలులెల్లా నవ్వేరు చిత్తగించరాదా ॥ చేరి ॥

పూవులదండ వేసేవు పొంచి వాడివట్టేవు
వావులు చెప్పిచూపేవు వద్దఁ గూచుండి
చేవట్టితీసినా రావు చెంతనే నివ్వెరగంది
దేవుళ్లే నిన్ను నవ్వేరు తెలుసుకోరాదా ॥ చేరి ॥

కన్నులనే సొలసేవు కాఁగిలించి కూడేవు
వన్నెలమోవి యిచ్చేవు వద్దఁ గూచుండి
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితి వాకెను నన్ను
కన్నెలే నిన్ను నవ్వేరు కనుకొ(ఁగొ?)నరాదా ॥ చేరి ॥ 434

సాళంగనాట

తోడఁ బెండ్లియాడవద్దా దోమటి దొడుకవద్దా
జోడు గూడి వుండవద్దా సుద్దులేమి చెప్పేవే ॥ పల్లవి ॥

సంతమాట లాడేవు సణఁగులు రాలిచేవు
యెంత లేదు నీపగటు యేమిచెప్పేదే
పంతాలాడేవు విభుఁడు బత్తి నాపైఁ జేసెనంటా
నింతగలదానవు నాఁ దేడనుంటివే ॥ తోడఁ ॥

సన్నలనే సొలసేవు చలములు మెరసేవు
ఇన్నిటా నీదొరతన మేమి చెప్పేదే
కన్నులనే జంకించేవు కాంతుఁడు నావాఁడంటా
యెన్నికగలదానవు యేమరఁదగునా ॥ తోడఁ ॥

సందడి శ్రీవేంకటేశు సారెసారెఁ గూడేవు
ఇందరిలో నీనేర్పు లేమిచెప్పేదే
మందలించేవు యీతఁడు మచ్చిక నన్నేలెనంటా
పొందైనదాన విట్టె బుద్ధి చెప్పవలదా ॥ తోడఁ ॥ 435

బౌళి

పాడరే సోబనాలు పడఁతులాల
వేడుక లిద్దరికిని వెలసెఁ జూడరే ॥ పల్లవి ॥

కొండలే పీఁటలుగాఁ గూచున్నా రెదురుబడి-
నండఁనే నారసింహుఁడు నాదిలక్ష్మియు
వెండిఁబైఁడినిండుకొన్న వేదాద్రిగరుడాద్రుల
పెండిలాడే రిద్దరును ప్రియములఁ జూడరే ॥ పాడ ॥

భవనాశిజలములఁ బాయక తోడ నీళ్లాడి-
రివలా నవలాఁ దాము యేటిదరుల
జవళి మంచిపూవుల సరిసేసలు వెట్టుచు
తవిలి సుముహూర్తానఁ దప్పక చూచేరు ॥ పాడ ॥

పొందుగఁ గనకావతిభోగావతినదుల
సందడివసంతముగాఁ జల్లులాడుచు
అందమై శ్రీవేంకటాద్రి నహోబలాన నొక-
చందమునఁ గూడి కూడి సరసములాడేరు ॥ పాడ ॥ 436

ఆహిరి

మఱఁగులేఁటి కింతట మన్నించవయ్యా
చిఱుతనీసేసలు చిత్తగించవయ్యా ॥ పల్లవి ॥

మచ్చువేసి మాటలాడి మగువను వలపించి
రచ్చలఁ బెట్టితి వింక రావయ్యా
యిచ్చకములే సేసి యీవిగా మోవి యొసఁగి
లచ్చనలు నించితి వెల్లవారు నెరిఁగిరి ॥ మఱఁ ॥

సయగారాలెల్లాఁ జూపి నంటున నవ్వులు నవ్వి
దయతోఁ బెండ్లాడితివి తలఁచవయ్యా
ప్రియములు పచరించి బిగువుఁజన్నులు ముట్టి
క్రియలు మరిపి సిగ్గు బయలుసేసితివి ॥ మఱఁ ॥

చూపులనే యాసరేఁచి సొమ్ములు మేనఁ బెట్టి
తీపులనే కూడితివి తెలియవయ్యా
యేపున శ్రీ వేంకటేశ యిన్నిటా నేర్పరిఁ జేసి
చేపట్టితి విందుకు నీచెలులు మెచ్చేరు ॥ మఱఁ ॥ 437

రేకు 874 శుద్ధవసంతం

ఆయనాయఁ దనిసితి మన్నిటాను
యీయెడ నీవోజలు యెఱఁగమా తొల్లి ॥ పల్లవి ॥

యెన్నిసుద్దులు చెప్పేవు ఇచ్చక మెంత సేసేవు
వున్నతి నిందాఁకా నెందోవుండి వచ్చి
సన్నలేల చూపేవు సరస మేమాడేవు
యిన్నేసి నీవేసాలు యెరఁగమా నేము ॥ ఆయ ॥

నవ్వు లెందాఁకా నవ్వేవు నయ మెట్టు గురిసేవు
యెవ్వరెవ్వరికో కాఁగిలిచ్చి వచ్చి
పువ్వు లెక్కడి విచ్చేవు పూసేవు గంద మప్పటి-
నివ్వల నీమతకము లెఱఁగమా నేము ॥ ఆయ ॥

కుచము లేలంటేవు గోరెంత దీసేవు
పచరించే వెవ్వతెతోనో పలికి వచ్చి
రుచులుగాఁ గూడితివి రొక్క_ము శ్రీ వేంకటేశ
ఇచట నీవినోదాలు యెఱఁగమా నేము ॥ ఆయ ॥ 438

దేశాక్షి

నెట్టుకొని మన్నించేది నీచేతి దింతేకాక
బట్టబయ లీఁదించఁగా భ్రమసే దేమరుదు ॥ పల్లవి ॥

వెలలేనిమాటలు వేవేలు నీ వాడఁగాను
వలవకుండురా యెట్టివనితలైనా
యెలమిఁ జక్క_ఁదనాలు యెదుటనే చూపఁగాను
బలిమి జవ్వనులెల్లా భ్రమసే దేమరుదు ॥ నెట్టు ॥

పురిగొని నీ వేపొద్దు పొరుగున నుండఁగాను
మరుగకుండురా గొల్లమంకులైనా
ఇరవైనచుట్టమవు ఇక్కు_వలు ముట్టఁగాను
పరిపరివిధముల భ్రమసే దేమరుదు ॥ నెట్టు ॥

కడు నీవు బుజ్జగించి కాఁగిలించుకొనఁగాను
అదరి చొక్క_కుండురా అచ్చరవైనా
నడుమ శ్రీవేంకటేశ నన్ను నిట్టె కూడితివి
బడి నిన్నుఁ జూచేవారు భ్రమసే దేమరుదు ॥ నెట్టు ॥ 439

లలిత

నీతి విచారించుకోవే నీలో నీవే
కాతరించి దూరుదురా కలికిరో నీవు ॥ పల్లవి ॥

సారెఁ బతిసముకాన సతులతో నవ్వఁగాను
పూరకే వుండుదురా వొద్దివారెల్లా
కోరి నీ వందుకుఁగాను కొడిమెలు గట్టేవు
ఆరజకత్తెవుగదే అంగనరో నీవు ॥ నీతి ॥

గద్దెమీఁదనుం డాతఁడు కప్పురము లియ్యఁగాను
గద్దించి వొల్లమందురా కామినులెల్లా
వద్దనుండి ఇందుకుఁగా వావు తేరుపరచేవు
సుద్దులకత్తెవుగదే సుదతిరో నీవు ॥ నీతి ॥

శ్రీ వేంకటేశుఁడు మెచ్చి చేరి కాఁగిలించఁగాను
దేవుళ్ళఁ గామందురా పొందినవారెల్లా
నీవుఁ గూడి యిందుకుఁగా నిండుఁజుట్టాలఁ జేసేవు
వోపలకత్తెవుగదే వువిదరో నీవు ॥ నీతి ॥ 440

## నారాయణి

ఇరుగుపొరుగు వింటే నీఁక నేమందురో కాని
సరి నూడిగపువారు శిరసులు వంచిరి ॥ పల్లవి ॥

నిలుచుండి మోవి యిచ్చి నెలఁతనుఁ గాఁగిలించి
అలరించేవు రతుల నందగాఁడవై
చెలులు మి మ్మిటు చూచి సిగ్గులువడుచు లోలో
తెలిఁగన్నులతోడుత తెరవేసుకొనిరి ॥ ఇరు ॥

తొడలపై నెక్కించుక తొయ్యలితో దోమట్లు
దొడికేవు కూటములఁ దోడుతోడనె
బడినున్న పేరటాండ్లు భావములెల్లాఁ దెలిసి
తడఁబాటుతో నవ్వు దాఁచి గుక్కుకొనిరి ॥ ఇరు ॥

వొత్తగిలి పవ్వళించి వువిదఁ బైపైఁ గలసి
పొత్తారగించితివి బువ్వముగాను
ఇత్తల శ్రీవేంకటేశ యెరిఁగి నన్నుఁ గూడఁగా
సత్తుగా సవతులెల్లా సన్నలు గావించిరి ॥ ఇరు ॥ 441

దేసాళం

వేడుకయ్యా నాకు నేఁడు వెరవ మీకేఁటికి
కూడుక వుండఁగరాదా గుట్టు దెలిసేను ॥ పల్లవి ॥

అద్దమరేతిరి నీవు ఆపెతో మాటలాడఁగా
వొద్దికి నే వచ్చితేనే వూరకుంటిరి
వద్దనేనా నే మిమ్ము వలపుగలంత మీలో
సుద్దులు చెప్పుకోరాదా సొరిది నే వినేను ॥ వేడు ॥

అంకెలుగా సన్నలు మీరట్టె సేసుకోఁగా నే మీ-
వంక చూచితే తల వంచుకొంటిరి
కొంకనేల నాయడకు కోరినట్టెల్లా మీకు
పొంకము లెంచుకోరాదా పొసఁగ నే మెచ్చేను ॥ వేడు ॥

కందువ మీరిద్దరును కాఁగిటిలో నవ్వుకోఁగా
సందడిలో నే మొక్కితే జట్టిగొంటిరి
అందుకేమి శ్రీవేంకటాధిప నన్నేలితివి
పందేలు వేసుకోరాదా బలిమి నే చూచేను ॥ వేడు ॥ 442

పాడి

నే నేమందునోయంటా నీ వనుమానించనేల
పూని అప్పణ ఇచ్చేను పొందవయ్యా సతిని ॥ పల్లవి ॥

సరి పరపుపై నుండి సతి తెరవేసుక
పెరరేచీ వలపులు బెట్టి (ట్టు?) మాటాడి
యిరవిదె నీకు దండ కిట్టె విచ్చేయవయ్య
పరగఁ బాళుండితేను పట్టలేవు మనసు ॥ నేనే ॥

పుక్కిటివిడెముతోనే పొలఁతి పులుగుపొంత
కెక్కిరించీఁ దమకము కేరినవ్వుతా
అక్కరగలవు నీవు అట్టె కాఁగిలించవయ్య
అక్కున నిడుకో కిటు ఆఁపలేవు వయసు ॥ నేనే ॥

పచ్చడములోను చొచ్చి భామ కుచముల నొత్తి
యిచ్చకపుసన్న సేసి యెనసీ లోలో
కుచ్చి శ్రీ వేంకటేశ కూడితి విట్టె నన్ను
విచ్చనవిడి గాకుంటే విడువలే వాసను ॥ నేనే ॥ 443

రేకు 875 నాగవరాళి

కంటిమి నీగుణమెల్లా కన్నుల తుదల నేఁడు
గొంటరిచేఁతలెల్లాను కుమ్మరించే విపుడు ॥ పల్లవి ॥

సాదించేవానివలెనే సతిమోము చూచేవు
తోదోపులాడి యట్టే కందువలంటేవు
సోదించేబాగుననే చొచ్చే వేకతానకు
పాదుగా నెన్నిమాయలు పచరించే విపుడు ॥ కంటి ॥

సొరిఁ దిట్టేవానివలె పొలఁతితో మాటాడేవు
వొరటుచూపేయట్టు వొడివట్టేవు
సొరిది గద్దించేరీతి సొమ్ములు గొని వేసేవు
గరిమ నెన్నిసటలు కల్పించే విపుడు ॥ కంటి ॥

మెచ్చేటివానివలెనే మెలుఁతఁ గాఁగిఁలించేవు
లచ్చనలు నించేయట్టే లాలించేవు
ఇచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యిచ్చకపుబయకారా లెన్ని సేసే విపుడు ॥కంటి॥ 444

ఆహిరి

ఎప్పుడు భేదము లేదు ఇద్దరికిని
చప్పుడు సేయకుండితే చనవిచ్చీ నతఁడు ॥పల్లవి॥

పెలుచైనవానికిఁ బ్రియములు చెప్పితేను
కలుచపడుఁ గాక సంగతెరుఁగునా
తలఁచుకొనీఁ దానే తరి నాకిచ్చినబాస
మలసి వూరకుండితే మంకుదేరీ నతఁడు ॥ఎప్పు॥

గడుసైనవానికిఁ గానుక లిచ్చితేను
బెడసరమే కాక వొడఁబడీనా
తడవీఁ గాక తానే తగిననాసేవలు
బడివాయకుండితేను పంతమిచ్చీ నతఁడు ॥ఎప్పు॥

నాలియైనవానికి నవ్వులు నవ్వితేను
పేలరితనమే కాక పెంపెరుఁగునా
వేశరిఁగి తా నన్ను శ్రీవేంకటేశుఁ డిటు గూడె
తాలిమితో నుండితేను దయఁజూచీ నతఁడు ॥ఎప్పు॥ 445

దేసాళం

ఏల నన్నొడఁబరచే విటు నిన్నుఁ గాదనేనా
మేలమెరిఁగినవారి మెప్పించరాదా ॥పల్లవి॥

జాదల నాతో నీవు సమ్మతించఁ జెప్పేవు
ఆదరాదా తగవు నీ వాపెతోను
వేడుకకాఁడవు నీవు వెలఁదు లొద్దనున్నారు
పాడిపంతములెల్లాఁ బచరించరాదా ॥ఏల॥

గుట్టున నన్నెంత వేఁడుకొనేవు సారె సారెకు
అట్టె పెనఁగరాదా ఆపెతోను
చుట్టరికము నేర్తువు చూచే రూడిగపువారు
నెట్టుకొన్నసంతోసాలు నెరపఁగరాదా ॥ఏల॥

పోదిసేసి నన్ను నెంతపొదిగే విందుకుఁగాను
ఆదరించి కూడరాదా ఆపెతోను
యీదెస శ్రీవేంకటేశ యేలితి వాపెను నన్ను
పాదుగా సవతులలోఁ బాలించరాదా ॥ఏల॥ 446

శ్రీరాగం

సంగడికి రాఁగదవే సరిచూచేను
యింగిత మెరుఁగుకొంటే నిద్దరికిఁ గూడెను ॥పల్లవి॥

తుంమి(తుమ్మిఁ)దలు వ్రాయఁబోతే తొయ్యలి నీతురుమాయ
నెమ్మిఁ జందురు వా(వ్రా?)సితే నీమోమాయనే
వుమ్మడి సంపెంగ వ్రాయ నున్నతి నాసికమాయ
కమ్మఁగలువలు వ్రాయఁ గన్నులాయను ॥సంగ॥

గక్కన శంఖము వ్రాయఁ గన్నెరో నీగళమాయ
ఒక్కవల వ్రాయఁగా నీచన్నులాయను
అక్కరఁ దామరలు వ్రాయఁగ నీకరములాయ
నిక్కి సింహము వ్రాయఁగా నీనడుమాయను ॥సంగ॥

పులినము వ్రాయఁగాను పొలఁతి: నీపిరుఁదాయ
తెలియ నరఁటులు వ్రాసితేఁ దొడలాయ
కలసితివి శ్రీ వేంకటేశ్వరుఁడనుఁ దాను
బలుచిగురులు వ్రాయఁ బాదాలాయను ॥ సంగ ॥ 447

## పాడి

ఒద్దికతోఁ గూడిమాడి వుండరాదా
సుద్దు లేమి చెప్పేవే సులభాన నీవు ॥ పల్లవి ॥

ఇప్పుడే యెవ్వతెతోనో యీవిభుఁడు నవ్వెనంటా
చెప్పుడుమాటలకేల చెవియొగ్గేవే
కొప్పు జారివున్నదంటా కొంగు పసపాయనంటా
చొప్పులేల యెత్తేవే సొలయుచు నీవు ॥ ఒద్ది ॥

కోడెవనితలతోడ గుట్టునఁ బెనఁగెనంటా
వేడుకచేఁతలకేల వెరగందేవే
వాడినది మోవియంటా వడిసీఁ జెమటలంటా
ఆడిక లేలాడేవే అందరిలో నీవు ॥ ఒద్ది ॥

కన్నెపెండ్లికూఁతురు కైదండ వట్టెనంటా
సన్నలరతులకేల సాదించేవే
ఇన్నిటా శ్రీ వేంకటేశుఁ డేలెనంటా మెచ్చెనంటా
నిన్ను నేల పొగడేవే నెట్టుకొని నీవు ॥ ఒద్ది ॥ 448

## వరాళి

కొనియాడేమే నిన్ను కొత్తలుగాను
చనవరి వైనందుకు సరివచ్చె నిపుడు ॥ పల్లవి ॥

ఇప్పుదేమాయనే ఇదిగో ఆతఁడున్నాఁడు
చిప్పిల నీపంతము చెల్లించుకోవే
చెప్పుకొన నేఁటికే చెలరేఁగి నీయెమ్మెలు
తప్పక చూచినందే తారుకాణ గంటిమే ॥ కొని ॥

కాదనేనటవే కదిసెను రమణుఁడు
పాదుగా నీయిచ్చలసు బాసగొనవే
తోదోపు లేఁటికే తొక్కితివి పాదము
ఆదరించినప్పుడే ఆయాలు గరఁగెనే ॥ కొని ॥

చెల్లదటవే నీవుచేసినచేఁతలెల్లా
యిల్లిదె శ్రీవేంకటేశు నిట్టె కూడవే
పల్లదాలేఁటికే నన్నుఁ బైకొని యీతఁడె కూడె
వొల్లనే నే నవ్వితేనే వొడఁబాటులాయనే ॥ కొని ॥ 449

రేకు 876 మంగళకౌశిక

భామల చయ్యాటాలు నీభాగ్య మాయను
యేమరక నీమే లొక టినుమడి సేసెను ॥ పల్లవి ॥

ఇద్దరుసవతులును యెదిరించి పెనఁగఁగా
వద్దని నడుము చొచ్చి వారించితివి
కొద్దితో నాలుగుచనుగుబ్బలు నీమేనను
చద్దికి వేఁడికి నొత్తి సమరతి సేసెను ॥ భామ ॥

చెలు లొకరొకరిపై చేతులు చాఁచుకోఁగా
తొలఁగకడ్డమై మాన్ప దొరకొంటివి
కెలఁకుల నెదురుగాఁగిళ్ల నీమెడఁ దగిలి
వెలలేనివలపులు వేడుకలు సేసెను ॥ భామ ॥

కన్నుల నీకె నాకె కడుజంకించి చూడఁగా
కన్నెలకు గురై నిల్చి కలసితివి
నన్నేలి శ్రీ వేంకటేశ నడుమ నీ వుండఁగాను
అన్నిటాఁ గల్వలై నిన్ను నవే పూజసేసెను ॥ భామ ॥ 450

హిందోళం

చెలి నిన్ను దూరీని చెప్పవయ్య యీతగవు
తలఁపించఁగలఁ గాక తమిరేఁచవచ్చునా ॥ పల్లవి ॥

వెలఁదిమాటలు నీకు విన్నవించఁగలఁ గాక
వలపించ నావసమా వరుసతోను
చెలఁగి నీకుఁ బ్రియము చెప్పఁగ నేఁ గలఁ గాక
బలిమిసేసి నిన్నుఁ బిలువఁగవచ్చునా ॥ చెలి ॥

కాంత ఇచ్చెనని నీకుఁ గాను కియ్యఁగలఁ గాక
వంతులకు మెడఁగట్టవచ్చునా నిన్ను
మంతనాన నీకెఁ దెచ్చి మాటాడించఁగలఁ గాక
వింతలుగా నిన్ను వెంటవెంటఁ దిప్పవచ్చునా ॥ చెలి ॥

తరుణికి నీకుఁ దెర తగ వేయఁగలఁగాక
సరిఁ బెట్టి కాఁగిలింపించఁగవచ్చునా
గౌరవై శ్రీ వేంకటేశ కూడితి విట్టె యీకెను
యిరవై మెచ్చఁగలఁగా కెదురాడవచ్చునా ॥ చెలి ॥ 451

లలిత

కానవచ్చీ మీవోపికలు మాకెల్లా
నానఁబెట్టేరు వలపు నంటున నిందరును ॥ పల్లవి ॥

వాళజొత్తుమాటలు వాకరొక రాదుకొని
జలజాక్షులు నీపై వసంతమాడేరు
పలుమారు నందరును బాసలు చేసుకొని
సొలసి సొలసి నీతో జూజాలాడేరు ॥ కాన ॥

సరినుండి తమలోన సన్నలు నేసుకొని
మొరయుచు నీతో సాములు సేసేరు
తొరలింపుమాటలు తొలుతే పదరుకొని
వరుసవంతులకు రవ్వలు నేసేరు ॥ కాన ॥

ముసిముసినగవులతో మొగములు చూచుకొని
అసము డించక కూడి ఆయాలంటేరు
యెసగి శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
పొసఁగ నందరు నీకుఁ బొందులు చూపేరు ॥ కాన ॥ 452

బౌళి

తమకించి నిన్నేమైనాఁ దడవితినా
అమరించుకొని నీవే ఆడుకొనేవు గాక ॥పల్లవి॥

పొగడిననోరనే పూఁచిపట్టి నేనిఁక
యెగసక్కె లాడేనా ఇప్పుడే నిన్ను
వెగటుఁజేఁతలు సేసి విచారించుకొని నీవే
పగటున వెంగేలుగా భావించేవుగాక ॥ తమ ॥

సేవసేసినచేతనే చెలరేఁగి నే నేఁడు
లావు చూపి పెనఁగేనా లలి నీతోను
కావరించి యాడోవారికాఁగిట నలసి వచ్చి
వోవరిలో నాచొప్పులే వూహించేవుగాక ॥ తమ ॥

సమ్మతించి కూడిననాచన్నులనే వొత్తి వొత్తి
నెమ్మది నీకు దాఁచేనా నేరుపు నేను
పుమ్మడి శ్రీవేంకటేశ పూరఁబొత్తులవాఁడవై
కుమ్మరింపుటాసలను కొసరేవుగాక ॥తమ॥ 453

ధన్నాసి

రమణుఁడ చిత్తగించు రతికెక్కె నీదేవులు
సముకపుమాటలు సమ్మదములాయను ॥పల్లవి॥

అదే నీచక్కఁదనాన కద్దము చూపినట్టు
పొదిగొని మెరసీని పొలఁతిమోము
కదిసి నీలాలబంతి కానుకగాఁ బట్టినట్టు
యెదుట నీకెతురుము యెక్కుడై కాన్పించెను ॥రమ॥

బడి నీసింగారానకు పైఁడికుండ లెత్తినట్టు
కడుమించీ నివిగో కాంతగుబ్బలు
వెడ నీకోరికలు తీవెలువారి వుండినట్టు
కడఁగి యీకెచేతులు కనుపట్టి వున్నవి ॥రమ॥

చుట్టుగా నీవలపు రాసులుగాఁ బోసినయట్టు
వొట్టి యీకెపిరుఁదులు వొనరినవి
యిట్టె శ్రీవేంకటేశ యీకెతో ననిచినట్టు
జట్టిగా నీమెపాదాలజంట చిగురున్నది ॥రమ॥ 454

మాళవిగౌళ

ఎంత మోహించినాఁడే నే నేమిబాఁతే తనకు
మంతనములాడీని మాఁటికి మాఁటికిని ॥పల్లవి॥

బలిమి నాగుబ్బలపై బన్నసరికంఠమాల
పలుమారు లెక్కవెట్టీ పయ్యద దీసి
మెలుపుతోడ నొసలిమీఁదికస్తూరిబొట్టు
కాలఁదికి దిద్దీ తనకొనగోరను ॥ ఎంత ॥

చందపునాకొప్పులోనిసంపెంగపూవులు
చెంది వాసనచూచీని ముందల వట్టి
ముందరినాకుచ్చెలపై మొలనూలిమొగపులు
అందములు చూచీఁ దనహస్తమునను ॥ ఎంత ॥

పరగ నాముంజేతులపగడాలచేఁకట్టు
గొరబై విలువసేసీ కొంగు పైఁ గప్పి
యిరవై శ్రీవేంకటేశుఁ డేలె నన్నుఁ జెలులార
[1]అరిదీఁ దమ్ముల మిది యట్టె నాపుక్కిటను ॥ ఎంత ॥ 455

రేకు 877 భైరవి

చిత్తగించవయ్యా నీసింగారపుదేవులను
హత్తి కరుణించరాదా ఆసపడీని ॥పల్లవి॥

నిండారాఁ దనమీఁద నీవు బత్తిగలవని-
యండనున్నచెలితోడ నానతిచ్చీని
పందఁబడి నీవుండినపర పిది తనదని
వెండియును తనపెనువేలఁ జూపీని ॥ చిత్త ॥

చనవున నిద్దరికి సమద్రిష్టాయనని
తనపొరుగాపెతోడఁ దలపోసీని
ననిచినయట్టిప్రాణనాథుడవు నీవని
వానరఁ జేకావికలు వాడిఁబెట్టి పంపీని ॥ చిత్త ॥

1. 'ఆశ్చర్యపడుట' యా? 2. స్వార్థమున'పడు'ధాత్వమ ప్రయోగము.

బెట్టినీనోరను తనపేరు నుడిగేవని
చుట్టపువనితతోఁ బొంచు లాలించీని
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి మగువను
॥ గుట్టుతోడఁ దనకు నిన్నే గురిసేసీని ॥ చిత్త ॥ 456

సాళంగనాట

ఎందరు చెప్పినా విన వేమిచెప్పేది
యిందె తగవు దేరె నేమిచెప్పేదే ॥ పల్లవి ॥

వంతువరుసలు గాక వద్దఁ గాచుకుందానవు
యెంతలేదు నీయాసోద మేమిచెప్పేదే
మంతనములాడితివి మరి మాటలాడేవు
యింత గద్దా యేఁకట యేమిచెప్పేదే ॥ ఎంద ॥

వుమ్మడిఁ బెండ్లాడియును వాడివట్టి తీసేవు
యెమ్మెలు చూపవలెనా యేమిచెప్పేదే
నమ్మికలు గైకొంటివి నవ్వుతానే కొసరేవు
యిమ్ముల నీదేరెఁ బంత మేమిచెప్పేదే ॥ ఎంద ॥

పట్టపుదేవివై యుండీఁ బలుమారుఁ దనియవు
యిట్టె పెంచేవు మేలు యేమిచెప్పేదే
చుట్టమైననన్ను నేలె నచ్చుగ శ్రీవేంకటేశుఁడు
యిట్టె నీనామంచితన మేమిచెప్పేదే ॥ ఎంద ॥ 457

సింధురామక్రియ

మెచ్చేరయ్య నాయకుఁడ మెలుఁత లీవేళ నిను
నిచ్చలును వలవఁగ నీవే నేర్తువయ్యా ॥ పల్లవి ॥

యిట్టుండవలదా యింతిమీఁదిమోహము
వొట్టుగా నాకుమడిచి యొసఁగితివి
చుట్టమవైనందుకు సుద్దులిన్ని చెప్పవద్దా
గుట్టుసేయ కింత నిండుఁగొలువులోను ॥ మెచ్చే ॥

ననుపింత గావలదా నలినాక్షితోడుత
యెనయుచుఁ దొడమీఁద నిడుకొంటివి
చనవిచ్చినయందుకు సరసమింతాడవద్దా
పనివడి యీకెయీడుభామలముందరను ॥ మెచ్చే ॥

యీరీతి నవ్వవలదా యేణాక్షితోడుత
గారవించి కాఁగిటఁ గలసితివి
ఆరయ శ్రీవేంకటేశ అందమిటు చూపవద్దా
సారెకు మోవిచ్చితి విచ్చటఁ బాన్పుమీఁదను ॥ మెచ్చే ॥ 458

తెలుఁగుఁగాంబోది

నావల్లఁ గడమ లేదు నమ్మితి నిన్ను
కైవసమై యీచెలినిఁ గఁటాణించు మిపుడు ॥ పల్లవి ॥

అలివేణి నిన్నుఁ బాసి అలసినఅలయిక
తెలిపి చెప్పితిఁజుమ్మీ తెల్లమిగాను
చెలరేఁగి మీరు తొల్లి సేసుకొన్నబాసలు
తలఁపించితిఁజుమ్మీ తారుకాణగాను ॥ నావ ॥

యేపున విరహవేళ నింతిపాన్పుపై చిగురు
చూపితిఁజుమ్మీ నేను సూడిదెగాను
తీపులనీమోవి యిచ్చి తేకువ మన్నించుమని
చేపట్టి మొక్కితిఁజుమ్మీ సెలవుగాను ॥ నావ ॥

పోడిమి నిద్దరికిని పొందుసేసి కూడించి
వేఁడుకొంటిఁజుమ్మీ నిన్ను వేడుకగాను
నేఁడు శ్రీవేంకటేశుఁడ నీవే దయఁ గాచితివి
పేఁడితిఁజుమ్మీ వలపు పెక్కువగాను ॥నావ॥ 459

## శంకరాభరణం

లెస్సాయఁగా నేఁడు నీలెక్కలేనిసరసాలు
అస్సారముగా వలపు లారడిఁబెట్టేవు ॥పల్లవి॥

నమ్మికిచ్చి తెచ్చి నేఁడు నలినాక్షిఁ బెండ్లాడి
వుమ్మడి జూజాలాడేవు వూరిలోనెల్లా
సమ్మతిగాఁ జన్నులంటి జవ్వనము పెడరేఁచి
పమ్మి పరాకుసేసుక పాటలువాడేవు ॥లెస్సా॥

ఆసలెల్లాఁ బెట్టి పెట్టి ఆయములు గరఁగించి
తోసిపార గుత్తాల పీదులఁ దోలేవు
బాససేసి యేకతాన పలురతులెల్లా నేర్పి
వేసాలకు సాములు వేమారుఁ జేసేవు ॥లెస్సా॥

తేటమాటలాడి మోవితేనియ చవిమరపి
పాటించి పానుపుమీఁదఁ బవళించేవు
గాఁటాన శ్రీవేంకటేశ కలికి నేలితి విట్టె
నాటకపుసిగ్గులను నవ్వులు నవ్వేవు ॥లెస్సా॥ 460

## నాదరామక్రియ

వోజకు వచ్చినవాని నొడికానఁ గూడరాదా
సాజము దెలుసుకోవే చలపట్టనేఁటికి ॥పల్లవి॥

కలసిమెలసి నీతోఁ గాఁపురము సేసేవాని
తొలుతటిచేఁత లెంచి దూరనేఁటికి
చెలరేఁగి నీకు నిట్టె చెప్పినట్టు సేసేవాని
బలిమిని చొప్పులెత్తి పచ్చిసేయనేఁటికి ॥ వో ॥

నవ్వుతాఁ దెగడుతాను ననుపై వుండెడివాని
వువ్విళూర్ల మర్మాలెత్తి వొరయనేలే
చివ్వన నిచ్చకములే సేసుక నడచేవాని
రవ్వగా సిగ్గువరచి రచ్చ వేయనేఁటికే ॥ వో ॥

కన్నుసన్నలనే నిన్నుఁ గాఁగిట నేలినవాని
పిన్ననాఁటిసుద్దు లవి పేరుకోనేలే
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డితఁడే మన్నించె నేఁడు
కిన్నెర మీఁట గోర గిలిగించ నేఁటికే ॥ వో ॥ 461

రేకు 878 పడవంజరం

కన్నవిన్నకొత్త గాదు కలికితన మీకెది
మన్ననలెల్లా నిచ్చి మందలించవయ్యా ॥ పల్లవి ॥

నానఁబెట్టి సెలవుల నవ్వు నీముందరఁ బోసి
కానుకలు వట్టీఁ గనకపుగుబ్బలు
సానఁబట్టినచూపుల జాజరలాడీని నీపై
పూనిననీయింతినేరుపులు చూడవయ్యా ॥ కన్న ॥

వొడిఁగట్టుకొని సిగ్గు లూరక నీపైఁ జల్లి
ముడుపులు గట్టిచ్చీని ముద్దుమాటలు
కడలేనిమురిపేల కందుచముగ్గులు వెట్టీ
తడయక యీకెజాణతన మెంచవయ్యా ॥ కన్న ॥

గాడిఁగట్టి మోము చంద్రకళలెల్లాఁ దోడుచూపి
సూడిదెవట్టీఁ దనసొంపురతులు
యీడుగా శ్రీ వేంకటేశ యెవసె నిన్నిటా నిన్ను
వేడుకచుట్టరికము వెలయించవయ్యా ॥కన్న॥ 462

బలహంస

బలిమిసేయకు మిఁక పచ్చిదేరీని
తిలకించి చూచితే నే దీకొనేనా ॥పల్లవి॥

కడుఁబెనఁగకు మేనిగంధపుబేంట్లు రాలీ
వొడివట్టి తియ్యకు నవ్వులు వచ్చీని
పిడికిటితలఁబాలపెండ్లికూఁతురను నేను
యెడయక నీ వెట్టున్నా యెగ్గులెంచేనా ॥బలి॥

బెట్టిమాట లాడకు పెదవికెంపులు రేఁగీ
మట్టుమీరి చూడకు మర్మము లంటీని
పట్టపుదేవులనైనపాయరానిసతి నేను
చుట్టమ వెందరికైనా సూడువట్టేనా ॥బలి॥

పందెములు వేయకు పైపై సందు లదరీ
సందు లంత దూర కలసత లుబ్బీని
కందువ శ్రీ వేంకటేశ కలసినసతి నేను
విందు లెందు చేకొనినా వెంగెములాడేనా ॥బలి॥ 463

సామంతం

ఏఁటికిఁ జింతించేవు యెఱఁగవా నామనసు
చీటికిమాటికి లోలో సిగ్గులు నాసాజము ॥పల్లవి॥

మొగమోటగలదాన మున్నుముందే దూరనేర
నగుతానుండేదిది నాసాజము
తగవుదప్పనిదాన తబ్బిబ్బులకు నోపను
అగపడి మెచ్చు మెచ్చే దదియు నాసాజము ॥ ఏఁటి ॥

వినయముగలదాన వెంగెములాడఁగనేర
ననిచి మాటలాడేది నాసాజము
మనసు నమ్మినదాన మర్మము లెత్తఁగ నోప
చనవులు మెరసేది చక్కనినాసాజము ॥ ఏఁటి ॥

కడు బత్తిగలదాన కాఁతాళించుకొననేర
నడుమఁ గాఁగిలించేది నాసాజము
అడరి నన్నేలితివి అంతలో శ్రీ వేంకటేశ
యెడసి పాయఁగనోప యిదే నాసాజము ॥ ఏఁటి ॥ 464

నాట

ఎవ్వరు నిన్నేమనేరు ఇంత దొడ్డవాఁడవు
చివ్వన నాపెచే సేవచేయించుకోరాదా ॥ పల్లవి ॥

జూటరితనము నేర్చు సుద్దులు చెప్పఁగనేర్చు
కూటమికి నాపె నిన్నుఁ గొసరనేర్చు
యేఁటికి బాఁతి నేను ఇచ్చకమాడేదానను
చోటిచ్చి యాపె నొద్దఁ గూచుండఁబెట్టుకోరాదా ॥ ఎవ్వ ॥

సరసమాడఁగనోపు సన్నలు సేయఁగ నోపు
ఇరవుగా నాపె యెలయించఁగ నోపు
కొరయ నిందేమున్నది వూడిగపుదాన నేను
తెరవేసి నీమాటికి తిద్దుకొనరాదా ॥ ఎవ్వ ॥

వలపించ తానెరుఁగు వాడికలెల్లా నెరుఁగు
కలసి నిన్నాపె పొసఁగఁగ నెరుఁగు
యెలమి నన్నేలితివి యిప్పుడే శ్రీ వేంకటేశ
కలికి యాపెఁ బెద్దరికము సేయరాదా ॥ఎవ్వ॥ 465

వరాళి

ఏల గడించుకొనేవు యేమి నీవు దూరేవు
వాలుకచూపులు గాక వాండ్లా ఇవి ॥పల్లవి॥

మంతనాన నేనాదేమాట సహజమే కాక
అంతలోనే నిన్ను వెంగెమాడుటా ఇది
చెంత నాకన్నుబొమ్మలసింగార మిట్టే కాక
పంతాన నిన్ను జంకించేపగటా ఇది ॥ఏల॥

నటనల నానెలి (నెలవి?)నవ్వేజాదే కాక
సటలకు నీతో నెగసక్కెమా ఇది
ఘటన నే నిలుచుండేకట్టదే ఇదికాక
మటమాయవొడ్డారాల మారుకొనుటా ఇది ॥ఏల॥

నెలవై నాకాఁగిటిలో నేరుపు లివే కాక
అలయించేనని పెనఁగాడుటా ఇది
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
కలపుకో లిది గాక కదుసాదింపా ఇది ॥ఏల॥ 466

మధ్యమావతి

ఎటువంటిజాణతన మేమి నేరుచుకొంటివి
సట లేల సేసేవు చలమా యిది ॥పల్లవి॥

నిలుచుండి పాదముల నిన్ను నింతి పెనఁచఁగా
కలయకానవెట్టేది గర్వమా నీకు
చెలరేఁగి గోర నొత్తి చేరి సన్న సేయఁగాను
పలుజీరలు సేసేది పంతమా యిది ॥ ఎటు ॥

ముప్పిరి నాకుమడిచి మోవితేనె లందియ్యఁగాను
తప్పించుకొనేది దొరతనమా నీకు
కొప్పువట్టి తీసి నిండుఁగ్రొవ్విరులు ముడువఁగా
వుప్పతించి తిట్టేది వుదుటా యిది ॥ ఎటు ॥

వుపరిసురతమున వూడిగము సేయఁగాను
వుపమించి నీవు గూడేవారపా నీకు
యిపుడె శ్రీవేంకటేశ యీచెలి నీకు మొక్కఁగా
నెపముగా దీవించేవు నేరుపా యిది ॥ ఎటు ॥ 467

రేకు 879 ధన్నాసి

కంటిమమ్మ యిన్నాళ్లకు కతలుగా మీసుద్దులు
జంటలై నఇటువంటిచనవు గలిగెనా ॥ పల్లవి ॥

చేయిమీఁదఁ జేయివేసి చెక్కునొక్కేవు విభుని
చాయల నాతఁ డింతేసి చనవిచ్చెనా
ఆయములంటి యాతని నప్పటి గోరనూఁదేవు
పాయక ఇద్దరికిని పాటి(త?)చూట్టరికమా ॥ కంటి ॥

మంతనాన నాతనిని మాటలోనే తిప్పేవు
పంతాన నీకిటువంటిబాస సేసెనా
బంతినే మీపై మీరు పాదాలు చాఁచుకొనేరు
సంతతము మీ కిట్టిసంగాతాలా ॥ కంటి ॥

చేరి శ్రీవేంకటేశ్వరు చెలరేఁగి కూడేవు
నేరుపు లీతఁ డిన్నేసి నీకు నేర్పెనా
యీరీతిఁ దా నన్ను నేలె ఇందుకే నీవు మెచ్చేవు
కారణాలు మీకు మీకుఁ గలిగినవా ॥ కంటి ॥ 468

నారాయణి

ఓరుపే నేరుపందురు పువిదలకు
తారుకాణించేఁ గాని తడవకురే ॥ పల్లవి ॥

మొగము చూచినవాఁడు ముచ్చటాడక మానీనా
నగినవాఁ డిందురాక నాలిసేసీనా
మగువలాల మనమనసు చూచీ నతఁడు
వెగటుగా మీ రింక వెంగెములాడకురే ॥ ఓరు ॥

చేసన్న చేసినవాఁడు చెప్పకుండీనా ప్రియము
ఆసకొనినవాఁడు ఆదరించఁడా
యీసులేలే చెలులాల యేఁటికో వున్నాఁ డతఁడు
రాసికెక్కించి మీరిఁక రాఁపులు సేయకురే ॥ ఓరు ॥

చేయిచాఁచినవాఁడు సేస చల్లక లోఁగీనా
కాయము ముట్టినవాఁడు కళ రేచఁడా
యీయెడ శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నింతలోనె
చాయల సన్నల నింక సాదించకురే ॥ ఓరు ॥ 469

పాడి

ఎటువంటిమర్మములో ఇంతికి నీకు
తటుకున నడిగినఁ దలఁపేమీఁ జెప్పదు ॥ పల్లవి ॥

పొంతనున్నచెలిమీఁదఁ బొరలి పొరలి నవ్వీ
మంతనాన నీవాడినమాటఁ దలఁచి
దొంతిపులకలు రేఁగఁ దోడతోడ వెరగందీ
చెంత నీవు సేసినట్టిచేసన్నలు దలఁచి ॥ ఎటు ॥

సొలసి ముంజేతిచిల్కఁ జూచి చూచి సిగ్గువడీ
బలిమి నీవిచ్చినబాసలు దలఁచి
నిలువెల్లాఁ జెమరించ నిట్టూర్పు నిగుడించీ
మలసి మన్నించినమన్ననలు దలఁచి ॥ ఎటు ॥

కమ్మవిరిపాన్పుపై కరఁగి కరఁగి చొక్కీ
చిమ్ముల నీవు సేసినచేఁతఁ దలఁచి
నెమ్మది శ్రీవేంకటేశ నిన్నుఁగూడి మొక్కి మొక్కీ
కమ్మిననీరతులలో కందువలు దలఁచి ॥ ఎటు ॥ 470

భైరవి

వేఁడుకొని వేఁడుకొని వేసరితి మిద్దరిని
నేఁడు గరుణించఁడొకొ నేరుపులమరుఁడు ॥ పల్లవి ॥

చెక్కు లెంతనొక్కినాను సేవ లెంతచేసినాను
మక్కువ గలుగుదాఁకా మన సొగ్గదు
మొక్కులెన్ని మొక్కినాను ముచ్చటలెంతాడినాను
అక్కర గలుగుదాఁకా నందవు పొందికలు ॥ వేఁడు ॥

సన్నలెన్ని చేసినాను చవులెన్ని పుట్టించినా
యెన్నిక లొనరుదాఁకా నింపు వుట్టదు
విన్నప మెంతసేసినా వేడుక లెంతచూపినా
కన్నుల కింపవుదాఁకా కలుగదు ప్రియము ॥ వేఁడు ॥

కతలెన్ని చెప్పినాను కప్పుర మెంతిచ్చినాను
రతి సమకొనఁదాఁకా రాఁపు మానదు
ఇతవై శ్రీవేంకటేశుఁ డింతియును నెనసిరి
పతివచ్చునందాఁకాఁ దప్పవు పంతములు ॥ వేఁడు ॥ 471

సామంతం

కన్నుల మొక్కేము నీకుఁ గడపరాయ నన్నుఁ
గన్నెనాఁడె యేలితివి కడపరాయ ॥ పల్లవి ॥

కందర్పగురుఁడ వోకడపరాయా మాకు
గంద మీయఁగదవోయి కడపరాయా
కందము నీగుణములు కడపరాయా తొంటి-
కందువకు రాఁగదోయి కడపరాయా ॥ కన్ను ॥

కలువపూవుల వేసి కడపరాయా నేఁ
గలికి నంటా మెచ్చేవు కడపరాయా
కలకాలముఁ బాయకు కడపరాయా నీ-
కలపుకో లెరుఁగుదుఁ గడపరాయా ॥ కన్ను ॥

గరిమ శ్రీవేంకటాద్రి కడపరాయా నన్నుఁ
గరుణించి కూడితివి కడపరాయా
గరిమెలు నేరుతువు కడపరాయా నా-
గరువ మీడేర్చితివి కడపరాయా ॥ కన్ను ॥ 472

గౌళ

వట్టిసిగ్గులు వడనేల వనితలలోననెల్లా
ఁట్టిగొని కెమ్మోవి చవిచూపవయ్యా ॥ పల్లవి ॥

వారసేచన్నులతోడ వాదివట్టితీసీ నాకె
గరిమ నీవిందుకుఁ బెనఁగకువయ్యా
పరగఁ బయ్యెద జారఁ బరువున వచ్చె నిదె
యిరవుగా విందుకుచెప్పి నియ్యకొనవయ్యా ॥ వట్టి ॥

వీడినతురుముతోడ విన్నపాలుసేసీ నాకె
తోడఁదోడ నీవిట్టె తోయకువయ్యా
వేడుకఁ బెంజెమటతో విడెమియ్యవచ్చె నిదె
జాడతోడ నీవు చేయిచాఁచి యందుకోవయ్యా ॥ వట్టి ॥

బుసకొట్టునూర్పులతోఁ బూవులు గొమ్మనీ నాకె
కొసరుఁగూరిమితోఁ జేకొనవయ్యా
యెసగ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
పొసఁగ నిద్దరుఁ దలపోసి చూడరయ్యా ॥ వట్టి ॥ 473

రేకు 880 సాళంగం

వీఁపు గానరాఁగా దాఁగేవిధము నేర్చుకొంటివి
మాపుదాఁకా నిందులోన మఱపున్నదా ॥ పల్లవి ॥

చొక్కపునీవూరిలోనిచుట్టరికా లడిగితే-
నెక్కడెక్కడో మాటలెల్లా నాడేవు
పక్కన నీవెంతేసిపరాకులు సేసినాను
మక్కళించి మాకింతలో మరపయ్యీనా ॥ వీఁపు ॥

గుట్టున నీమేనిసొమ్ముగురుతు లడిగితేను
చుట్టి చుట్టి జూజాలు చూపేవు మాకు
గట్టువాయ(యి?)వై మతకము లెంత సేసినాను
నెట్టన నీపాటికి నేము భ్రమసేమా ॥ వీఁపు ॥

కూడితివి రతినేర్పు యాడ నేర్చితివంటేను
చూడఁ జూడఁ గళలంటి చొక్కించేవు
యీడనె శ్రీవేంకటేశ యెన్ని వేసాలు సేసినా
జాడల నీసటలకు సమ్మతించేమా ॥వీఁపు॥ ॥ 474

## కన్నడగౌళ

[1]ఎంత గారవించేవు యేమిటాఁతి నే నీకు
దొంతరబత్తి సేయఁగ దొరనైతిని ॥పల్లవి॥

భావించి చూచితేఁ దొల్లి పడచుదానను నేను
నీవు మన్నించి యేలఁగా నెలఁతనైతి
వావి దెలుసుకొంటేను వదనమాత్రము నేను
దేవులఁ జేసుకొనఁగ దిట్టనైతిని ॥ఎంత॥

గట్టిగా విచారించితే కడుముద్దరాల నేను
నెట్టన బుద్ధిచెప్పఁగా నేర్పరినైతి
చుట్టరిక మెంచితే మెచ్చుగ మరఁదల నేను
పట్టముగట్టఁగ నింతప్రౌఢనైతి ॥ఎంత॥

చెంగటఁ బాలజలధి సేరి నీవురమున-
నంగవించఁగా నలమేల్మంగనైతిని
రంగగు శ్రీ వేంకటేశ రతి గూడే మేనదాన
ముంగిటినీకృపచేత మోహవతినైతి ॥ఎంత॥ 475

## శ్రీరాగం

ఏఁటికి దూరేవు చెలి నింతలో నీవు
కోటికిఁ బడగెత్తినగురుతులు గావా ॥పల్లవి॥

1. ఇందులో వివావివరుసలు విచారింపవలసియున్నవి.

మచ్చికగలిగినట్టిమగువ గనక గోర-
నెచ్చరించి గీరితే నేమాయను
ముచ్చట నీయందుఁగలమోహపురాసులకెల్లా-
నచ్చముగఁ బెట్టినట్టిలచ్చనలు గావా ॥ ఏఁటి ॥

తీపులు మరిగినట్టితెఱవ గనక మోవి-
నేపున గంటిసేసితే నేమాయను
పైపై నీజవ్వనపు బండారమునకెల్ల
కాపుగాఁ బెట్టినమాణికపుముద్ర గాదా ॥ ఏఁటి ॥

అట్టె చనవరియైన యలమేల్మంగ గనక
యెట్టు పాదాలఁ జిమ్మినా నేమాయను
దిట్ట శ్రీవేంకటేశ రతిమహోత్సవానకు
కట్టినతోరణపుసింగారాలు గావా ॥ ఏఁటి ॥ 476

నాగవరాళి

ఎవ్వరు నెరఁగరంటా యేల బొంకేరు
సవ్వేరు మిమ్ముఁ జూచి నలినాక్షులెల్లను ॥ పల్లవి ॥

చెలియనుదుటిమీఁదిచిన్నారికస్తూరిబొట్టు
చెలువుమీరఁగ నీచెక్కుల నంటె
నిలువునామము నీది నెలఁతనుదుట నంటె
[1]తలకొన్న గురుతులు తారుమారులాయను ॥ ఎవ్వ ॥

కాంతకన్నులఁ బెట్టినకాటుకెల్లా నీమోవి-
వింతబాగులై నేఁడు వెలశున్నది
రంతుల నీబాహుపురి రమణిసందిటఁ జిక్కె-
యింతలోనే మీచేఁత లివ్వ లవ్వలాయను ॥ ఎవ్వ ॥

---

[1] శ్రీగీఁతలు గల యక్షరము చిలుము దిన్నది. నే నూహించినది.

సరి నలమేల్మంగచరణములలత్తుక
సొరిది నీపురమునఁ జూపట్టెను
గరిమ శ్రీ వేంకటేశ కౌస్తుభ మింతికి సొమ్మై
దొరసె మీవలపులు తోడునీడలాయను ॥ ఎవ్వ ॥ 477

ధవళ

ఇందాఁకా సరివచ్చె నింపులెల్లాను
కందువ నీజాడ లిఁకఁ గనుఁగొనేఁ గాని ॥ పల్లవి ॥

నెమ్మిఁ బెండ్లాడినదాఁకా నీచేయి మీఁదైనదాఁకా
నమ్మిక లిచ్చితి విట్టె నాకు నీవు
దొమ్మిసతులు గూడిరి దొరతనమెక్కె నేఁడు
యెమ్మెల నీతలపోఁత లీడ నెట్టోకాని ॥ ఇందాఁ ॥

చివ్వనఁ గరఁగుదాఁకా సిగ్గులువీడినదాఁకా
నవ్వులు నవ్వితివిగా నాతో నీవు
జవ్వనము నాకు నిండె జాణఁడవైతి విపుడు
ఇవ్వల నీపొందులెట్లా నీదేరినో కాని ॥ ఇందాఁ ॥

కళలు రేఁగినదాఁకా కైవసమైనదాఁకా
నలుగడఁ గూడితివి నన్ను నీవు
అలమేలుమంగను నీవదె శ్రీ వేంకటేశుఁడ-
విల నీరతు లేరీతి హెచ్చీనో కాని ॥ ఇందాఁ ॥ 478

సాళంగనాట

కోడెకాఁడు వీఁడుగదె గోవిందరాజు
జోడైన సకులుఁ దాను చొక్కుచున్నాఁడు ॥ పల్లవి ॥

---

క్రీగీతలు గల యక్షరములు చిలుము దిన్నవి. నే నూహించినవి.

పరగఁగ మేలుకొని పవ్వళించివున్నవాఁడు
సారిది దేవుళ్లకు చోటిచ్చినాఁడు
యిరవై మోవివిందుల కెదురుచూచుచున్నాఁడు
తరుణులరతులెల్లాఁ దలపోయుచున్నాఁడు ॥ కోదె ॥

చెప్పరానిసిరులతో సింగారించుకున్నాఁడు
వుప్పతిల్లుఁదమకాన నుబ్బుచున్నాఁడు
కుప్పెఁడుజవ్వాది మేనఁ గుప్పళించుకున్నవాఁడు
అప్పసము సరసములాడుచున్నాఁడు ॥ కోదె ॥

సారె సారె వలపులు చల్లుకొంటా నున్నవాఁడు
వూరడిం చందరిఁ గలయుచునున్నాఁడు
యీరీతి శ్రీవేంకటాద్రి నిరవై తిరుపతిలో
కూరిములు నెరపుచు కొలువున్నాఁడు ॥ కోదె ॥ 479

రేకు 881 ముఖారి

ఏఁటికి దాఁచేవు మాకు నిందు కిట్టె వద్దనేమా
జూటరివలపులు మెయి చొక్కించీని ॥ పల్లవి ॥

ఇన్నిటా నాపెనీసంది యెరుకగలందుకు
కన్నులచూపులలోనే కానవచ్చెను
పన్ని యాపెచే నీమాటపట్టు వుచ్చుకొన్నందుకు
మన్నించినందులోనే మాకల్లాఁ దెలిసెను ॥ ఏఁటి ॥

అంగవించి మీరు చుట్టాలై వుండినయందుకు
యెంగిలిపొత్తు గూడిన నెరిఁగితిమి
అంగము లొకరొకరి అంటి పెనఁగినందుకు
వుంగరాలు వీడుజోడై వుండఁగానే కంటిమి ॥ ఏఁటి ॥

గీతలాగలవి చిలుమదిన్నయక్షరము లు

వొగ్గి ఆలుమగఁడునై వొద్దికై వుండినందుకు
సిగ్గులువడినయందే చిమ్మిరేఁగెను
అగ్గమై యలమేల్మంగనైనందుకు నన్నేలితి
తగ్గక శ్రీవేంకటేశ తమి వొప్పులెత్తెను ॥ఏఁటి॥ 480

లలిత

అందులోనే కానవచ్చీ నన్నిపనులు మాకు
సఁదడి నేమిచెప్పినా సమ్మతి గాదెపుడు ॥పల్లవి॥

పడఁతిమీఁద నీకు బత్తే గలిగితేను
ఉడుగ కాపెపాదాలు వొత్తుమా చూతము
బడిబడి నీవిచ్చినబాసలే నిజమైతే
గుడిగొని వీఁ పెక్కించుకొమ్మా నేఁడు చూతము ॥అందు॥

సొగిసి మీయిద్దరికి చుట్టరికమే కలితే_
నొగి నెంగిలిపొత్తుకు నొగ్గుమా చూతము
మగువచేఁతలకు నీమర్మములు గరఁగితే
తెగువతో గోళ్ల నొత్తించుకొమ్మా చూతము ॥అందు॥

యెలమి నాపెకు నీకు నెరపులు లేకుండితే
బెళకకుండా నుద్దాలు పెట్టుమా చూతము
అలమేలుమంగ నేను ఆపె నీకుఁ బ్రియమైతే
కలసి శ్రీవేంకటేశ కైకొనుమా చూతము ॥అందు॥ 481

పాడి

ఇంతులాల చూడరమ్మ యెటువంటితమకమో
ఇంతలేకుండితే నిది యేఁటిజాణతనమే ॥పల్లవి॥

పొలఁతిరూప మితఁడు బొమ్మచేసి మోము చూచి
తలపోసి గోడ చిత్తరువు వ్రాసి
పలుమారు నప్పటిని బయలులో భావించి
అలరి అట్టె భ్రమసి కలలోనఁ గనీని ॥ ఇంతు ॥

వనితచక్కఁదనము వర్ణించి నవ్వి నవ్వి
తనలోనే మాటలాడి తప్పక చూచి
వెనుకొని చప్పుడైతే వీనుల నాలకించి
వినయాన మూలమూల వెదకి చేచాఁచీని ॥ ఇంతు ॥

వావి దానే యేర్పరచి వలపు పైఁ జల్లుకొని
మోవితేనెకు నోరూరి ముంచు గుక్కిళ్ళు
శ్రీ వేంకటేశుఁడే తాను చెలి యలమేలుమంగ
వేవేగ నురమెక్కఁగా వేమారు గూడీని ॥ ఇంతు ॥ 482

నారాయణి

ఊరకేల దూరేవు వూరివారిని
బీరములాడితిఁగాక పెనఁగితినా ॥ పల్లవి ॥

రవ్వలుసేసితినా రచ్చల వేసితినా
నవ్వినవాఁడవు నీవే నాతితోను
ఇవ్వల నేఁ డిది చూచి ఇంతులెల్లా నాడుకొంటే
దవ్వులనే వింటిఁ గాక తడవితినా ॥ ఊర ॥

పల్లదీఁడవంటినా పచ్చిచేఁత చూపితినా
చల్లినవాఁడవు నీవే సతిపై సేస
చల్లఁగా నిందుకిందపు సన్నలుసేసుకోఁగా
వొల్లనే చూచితిఁ గాక వొరయవచ్చితినా ॥ ఊర ॥

యీడులువెట్టితినా యెరుక సేసుకొంటినా
కూడినవాఁడవు నీవే కోమలాంగిని
తోడనె శ్రీ వేంకటేశ తొల్లె యలమేల్మంగను
వీడె మందుకొంటిఁగాక వేగులు వెట్టితినా ॥ ఊర ॥ 483

బౌళి

ఏల తమకించేవే యెరఁగవా యీకతలు
కోలుముందై తిట్టు నొండె గోరనైనా గీరును ॥ పల్లవి ॥

మగవానితోఁ బలుమరు మాటలాడఁబోతే
వాగరులాడును నొండె వాదివట్టును
నగవులు వచరించి నసువు నటించఁబోతే
మొగిఁ బరాకౌ నొండె మోనాన నుండును ॥ ఏల ॥

వచ్చి వచ్చి నిజముగా పలపులు చల్లఁబోతే
రచ్చ నాడుకొను నొండె రాఁపుసేసును
ఇచ్చకము సేసి కడునింపులు చూపఁగబోతే
తచ్చనలు చూపు నొండె తరితీపుసేసును ॥ ఏల ॥

బలిమిఁ గాఁగిట నించె పట్టి పెనఁగఁగఁబోతే
చలమైనా రేఁచు నొండె సన్నైనాఁజేసు
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనె నిన్నుఁగూడె
వెలయ మన్నించు నొండె వేడుకైనా నించును ॥ ఏల ॥ 484

ఆహిరి

చక్కఁగా నానతీవయ్య సమ్మతించేఁ గాని నేను
పిక్కటిల్లుఁ గోరికలు పెనగొనెనా ॥ పల్లవి ॥

యెలమి మీరిద్దరును యేకతాన నుండితిరి
చెలియ విన్నపములు చెవిఁబట్టెనా
నలువంక మీలోనే నవ్వుకొంటా నుండితిరి
తలకొన్నవలపులు తారుకాణలాయనా ॥చక్క॥

పరగ నిద్దుర నుండి పందేలు వేసుకొంటిరి
తరుణిసరసము చిత్తమువచ్చెనా
మరుగుచు నొడఁబాటుమాట లాడుకొంటిరి
యెరవులేనిపొందు లియ్యకొంటిరా ॥చక్క॥

వేడుకతో నీవునాకె విడేలందుకొంటిరి
చేడెకు నీకాఁగిటిలో సిగ్గుదేరెనా
యీడనె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యీడుతో నీననుపులు యిరవాయనా ॥చక్క॥ 485

రేకు 882 ముఖారి

అనుకొనఁగాని నీతో నందరివలె
వినయములేనిది వెలఁదా యది ॥పల్లవి॥

పంతములాడుకొనేది పలుమారు నవ్వేది
అంతరువెరిఁగినట్టియాఁటదా యది
పంతులకుఁ బెనఁగేది వాసులకుఁ దిరిగేది
కాంతునిఇచ్చయెరిఁగేకామినా యది ॥అను॥

వేసాలఁ బొరలేది వెంగెములు నెరపేది
నేసవెట్టిపెండ్లాడినచెలియా యది
బాస సేయించుకొనేది బలుములు చూపేది
దోసానకువెరచినతొయ్యలా యది ॥అను॥

అట్టడియై మెరసేది పట్టి రచ్చకుఁ దీసేది
గుట్టుగలిగినయట్టికోమలా యది
ఇట్టె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
మట్టె ఇఁక మెచ్చకుంటే మగువా యది ॥ అను ॥ 486

రామక్రియ

అదరిపాటున వచ్చి ఆయములంటీఁ దాను
వుదుటున ముందుముందె వుంగరము వెట్టెనా ॥ పల్లవి ॥

పువ్వుల వేసీ నూరకె పుప్పొడి చల్లీఁ దాను
చివ్వనఁ జుట్టరికముఁ జెప్పుమనవే
నవ్వులు నవ్వీ నింతలో నమ్మికలిచ్చీఁ గమ్మటి
మవ్వముగాఁ దొల్లి పెండ్లిమాట లాడించెనా ॥ అద ॥

కొంగువట్టీ నప్పటిని కుచములంటీ నిదివో
అంగడిఁ బైడి ముడిచి అంపెనా నేఁడు
యెంగిలిపొత్తుకు వచ్చీ యేడనైనాఁ దమకించీ
అంగవించి సోబనపుటక్షత లిప్పించెనా ॥ అద ॥

తప్పకచూచీ నదివో తతిగొని పొందుసేసీ
అప్పుడే పొంకవెట్టెనా అవునా తాను
కప్పి శ్రీ వేంకటేశుఁడు కంకువఁ దానె పెండ్లాడీ
చొప్పుగా నింతులచేత సోబనఁ బాడించెనా ॥ అద ॥ 487

వరాళి

రమణుఁడవు నీవు రమణి నేను
తమితోడ నీవు నాకు దక్కిపుండవయ్యా ॥ పల్లవి ॥

తలఁచి నీవె నన్ను దయఁజూచుట గాక
చెలరేఁగి విన్నపాలు సేసేదాననా
నెలకొన్నబుద్ధి నీవే నేరుపు టింతేకాక
చలపట్టి నీతోను సాముసేసేదాననా ॥ రమ ॥

మంతనానఁ జనవిచ్చి మన్నించుట గాక
చెంతల చుట్టరికము చెప్పేదాననా
వంతులకు నీవె నాపై వలపు చల్లుట కాక
పంతాన నిన్నుఁ జెనకి పచరించేదాననా ॥ రమ ॥

నిక్కముగా నన్ను నేలి నీవే మెచ్చుట గాక
చెక్కునొక్కి యెమ్మె మెరసేటిదాననా
యిక్కువ శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
మొక్కేదానఁ గాక నీతో మొనచూపేదాననా ॥ రమ ॥ 488

సామంతం

ప్రియముగలిగినట్టిపెండ్లికొడుకవు నీవు
నయముతో మొక్కు మొక్కి నవ్వు నవ్వరాదా ॥ పల్లవి ॥

రెప్పలెత్తి చూచి నీతో రెట్టింపుమాట లాడి
చిప్పిలుఁజెమట చిందీ చెక్కులవెంట
వుప్పతించి తిట్టరాదు వొడివట్టి తియ్యరాదు
కప్పురగందికి మచ్చికలు చూపరాదా ॥ ప్రియ ॥

చిగురుమోవి వంచి చేయిఁజేయి నప్పళించి
జిగిమించేవలపులు చిమ్మిరేఁచీని
తగవులఁ బెట్టరాదు తరితీపుసేయరాదు
మగువకు జనవిచ్చి మన్నించరాదా ॥ ప్రియ ॥

కందువతోఁ జన్నులంటి కదుబిగ్గఁ గాఁగిలించి
సందడి మర్మములంటి చల్లీ నూర్పులు
ఇందులో శ్రీ వేంకటేశ యెంచరాదు పంచరాదు
మందగజగమనకు మనసియ్యరాదా ॥ ప్రియ ॥ 489

నాట

ఆయనాయ నీమాటే యనరే ఆతనితోను
యేయెడాఁ దనవిద్యలు నిందరుఁ జూడనివా ॥ పల్లవి ॥

వుదుటున నానతియ్యకుండితే మానెఁగాక
యెదలోనితనయెన్ని కెరఁగనిదా
చెదరక తాఁ గొత్తలు నేసితేఁ జేసెఁగాక
మొదలనే తనతో సాములు నేఁ జేయనివా ॥ ఆయ ॥

ఇక్కడఁ దా నమ్మిక నాకిచ్చితే నిచ్చెఁగాక
చొక్కపుఁదనగుణము సోదించనిదా
అక్కరతో నాచన్నులంటితే నంటెఁగాక
మక్కువఁ దనగోరితో మారుమలయనివా ॥ ఆయ ॥

బెట్టియానలెల్లా నేఁడు పెట్టితేఁ బెట్టెఁగాక
నెట్టనఁ దనసుద్దులు నే విననివా
ఇట్టె తా శ్రీ వేంకటేశుఁ డేలితే నేలెఁగాక
చుట్టపుతనమేలు నేఁ జూడనిదా ॥ ఆయ ॥ 490

తెలుఁగు కాంబోది

ఎవ్వరు నేమి సేతురు యేల దూరేవు చెలుల
జవ్వన మిదెకద చవులు వుట్టించేది ॥ పల్లవి ॥

కనుచూపులేకద కమ్మరఁగమ్మర లోలో
పొనుగకుండా నాసలు పుట్టించేవి
వినుకలి యిదెకద వెక్కసమై వలపించి
తనవోనితమకము దైలువారించేది ॥ ఎవ్వ ॥

ఆడేటిమాటలేకద ఆయములు సోఁకించి
వేడుకలు మీఁదమీఁద వెలఇంచేవి
కూడినకూటమేకద గుణములు పెడరేఁచి
వాడికలు నెలకొల్పి వసముచేసేవి ॥ ఎవ్వ ॥

సరసములివేకద సమ్మతులుగాఁ జేసి
బిరుసుకాఁగిటిలోనఁ బెనఁగించేవి
యిరవై శ్రీవేంకటేశుఁ డేలె నిన్ను నింతలోనె
గొరబుగుబులేకద కొనలు సాగించేవి ॥ ఎవ్వ ॥ 491

రేకు 883 నాగవరాళి

చిత్తగించవయ్య నన్ను చెలువుఁడవు
బత్తిసేయఁగా వలపు పైకొనీని ॥ పల్లవి ॥

అదరి యెదమాటాడ నటు చెలి నంపేనంటే
తదవనీయమి సిగ్గు తతిగొనీని
వాదఁబరచ నీయింటి కొగి నేవచ్చేనంటే
తదఁబడీ నడుగులు తమకానను ॥ చిత్త ॥

గక్కన నిన్ను నేఁ గాఁగిలించుకొనేనంటే
అక్కజపు హారములు అడ్డమయ్యీని
చిక్కించుక నీకు నేఁడు చేతులెత్తి మొక్కేనంటే
పక్కనఁ జన్నులమీఁద పయ్యద జారీని ॥ చిత్త ॥

చిట్టనై నీమోవితేనెతీపు చవిగొనేనంటే
అట్టె కడుఁ బరవశమందీ మనసు
యిట్టె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను, నిట్టె
చుట్టరిక మెంచేనంటే సొంపులెత్తీఁ గళలు ॥ చిత్త ॥ 492

ఆహిరినాట

నీవెఱఁగనితగవు నే విన్నవించేనా
వేవేలైనాఁ దమలోన వేసరింతురా ॥ పల్లవి ॥

కడువలచినవారు కదియవత్తురు గాక
యెడమాట లాడింతురా యింతులచేత
యెడయలేనివారు యింపులు నేతురు గాక
జడియక బొమ్మలను జంకింతురా ॥ నీవె ॥

పాయరానియట్టివారు పైపై నవ్వుదురు గాక
చాయలా సన్నలా నింత సాదింతురా
ఆయమెఱిఁగినవారు అట్టె మెప్పింతురు గాక
కాయకపుచేఁతలను కాకు సేతురా ॥ నీవె ॥

తగులాయమైనవారు తతిగొనుందురు గాక
పగటున కాఁతాళించి పచ్చిసేతురా
నిగిడి శ్రీ వేంకటేశ నెలఁతఁ గూడితి విట్టె
అగడుగా రతులలో నలయింతురా ॥ నీవె ॥ 493

ముఖారి

ఎట్టు దెలియఁగవచ్చు నెదలోనిమీసుద్దులు
ఒట్టిగొన్నలోలోనిజాణతనా లేఁటివో ॥ పల్లవి ॥

పవళించి నీవుండఁగా పానుపువద్దఁ గూచుండి
చెవిలో విన్నప మేమినేసీ నీకాపె
తవిలి నీమొగము తప్పకచూచి యప్పటి
నవముగా సన్న సేసినవ్వీ నది యేఁటిదో ॥ ఎట్టు ॥

పైకొని నీవింతులచే పాటలు వినుకొనఁగా
ఆకుమీఁద నేమి వా(వ్రా?)సియంపీ నీకాపె
జోకతో నంతటిలోనే సొరిది నాయము లంటి
రేకలు దీసి యెచ్చరించీ నది యేఁటిదో ॥ ఎట్టు ॥

కొలువుకూటములోన గుట్టుగా విచారించుకోఁగా
చెలిచే నీకేమి బుద్ధిచెప్పించె నాపె
యెలమి శ్రీ వేంకటేశ యిట్టె నన్ను నేలితివి
తలపుమాఁటున నాకె తలపించె నేఁటిదో ॥ ఎట్టు ॥ 494

పాడి

ఈతఁడు చలమరౌత యెఱఁగవా తొల్లి నీవు
చేతులెత్తి మొక్కి యిట్టె సేవసేయరాదా ॥ పల్లవి ॥

తడఁబడువిభుఁడు తనపై నానవెట్టి
వొడివట్టి తియ్యఁగాను వోపనందురా
జడిసి వొడ్డాణము జారెఁ గుచ్చుల పీడె
[1]కడఁగీతనిదుప్పటి గప్పుకొనరాదా ॥ ఈతఁ ॥

రాఁపుల నింటికి వచ్చి రమణుఁడు నీతోను
కాఁపురముసేయఁగాను కాదందురా
పైపైఁ గొప్పు వదరె భావము నివ్వెర గందె
తీపులమోవి యొసగి తెరవెయ్యరాదా ॥ ఈతఁ ॥

---

1. కడఁగి + ఈతని

యెన్నిక శ్రీ వేంకటేశుఁ దేకతాన నిన్నుఁ దీసి
చన్నులంటి కూడఁగాను చాలునందురా
కన్నులఁ దేటలుమించెఁ గళలు మోమున నిండె
అన్నువ గోర నూఁది యాదరించరాదా :: ఈతఁ ॥ 495

దేసాళం

మగవానితో నింత మారుకొందురా
తగవులేలడిగేవే తతిగొని నీవు ॥ పల్లవి ॥

గొప్పలై నసీచన్నులు కోరి పిసికెనంటా
తప్పులేల యెంచేవే సంచడిఁ బతిని
ముప్పిరిగా లచ్చెనలు మోవిమీఁద నున్నవంటా
చొప్పులేల యెత్తేవే సోదించి నీవు ॥ మగ ॥

చెంత నుండి యీతఁడే చేరి కొంగువట్టెనంటా
పంతాలేల దుస్సేవే పలుమారును
మంతనాన నాతఁడు మర్మములు ముట్టెనంటా
రంతులేల సేసేవే రచ్చలోనను ॥ మగ ॥

కగ్గులేక యీతఁ డిట్టె కాఁగిలించుకొనెనంటా
సిగ్గులేల నెరపేవే చెలులఁ జూచి
అగ్గమై శ్రీ వేంకటేశుఁ డదె తానె నన్నుఁ గూడె
అగ్గలపురతి నెంత అలయించేవే ॥ మగ ॥ 496

శంకరాభరణం

ఔనయ్యా నీదేవులంటా నలయి కెలఁగవద్దా
తానకమై నేమెల్లా నింతకు నోపఁగలమా ॥ పల్లవి ॥

బత్తితోడ నీకుఁ జెలి పాదములు గుద్దఁగాను
సత్తపుచనుగుబ్బలు గునిసీనవె
తత్తరానఁ జేసురటి తడఁబడ విసరఁగా
చిత్తడిచెమట గారీఁ జెక్కులవెంటను ॥ఔన॥

అంది యంది యప్పటి నీ కాకుమడి చియ్యఁగాను
కందువలఁ గంకణాలు గల్లనీ నీవె
సందడి వింజామర సారెసారె వేయఁగాను
పొంది నిట్టూర్పులు రేఁగె పుక్కిటిబంటిగను ॥ఔన॥

కడఁగి నీమేన నిండాఁ గస్తురి యలఁదఁగాను
మెడనున్న మాణిక్యాలు మెరిచీ నవె
తడవి శ్రీవేంకటేశ తగ నన్ను నేలితివి
పడఁతి నివ్వెరగందీఁ బరవశమునను ॥ఔన॥ 497

రేకు 884 ధన్నాసి

పాయరానిమగఁడవు పట్టపుదేవుల నేను
రాయిడి సేయకుమీ రవ్వసేసి యిఁకను ॥పల్లవి॥

మాఱుకొని నినుఁ బిల్చి మాటలాడితిని
ఆఱడిఁ బెట్టకుమీ అందరిలోన
వేఱులేక నీకు మొక్కి వేఁడుకొంటిఁ గమ్మటిని
వీఱిడిఁ జేయకుమీ వేగిరించి నన్నును ॥పాయ॥

నెలపుల నవ్వి నీకు చేసన్న సేసితి
వెలుపలఁ జెప్పకుమీ వెక్కసానను
మొలకచన్నుల నొత్తి ముచ్చట మాటాడితి
చలానఁ బెనఁగకుమీ సారెసారె నిపుడు ॥పాయ॥

కచ్చుపెట్టి మోవి ఇచ్చి కాఁగిలించుకొంటిని
పచ్చిసేయకుమీ నన్ను పంతమునను
ఆచ్చపలమేలుమంగనై నన్ను నేలితివి
ఇచ్చకపుశ్రీ వేంకటేశఇమ్మి చనవు ॥పాయ॥ 498

రామక్రియ

మగువగుంపెన నీకు మంచిదాయను
తగవులఁ బెట్టఁగానే తమి రేఁగెను ॥పల్లవి॥

చలము సాదించేనంటా సతి నిన్ను జంకించితే
చెలరేఁగి లోలోనిసిగ్గు చేరెను
బలిమి సీవు సేయఁగాఁ బట్టిపెనఁగఁజూచితే
యెలమిఁ జన్నులపై పయ్యద జారెను ॥మగు॥

తరితీపు సేసేనంటా తగుల మాటలాడితే
గొరబై నవలపు లుంకువలాయను
కెరలించేనంటా నిన్ను కెంగేలు వట్టితేను
సురతకాంక్షలకును చోటాయను ॥మగు॥

కడునలయించేనంటా కాఁగిట బిగించితేను
జడిగొన్న వేడుకలు సతమాయను
అడరి శ్రీ వేంకటేశ అలమేలుమంగ యిట్టె
కడఁగి వురమెక్కితేఁ గాణాచి అయను ॥మగు॥ 499

నాదరామక్రియ

పోరానిచుట్టరికము పొంచి యాతనికి నీకు
సారెఁ బ్రియముచెప్పగా సాదింతురటవే ॥పల్లవి॥

చిప్పిలఁ బతి నవ్వఁగా చెలి యేల జంకించేవే
కప్పురాన వేయఁగాను కాఁకలేల చల్లేవే
కుప్పళించి మొక్కఁగాను గొణఁగి యేల తిట్టేవే
వొప్పగు విడెమియ్యఁగా నొల్లనందురటవే ॥ పోరా ॥

తగిలి నిన్నుఁ జూడఁగా తలవంచుకొననేలే
సొగిసి గోర సోఁచఁగా సొలయనేలే
చిగురుమోవి ఇయ్యఁగా సిగ్గులువడఁగనేలే
తగవు నడపఁగాను తమకింతురటవే ॥ పోరా ॥

పాపటకు దువ్వఁగాను పంతములాడఁగనేలే
చేపట్టి మన్నించఁగాను చిమ్మిరేఁగ నీకేలే
యేపున శ్రీ వేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
వోపి రతిఁ జొక్కించఁగా నొద్దుకొందురటవే ॥ పోరా ॥ 500

సామంతం

నీవైనా నానతీవయ్య నీకేల యింతేసిసిగ్గు
భావించ నలవిగాదు పంత మిదియేఁటిదో ॥ పల్లవి ॥

చేతిమీఁదఁ జేయివేసి చెలి నిన్ను మెచ్చిమెచ్చి
యేతులకు నవ్వు నవ్వె నేఁటికోకాని
దూతికమొగము చూచి తోడనే సన్నలుసేసి
కాతరపుమాట లేమికారణాన నాడెనో ॥ నీవై ॥

గుబ్బలు నీమేన నూఁది కొసరి కొసరి ఇంతి
పుబ్బున మొక్కులు మొక్కీ నూహ యేఁటిదో
గబ్బియై ముంజేతిచిలుకతో నేకతము చెప్పి
అబ్బురాన నంది పండు అది యేఁటికిచ్చెనో ॥ నీవై ॥

పురముపైఁ గూచుండి వొగి నలమేలుమంగ
అరుదుగాఁ గానుకిచ్చె నదియేఁటికో
ఇరవై శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
సరిగా నేపని కాపె చవులు వుట్టించెనో ॥ నీవై ॥ 501

బౌళి

మగవాఁడు మెత్తనైతే మరి యపకీర్తి గాదా
తగవు నెరపకుంటే తరుణులు మెత్తురా ॥ పల్లవి ॥

నీపదాలు వాడి ఇంతి నిన్నుఁ గాఁగిలించెనంటా
కోపగించి నీదేవులు కొంగువట్టెను
చూపెట్టుక వున్నాఁడవు చొక్కి విడిపించవద్దా
యీపాటివాఁడవైతే యెవ్వరు నమ్మేరు ॥ మగ ॥

సేవసేసేఆఁటది చేరి పాదా లొత్తెనంటా
వోవరిలోఁ దనవద్ద నుంచుకొన్నది
నీవద్దికి నంపుమని నేఁ డాపెకుఁ జెప్పకుంటే
యీవలావలిపొందు లెట్టు జరగీని ॥ మగ ॥

నాటక్క(క?)సాలమగువ నవ్వి నిన్నుఁ గూడెనంటా
మేటియలమేల్మంగ మీరనియ్యదు
నీటున శ్రీ వేంకటేశ నీవె తెచ్చుకొనవలె
మాటపట్టు లెటువలె మచ్చిక రేఁచీని ॥ మగ ॥ 502

కన్నడగౌళ

ఇప్పుడేమి వేగిరము యీన్నియు నయ్యీఁగాక
కప్పుర మవదరించు కానుక వట్టినది ॥ పల్లవి ॥

అలసివచ్చిననిన్ను నంత మాటాడించనేల
వెలయఁగఁ బవళించు విసరే నేను
వలపులదిష్టిదాఁకి వాడివున్నది నీమోము
బలిమినైనా నిద్రించు పాదాలు గుద్దేను ॥ ఇప్పు ॥

చెమటవెట్టినమేను చేతుల నంటఁగనేల
తమితో నూరకుండు గందము వూసేను
సమరతి నోలలాడి జారివున్న దిదె కొప్పు
అమర నాతొడపైఁ బె[1]ట్టలరులు నించేను ॥ ఇప్పు ॥

పచ్చిపులకలచెక్కుపై గోర నూఁదనేల
గచ్చులముసుఁ గిదుకో కాఁగిలించేను
కుచ్చి శ్రీ వేంకటేశుఁడ కూడితివి నన్ను నిట్టె
తచ్చి నాకు మోవాసఁగు దప్పులు దీర్చేను ॥ ఇప్పు ॥ 503

రేకు 885 దేశాక్షి

నాపంతము లీడేరె నన్ను మన్నించితివి
వోపిక నీవేమిచ్చినా వొల్లనన నిఁకను ॥ పల్లవి ॥

మాయింటికి వచ్చితివి మాచే మొక్కించుకొంటివి
నీయింతు లేమైనాననని యిఁకను
చేయి నాపై వేసితివి చెప్పినట్టు సేసితివి
వేయి చెప్పినా నీసుద్దులు వినే నే నిఁకను ॥ నాపం ॥

విందు లారగించితివి వీడె మందుకొంటివి
అందులకే నే నవ్వేను అట్టే ఇఁకను
గందము మైఁ బూసితివి కంకణము గట్టితివి
యెందుకైనా నీసేఁతకు ఇయ్యకొనే నిఁకను ॥ నాపం ॥

1. పెట్టు + అలరులు

నమ్మించితివి నన్ను నాపై నేస వెట్టితివి
వుమ్మడి నొకమనసై వుండే నిఁకను
నెమ్మది శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
సమ్మతి మోవిచ్చితివి చవిగొనే నిఁకను ॥ నాపం ॥ 504

గౌళ

ఇయ్యఁగదె కానుక నీయెదుట నున్నాఁ డతఁడు
నెయ్యపుమాట లాడఁగా నేనోపనందురా ॥ పల్లవి ॥

దవ్వులనుండి యాతఁడు తగుల నిన్నుఁ జూచితే
నవ్వుదురుగాక వదనము వంతురా
పువ్వులచెండున నిట్టె పూఁచి నిన్ను వేసితేను
వువ్విళ్ళూర మొక్కుటగా కూరకవుండుదురా ॥ ఇయ్య ॥

మలసి సొలసి నీతో మాట లాతఁ డాడఁగాను
చెలిమిసేతురు గాక చేరకుందురా
పిలిచి నిన్నుఁ బేర్కొని ప్రియములుచెప్పఁగాను
కొలువుసేతురుగాక గుట్టునఁ గొంకుదురా ॥ ఇయ్య ॥

శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జిత్తగించి కూడఁగాను
భావిం చలమేల్మంగవు పదరుదురా
చేవమీరి నీకితఁడు నేస లిట్టె పెట్టఁగాను
వేవేలై మెత్తురుగాక వెంగెము లాడుదురా ॥ ఇయ్య ॥ 505

ఆహిరి

ఇటని విన్నవించరే ఇంతులాల పతితోను
తటుకున నిఁ(నిం?)పైతే దండకు రమ్మనరే ॥ పల్లవి ॥

మనసువచ్చినయంతె మాఁటలు
　కనుచూపు నాఁటినంతె కాంక్షలు
　తనువులు సోఁకినంతె తమకములు
　వినయములు గలయంతె వేడుకలు ॥ ఇట ॥

సరసములాడినంతె సంగాతాలు
　సరుసఁ గొలిచినంతె సలిగెలు
　మరిగియుండినంతె మంతనాలు
　హరుషమైనయంతె ఆదరింపులు ॥ ఇట ॥

సముకముగలయంతె చనవులును
　సుముఖత్వమైనయంతె చుట్టరికము
　రమణుఁడు శ్రీవేంకటరాయఁడు దాను
　అమర నవ్వెలె నేను అలమేలుమంగను ॥ ఇట ॥ 506

## వరాళి

నిగిడి నేఁ గంటిఁగా నీసరితలెల్లాను
　ముగురెరిఁగినపని మూఁడులోకా లెఱుఁగు ॥ పల్లవి ॥

వరుస నాపెఇంటికి వచ్చేనని నీవు రాఁగా
　గొరబుగా నొకతె నీకొంగు వట్టెను
　యెరవులవాఁడవై యేమని బొంకఁగలవు
　వెరవున నాకె ఇందు వెదక వచ్చినను ॥ ౯గి ॥

వింతగాఁ దొల్లిటాపెకు విడెము నీవంపఁగాను
　అంతలోనే యీాకె వచ్చి అందుకొనెను
　బంతి నుండి యెట్టు వొడఁబరచఁగ నేరుతువు
　యింతలో నాకె దెలిసి యీాడకు వచ్చినను ॥ నిగి ॥

అప్పటాపెఁ బేరుకొని అట్టె నీవు విలువఁగా
వొప్పుగా నడుమ నీకె వూఁకొనెను
చిప్పి లలమేల్మంగను శ్రీ వేంకటేశ యేలితి-
విప్పు డాకె వచ్చితేను యిందరిఁ గూడితివి ॥ నిగి ॥ 507

లలిత

కాంతకు నీకునునేల కాఁతాళాలు
వింతవారెల్లా నీకు వెక్కసమయ్యేరా ॥ పల్లవి ॥

సారెసారె నీదేవులై జంకించ వచ్చేఁగాక
తేరసతులెల్ల నినుఁ దెమలించేరా
నేరుపరిగనక తా నిన్ను వెంగేలాడెఁగాక
వూరివారెల్లా నిట్టె వొరయవచ్చేరా ॥ కాంత ॥

వడి నీమోహపుటింతి వట్టినేరా లెంచెఁగాక
కడవారెల్లా నిన్నుఁ గక్కసించేరా
అడియాలమైనయాపె ఆనలెల్లాఁ బెట్టెఁగాక
బడిబడివారెల్లా పాడివట్టేరా ॥ కాంత ॥

నెట్టన నలమేల్మంగ నీవురాన నిల్చెఁగాక
పొట్టఁబొరుగువారెల్లా బోదించేరా
ఇట్టె శ్రీ వేంకటేశ ఇటు నే మొక్కితిఁగాక
చుట్టపువారెల్లా నింతసోదించేరా ॥ కాంత ॥ 508

కేదారగౌళ

ఇంతి నీతో నవ్వఁగాను యెదురుగా ననుపులు
దొంతివెట్టి వలపులు దోమటి దొడికేవు ॥ పల్లవి ॥

వావి నిన్నడిగేటివనితఁ జూచి నీవు
మోవితేనె లడిగేవు మొక్కలీఁడవై
కావికన్నులఁ జూచి కడుఁజొక్కఁగాఁ బిల్లఁ—
గోవిరాగాల నప్పటిఁ గొచ్చి కరఁగించేవు ॥ ఇంతి ॥

పేరు చెప్పుమని నీతోఁ బెనఁగఁగా నాపెచెక్కు—
గోరు దాఁకించేవు నీవు కోడెకాఁడవై
వూరుఁజెమటలతోడ వొాగి మొక్కఁగా ముత్తేల—
పేరులెల్లా మెడవేసి ప్రేమము రేఁచేవు ॥ ఇంతి ॥

ఆటలాడ రమ్మనుచు నలమేల్మంగ దూరఁగా
పాటలు పాడుమనేవు పల్లదీఁడవై
గాఁటపు శ్రీవేంకటేశ కలయఁగా సమరతి—
తేటలనే మెప్పించి తీపు వుట్టించేవు ॥ ఇంతి ॥ 509

రేకు 886 దేశాక్షి

ఇదివో నీమహిమలు యెవ్వ రెరుఁగుదురయ్య
మదనతంత్రములు మరపితి వేమో ॥ పల్లవి ॥

చెలిచేత నే నీకుఁ జెప్పియంపినమాటలు
మలసి నీమోము చూచి మరచెనేమో
యెలమి నాపైనైనా నీడకు నంపవైతివి
పలుకులనే నీవు భ్రమయించితివేమో ॥ ఇది ॥

పొందుకు నాపెచే నీకుఁ బుత్తెంచినవిడెము నీ—
సందడిపరాకునఁ దా నందెనో యేమో
ఇందుకైనా మారుసుద్ది యెరిఁగించవైతివి
గొంది నిట్టె లిలఁపించుకొంటివో యేమో ॥ ఇది ॥

శ్రీ వేంకటేశుఁడ నీకుఁ జేయెత్తి మొక్కమంటే
భావించి నీవు గూడఁగా భ్రమసె నేమో
యీవల నలమేల్మంగని ఇటు నన్ను నేలితివి
మావతఁ దెచ్చితివి మన్నించితివేమో(?) ॥ఇది॥ 510

గౌళ

వింటిరటే చెలులార వింతసుద్ది ఇదొకటి
వొంటినీచేఁతలు చూచుకుందాన నేను ॥పల్లవి॥

శిరసు మజ్జనమాడి చిక్కుదీసుకొనఁగాను
సరుసనున్నాకెఁ దాఁకె సన్నపుగోరు
సిరుల నితఁడు సన్న సేసెనంటా నాకె వచ్చి
సొరిదిఁ గాఁగిలించితే చూచి నవ్వె నితఁడు ॥వింటి॥

బలుసొమ్ములు నించుక పరిమళాలు వూయఁగ
చెలియొకతెపైఁ బొట్టు చిమ్మిపడెను
కలయికకు గురుతు గావించెనంటా వచ్చి
మలసి మోము చూచితే మరినవ్వెనితఁడు ॥వింటి॥

అట్టె శ్రీ వేంకటేశుఁడు అలమేల్మంగఁ గూడఁగా
[1]కట్టఁగడాకెఁ దాఁకె గక్కనఁ బాదము
ఇట్టె తానుఁ బెండ్లాడ యెచ్చరించెనంటా వచ్చి
యెట్టయెదుట నిల్చితే యెనసి తా నవ్వెను ॥వింటి॥ 511

పాడి

ఏమి చెప్పేవు నీసుద్దు లెరఁగమటే
నేము [2]నీవలన కామా నెట్టన విభునికి ॥పల్లవి॥

---

1. 'కట్టఁగడ'లో అరసున్న వింత. 2. 'వలెనె' అనుటకు 'వలన' కాఁబోలు.

పంతమాడేదానవు పడఁతులఁ బెట్టిపంపి
కాంతుని రప్పించుకొనఁ గారణమేమే
ఇఁ(ఇం?)త యెమ్మెలదానవు యెదురుగాఁబో యతని–
కఁ(కం?)తకంతకును వినయాలు సేయనేలే ॥ ఏమి ॥

కడువాసికత్తెవు కందువ నాతనిఁ జేరి
అడియాలమైనసొమ్ము లడుగనేలే
వొడఁబడనిదానవు వూడిగాలెల్లాఁ జేసి
ఁడిగొన్న కెమ్మోవి చవిచూపనేలే ॥ ఏమి ॥

దొరతనాలదానవు దొరసి శ్రీవేంకటేశుఁ
గరగించి కూడితివి కతలేఁటికే
నిరతి నన్నేలినాఁడు నేనలమేలుమంగను
మరిగి యప్పటి నీవు మలయనేమిటికే ॥ ఏమి ॥ 512

దేసాళం

ఆతనికి నీకుఁ బొందులౌత నేనెఱఁగనే
నీతితోఁ జెలులలాగు నేఁడు గంటినే ॥ పల్లవి ॥

యెగసక్కెలకు విభుఁ డిటువలెఁ జేయఁగాను
తగవు లేమిచెప్పేవే తరుణి నీవు
మగవాఁడంటా నేఁడు మరి వొలపటాలాడి
మగువలతోనేల మాయలు సేసేవే ॥ ఆత ॥

కడునొద్దారా లాడకు కాంతుఁడు నవ్వఁగా నన్ను
వొడఁబరచేవదేమే వువిద నీవు
అడరి రమణుఁడంటా నాతనివంకలు దిద్ది
పడఁతుల నింతయేల భ్రమలఁబెట్టేవే ॥ ఆత ॥

చలాలకు శ్రీ వేంకటేశ్వరుఁడే నన్నుఁ గూడఁగా
అలుక లెంత దీర్చేవే అంగన నీవు
బలువుఁడంటా నతనిఁ బాలార్చె వలమేల్మంగ
చెలులమంటానేల సిగ్గులు రేఁచేవే ॥ అత ॥ 513

నీలాంబరి

ఎందువోయీ వలపులు ఇల్లాల నేను
ముందర నిలువవయ్య మొక్కేము నీకు ॥ పల్లవి ॥

జిగినూడిగపువారు సేవలెల్లాఁ జేయఁగాను
తగినయిల్లాండ్లపైఁ దలఁపున్నదా
మగఁడుగలవనేమాట గలిగితేఁ జాలు
మొగము చూపవయ్య మొక్కేము నీకు ॥ ఎందు ॥

ఆసవెట్టి మగనాండ్లు అట్టె కానుక లంపఁగా
సేసవెట్టినాండ్లపైఁ జిత్తమున్నదా
యీసులేక నీవు నవ్వేయీపెద్దరికమే చాలు
మోసములేదు రావయ్య మొక్కేము నీకు ॥ ఎందు ॥

పొట్టఁబొడగుసతులు పొంచి సేవసేయఁగా
పట్టపుదేవులమీఁద బాఁతి వున్నదా
అట్టె శ్రీ వేంకటేశ అలమేలుమంగను నేను
మట్టి నన్నుఁ గూడితివి మొక్కేము నీకు ॥ ఎందు ॥ 514

కన్నడగౌళ

నీవు నేను గురిగాక నెలఁత లెందరు లేరు
కైవసమైనమీఁదఁ గల్లలాడేవా ॥ పల్లవి ॥

చేసిననీచేఁతలెల్లా చెలిచేత వింటిమి
రాసితో నీవానతియ్యవలెనా మాకు
వోసరించి యేడలేనివొట్టులు వెట్టుకోనేల
కాసుచేయనిపనికి కల్లలాడేవా ॥ నీవు ॥

కమ్మటి నీపనులెల్లా కన్నులెదుటఁ గంటిమి
యెమ్మెలు నాకుఁ జూపనేఁటికి నీవు
నమ్మమని చేయిచ్చి నన్ను భ్రమయించనేల
కమ్మక యింతదొరవు కల్లలాడేవా ॥ నీవు ॥

ననుపైననీవలపు నాకునాకే యెఱిఁగితి
యెనసి తలఁపించఁగ లా నీకు
అనుఁగుశ్రీ వేంకటేశ అలమేల్మంగను నేను
ఘనత నన్నేలితివి కల్లలాడేవా ॥ నీవు ॥ 515

రేకు 887 లలిత

నీతో నవ్వఁగలమా నెరజాణవు
గాతనేయ కెపైనాఁ గరుణించవయ్యా ॥ పల్లవి ॥

గోవులనెల్లాఁ గాచి గొల్లెతలపొందు నేసి
కోవిదుఁడ వైతివి గోవిందరాజా
వావు లొక్కటిగాఁ జేసి వన్నెకాఁడవై తిరిగి
గోవాళుఁడ వైతివి గోవిందరాజ ॥ నీతో ॥

దూడలఁ గొన్నాళ్లు గాచి తూలేటివుట్లు గొట్టి
కూడుకొంటివి బాలుల గోవిందరాజ
వేడుకకాఁడవై వేవేలు నేఁతలు నేసి
కోడెకాఁడ వైతివి గోవిందరాజ ॥ నీతో ॥

చిఱుతవాఁడవై నీవు చీరలు దొంగిలుకొని
కొఱతలు మాన్పితివి గోవిందరాజ
యెఱిఁగి శ్రీ వేంకటాద్రి నిందరినిఁ బెండ్లాడి
గుఱిగా నిలిచితివి గోవిందరాజ ॥నీతో॥ 516

హిందోళం

చేరి వూరకుంటే తానే సిగ్గువడును
నేర మెంచకు మనరే నే నంటఁగాకుందాన ॥పల్లవి॥

పచ్చడ మందుకోరే పాదాలు గడుగరే
రచ్చసేసి వచ్చినాఁడు రమణుఁడు
గచ్చుల దూరకురే గక్కనఁ బీఁటవెట్టరే
నెచ్చెలులకై దండతో నిలిచియున్నాఁడు ॥చేరి॥

వీడెము చేతికియ్యరే విసరరే సురటిని
ఆడానీడాఁ దిరిగాడి అలసినాఁడు
వాదెననకురే మోవి వడిఁ బానుపు వేయరే
వేడుకఁ బండేఇల్లు వెదకుచున్నాఁడు ॥చేరి॥

పువ్వులు ముడువరే పూయరే మేనఁ గస్తూరి
పువ్విళ్లూరఁ జెమటతో నున్నవాఁడు
యివ్వల శ్రీ వేంకటేశుఁ డిట్టె నన్నుఁ గాఁగిలించె
చివ్వన నాలునాళ్లు సేసిన దెఱిఁగినాఁడు ॥చేరి॥ 517

మంగళకౌశిక

ఇతవరిఁ గనక నీకెరుఁగించితి
కతలేర్పడకుండితే కాంతలు నవ్వేరు ॥పల్లవి॥

చెలితో నేకతమాడి చెప్పుతానుండె నీసతి
కలవెల్లా నీసుద్దులే కాఁబోలును
అలివేణితో నీవు ఆడుకొని రావయ్యా
తెలుపుకొనకుండితే తెరవలు నవ్వేరు ॥ ఇత ॥

సుదతికి నిన్ను వేలఁ జూపుతానుండె నీసతి
అదన నీప్రసంగమే అది గాఁబోలు
పదిలాన నీనేరాలు పాపుకొని రావయ్యా
ముదులకించకుండితే ముదితలు నవ్వేరు ॥ ఇత ॥

నడుమ శ్రీవేంకటేశ నవ్వుతానుండె నీసతి
కడుఁగడు నిన్నుఁ జూచేకాఁబోలును
అడరి నన్నేలితివి ఆమాఁ టడిగి రావయ్యా
తడవ కూరకుండితే తరుణులు నవ్వేరు ॥ ఇత ॥ 518

## సౌరాష్ట్రం

[1]ఎవ్వరు నిన్నాడుకొనే రిక్కఁడ నే నుండఁగాను
అవ్వల నీమనోరథా లడిగి రావయ్యా ॥ పల్లవి ॥

పొలఁతి మాటలాడఁగా పోచిళ్ల చల్లితినంటా
వెలి నాలకించుకొంటా వినేవు నీవు
తలఁపుకొలఁది నాకె తారుకాణలే చెప్పె
ఫలించె సగినము లోపలికిఁ బోవయ్యా ॥ ఎవ్వ ॥

సరసా లాపే[2]డఁగా సగినాలు చూచెనంటా
గొరబై పలుకు లెంచుకొనేవు నీవు
అరుదుగ నీవు గోరినటువలెనే కలసె
సరివచ్చె సగినము సంగడికిఁ బోవయ్యా ॥ ఎవ్వ ॥

---

1. దీనిభావము స్పష్టమగుటలేదు. 2. ఆపె + ఆడఁగా

ఆపెకతలు చెప్పఁగా నర్చించుకున్నాఁడంటా
జోకఁ బాటముసేసుక చొక్కేవు నీవు
యీకడ శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యేకమాయ సగినము యింటికిఁ బోవయ్యా ॥ఎవ్వ॥ 519

తోండి

ఇచ్చకురాలు గనక యేమీననదు గాక
పచ్చిచేఁతలకెల్లాను పడఁతి వోపినదా ॥పల్లవి॥

కొమ్మఁ జెఇవట్టి తీసి కొసరేవు తొలుతనె
రమ్మని పిలువఁగాను రాననెనా
యెమ్మెల కిందరుఁ జూడ నింతసేసితివి గాక
దిమ్మరి నీగుంపెనకు తెరవ వోపినదా ॥ఇచ్చ॥

బలిమిఁ జేయివట్టించి పైపైఁ దమ్మ వుమిసేవు
చెలి కప్పుడే చెప్పఁగా సేయదాయనా
చలము లిందరిలోన సాదించితివి గాక
వలవనిసటలకు వనిత వోపినదా ॥ఇచ్చ॥

యీడఁ ఁన్నులు విసికే వింతిపానుపుమీఁదట
కూడినట్టెల్లా నియ్యకొనదాయనా
వేడుక కిందరిలో శ్రీ వేంకటేశ నవ్వేవు గా-
కేడలేని బీరాలకు నీకాంత వోపినదా ॥ఇచ్చ॥ 520

నాదరామక్రియ

ఎవ్వరిది నేర్పు మనయిద్దరిలోనా
జవ్వను లిందరుఁ జూచి సంతోసించేరు ॥పల్లవి॥

వాడిలోని నిమ్మపండు వొగిఁ జేతఁ దియ్యఁగానే
పిడికిటఁ బట్టి యట్టె పెనఁగేవు
తొడిఁబడ నంతలోనే దొడ్డకుచ్చెల వీడితే
కడఁగి నీపచ్చడము గప్పుకొనవలదా ॥ ఎవ్వ ॥

పయ్యెదలోని విడెము పట్టి నీ కియ్యరాఁగానే
కొయ్యవై పొదిగిపట్టి గుంపించితివి
చయ్యన బయలుగాఁగా చన్నులకు నీకుళ్ళాయి
వొయ్యనే మాటుగా నొనర్చుకోవలదా ॥ ఎవ్వ ॥

కొప్పుపూవుబంతి దీసుకొని కానుకియ్యరాఁగా
అప్పళించి నీకాఁగిట నలమితివి
యిప్పుడే శ్రీ వేంకటేశ యింతలో సిగ్గువిడఁగా
విప్పుచు గక్కనఁ దెరవేసుకోవలదా ॥ ఎవ్వ ॥ 521

రేకు 888 భైరవి

వీనులార నీవే ఇటు విందువు రావే
ఆనవెట్టి పిలువఁగనంపీఁ జెలులను ॥ పల్లవి ॥

పవళించి యున్నవాఁడు బాగా లియ్యవే పతికి—
నివల జూజ మేమాడే వింతులతోను
జవళిని చలములు సాదించేవేళ గాదిది
తివిరి పిలువుమంటాఁ దిట్టీఁ జెలులను ॥ వీను ॥

ముందే మేలుకన్నవాఁడు మోము చూపవే పతికి
చెంది యేమిమాటాడేవు చిలుకతోను
గొందినే కాఁకలు రేఁచి కొసరేవేళ గాదిది
కందువకు నంపుమని కసరీఁ జెలులను ॥ వీను ॥

చెనకి సేసవెట్టవే శ్రీ వేంకటపతికి
గునిసేవేమే ముద్దులు కోవిలతోను
యెనసితి విఁక బయలీఁదించేవేళ గాదిది
పెనఁగించుమనుచుఁ గుప్పించీఁ జెలులను ॥ వీను ॥ 522

ముఖారి

సేసినదెల్లాఁ జేఁత చెల్లుఁబడాయ మీకు
మోసులుగా నవ్వరాదా మోహమెల్లాఁ గంటిమి ॥ పల్లవి ॥

దగ్గరనుంటే మీఁక తమకము వుట్టుఁగాక
సిగ్గువ [1]దెల్లఁతనుంటే చింతిరేఁగదా
యెగ్గులేదు పతితొడ యెక్కుక కూచుండఁగదే
వెగ్గళించి కాదనేమా వెరపేల ఇఁకను ॥ సేసి ॥

మొగములు చూచుకొంటే ముచ్చట లీడేరుఁగాక
నిగిడి తలవంచితే నిండదా కాఁక
తగవౌమగనితోను దట్టించి మాటాడఁగదే
జగడించేవా రున్నారా సటలేల ఇఁకను ॥ సేసి ॥

ఇట్టె కాఁగిలించుకొంటే నితవులై వుండుఁగాక
గుట్టుననుంటే చెమట గుబులుకోదా
జట్టిగొని శ్రీ వేంకటేశ్వరుఁడు నన్నిటు గూడె
అట్టు[2] కొత్తగా నయ్యెరా గుట్టేల ఇఁకను ॥ సేసి ॥ 523

శ్రీరాగం

ఎప్పుడు దలఁచే వీకెపై నీవు
అప్పుడే కూడఁగవద్దా అయ్యో నీవు ॥ పల్లవి ॥

---

1. సిగ్గువడి + అల్లంత. 2. సాధు శకటరేఫయతి వీరిలో కొత్తదే. 'రట్టు' అనియు వ్రాతగలదు చూ:- 526 పా. 2-4. వ్రాయసకాని తప్పిదమో?

అక్కరతో నాసపడి అట్టె మోము చూచేచెలిఁ
జెక్కు నొక్కవైతివిగా చెల్లఁబో నీవు
మక్కళించి వీనుల నీమాట లాలకించేదాని
గక్కనఁ బిలువవద్దా కటకటా నీవు ॥ ఎప్పు ॥

నెలవుల నవ్వు దేర చెంగలించి మొక్కెసతి
అలమి మెచ్చఁగవద్దా ఆహా నీవు
కొలువుసేయుచు నిన్నుఁ గూరిమి గొసరేదాని
అలరి లాలించవద్దా అవునయ్యా నీవు ॥ ఎప్పు ॥

నిండు జవ్వనముతోడ నిన్నుఁ గోరుచున్న యింతి-
నండఁ బెట్టుకొనవద్దా . మ్మరో నీవు
దండిగా శ్రీ వేంకటేశ తగ నిన్నుఁగూడె నిట్టె
పఁ(పం?)డుమోవి యియ్యవద్దా బాపురే నీవు ॥ ఎప్పు ॥ 524

## సామంతం

ఊరకేల దూరేవు వూరివారినెల్లాను
చేరి నామోము చూచితే చేయెత్తి మొక్కితినే ॥ పల్లవి ॥

చింతదీర నతఁడు నీచేతికి లోనై వుండఁగా
పంతములాడుకోనేలే పలుమారును
వింతవారిఁ గూడకుండా వేడుకైతే నింకా నీవు
కాంతుని నీమొలఁ గుచ్చి కట్టుకొనఁగదవే ॥ ఊర ॥

చెలువుఁ డీతఁ డిదె నీకుఁ జెప్పినట్టు సేయఁగాను
యెలమి నీరపము గా కిఁక నెన్నఁడే?
కలసి నీ వొక్కతెవే కైకొన నాసగలితే
తలమీఁదఁ బెట్టుకొని దాఁచుకొనఁగదవే ॥ ఊర ॥

శ్రీ వేంకటేశుఁడు నిన్నుఁజేరి పెద్దసేయఁగాను
సేవలు సేతువుగాక సిగ్గులేదవే
యీవల నన్నితఁ దేలె నింకా నీకు వలసితే
భావించి కాఁగిలించుక బడివాయనీకువే ॥ ఊర ॥ 525

బౌళి

మగువలాల బుద్ధు లీమానినికిఁ జెప్పరే
యెగసక్కెములయాపె యేల వచ్చె నీడకు ॥ పల్లవి ॥

మంతనాన విభుఁడు నామర్మములు చెనకితే
చెంతనున్న తానేల సిగ్గువడీనే
వంతులకు మాలోన వలపులు చల్లుకొంటే
ఇంత కతకారియాపె యేల వచ్చె నీడకు ॥ మగు ॥

జడిగొని పతి నాతో సరసము లాడఁగాను
నడుమనుండి తానేల నవ్వు నవ్వీనే
తడఁబడి మాలో నేము తమకానఁ బెనఁగితే
యెడపులరట్టడాపె యేలవచ్చె నీడకు ॥ మగు ॥

శ్రీ వేంకటేశుఁడు నన్నుఁ జేరి కాఁగిలించఁగాను
ఆవల నుండి తానేల అంటవచ్చీనే
చేవమీర మాలో నేము సేసలువెట్టుకోఁగా
యీ వేళ బిత్తరియాపె యేలవచ్చె నీడకు ॥ మగు ॥ 526

ఆహిరి

ఎంత నన్నుఁ బొగడేవు యిందరిలోన
సంతతపు మోహములు చల్లఁగలఁ గాక ॥ పల్లవి ॥

నిన్ను మెప్పించఁగ నేను నేరుతునా యేమైనాను
కన్నులనే మొక్కనేర్తుఁగాక నీకు
సన్నలుసేసి వట్టియాసల ముంచఁగలనా
చిన్నదాననై సేవలు సేయఁగలఁగాక ॥ ఎంత ॥

సరసములాడి నీతో సాటికి రా నోపుదునా
వొరసి యిచ్చకమాడ నోపుదుఁగాక
తరితీపు చూపి కొత్తలు సేయఁగలనా
పెరరేఁచి కోరికలే పెంచఁగలఁగాక ॥ ఎంత ॥

మించి నీకంటె పంతాన మెరసేటిదాననా
పొంచి మేనదాననై భోగింతుఁగాక
అంచెల శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
యెంచఁగలనారతుల నించఁగలఁగాక ॥ ఎంత ॥ 527

889వ రేకు లేదు.

రేకు 890. లలిత

నిన్నుఁ బాయఁగలనా నీకెదురాడేనా
సన్నల చాయల నిన్ను ఁరసితిఁగాక ॥ పల్లవి ॥

వొడివట్టి పెనఁగఁగా నోపనంటే నేమందువు
అదరి మాయింటికి రావయ్యా నీవు
వెడవెడ సతులను వెంటఁబెట్టుక రాఁగాను
తొడిఁబడ నేనూరకే దూరితిఁ గాక ॥ నిన్నుఁ ॥

చెక్కు నొక్కి వేఁడుకోఁగా సేయనంటే నేమందువు
అక్కరతోఁ గూచుండవయ్యా నీవు
చొక్కుచుఁ బెరకాంతలసుద్దులు చెప్పుకొనఁగా
చక్కఁగా బొమ్మల నిన్ను జంకించితిఁ గాక ॥ నిన్నుఁ ॥

పొంచి కాఁగిటఁ గూడఁగా పొనిగితే నేమందువు
అంచెల నిట్టె మన్నించవయ్యా నీవు
యెంచఁగ నన్నేలి యేడో ఇంతులతోఁ జెప్పుకోఁగా
కాంచక శ్రీవేంకటేశ కొసరితిఁ గాక ॥ నిన్నుఁ ॥ 528

పాడి

ఉండవయ్య ఇఁక నీవు [1]వొబ్బుద్దితోను
నిండుకొనె నవ్వులెల్లా నేఁడు నా సెలవుల ॥ పల్లవి ॥

బొంకక చెప్పితివిగా పొందుల నీసుద్దు లెల్లా
కొంకక నా మనసులో కోపము మానె
అంకెల నేఁ బెట్టుమన్నఆన వెట్టుకొంటివిగా
మంకునాచలములెల్లా మట్టుపడీ నిపుడు ॥ ఉండ ॥

తగ నియ్యకొంటివిగా తారుకాణించినవెల్లా
యెగసక్కెములవుడు కెంతయుఁ బాసె
తగవరులు చెప్పితే తల వంచుకొంటివిగా
వెగటులన్నీ నుడిగి వేడుకలాయను ॥ ఉండ ॥

సిగ్గులువడితివిగా చేఁతలు దలపించి
వెగ్గళించిన తొల్లిటివెత దీరెను
నిగ్గుల శ్రీవేంకటేశ నీవు నన్నేలితివిగా
తగ్గనిభోగముల సంతసము లీడేరెను ॥ ఉండ ॥ 529

వరాళి

మాకుఁ దెలియవు మీలో మర్మము లివి
వాకున నాడఁగరాదు వర్ణించుకో నీవే ॥ పల్లవి ॥

1. ఒక+బుద్ధి=ఒ+బుద్ధి=ఒబ్బుద్ధి. విం త్రైన త్రికసమాసము.

దాకొని యొకఇద్దరు తరుణులు నిన్నుఁ జూచి
యేకతము లాడుకొనే రేఁటికోకాని
కైకొని నీవు సేసినకల్లలేమైనాఁ గలితే
చేకొని తలఁచుకొమ్మా చిత్తములో నీవే ॥ మాకుఁ ॥

యెన్నికతో తమ్ముఁదామె ఇట్టె నీభావములకు
సన్నలుసేసుకొనే రాచందమేఁటిదో
కన్నవిన్ననీమతకములేమైనాఁ గలితే
వున్నతిఁ దెలుసుకొమ్మా వూహించి నీవే ॥ మాకుఁ ॥

వువ్విళ్లూరఁ గూడి నిన్నొందురులు శ్రీవేంకటేశ
నవ్వుకొనేరు రతులనను పెట్టిదో
ఇవ్వల నన్నేలితివి ఇంకా నీగుట్టు గలితే
రవ్వగాఁ దెలుసుకొమ్మా రపముగా నీవే ॥ మాకు ॥ 530

శంకరాభరణం

దూరనేల ఇఁక నిన్ను తోడఁదోడను
వారికివారే మెచ్చేరు వాడవాడను ॥ పల్లవి ॥

నటనల నీమాటలు నయగారాలు
ఘటనలమోహము బంగడిబేరాలు
యెటువలె నిన్ను నెంచే దిఁక నేరాలు
తటుకున నాడరాదు తగవరిబీరాలు ॥ దూర ॥

పేరడైన నీనవ్వులు పెండ్లి సేసలు
వారక మంచితనాలు వట్టియాసలు
చేరిచేరి యేఁటికిఁ జేసేవు బాసలు
నారుకొనఁ గట్టితివి నాకు నల్లఁబూసలు ॥ దూర ॥

---

వ్రాతప్రతిలో గల వన్నియు చిలుము తిన్నవి. నే నూహించినవి.

తలకొని సేసేవు తరితీపులు
కలసితి వేఁటికి నింకా రాఁపులు
చలువాయ నాకు నీచల్లఁజూపులు
కలిగి శ్రీవేంకటేశ కాఁగిటి సీదాపులు ॥దూర॥ 531

### మాళవిగౌళ

చిత్తగించు రమణుఁడ చెలిమొగమై నీవు
చిత్తజుకేలికిని సింగారించుకొన్నది ॥పల్లవి॥

నిమ్మపండ్లంతలేసి నిక్కినచన్నులు నీకు
వుమ్మడిఁ గానుక వట్టుకున్నది చెలి
తమ్మిదపౌఁజులకొప్పు తోడుచూపేనంటాను
పమ్మి పచారించుకొని పనివడి యున్నది ॥చిత్త॥

తేనెపెరవంటిది తియ్యనిమోవి నీకు
పూని విందువెట్టేనని వున్నది చెలి
పూనికనుఁ గలువలు పూజసేసేనంటా నీకు
ఆనుకొని నీరాకకు అదె కాచుకున్నది ॥చిత్త॥

కరికుంభజఘనపుగజరాజలక్ష్మిని
వారసి నీసొమ్ము చేసుకున్నది చెలి
యిరవై శ్రీవేంకటేశ యీకె నిట్టె కూడితివి
గొరబు కాఁగిటి కింకాఁ గోరుచున్నది ॥చిత్త॥ 532

### తెలుఁగుఁగాంబోది

సెలవుల నవ్వులాడ సిగ్గులువడఁగనేల
చలువగాఁ గెమ్మోవి చవిచూపరాదా ॥పల్లవి॥

---

క్రిగీతలు గల యక్షరములు చిలుము దిన్నవి. నే నూహించినవి.

నేరుపెల్లా మెరయుచు నీతో మాటలాడీఁ జెలి
  వూరటలు సేసుకొని వూఁకొనవయ్యా
  ఆరయ వీడెమిచ్చి ఆకులు చుట్టిచ్చీని
  ఆరీతి చేతులు మార్చి అందుకొనరాదా ॥ నెల ॥

తమకమెల్లాఁ యెంచి తప్పక చూచీఁ జెలి
  సుముఖుఁడవై మోము చూపవయ్యా
  అమర సింగారించి యట్టె విరులు ముడిచీ
  రమణితొడపై నీశిరసు మోపరాదా ॥ నెల ॥

గొరబు లెల్లాఁ జేసి కుచముల నొత్తీఁ జెలి
  వుర మాపె కొప్పగించి వుండవయ్యా
  యిరవై శ్రీ వేంకటేశ యేవితివి నన్ను నిట్టె
  మరిగి యాపెను నీవు మన్నించరాదా ॥ నెల ॥ 533

రేకు 891 వసంతవరాళి

అన్నియు నీవెరుఁగుదువనే దిఁక నేమున్నది
  కన్నులె గొప్పలుగాని కడుఁజిన్ని మొగము ॥ పల్లవి ॥

దండనే నే వుండఁగాను దయఁజూడవలెఁ గాక
  చండివెట్టి పెనఁగుతా సాముసేతురా
  పండుమోవిపసే కాని పలుచనిదాన నేను
  అందుకొని కొసరేవు అలయఁగనోపను ॥ అన్ని ॥

సేవలు నీకుఁ జేయఁగా చేరి మెచ్చవలెఁగాక
  రావాడి చెనకుతా రవ్వసేతురా
  యీవలఁ ఁన్నులే గొప్ప లించుకంతె నెన్నడుము
  వోవలఁబెట్టితే నంత వోఁచుకోనోపను ॥ అన్ని ॥

---

క్రీగీఁతలు గల యక్షరము చిలుము దిన్నవి. నే నూహించినవి.

నీసతినై వుండఁగానే నెమ్మది నుంతువు గాక
ఆస చూపి తరితీపు లడరింతురా
వాసితో శ్రీ వేంకటేశ వడి నన్నుఁ గూడితివి
పోసరించెఁ బిరు; దురమునఁ బాయనోపను ॥ అన్ని ॥ 534

హిజ్జిజి

ఊరకే నీవు లోఁగివున్నాఁడ వింతెకాక
చేరి నీవేమిసేసినా చెల్లదా నీకు ॥ పల్లవి ॥

పడఁతి పొదగంటేను బాగా లిచ్చితివి గాని
తొడపై నిడుకొంటేను దోసమా నీకు
చిడుముడి నిలిచితే చేయివట్టితివి గాని
వాడివట్టి తీసితేను వొద్దనేరా నిన్నును ॥ ఊర ॥

కొలువుసేసెనంటా కొప్పుదువ్వితివి గాని
ఇలఁ గాఁగిలించుకొంటే హీనమా నీకు
అలరి మాటాడితేను ఆసచూపితివిగాని
కలసి పెండ్లాడితేను కాదనేరా నిన్నును ॥ ఊర ॥

చెంతఁ బాయకున్నదంటా చెక్కు నొక్కితివిగాని
యెంత వంచనసేసినా నెగ్గా నీకు
ఇంతలో నన్నేలి యాకె నేలేవు శ్రీ వేంకటేశ
బంతి నెంతమన్నించినా పంగించేరా నిన్నును ॥ ఊర ॥ 535

నాగగాందా(ధా?)రి

ప్రియురాలు నీకెదురు వెట్టివలపులు నించె
నియతాన నీవును మన్నించఁగదయ్యా ॥ పల్లవి ॥

వనజాక్షిపయ్యెదలో వట్టువచన్నులు నీకు
    ననుపున నుంకువధనము బిందెలు;
    పెనగొన్నసింగారపుబిరుదు బటువుదింటు—
    తనరారుమంచిరత్నాలపెండ్లిపీట; ॥ప్రియ॥

తరుణితురుములోనితగుమల్లెమొగ్గలు
    తిరమైనసేసకు నెత్తినముత్యాలు;
    పరిపరిచవులతోఁ బరగుతేనెలమోవి
    వరుసఁ బెట్టినట్టిబువ్వపుఁబళ్ళెము; ॥ప్రియ॥

పడఁతికాఁగిటిలోని బాహులతలు నీకు
    తొడిఁబడ నొనరించేతోరణాలు;
    అడరి శ్రీవేంకటేశ అలమేలుమంగ నీకు
    కడలే కెప్పుడు మెడఁగట్టినతాళి ॥ప్రియ॥ 5?6

దేసాళం

ఊడిగపువారము వొద్దనుండేవారము నే—
    మీడుజోడైనవారు మీరెరఁగరా తగవు ॥పల్లవి॥

పంతము లాకెకుఁ జెల్లు పైకొనఁగ నీకుఁ జెల్లు
    పొంతనే యిద్దరికిని బువ్వము చెల్లు
    కాంతల నేమడిగేరు గరిసించి గరిసించి
    ఇంతేసివారు మీకె(రె?)రఁగరా తగవు ॥ఊడి॥

వెస గుట్టాపె కమరు వినయము నీకమరు
    వసుధ నిద్దరికిని వల పమరు
    అసురుసురగుచును అందరి కేమిచెప్పేరు
    యెసగినదొరలు మీ రెరఁగరా తగవు ॥ఊడి॥

శ్రీ వేంకటేశుఁడవు చెలి యలమేలుమంగ
దేవర లిద్దరుఁ గూడితిరి మీలోనే
భావించి పచ్చిగా నేమినవ్వేరు
యీవల మీరే జాణలు యెరఁగరా తగవు ॥ ఊడి ॥ 537

శంకరాభరణం

ఏమని పొగడుదుమే యిఁక నిన్నును
ఆమనిసొబగులఅలమేల్మంగ ॥ పల్లవి ॥

తెలిఁగన్నుల నీతేటలేకదవే
వెలయఁగ విభునికి వెన్నెలలు
పులకలమొలకలపొదు లివిగదవే
పలుమరుఁ బువ్వులపానుపులు ॥ ఏమ ॥

తియ్యనినీమోవితేనెలే కదవే
వియ్యపురమణుని విందు లివి
ముయ్యకమూసినమొలకనవ్వుగదె
నెయ్యపుఁగప్రపునెరిబాగాలు ॥ ఏమ ॥

కైవసమగునీకాఁగిలేకదవే
శ్రీ వేంకటేశ్వరుసిరినగరు
తావుకొన్నమీతమకములేకదే
కావించిన మీకల్యాణములు ॥ ఏమ ॥ 538

కన్నడగౌళ

కరుణింతువు గాని కాంతను నేము
అరమరపుల నిఁక నలయకుమీ ॥ పల్లవి ॥

జిగురువంటిది నాచిత్తములోనివలపు
తగరువంటిది నీపై దాకొన్నయాస
తగిలి తగిలి నిన్నుఁ దరవులువెట్టఁగాను
వెగటులు సేసుకొని వేసరకుమీ ॥ కరు ॥

సూదిరాయివలె నంటు సొరిది నాతోపొందు
దూదివలె మెత్తన కందువకాఁగిలి
ఆదిగొని నేను నీయాయములు ముట్టఁగాను
ఆదరింతువు గాని మారాడకుమీ ॥ కరు ॥

చిగురునఁ బోలు [1]నాచేచేతివూడిగము
పగటువిందులఁ బోలు బహురతులు
అగపడి కూడితి నిన్నలమేలుమంగ నే నీకు (?)
జిగి శ్రీ వేంకటేశుఁడ చెదరకుమీ ॥ కరు ॥ 539

రేకు 892 సౌరాష్ట్రం

చెవిలో నేకత మేమిచెప్పేవయ్యా
కవగూడి నీవద్దనే కాచుకున్నదానను ॥ పల్లవి ॥

యేపున నీగురుత నేమేలెఱఁగమయ్యా
చూపులసాములు సేసేసూడుకాఁడవు
తీపులనీసుద్దులెల్లా తెలిసితిమయ్యా
ఆపనులకే తిరిగేఅందగాఁడవు ॥ చెవి ॥

వెలయ నీసరితలు వినమటవయ్యా
పలుకుల సానఁబట్టేపంతగాఁడవు
నిలువునీసింగారము నేఁడు గంటిమయ్యా
మొలకనవ్వులపెను మొత్తగాఁడవు ॥ చెవి ॥

1. సమాసములోగూడ 'చేచేత'వలె ద్విరుక్తి.

అంది నిన్నుఁ బొగడితి నౌఁగదవయ్యా
పొందులరతుల మంచిపోదికాఁడవు
ఇందుకె శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
విందులమోవితేనెల వేడుకకాఁడవు ॥ చెవి ॥ 540

అమరసింధు

విన్నపము సేయుమనె వేడుకతో నీకు మమ్మ
చెన్నుమీరిన ట్టాయింతిచెలలము సుమ్మీ ॥ పల్లవి ॥

చిత్తమురా నీకు నాకె సేవలు సేయనేరుచు
మొత్తముగాఁ బాదాలకు మొక్కనేరుచు
పొత్తుకుఁ దీసి నిన్ను పొగడఁగనేరుచు
ఇత్తల నేమిసేసేవు ఇంటికి రారాదా ॥ విన్న ॥

ఇచ్చకము సేసి నిన్ను నియ్యకొలుపనేరుచు
నచ్చుదీర సీతోను నవ్వనేరుచు
పచ్చిసేఁతలను నిన్ను పనిగొననేరుచు
ఇచ్చితివి చనవులు యింటికి రారాదా ॥ విన్న ॥

అలమేలుమంగ యీకె అంకెఁగూడఁగనేరుచు
పొలఁతి శ్రీ వేంకటేశ భోగించనేర్చు
అలరితి రింతలోనె ఆకె నీవు నిద్దరును
యెలమితో నిట్లానె యింటికి రారాదా ॥ విన్న ॥ 541

నాదరామక్రియ

అందులోనే కానవచ్చీ నన్నిభావాలు
విందులు వెట్టఁగరాదా వెలఁదికి మోవి ॥ పల్లవి ॥

కొప్పు దువ్వి యాకె నిట్టె కోరి వొడఁబరచేవు
కప్పిననీమాఁటలు కాదనీనా
చిప్పిల నింతటిలోనే చెక్కు-లెల్లాఁ జెమరించె
తప్పకచూడరాదా తరుణినెమ్మోము ॥ అందు ॥

సెలవుల నవ్వుతానే సిగ్గు విడిపించేవు
చెలరేఁగి చెప్పినట్టు సేయకుండీనా
తలఁపులు దైవారి తనువెల్లాఁ బులకించె
సొలయుచు నీ వంటిచూడరాదా యింతిని ॥ అందు ॥

కూడితి వలమేల్మంగఁ గొంకక శ్రీ వేంకటేశ
పాడిపంతా లింకా నీతోఁ బచరించీనా
వేడుకకళలతోడ విఱ్ఱవీఁగి రతులను
జోడై యిట్టె చూడరాదా సొబగు లిన్నియును ॥ అందు ॥ 542

శంకరాభరణం

ఎమ్మెకాఁడు గదె యీదేవుఁడు
కుమ్మరించీ మేలు గోవిందరాజు ॥ పల్లవి ॥

గొల్లెత లిందరు కొలువుసేయఁగ-
నల్లదె సరసమాడుచును
తెల్లనికన్నులతేటచూపులతో
కొల్లున నవ్వీని గోవిందరాజు ॥ ఎమ్మె ॥

పడఁతు లిద్దరు పాదా లొత్తఁగాను
అదరి కుచము లంటుచును
వెడగుమాటలు వేవే లాడుతాను
కొడుకుఁ గనెను గోవిందరాజు ॥ ఎమ్మె ॥

వూడిగపువారు వొద్దనే వుండఁగ
జాడువలపులు చల్లుచును
వేడుకతో శ్రీ వేంకటాద్రిమీఁదఁ
గూడీ నిందరిని గోవిందరాజు ॥ఎమ్మె॥ 543

కన్నడగౌళ

నీదేవులు సేసేసేఁత నేము సేసేమా
యీదెస నిద్దరు నున్నా రిఁకనేఁటిసుద్దులు ॥పల్లవి॥

వూడిగాలవారము వొరసేమా నిన్ను నంత
ఆడానీడా నిచ్చకములాడేము గాక
పాడిపంతాలతో నీచే బాససేయించుకొనేమా
జోడుగూడ బుద్ధిచెప్పి చొక్కించేము గాక ॥నీదే॥

చెలికత్తెలము నేము చెరఁగువట్టి తీసేమా
చెలఁగి మీ కొడఁబాటు సేసేము గాక
చలపట్టి నిన్ను మరి సారె సారె దూరేమా
పొలసి మీనేర్పులు పొగడేము గాక ॥నీదే॥

చుట్టపువారమట రేసున బలిమిసేసేమా
మెట్టిపట్టి మీరతులు మెచ్చేము గాక
ఇట్టె శ్రీ వేంకటేశ యెనసితి రింతలోనె
గుట్టున మీమేళ్లెల్లాఁ గోరెము గాక ॥నీదే॥ 544

రీతిగౌళ

చెల్లుఁగదె యాతఁడేమిసేసినా నీయెడకును
పల్లదాన నింతేసి పఅచకువే ॥పల్లవి॥

వొగ్గి యాతఁ డిట్టె నీవొడివట్టెనంటాను
సిగ్గులువడకువే చెలియా
తగ్గక అట్టె బలిమిఁ దమ్ములమిడెనంటాను
దిగ్గనఁ దొదలుమాఁటఁ దిట్టకువే నీవు ॥ చెల్లుఁ ॥

సారె కొనగోళ్లను నీచన్నులు దాఁకించెనంటా
బీరాన జంకించకువే ప్రియురాలా
కోరి నవ్వుతా నీకొప్పు వట్టి తీసెనంటా
మేర మీరకువే మందెమేళమునను ॥ చెల్లుఁ ॥

కప్పి శ్రీ వేంకటేశుఁడు కాఁగిలించి కూడెనంటా
తప్పులువట్టకువే తరుణి
చిప్పిలు నీమోవితేనె చేకొని నీ కిచ్చెనంటా
వుప్పటించకువే యింత వుదుటునను ॥ చెల్లుఁ ॥ 545

రేకు 893 పడవంజరం

ఏమిటికి మాతోనే యెగసక్కెలు
చేముట్టి యాతని నీవే చెనకఁగరాదా ॥ పల్లవి ॥

మలసి యాతనితోను మాటలాడితినంటాను
వెలఁదిరో నీవేల వెంగమాడేవే
వలచి వచ్చి విభుఁడు వద్దనే కాచుకున్నాఁడు
చలము లాతనితోనే సాదించరాదా ॥ ఏమి ॥

ననుపున నాతనితో నవ్వులు నవ్వితినంటా
కనుఁగొని నీవెంత కాఁతాళించేవే
చనవున నాతఁడు చన్ను లంటుకున్నాఁడు
తనిసి యాతని నీవే తప్పులెంచరాదా ॥ ఏమి ॥

కందువ శ్రీ వేంకటేశుకాఁగిట నుందాననంటా
చెంది కాలుదొక్కి యేల చెనురించేవే
మందెమేళాన నీతఁడే మనసిచ్చుకున్నాఁడు
పొంచుసేసుక నీవును పొగడఁగరాదా ॥ఏమి॥ 546

సాళంగం

ఏమాయ నింతలోను ఇట్టె చెప్పినట్టు సేసి
భామకు నీ వొకమాటు పంతమియ్యరాదా ॥పల్లవి॥

బలిమిఁ బానుపుమీఁదఁ బవళించి వున్న దదె
వెలఁదిని వొకమాటు వేఁడుకొనరాదా
చెలులము బుద్ధులెల్లాఁ జెప్పి వేసరితి మిదె
ములువాఁడిగోరిచేత మొక్కఁగరాదా ॥ఏమా॥

దీమసాన నేకతానఁ దెరవేసుకొన్న దిదె
కోమలి తొడమీఁదఁ గూచుండరాదా
నేమెల్లాఁ బ్రియముచెప్ప నేరిపితి మిందాఁకా
వేమారుఁ జెక్కులు నొక్కి విడెమియ్యరాదా ॥ఏమా॥

తమకాన నీయెదుటఁ దలవంచుకున్న దిదె
కొమరెఁ గాఁగిట నిట్టె కూడఁగరాదా
మముఁజూచి యాకె నిట్టె మన్నించి శ్రీవేంకటేశ
సముకాన నీమోవి చవిచూపరాదా ॥ఏమా॥ 547

పాడి

అన్నిటికి నోపుఁ దాను ఆఁటదాన నేను
వెన్నవట్టుకొని నెయ్యి వెదకఁగఁదగునా ॥పల్లవి॥

ఆసతోడ నేఁ దన్ను ఆయము లంటఁగాను
    వేసారకు మనవే వేమారును
    నేసవెట్టి పెండ్లాడె చేత కంకణము గట్టె
    బేసబెల్లితనమున పెనఁగఁగఁదగునా ॥ అన్ని ॥

భావించి సరసములు పలుమారు నాడఁగా-
    నేవంక పరాకు తనకేఁటికే యది
    వావు లౌనగూడఁ జెప్పె వలపులు పెదరేఁచె
    చేవమీరినపనికి సిగ్గువడఁదగునా ॥ అన్ని ॥

కాఁగిలించుకొని తన్నుఁ గందువలఁ గూడఁగాను
    వీఁగఁజెల్లునా శ్రీవేంకటేశుఁడు
    తోఁగించె చెమటనీరు తొక్కినాఁడు పాదము
    మాఁగినమోవి యొసఁగి మచ్చువేయఁదగునా ॥ అన్ని ॥ 548

## మాళవి

ఉండవయ్యా చాలుఁజాలు వొరయకు మమ్ము నిఁ(నిం?)త
    నిందువావులు చెప్పేది నీసాజము ॥ పల్లవి ॥

యెక్కడనుండి వచ్చి ఇంతులు పొలసినాను
    నిక్కినిక్కి చూచేది నీసాజము
    చక్కనివారిఁ గంటే సరికి బేసికి నీవు
    నెక్కొని నవ్వునవ్వేది నీసాజము ॥ ఉండ ॥

తేరకే వచ్చినయట్టితెరవలతోడుత
    నేరుపుమాటలాడేది నీసాజము
    పోరచి నీయిరుగుపొరుగులవారితో
    సీరతులు చెప్పేది నీసాజము ॥ ఉండ ॥

అచ్చలాన నే పొద్దూ నండనుండి పనిసేసే-
నెచ్చెలులఁ గూడేది నీసాజము
పచ్చిగా శ్రీవేంకటేశ పలుమారు మన్నించి
నిచ్చలు మమ్ము నేలేది నీసాజము ॥ఉండ॥ 549

## నాదరామక్రియ

ఇచ్చకము నెరపితే నేమాయనే
పచ్చిమాట లాడితేనే పదర నేమిటికే ॥పల్లవి॥

కుచ్చలపై వొడ్డాణము కొనచూపులఁ జూచితే
కొచ్చి కొచ్చి యేమిటికి గొణఁగేవే
మెచ్చుట నీకంకణము ముట్టి చూచినంతలోనే
రిచ్చల నింతటిలోనే రేఁగనేఁటికే ॥ఇచ్చ॥

కొప్పుపై మొగలిరేకు కూడఁగఁ జెరిగితేను
తప్పులేల యెంచేవే తమకించి
చిప్పిలఁ బయ్యదకొంగు చేరి చక్కఁబెట్టితేను
వుప్పతించి యెంతేసి వొట్లువెట్టేవే ॥ఇచ్చ॥

అలమేల్మంగవు నిన్ను నక్కునఁ బెట్టుకొంటేను
నలువంక నీవేమి నవ్వు నవ్వేవే
యెలమిని శ్రీ వేంకటేశుఁడ నేఁ బొగడితే
మెలుపున నెంతేసిమెచ్చు మెచ్చేవే ॥ఇచ్చ॥ 550

## కుంతలవరాళి

ఇద్దరు నిద్దరే మీరు యిన్నిటాను జాణలు
పొద్దు వొద్దునకు నిట్టె పొందుసేయవయ్యా ॥పల్లవి॥

వాడికెకు మాటలాడి వన్నెలకుఁ బొడచూపి
వేడుకలు నేసీని వెలఁది నీకు
యేడనుండో వచ్చి నీవు యెమ్మెలకు నలసేవు
నీడనుండి వగరించ నేరుచుకోవయ్యా ॥ఇద్ద॥

సటలకు నవ్వు నవ్వి చవులకు మోవి చూపి
గుటుకల నోరూరించీఁ గోమలి నీకు
మటమాయలకు నీవు మరి వలపు చల్లేవు
తటుకున చెమటలతడి చూపవయ్యా ॥ఇద్ద॥

పురముపై నెలకొని పుదుటునఁ గాఁగిలించి
మరిగెఁ గూడి యలమేలుమంగ నీకు
యెరవు లేక మన్నించి యిద్దరు మమ్మేలితిరి
యిరవై శ్రీవేంకటేశ యిట్టె మెచ్చవయ్యా ॥ఇద్ద॥ 551

రేకు 894 **పేళావళి**

ఎఱుఁగుదు నీమనసు ఇంతా నేను
జఱయ కానతీవయ్యా చలములు సేయక ॥పల్లవి॥

యేమేమి సేవసేసెనో యేకతాన నీకుఁ జెలి
ఆముకొని బాఁతిపడే వందుకే నీవు
చేముంచి అందుకంటెఁ జేసే నే నూడిగము
కామించి యానతీవయ్యా కడమలు వెట్టక ॥ఎఱుఁ॥

యేరీతి మొక్కుకొనెనో ఇచ్చకముసేసి యాకె
కోరి అవే తలఁచేవు కొంకక నీవు
సారె నాలాగుననే వేసారక నేఁ బెనఁగేను
నేరుపవయ్యా నాకు నీవే అన్నియును ॥ఎఱుఁ॥

యెటువలెఁ గూడెనో ఇట్టె యలమేలుమంగ
తటుకున నవ్వేవు దానికే నీవు
ఘటన శ్రీవేంకటేశ కైకొంటి విన్నట్లానే
గుటుకల మోవీవయ్యా కొసరుగా నీవు ॥ఎటు॥ 552

కురంజి

కంటిమయ్యా యీభాగ్యము కన్నులతుదల నేము
జంటలై బదుకరయ్యా చల్లగా నిద్దరును ॥పల్లవి॥

పెదవితేనియ లాని పిరుఁదుపైఁ జెయివేసి
వదలించితివి నీవి వనితకు
పొదిగి చన్నుల నూఁది బుగబుగఁ జెమరించి
మదము గురియఁజొచ్చె మానిని నీమీఁదను ॥కంటి॥

పుక్కిటివిడియ మిచ్చి పొందుగాఁ గాఁగిలించి
చెక్కుఁజెక్కు మోపితివి చెలియకు
తొక్కినపాదముతోడ తొడఁదొడఁ గీలించి
ముక్కున నూర్పు విసరీ ముదిత నీమీఁదను ॥కంటి॥

పచ్చడము పైఁగప్పి పలురతులనుఁ గూడి
మెచ్చితి వలమేలుమంగకు
అచ్చమై శ్రీవేంకటేశ అన్నిటా నిన్నుఁ జొక్కించి
లచ్చనలు నించఁజొచ్చె లలన నీమీఁదను ॥కంటి॥ 553

శ్రీరాగం

మాపొందు సేయుమా మచ్చికలతోడ
ఆపనిఁ దిరుగఁగా నదవదలాయ ॥పల్లవి॥

మందమగువలు మాటలాడుకోఁగా
కందువల నీకుఁ గతలాయ
సందడించి పైఁపైఁ జల్లు లమ్మఁగా
చిందుచు నీమేన జిరుతులాయ ॥ మాపొం ॥

నటన నందరును నవ్వులు నవ్వఁగా
గుటుక నీమోవి గురులాయ
తటుకున లోలోఁ దనువు లంటఁగా
జోటజోటఁ జెమటలు చొతుకులాయ ॥ మాపొం ॥

చెలరేఁగి యందరు సేవలుసేయఁగ
కలిమాయ శ్రీవేంకటవిభుఁడా
అలమేలుమంగనై ఆయము లంటఁగా
బలిమి వేడుకల గొబ్బునఁ బదనాయ ॥ మాపొం ॥ 554

## మేఁచబౌళి

ఆతఁడు నీకంటె జాణఁ డదెఱఁగవా
యేతుల కిన్నిటానేల యెలయించేవే ॥ పల్లవి ॥

చెక్కునఁ జేయిపెట్టుక నెలవుల నవ్వుకొంటా
వెక్కసము లేమాడేవే విభునిని
చిక్కనిచెమట గార సిగ్గులనుఁ దొప్పఁదోఁగి
చక్కనిమోమున నేమి సన్న సేసేవే ॥ ఆతఁ ॥

పొదిగి తప్పక చూచి బొమ్మల జంకించుకొంటా
కది మెంతవారసేవే కాంతునిని
మదమున నుప్పొంగి మచ్చికల వెరగంది
పొదలుఁజన్నుల నెంత పూఁచి యదిమేవే ॥ ఆతఁ ॥

బిగువుఁగాఁగిటఁ గూడి పిప్పిగాఁ బెనఁగుకొంటా
వెగటుసేతురటె శ్రీవేంకటేశుని
అగపడి చొక్కించి అలమేలుమంగవు నీవు
చిగురుమోవితేనె చిందించేవే ॥ అతఁ ॥ 555

## ముఖారి

వేసరక సారె నన్ను వేఁడుకొనే విందరిలో
ఆసతోడ నేమిసేయుమనేవయ్యా యిపుడు ॥ పల్లవి ॥

వెగ్గళించక నీచేత విడె మందుకొంటి నిట్టె
సిగ్గువడకుమనవే చెప్పితి నేను
కగ్గులేక యప్పటిని కాఁపురములు సేసితి-
నగ్గమైతి నేమిసేయుమనేవయ్యా యిపుడు ॥ వేస ॥

పంతములాడక నీపనులెల్లాఁ జేసితి
వంతులువెట్టక నేనే వలచితిని
వింతలు సేయక మోవివిందులు చవిగొంటిని
అంతరంగ మేమిసేయుమనేవయ్యా యిపుడు ॥ వేస ॥

వేసాలు చెప్పక నిన్ను విచ్చనవిడిఁ గూడితి
బాసగొనక దేవినై పట్టమేలితి
నీసరి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
ఆసుద్దుల కేమిసేయుమనేవయ్యా యిపుడు ॥ వేస ॥556

## ఆహిరినాట

చూతము నీబలుములు సుద్దు లింతేసేమిటికి
పోతరము చూపరాదా పొరుగువారిపయిని ॥ పల్లవి ॥

పలుమారు నవ్వేవు పైఁ జెయ్యివేసేవు
చలములే సేసేవు సారెసారెకు
వలపు నీకు బాఁతైతే వద్దనున్నకాంతల-
మొలకచన్నులమీఁద మోపరాదా గోరు ॥ చూత ॥

భావించి చూచేవు పంతములాడుకొనేవు
కావరించి పెనఁగేవు గర్వానను
లా వింత నీకుఁ గలితే లలితో వారసతుల-
మోవులపైఁ బల్లుమోపి ముట్టరాదా కొప్పులు ॥ చూత ॥

సరసములాడేవు చనవిచ్చి కూడేవు
విరుల వేసేవు శ్రీ వేంకటేశుఁడా
మరిగితి న(వ?)లమేలుమంగను నేనూ (నీవూ?)డిగపు-
తరుణులతొడలపై తాచరాదా పాదాలు ॥ చూత ॥ 557

రేకు 895 సామంతం

చొక్కపునీపెండ్లి నేఁడె సుక్కురారము
అక్కరతో నిన్నియు నవధరించవయ్యా ॥ పల్లవి ॥

పడఁతిచెమటలే పన్నీటిజలకము
వెడగుముద్దుమాటలు వేదమంత్రాలు
యెడయనియాకెపయ్యెదకొంగే తడియొత్తు
అడియాలపుమజ్జన మవధరించవయ్యా ॥ చొక్క ॥

తరుణినెలవినవ్వు తగినకప్పురకాపు
తరమైనకనుచూపు తట్టుపుణుఁగు
విరులతావిపూర్పులే విసరేటిచల్లగాలి
అరుదైనవుపచార మవధరించవయ్యా ॥ చొక్క ॥

అలమేలుమంగకాఁగి లంటుదామెరల పూజ
పొలివోనిమేనికాంతి భూషణములు
యెలమి శ్రీవేంకటేశ ఇద్దరునుఁ గూడితిరి
అలవడె విభవము లవధరించవయ్యా ॥చొక్క॥ 558

శ్రీరాగం

ఎదుటనే వున్నది యింతి గడుఁబిన్నది
ఇదివో మావిన్నపా లిచ్చగించవయ్యా ॥పల్లవి॥

నెలవుల నవ్వుగారీ చెక్కులఁ జెమట జారీ
నిలువెల్లా సిగ్గుదేరీ నెలఁతకు
పలుకులఁ దేనె లూరీ భావములోఁ దమి మీరీ
కలసి మెలసి యీకెఁ గాఁగిలించవయ్యా ॥ఎదు॥

కన్నుల వెరగుమించీ కళలు మోమునఁ బొంచీ
చన్నులపైఁ బులకలు సారెకు ముంచీ
సన్నలు బొమ్మల వంచీ చవు లాసలనుఁ బెంచీ
మన్ననల నీకెను మరిగించవయ్యా ॥ఎదు॥

మోవి నమృతము చిందీ మూఁపునఁ దురుము చెందీ
సేవలుగా చెనకులు చేతికి నందీ
యీవేళ నలమేల్మంగ ఇన్నిటాను నిన్నుఁ బొందీ
శ్రీవేంకటేశ యీకెఁ జేకొంటివేలవయ్యా ॥ఎదు॥ 559

లలిత

చూడరే వోచెలులాల సుగుణతనాలు తాను
ఆడరే మీరిందరును ఆయములు సోఁకను ॥పల్లవి॥

వలసి(చి?)నమానినుల వద్ద నుండఁడా తాను
చెలఁగి చెప్పినట్టెల్లాఁ జేయఁడా తాను
తిలకించి సారెసారె దిష్టించుకోఁడా తాను
నెలవై పెద్దరికాలు నెరపీఁ దా నీడను ॥ చూడ ॥

కెరలినకాంతలకు కిందుపడఁడా తాను
ఇరవుగ చనవెల్లా నియ్యఁడా తాను
గౌరబుగాఁ గుచములఁ గమ్మించుకోఁడా తాను
దొరతనాలన్నియును దొడ్డివెట్టీ నీడను ॥ చూడ ॥

యెనసినసతులకు నెంగిలిపడఁడా తాను
ఘనుఁడై అన్నిటా లోనుగాఁడా తాను
యెనలేని శ్రీవేంకటేశుఁడు తా నన్నుఁ గూడి
ననిచి తగవులెల్లా నడపీఁ దా నీడను ॥ చూడ ॥ 560

దేశాక్షి

ఈతఁడు పంతము నీకు నిచ్చీఁగాని
యీతల నాతోనైన నెచ్చరించరాదా ॥ పల్లవి ॥

హత్తుకవుండియు నీకు నలుక లంతేసి యేల
చిత్తములోపలిమాట చెప్పరాదా
బత్తిగలదానవు పట్టినమోనములేల
తత్తరించక కలట్టె తారుకాణించరాదా ॥ ఈతఁ ॥

పూఁతసిగ్గుతో నగవు పొదిగిపట్ట నేఁటికి
చేఁతలెల్లా పెల్లవిరి సేయరాదా
వూఁతచెక్కుచేతులతో నుమ్మగిల నేమిటికి
పాఁతసుద్దులెల్లా బట్టబాయిట వేయరాదా ॥ ఈతఁ ॥

పుదుటుబీరముతోడ నోరచూపు లేమిటికి
పదరి మేగురుతు చూపఁగరాదా
యెదుట శ్రీవేంకటేశ యెనసితి రిద్దరును
ముదముతో నన్నిటికి మొక్కఁగరాదా ॥ ఈతఁ ॥ 561

కాంబోది

చిత్తమువచ్చినట్టెల్లాఁ జేయుమనవే
హొత్తులకూరిమితోడ బోదించవలెనా ॥ పల్లవి ॥

మనసుమర్మ మెఱుఁగు మరిగినవాఁడు తాను
యెనలేనివిన్నపము లేమి సేసేనే
వెనకకె బాసలెల్లా వేవేలుఁ జేసె నాకు
పెనఁగి బలిమి సేసి పిలువఁగవలెనా ॥ చిత్త ॥

పిన్ననాఁడె సేసవెట్టి పెండ్లాడె నన్నుఁ దాను
వన్నెల నింకా నేమివావి చెప్పేనే
పన్ని దేవుళ్లలోనెల్లాఁ బట్టముగట్టె తాను
యిన్నిటా నాసుద్దులెల్లా నెచ్చరించవలెనా ॥ చిత్త ॥

చెలఁగు మేనరికపు శ్రీవేంకటేశుఁడు దాను
కలసీ నప్పటి నేమి గడునవ్వీనే
యెలమి నెప్పుడుఁ బాయ కింటనే వున్నాఁడు తాను
వలపులు చల్లి ఇంకా వాసిరేఁచవలెనా ॥ చిత్త ॥ 562

నాదరామక్రియ

చూడవయ్యా అఁడువారిసుద్దు లిటువంటివి
వాడికగా నాడనుండే వాసులు రేఁచీని ॥ పల్లవి ॥

వెలయ నీతో నేను వేడుకకు నవ్వఁగాను
నలినాక్షి యెవ్వతో సన్నలుసేసీని
నిలిచి నీవు నాతో నెయ్యములు చూపఁగాను
కెలన నుండి తాను కేఁకరించీని ॥ చూడ ॥

అరుదుగ నీవొద్దను ఆసతోఁ గూచుండఁగాను
కెరలుచుఁ దా కిలకిలనవ్వీని
సరసము నీవు నాతో సారె సారె నాడఁగాను
యిరవుగా నేతువ లెత్తిపెట్టీని ॥ చూడ ॥

వొనరి నీకు నేను వూడిగాలు సేయఁగాను
వెనకనుండి తాను వెంగెమాడీని
యెనసితివి శ్రీవేంకటేశ నన్ను వింతలోనె
వినయముతోఁ దాను వేఁడుకొనీని ॥ చూడ ॥ 563

రేకు 896 రీతిగౌళ

తేవయ్య వీడెము తేఁకువ నీయాలనైతి
దేవర వొదువు తరితీపు లింకా వలెనా ॥ పల్లవి ॥

నీటుతోడ నాయెదుర నిలుచుండి వేరె వేరె–
మాటలాడే వవునయ్యా మతకానను
మూటవలపుల నీకు మొగమెల్లాఁ జెమరించె
యేఁటికిఁ జేసేవు నీవు యెమ్మెలు మాముందర ॥ తేవ ॥

రవ్వలుగా మాతోను రాజసము చూపి మోవి–
నవ్వులు నవ్వేవయ్యా నాలితనాన
చివ్వన నీతమకము చిగిరించెఁ బులకలై
నివ్వటిల్ల వేసాలేల నించేవు పంతానను ॥ తేవ ॥

చేపట్టి నన్నిటు గూడి చెలరేఁగి గుట్టు సేసి
చూపు లేమిచూచేవు సొలపులను
నాపాలిశ్రీ వేంకటేశ నన్నుఁ గృపనేలితివి
ఆపని కిచ్చకా లెన్నియాడేవు తగిలి ॥ తేవ ॥ 564

శంకరాభరణం

కరుణించుము నీకామినిని
యిరవుగ కడుఁజన వియ్యవయ్యా ॥ పల్లవి ॥

పెలుచుఁదనపు నీబీరంబులకే
చలములు నెరపితి సారెకును
నెలవుగ నే నన్నిటికి నెలవుగా
మొలకవలపులను మొక్కేమయ్యా ॥ కరు ॥

బంతి నీవాదేటిపంతంబులకే
వంతునఁ బెనఁగితి వాసికిని
మంతనమున నీమన సొక్కటిగా
చెంతలఁ బ్రియములు చెప్పేమయ్యా ॥ కరు ॥

వెగ్గలమగు నీవేసంబులకే
సిగ్గున నవ్వితి నెలవులను
అగ్గపుశ్రీవేంకటాధిప కూడితి-
వొగ్గుచుఁ జన్నుల నొరసేమయ్యా ॥ కరు ॥ 565

మాళవశ్రీ

ఏఁటికిఁ దమకించేవు యింతలోననే
ఆఁటదాని కిట్టె వసమయి వుండవయ్యా ॥ పల్లవి ॥

సిగ్గుతోడనున్నచెలిఁ జేయివట్టి పెనఁగుచు-
నగ్గలపువేడుకతో నలయింతురా
వొగ్గి విడెమిచ్చి మరి వొడఁబరచి మెల్లనె
యెగ్గుసేయక నీ వీపెయిచ్చలో రావయ్యా ॥ ఏఁటి ॥

గుట్టుతోడనున్న యింతిఁ గొలువులోఁ జెనకుచు
తొట్టినమదముతోడ దొమ్మిసేతురా
మట్టుతోనే మోవి చూపి మన్ననలు పచరించి
బట్టబయ లీఁదించక పనుపు సేయవయ్యా ॥ ఏఁటి ॥

మేలుతోనున్నకాంతను మేకొని వచ్చి మన్నించి
యాలీలఁ గూడినవాఁడ వెమ్మెసేతురా
తాలిమితో బుజ్జగించి తనిపి శ్రీవేంకటేశ
యేలుకొంటి వెడయక యింట నుండవయ్యా ॥ ఏఁటి॥ 566

## గుండక్రియ

ఎక్కడి పరాకు నీకు నెందాఁకాను
చక్కనిరమణి కిట్టు చనవియ్యవయ్యా ॥ పల్లవి ॥

సానఁబట్టినచూపులు చల్లఁగా నీపైఁ జల్లి
తేనెలమాటలెల్లా నొద్దికతో ముంచె
కానుక నెలవినవ్వు కప్పురముగా నిచ్చె
మానవతి నీకనైన మన్నించవయ్యా ॥ ఎక్క ॥

సరి చన్నులు మీఁదెత్తి సమ్మతిఁ గాచుకున్నది
యిరవై చెమటపన్నీ రిదివో నించె
మురిపెపుసిగ్గులనే ముగ్గులు నీకుఁ బెట్టె
తరుణి నింతట నిట్టె దయఁజూడవయ్యా ॥ ఎక్క ॥

నిండుజవ్వనపాయమే నిలువుసేసలు వెట్టి
దండిసరసపుఁదమి దయిలువోసె
అండనె శ్రీవేంకటేశ అన్నిటా నేలితివి
మెండైనవనిత నింకా మెప్పించవయ్యా ॥ ఎక్క ॥ 567

## దేవక్రియ

చెలులము నీకు నేము చెప్పకపోదు
చెలరేఁగి యీతనికి సేవసేయరాదా ॥ పల్లవి ॥

చెలి నీపెదవిపై చేయి చేర్చితివి నేఁడు
యిలఁ జిగురులుగదే యివిరెండును
పలుకుఁదేనెలు నీపతి కేలదాఁచేవే
చలివాయ నీతనికి చవిచూపరాదా ॥ చెలు ॥

చూపులకు నద్దాలు సొనిపేవు కురులను
యేపునఁ దేటులేకదే యివిరెండును
ఆఁపనేలే వెన్నెలన వ్వాతనియెదుట నీవు
రాఁపులుగా ముందటను రాశివోయరాదా ॥ చెలు ॥

చన్నులకుఁ గరములు సరినద్దాలు పెట్టేవు
యెన్నఁ దామెరలేకదే యివి రెండును
కన్నెరో కాఁగిట శ్రీవేంకటేశుఁ గూడితివి
అన్నిటా నీముచ్చటలు ఆనతియ్యరాదా ॥ చెలు ॥ 568

## శుద్ధవసంతం

ఏడనుండి వచ్చెనో యీడకు నీకె
నీడనుండి కదలదు నిర్మలాన నీకె ॥ పల్లవి ॥

మంతనాన నీవు నేను మాటలాడుకొనఁగాను
యింతలోఁ బొంచులువినీ నిదివో యీకె
వింతలుగ లోలోన వేడుకకు నవ్వఁగాను
పంతమున నప్పటిఁ దప్పకచూచీ నీకె ॥ఏడ॥

జఱసి జఱసి మీరు సరసములాడఁగాను
గుఱుతులు వెట్టుకొనీ గుట్టున నీకె
మొఱఁగులు మఱఁగుల మోవు లందుకోఁగాను
అఱిముఱిఁ జెలులతో నాడుకొనీ నీకె ॥ఏడ॥

శ్రీవేంకటేశ్వర చేరి నీవు గూడఁగాను
వోవలఁ దెరమాఁటున నున్నది యీకె
చేవదేర నీవు నన్ను చెంతల మన్నించఁగాను
వావిచెప్పి పెండ్లాడవచ్చీ నీకె ॥ఏడ॥ 569

రేకు 897 మంగళకౌశిక

ఇద్దరినడుమ నుండీ ఇదివో తాను
తిద్దుచు జగడములు తేరిచీఁగాక ॥పల్లవి॥

వొక్కరికి బుద్దిచెప్పీ నొక్కరికి చెక్కు నొక్కీ
చక్కనినాయకుఁడు సవతులకు
అక్కరతో నింతసేసినట్టివాఁడు తానే కాఁడా
పుక్కటతో రేఁచుకొని పొడిఁబడీఁగాక ॥ఇద్ద॥

వొడివట్టీ నాకెను వొడఁబరచీ నీకెను
కడుజాణరమణుఁడు కామినులకు
ముడికాఁడైనవాఁడు మొదలఁ దానేకాఁడా
యెడమాటలాడి బయలీఁదుకొనీఁ గాక ॥ఇద్ద॥

కలసీని జవరాలిఁ గాఁగిలించీ కన్నియను
లలి శ్రీవేంకటేశుఁడు లలనలకు
యెలమి నన్నును నేలె నిన్నిటాఁ దానే కాఁడా
వలపులు పెడరేఁచి వసమయ్యీఁ గాక ॥ఇద్ద॥ 570

### అహిరి

చిత్తము లెరిఁగి సేవసేయరమ్మా
పొత్తులబువ్వానకు పొసఁగించరమ్మా ॥పల్లవి॥

పీఁటమీఁదఁ గూచుండి పెండ్లాడి రిద్దరును
చీటికిమాటికి నట్టె సిగ్గువడేరు
మాటలాడించి చూచితే మంతనమాడుకొనేరు
తేటలుగా నింతలోనె తెరవేయరమ్మా ॥చిత్త॥

చేతు లొగ్గించుకొంటాను సేసలు వెట్టుకొనేరు
పోతరించి సెలవులఁ బూఁచి నవ్వేరు
ఘాతల నొకరొకరిఁ గడకన్నులఁ జూచేరు
నీతెరిఁగి పచ్చడము నిండఁ గప్పరమ్మా ॥చిత్త॥

కడుఁ దలలువంచుక కాఁగిట నించుకొనేరు
అడరి లోలోనే విడె మందుకొనేరు
యెడయక శ్రీవేంకటేశుఁ డింతియుఁ గూడిరి
బడిఁబడిఁ దలుపు గొబ్బన మూయరమ్మా ॥చిత్త॥ 571

### భైరవి

పంతము దప్పదు నీకుఁ బడఁతితోను
యింతటిలోనే చనవిచ్చేవుగాక ॥పల్లవి॥

యేచి యీ కెను నీశిరసెత్తి చూడరాదా
నీచిత్తము వచ్చితే మన్నించేవుగాక
కాచుకున్నది గొబ్బున( గప్పుర మీరాదా
చేచేత( జెప్పినట్టు సేసేవుగాక ॥పంత॥

నంటున నెలవులను నవ్వరాదా
యింటికివచ్చినప్పు దేలేవుగాక
అంటి ముట్టి యిప్పుడిట్టె యాదరించరాదా
పెంటగా నేకతమున( బెన(గేవుగాక ॥పంత॥

కందువల మెచ్చిమెచ్చి కా(గిలించరాదా
సందడిరతి( బాదాలు చా(చేవుగాక
విందుగా నీకాంతను శ్రీవేంకటేశ కూడితివి
పొంది మోవియ్యరాదా బోదించేవుగాక ॥పంత॥ 572

## బౌళిరామక్రియ

నేరుతువయ్యా నేరుపులు
పోరచిపొందులె భోగములు ॥పల్లవి॥

నలుగడ నెలవుల నవ్వు లివి
వలచినసతులకు వాడికలు
తల(చినయప్పుడె తగులములు
పెలుచగునీతో పెన(గులాటలు ॥నేరు॥

పరమమైననీపలుకు లివి
మరిగినవారికి మర్మములు
దొరకినయప్పుడె దోమటులు
పరగ నిండుకొనుపలు చూపరలు(?) ॥నేరు॥

పేదెపునీమోవివిందు లివి
 కూడినమాకును కోరికలు
 యీడుగ శ్రీ వేంకటేశ్వరుఁడా
 వేడుకరతు లివి వెల్లావిరులు ॥ నేరు ॥ 573

హిందోళవసంతం

పట్టినచలములేల వలుకరాదా
 యెట్టు చెప్పినా ని(న?)ట్టే యియ్యకొనరాదా ॥ పల్లవి ॥

ములువాఁడిగురుతులమోవి నీకుఁ జూపితేను
 సెలవుల నవ్వనేల చెప్పరాదా
 తలుపుమూల నుండఁగ తగఁ గొంగువట్టితేను
 కలువల వేయనేల కానిమ్మనరాదా ॥ పట్టి ॥

చిక్కనిచెమటతోడి చేతులు పైఁ జాఁచితేను
 దిక్కన జంకించనేల తెలుపరాదా
 మక్కువ సిగ్గువడఁగ మంచముపై నిదుకొంటే
 మొక్కులు మొక్కఁగనేల ముచ్చటాడరాదా ॥ పట్టి ॥

కప్పురపుఁదావిమేనఁ గాఁగిలించుకొంటేను
 చొప్పులెత్తనేల కల్ల చూపరాదా
 చిప్పిలఁ గూడితిఁగదే శ్రీ వేంకటేశుఁడ నేను
 దప్పులఁ బొరలనేల తనియఁగరాదా ॥ పట్టి ॥ 574

శ్రీరాగం

మేలయ్య మిమ్ముఁ జూచి మెచ్చితి నేను
 మేలములాడేరు మీరు మేళ్కొట్టివో ॥ పల్లవి ॥

వెలఁది నీకుఁ జెవిలో విన్నపాలు సేయఁగాను
పులకించె నీమేను పొందు లెట్టివో
కులికి యట్టె విరులఁగొప్పు నీకు ముడువఁగ
జలజలఁ జెమరించె చవులెట్టివో ॥ మేల ॥

సరినుండి వీడెమిచ్చి చన్నుల నిన్నొత్తఁగాను
తరవాత సిగ్గు రేఁగె తములెట్టివో
తెర వేసుకొని నీతో తేటలుగా నవ్వఁగాను
గొరబుచేఁతలు నిండె గుణా లెట్టివో ॥ మేల ॥

కామించి ఇంతలో నిన్నుఁ గాఁగిలించుకొనఁగాను
మోమునఁ గళలు రేఁగె మోహాలెట్టివో
ప్రేమపు శ్రీ వేంకటేశ బెరసి నిన్నుఁ జూచితే
ఆమనాయ మోవితేనె లాస లెట్టివో ॥ మేల ॥ 575

రేకు 898 సింధురామక్రియ

ఏఁటికి సిగ్గువడేవు యిందరిలోన
మాఁటు కరుగక ఇంక మాటలాడవమ్మా ॥ పల్లవి ॥

పొసఁగ నిన్ను నతఁడు పుత్తడిబొమ్మవంటా
కొసరుచుఁ బొగడీవి కొలువులోన
వసముచేసుకొని వలపించుకొంటివి
అసుదవుగావు వీడె మందుకొనవమ్మా ॥ ఏఁటి ॥

సారెసారెకును నీవె చక్కనిదానవంటా
ఆరీతి నట్టె చూపీ నంగనలకు
మేరమీరి యిందరిలో మెప్పించుకొంటివి
కోరికతో సంగడిని కూచుండవమ్మా ॥ ఏఁటి ॥

యీడైన యలమేల్మంగ విన్నిటా నేర్పరివంటా
వేడుకఁ గొసరీని శ్రీ వేంకటేశుఁడు
కూడితిరి మీరిద్దరు కొంకక మమ్మేలితిరి
వాడికలాయను మీవారము నేమమ్మా ॥ఏఁటి॥ 576

ఆహిరి

కందువ నీప్రియములు కైకొనేఁగాక
సందడి నిన్నెటువలె జరసేమయ్యా ॥పల్లవి॥

నంటున నాపె నీపై నవ్వులపువ్వులు వేసె
జంటచూపులఁ గస్తూరి సారెకుఁ జల్లె
పెంటసన్నలబువ్వానఁ బెదవి యెంగిలిసేసె
యింటివారము నేము నిన్నేమనేమయ్యా ॥కందు॥

చెలరేఁగె సరసపుసిగ్గుల గందము పూసె
వలపులచెమటల వంచెఁ బన్నీరు
నిలువుఁజక్కఁదనాల నిన్ను బంటుగా నేలె
కులమువాండ్లము నిన్నుఁ గొసరనేలయ్యా ॥కందు॥

వెంగెపుమాటలనే వీడెము లొసగె నేఁడు
అంగపుసోఁకులనే పెండ్లాడె నిన్నును
చెంగట నలమేల్మంగ శ్రీ వేంకటేశ నిన్నంటె
అంగపుఁగాఁగిటివార మారడులేలయ్యా ॥కందు॥ 577

కొండమలహరి

ఏమే యెఱఁగవా యేకతపుసరసము
కామించినాతని నింతకాకుసేతురా ॥పల్లవి॥

చెంతనుండి యాతఁడు నీచెఱఁగువట్టి తీసితే
పంతములాడుదురా పతితోను
అంతరంగ మనుచు నీయండ నిట్టె కూచుండితే
రంతుసేసి మాటలాడి రవ్వసేతురా ॥ ఏమే ॥

సన్నలకు నీకొప్పు జార నాతఁడు దీసితే
కన్నుల జంకింతురా కాంతునిని
మన్ననల సిగ్గులమాటలు దడవితేను
పన్ని సతులలో నెల్లాఁ బచ్చిసేతురా ॥ ఏమే ॥

అలమేలుమంగవు నీవు నిన్నట్టె కాఁగిటఁ గూడితే
యెలయింతురా శ్రీవేంకటేశ్వరుని
వలపులు రేఁచి రతి వక్కాణ నీకుఁ జెప్పితే
వెలయ నంతటా వెల్లవిరి సేతురా ॥ ఏమే ॥ 578

వరాళి

నేరుతుము నీకంటె నే మిందరము
ఆరీతిఁ బెనఁగకుంటే నందువు గాని ॥ పల్లవి ॥

యేడలేనిమాటలు నీ విన్ని నేరుచుక వచ్చి
ఆడేవు సిగ్గువడక ఆఁడువారిలో
వోడక యేకతమున నొరసి నిలువరాదా
జోడగు మాసరితలు చూతువు గావి ॥ నేరు ॥

కన్నకన్నచోటులను కతలెల్లాఁ జూచి వచ్చి
సన్నలనే చూపేవు సబలలోన
యిన్నేసి తడవనేల ఇంటిలోనికి రారాదా
కన్నెలము మా సేఁతలు కందువు గాని ॥ నేరు ॥

---

క్రీగీతలు గలయక్షరములు చిలము దిన్నవి. నే నూహించినవి.

తలఁపులో నొక్కొక్కటే తలఁచుక నీవు వచ్చి
అలమేవు కాఁగిట నన్నాడా నీడాను
అలమేలుమంగను పాయకు శ్రీవేంకటేశుఁడ
తిలకించి మాగుణాలు తెలిసేవు గాని ॥ నేరు ॥ 579

సౌరాష్ట్రం

ఆతనిఁ జూడవలెఁగా అన్నిటా నేము
చేతులొగ్గి చెప్పినట్టు సేసేమే యిఁకను ॥ పల్లవి ॥

సొరిది నాతనితోడ జోడుగూడుక వచ్చి
సిరులనెమ్మెలచేత చెలరేఁగేవే
దొరవౌదువంటాను తోడిసతులు మెచ్చేరు
మురిపెములు గంటిమి మొక్కేమే నీకు ॥ ఆత ॥

పొలయుచు రాజసాన పురుషుని సలిగెల
నలువంక విఱ్ఱవీఁగి నవ్వునవ్వేవే
బలువురాలవంటాను పడఁతులు పొగడేరు
తెలిసితిమి పట్టపుదేవులవే నీవు ॥ ఆత ॥

కూరిమిశ్రీవేంకటేశుఁ గూడినసంతోసాన
మేరమీరి యందరికి మేలు చూపేవే
యీరీతి నీతనిచేత నేలించితనే రిందరు
ఆరయ నలమేల్మంగ వౌదువే మన్ననల ॥ ఆత ॥ 580

పాడి

కాని అందు కేమాయఁ గడవారమా
పూని యీకరుణ యెట్లాఁ బుట్టెనో నీకు ॥ పల్లవి ॥

చేతికిఁ గానుకిచ్చితే సిగ్గువడే వేమయ్యా
ఆతల నీ కేమితలఁపాయనో నేఁడు
యీతల మొక్కఁగా శిరసేల వంచేవేమయ్యా
కాతరపునేర మెట్టుగలిగెనో నీకు ॥ కాని ॥

నంటున వీడెమిచ్చితే నవ్వు నవ్వే వేమయ్యా
జంటల నేమిటివంక సరిదాఁకెనో
అంటి సేవసేసితేనే అలసే విదేమయ్యా
యింటిలో నాచన్నులవేఁ గెట్టుండెనో నీకు ॥ కాని ॥

వొద్దికఁ బెనఁగితే నిట్టూర్పు నించేవేమయ్యా
గద్దరిచిత్త మెట్టులఁ గరఁగినదో
ముద్దుల శ్రీవేంకటేశ ముంచి కూడితి వౌనయ్యా
వొద్దు వొద్దు కాస లెట్టు వొసఁగెనో నీకు ॥ కాని ॥ 581

రేకు 899. శుద్ధవసంతం

పంతపుసుద్దులుచెప్పేబయకాఁడవు
వంతులకు నీవు నట్టే వలవరాదా ॥ పల్లవి ॥

పలచఁగా నవ్వు నవ్వి పలుమారు సిగ్గువడి
వెలఁది మాటలాడీని వినరాదా
వలిపెపయ్యదకొంగు వల్లెవాటు వేసుకొని
చెలరేఁగి మొక్కీని చేకొనరాదా ॥ పంత ॥

కడుమురిపెము చూపి కారపువీడెములిచ్చి
పడఁతి నిలుచున్నది భావించరాదా
కడఁగి తురుము కీలుగంటుగొన బిగియించి
జడియక పెనఁగీని సమ్మతించరాదా ॥ పంత ॥

మచ్చికఁ జన్నులనొత్తి మనసురా మోవి యిచ్చి
నెచ్చెలి గాఁగిలించీ మన్నించరాదా
యిచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
తచ్చి తచ్చి సొలసీని దయఁజూడరాదా ॥ పంత ॥ 582

నాగవరాళి

ఇప్పుడే యిన్నియుఁ గాక యిఁక నెన్నఁడు
చెప్పరానిసేఁతలెల్లాఁ జేసుకొనవయ్యా ॥ పల్లవి ॥

వెలఁదివిన్నపములు వింటివా నీవు
పలుమారు చిత్తమునఁ బట్టెనా నీకు
అలరినసంతోస మబ్బెనా నేఁడు
కలిగె నీకు లాభము కట్టుకొనవయ్యా ॥ ఇప్పు ॥

కొమ్మచేతికాను కందుకొంటివా నీవు
చిమ్ముల నీ చేతికిఁ[1] జిక్కెనా నీకు
దిమ్మరి నీకోరికె సిద్ధించెనా నేఁడు
వుమ్మడిఁ జేరె మేళ్లు వొప్పుకొనవయ్యా ॥ ఇప్పు ॥

కోమలిమోవిచవి గొంటివా నీవు
దామెనరతులు యిట్టె దక్కెనా నీకు
నేమపు శ్రీవేంకటేశ నేఁడు నన్నేలితివి
కామతంత్రపుసంపద గనుకొనవయ్యా ॥ ఇప్పు ॥ 583

దేసాళం

ఎదురుబడి సొలయ నిఁకనేలయ్యా
ముదముతోడ నీకు మొక్కేమయ్యా ॥ పల్లవి ॥

---

1. 'నీచేతికి' 'నీకు' ఇట్టి పునరుక్తి లిపాఙ్మయమున నక్కడక్కడ గలవు.

వనితల నందరిని వలపించ నేరుతువు
పెనపెట్టి మచ్చికలు పెంచనేర్తువు
మనసురా నన్నిటాను మాటలాడ నేరుతువు
పనితోడ నేమెల్లా బదికితిమయ్యా ॥ ఎదు ॥

క్రియలు దెలిపి తమి కెరలించ నేరుతువు
నయములుగా కడునవ్వనేర్తువు
ప్రియములు చూపి యాస పెచ్చురేఁచ నేరుతువు
నియతాన నీకృపను నెలకొంటిమయ్యా ॥ ఎదు ॥

విందు చెప్పి మోవియిచ్చి వెలయించ నేరుతువు
అంది కాఁగిలించి కళ లంటనేర్తువు
చెందితివి నన్ను నిట్టె శ్రీవేంకటేశ్వర
మందలించి నిన్ను నేము మరఁగితిమయ్యా ॥ ఎదు ॥ 584

శంకరాభరణం

తేట తెల్లములు తెలిసినవి
యేఁటికి మఱఁగులు యిదివో మాట ॥ పల్లవి ॥

నెనుపుగలిగితేనే నవ్వులు
మనసువచ్చితేనే మంతనాలు
తనవారితనమైతే తగవులు
యెనలేనిరమణుఁడ ఇదివో మాట ॥ తేట ॥

సమ్మతించితే సరసములు
నమ్మికలైతే నంటులు
పమ్మినవలపులె బలుములు
యిమ్ములఁ గనుఁగొంటే యిదివో మాట ॥ తేట ॥

కైవసమైతే కడఁకలు
మోవులయీవులె ముదములు
శ్రీ వేంకటేశ్వర చెలఁగి నన్ను
యీవలఁ గూడితి విదివో మాట ॥ తేట ॥ 585

సాళంగనాట

నీకొలఁదిదాననా నే నిన్నిటా
జోకలెల్లా మీఁదమీఁదఁ జూపరాదా యిఁకను ॥ పల్లవి ॥

నవ్వులెన్ని నవ్వేవే నయ మెంతచూపేవే
రవ్వలుగా వలచినరమణునికి
యివ్వల నీతని నేఁడే యింటికి రప్పించుకొంటే
చివ్వన నీవు నన్ను మెచ్చేవటవే యిపుడు ॥ నీకొ ॥

పంతమెంతనెరపేవే పనులెన్ని చెప్పేవే
వింతలుగాఁ జొక్కినట్టివిభునికిని
చెంతనుండి నేను నట్టే చేతికి లోఁజేసుకొంటే
సంతసించి పొగడేవా సారెసారె నన్నును ॥ నీకొ ॥

చవులెన్ని చూపేవే చనవెంత నెరపేవే
యివలను శ్రీ వేంకటేశ్వరునికి
జవళి నితని నేను సంగడిఁ బెండ్లాడితి
వివరానఁ బందెమువేయరాదా యిందుకు ॥ నీకొ ॥ 586

నాదరామక్రియ

అందరివలెనే చూచే వప్పటి నన్ను
నిందలు నిన్నాడుదునా నేఁ బొగడుదుఁగాక ॥ పల్లవి ॥

చలమరినా నీతో సారెసారెఁ బెనఁగను
చెలరేఁగి చెప్పినట్టు సేతుఁగాక
పెలుచుదానవా నీతోఁ బెడసరాలాడను
మెలఁగి ప్రియాలు చెప్పి మెప్పింతుఁగాక ॥ అంద ॥

కోపకత్తెనా నిన్ను కొసరుచు జంకించఁగ
వోపి నీతో నవ్వుతానే వుండుదుఁగాక
రాఁపులదానవా నిను రచ్చల నాఱడిసేయ
చూపులనే తమిరేఁచి చొక్కింతుఁగాక ॥ అంద ॥

కొత్తదానవా నిన్నుఁ గోరి మనసుచూడఁగ
బత్తిసేసి కాఁగిలించి పైకొందుఁగాక
యిత్తల శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
గుత్తపుగుబ్బల నొత్తి కొసరుదుఁగాక ॥ అంద ॥ 587

రేకు 900 దేవగాంధారి

ఏమని దూరే మెందాఁకా నిను
కామితఫలములు గలిగెను మాకు ॥ పల్లవి ॥

పలుకు లేమిటికిఁ బలుమారు
అలర నీరపములాయ నిఁక
కొలఁదిమీరి రదె గొల్లెతలు
మలసి వారలకు మగఁడవు నీవు ॥ ఏమ ॥

తడవ నేమిటికి తతిగొనుచు
చిడుముడి నీసేఁత చెల్లెనిఁక
అడరిరి పెండ్లికి నచ్చరలు
యెడయక వారల నేలితివి ॥ ఏమ ॥

వెంగెము లేఁటికి వెక్కసమై
　కంగుదేర మముఁ గలసితివి
　యింగితమెఱిఁగినయిల్లాండ్లము
　చెంగటఁ గూడితి శ్రీవేంకటేశ　॥ ఏమ ॥ 588

## భూపాళం

మఱచితిననక యేమఱివుంటిననక
　యెఱుకగా గుఱుతు నా కిమ్మని యడుగవే　॥ పల్లవి ॥

యెలమితోడుత మాయింటి కెప్పుడు విచ్చేసీ
　అలివేణి యాతని నీ వడిగి రావే
　పొలుపారఁ గూటమికి పొందుగా మాటలాడి
　అలరినరతులకు నానవాలు దేవే　॥ మఱ ॥

అందుకోలు పెండ్లికి నట్టె సమ్మతించితేను
　పెందలకాడ విడె మిప్పించుకరావే
　కందువతో వలపులు కడుఁజవులై తేను
　చెంది యానవెట్టించుక చేకొనిరావే　॥ మఱ ॥

చిమ్ముచు నన్నింతలోనె శ్రీ వేంకటేశుఁడు గూడె
　పిమ్మటి సేఁతలు దలఁపించిరావే
　వుమ్మడి నలమేల్మంగ నొనరితిఁ గాఁగిట
　నమ్మికాయ నాకుఁగా విన్నపములు సేయవే　॥ మఱ ॥ 589

## సింధురామక్రియ

చెప్పినట్టెల్లా నేఁడు నేతురుగాక
　దుప్పటి గప్పఁగా నీవు దూరుదురా　॥ పల్లవి ॥

సరసపుమాఁటలెల్లా చవిసేసుకొంటగాక
వెరవుగా నెరసులు వెదకుదురా
పరగ నన్నిటా నీవు పట్టపుదేవులవు
వొరసి పిలువఁగాను పూరకుందురా ॥ చెప్పి ॥

నవ్వినవ్వులకెల్లా ననిచి వోర్చుటగాక
రవ్వగా నెగ్గులువట్టి రచ్చవేతురా
మువ్వురలోపల నీవు మోహపుఁ గామినివి
పవ్వళించు మనఁగాను పరాకుసేతురా ॥ చెప్పి ॥

చెనకి నిన్నుఁ గూడఁగా చెలరేఁగుదురు గాక
పెనఁగుచు సిగ్గులింత పెంచఁజూతురా
అనిశముఁ బాయరాని అలమేల్మంగవు నీవు
యెనసె శ్రీ వేంకటేశుఁ దేతువ వెత్తుదురా ॥ చెప్పి ॥ 590

కన్నడగౌళ

చెలువుఁడ నీకు నేము చెప్పవలెనా
మలసి సొలసి యిట్టె మన్నించవలదా ॥ పల్లవి ॥

చిగురుఁబోడి నీకుఁ జెప్పినప్రియములకు
నిగిడి ఇంతటఁ గరుణించవలదా
మొగముచూచి నీకు మొక్కినట్టిమొక్కులకు
అగపడి నీవు గడు నాదరించవలదా ॥ చెలు ॥

యెదురుగా నీకు నింతి యిచ్చిన కానుకలకు
సదరాననే లాలించఁగవలదా
కొదలేక నీవద్దఁ గొలువు సేసినందుకు
మది సంతోసములతో మన్నించవలదా ॥ చెలు ॥

---

ప్రతిలో ౯౦ వన్నియు చివుము తిన్నవి. నే నూహించినవి.

అలమేలుమంగ నీయంకెలఁగూడినందుకు
మెలఁగి శ్రీవేంకటేశ మెచ్చవలదా
చలపట్టి నీమోవి చవిగొన్నయందుకు
వెలలేనివేడుకల వెలయించవలదా ॥ చెలు ॥ 591

బౌళి

కానవచ్చె నీగుణాలు కాంతలకు నిందరికి
యీ నేరుపు లేకుండితే నెమ్మెలింత సేతువా ॥ పల్లవి ॥

పంతగాఁడ వౌదువు బలిమిసేసి చెలిని
వింతముద్రలు మోవిపై వెలఇంచితి
ఇంతవాఁడవు గాకుంటే నెరవులగొల్లెతల
చెంతఁ గూడి కాకుసేసి చిమ్మిరేఁతువా ॥ కాన ॥

శూరుఁడవు నౌదువు సోయగపుఁ జెక్కులపై
గోరుదీసి జవ్వనము కొల్లగొంటివి
ధీరత ఇంతలేకుంటే దిక్కులఁ బదారువేల-
కూరిమిసతులఁ దెచ్చుకొ పెండ్లాడుదువా ॥ కాన ॥

అన్నిటా గబ్బివౌదువు అలమేలుమంగఁ గూడి
పిన్ననాఁడే వురమునఁ బెట్టుకొంటివి
యెన్నఁగ శ్రీవేంకటేశ యీ బిగు వుండకుండితే
వన్నెలుగా నందరిని వలపింతువా ॥ కాన ॥ 592

వరాళి

బలువాఁడవయ్యా భామల రొచ్చు కోర్చితి
పలువై యెందరిపాలఁ బరగె నీమేను ॥ పల్లవి ॥

---

క్రీగీఁతలు గలయక్షరములు చిలుము దిన్నవి. నే నూహించినవి.

కందువ సతులు నీకుఁ గడుఁగడు మొక్కఁగాను
యెందరితలలు మోచె నీపాదాలు
అంది వూడిగాలు నీకు నందరును జేయఁగాను
సందడి కెట్టోరిచె నీచక్కనిమేను ॥ బలు ॥

కన్నెలెవ్వరైనా నిన్నుఁ గాఁగిలించుకొనఁగాను
యెన్నిచన్నులు సోఁకెను యీ చేతులు
సన్నల మాటలాడి సారెఁ దమ్ములా లిడఁగ
వున్న[illegible] నెంగిలి కెట్టు వోనరె నీమోవి ॥ బలు ॥

అట్టడి కామినుల యాఅడి పసలనుఁ జొక్కి
యెట్టు తగులువడెను యీ మనసు
అట్టె శ్రీవేంకటేశుఁడ వలమేల్మంగను నన్ను
గట్టిగా నేలుకొంటివి ఘనుఁడవు నీవు ॥ బలు ॥ 593

---

క్రీగీతలు గల యక్షరములు చిలుము దిన్నవి. నే నూహించినవి.

# అనుబంధము ౧

సంకీర్తనల రాగముల అకారాది సూచిక.


| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| అంగడిమావలపు | రామక్రియ | 358 |
| అంగన నీతోఁ | కాంబోది | 43 |
| అంగనా నీవును | శ్రీరాగం | 98 |
| అంతేపో వోయమ్మ | సౌరాష్ట్రం | 19 |
| అందరివలెనే | నాదరామక్రియ | 587 |
| అందుకేమి దోసము | లలిత | 135 |
| అందులోనే | లలిత | 481 |
| అందులోనే కాన | నాదరామక్రియ | 542 |
| అందులోనే | గుజ్జరి | 175 |
| అంబుజాక్ష | సాళంగనాట | 300 |
| అచ్చివచ్చు | హిందోళం | 224 |
| అటువలెఁజూతమా | పాడి | 260 |
| అట్టె తెరవేసు | దేసాళం | 274 |
| అట్టె నీకాఁగిటి | లలిత | 34 |
| అతిరాజసపు | కేదారగౌళ | 166 |
| అదరిపాటున | రామక్రియ | 487 |
| అద్దమరేతిరి | పాడి | 263 |
| అనుకొనఁగాని | ముఖారి | 486 |
| అనేకపంత | మంగళకౌశిక | 136 |
| అన్నిటాను | సాళంగనాట | 116 |
| అన్నిటానెర | భైరవి | 88 |
| అన్నిటికినోపు | పాడి | 548 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| అన్నియుఁగూడఁ | రామక్రియ | 239 |
| అన్నియు నీ | వసంతవరాళి | 534 |
| అప్పుడుగాని | దేసాళం | 61 |
| అప్పుడు చూతము | ఆహిరి | 288 |
| అప్పుడు వేంకట | సామంతం | 281 |
| అప్పుదే యెఱఁగ | దేశాక్షి | 357 |
| అలమేలుమంగను | శంకరాభరణం | 31 |
| అవునే భాగ్య | దేసాళం | 399 |
| ఆఁడువారి | శ్రీరాగం | 201 |
| ఆఁపలేక కొసరితి | ఆహిరి | 23 |
| ఆడనుండే చూచి | నారాయణి | 121 |
| ఆడవయ్య సరిగా | హిందోళం | 389 |
| ఆతఁడు నీకంటె | మేఁచబౌళి | 555 |
| ఆతఁడు నీకు | బౌళి | 41 |
| ఆతనిఁజూడ | సౌరాష్ట్రం | 580 |
| ఆతవిఁజూప | సామంతం | 82 |
| ఆతనికి నీకుఁ | దేసాళం | 513 |
| ఆనతీవయ్యా | సామంతం | 385 |
| ఆపెకేల సన్న | బౌళి | 65 |
| ఆపెనేమీనన | మాళవిగౌళ | 311 |
| ఆపెనేల | పాడి | 199 |
| ఆయనాయఁదనిసితి | శుద్ధవసంతం | 438 |
| ఆయనాయ | నాట | 490 |
| ఆయనాయ నీ | రామక్రియ | 64 |
| ఆలిమగని సందికి | వరాళి | 432 |
| ఆ సుద్దులన్నియుఁ | శుద్ధవసంతం | 366 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఇంకనేలమఱఁగులు | పాడి | 415 |
| ఇంకానెంతసేసునో | శుద్ధవసంతం | 48 |
| ఇంతటగాని నీపగ | గౌళ | 261 |
| ఇంతటి మీఁది | బౌళిరామక్రియ | 9 |
| ఇంతదానవౌత | సాళంగనాట | 344 |
| ఇంతలో విచ్చేసితి | వరాళి | 83 |
| ఇంతవేగిరకత్తెనా | కేదారగౌళ | 49 |
| ఇంతినీతోనవ్వఁ | కేదారగౌళ | 509 |
| ఇంతి సేసిన | తెలుఁగుఁగాంబోది | 270 |
| ఇంతులకుఁ బతులకు | నారాయణి | 191 |
| ఇంతుల చేతఁకు | ధన్నాశి | 92 |
| ఇంతులాల | గౌళ | 219 |
| ఇంతులాల చూడరమ్మ | పాడి | 482 |
| ఇంతులాల చూడరే | పాడి | 377 |
| ఇంతేసి కొయ్యతనాలు | రామక్రియ | 316 |
| ఇందరితో సిగ్గయ్యీ | నాగవరాళి | 244 |
| ఇందవె యాతఁడు | శంకరాభరణం | 148 |
| ఇందాఁకా సరివచ్చె | భవుళి | 478 |
| ఇందుకేనవ్వు | బౌళి | 416 |
| ఇంపుగలిగిన | శ్రీరాగం | 214 |
| ఇచ్చకము నెరపితే | నాదరామక్రియ | 550 |
| ఇచ్చకమెఱఁగ | దేశి | 346 |
| ఇచ్చకురాలు | తోండి | 520 |
| ఇటని విన్నవిం | ఆహిరి | 506 |
| ఇటువలె నుండ | లలిత | 99 |
| ఇట్టిదివో | భైరవి | 352 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఇట్టినామోము | సాళంగనాట | 150 |
| ఇట్టె వట్టి వేసాలు | నాట | 275 |
| ఇట్టే పిలిపించ | శంకరాభరణం | 66 |
| ఇతవరి గనక | మంగళకౌశిక | 518 |
| ఇదివో నా | తెలుఁగుఁగాంబోది | 336 |
| ఇదివో నీపొందు | దేసాళం | 20 |
| ఇదివో నీమహి | దేశాక్షి | 510 |
| ఇదివో నీరమ | దేశాక్షి | 303 |
| ఇద్దరికిఁ జుట్ట | కురంజి | 251 |
| ఇద్దరినడుమ | మంగళకౌశిక | 570 |
| ఇద్దరు నిద్దరే | కుంతలవరాళి | 551 |
| ఇద్దరును మేన | సాళంగం | 213 |
| ఇన్నిటా దొరవు | బౌళి | 185 |
| ఇన్నియు నీకు | కన్నడగౌళ | 428 |
| ఇన్నేసి నేరకుండి | కురంజి | 310 |
| ఇప్పుడేమి వేగిరము | కన్నడగౌళ | 503 |
| ఇప్పుడే యిన్నియుఁ | నాగవరాళి | 583 |
| ఇప్పుడే విన్న | భైరవి | 149 |
| ఇయ్యఁగదె కానుక | గౌళ | 505 |
| ఇయ్యకొంటి | శంకరాభరణం | 341 |
| ఇరుగు పొరుగు | నారాయణి | 441 |
| ఇల్లాలయినదాని | కొండమలహరి | 423 |
| ఈఁదుకరమ్మనవే | సాళంగనాట | 37 |
| ఈకెగలిగి | బౌళి | 176 |
| ఈకె నీచుట్టరి | బౌళి | 74 |
| ఈగుణాలు మీకె | లలిత | 368 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఈతఁడు గుట్టు | మాళవి | 40 |
| ఈతఁడు చలమ | పాడి | 495 |
| ఈతఁడు పంతము | దేశాక్షి | 561 |
| ఈపనికి నేము | రామక్రియ | 212 |
| ఉండవయ్య ఇఁక | పాడి | 529 |
| ఉండవయ్యచాలుఁ | మాళవి | 549 |
| ఊడిగపువారము | దేసాళం | 537 |
| ఊరకుండవయ్య | పాడి | 382 |
| ఊరకున్నవారి | కేదారగౌళ | 297 |
| ఊరకే గుట్టుతోడ | నాట | 89 |
| ఊరకే దూరేవు | దేశి | 319 |
| ఊరకే నీవు | హిజ్జిజి | 535 |
| ఊరకేల దూరేవు | నారాయణి | 483 |
| ఊరకేల దూరేవు వూరి | సామంతం | 525 |
| ఊరకే విఱ్ఱవీఁ | గౌళ | 104 |
| ఊరకే వుండే | కాంబోది | 127 |
| ఊరివారి గుణములు | నాగవరాళి | 293 |
| ఎంచి చూచితే | ముఖారి | 337 |
| ఎంతగారవిం | కన్నడగౌళ | 475 |
| ఎంతగుట్టుగల | శుద్ధవసంతం | 343 |
| ఎంతజాణలే | మాళవి | 138 |
| ఎంతతమకమే | సౌరాష్ట్రం | 298 |
| ఎంతనన్నుఁ | ఆహిరి | 527 |
| ఎంతని పొగడేము | తెలుఁగుఁగాంబోది | 287 |
| ఎంతనీవు మో | గౌళ | 256 |
| ఎంతనోము నో | పాడి | 103 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఎంతబత్తిసేసీ | పాడి | 143 |
| ఎంతమోహమో | సౌరాష్ట్రం | 139 |
| ఎంతమోహించి | మాళవిగౌళ | 455 |
| ఎంత యిచ్చకు | నట్టనారాయణి | 425 |
| ఎంతయెడగొల్ల | పాడి | 112 |
| ఎంతలేదు నీ | కుంతలవరాళి | 406 |
| ఎంత వలతువో | నాదరామక్రియ | 11 |
| ఎంతలేదు పరాకు | సింధురామక్రియ | 111 |
| ఎంత వేగిరకాడవు | దేసాళం | 203 |
| ఎంతవేడుకకాడ | పాడి | 141 |
| ఎంతవేడుకో | నీలాంబరి | 10 |
| ఎంతసింగారించు | శ్రీరాగం | 26 |
| ఎందరి బెండ్లా | గౌళ | 24 |
| ఎందరు చెప్పినా | సాళంగనాట | 457 |
| ఎందరు లేరు | రీతిగౌళ | 217 |
| ఎందాకాబుజ్జ | సామవరాళి | 75 |
| ఎందాకా సరస | హిందోళం | 222 |
| ఎందాకా సిగ్గు | మధ్యమావతి | 309 |
| ఎందుకని సిగ్గు | బౌళి | 134 |
| ఎందువోయీ | నీలాంబరి | 514 |
| ఎక్కడి పరాకు | గుండక్రియ | 567 |
| ఎగసక్కెలేసేసీ | బౌళి | 160 |
| ఎచ్చటచూచినా | హిజ్జిజి | 246 |
| ఎటువంటిజాణ | హిందోళం | 62 |
| ఎటువంటి జాణత | మద్యమావతి | 467 |
| ఎటువంటి మర్మ | పాడి | 470 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఎటువంటి వేడు | మధ్యమావతి | 321 |
| ఎట్టుగల్గెనయ్యా | సామంతం | 284 |
| ఎట్టుదెలియఁగ | ముఖారి | 494 |
| ఎట్టునేరుచు | రీతిగౌళ | 354 |
| ఎట్టుమన్నించేవో | ఆహిరి | 332 |
| ఎట్టునేసినాఁ | దేశాక్షి | 55 |
| ఎట్టునేసినానీ | బౌళి | 123 |
| ఎడమాటలేమి | భైరవి | 418 |
| ఎడయనీచుట్ట | సామంతం | 57 |
| ఎదిరిఁదన్నెరఁ | హిందోళం | 13 |
| ఎదుటనూరకే | వరాళి | 314 |
| ఎదుటనే వున్నది | శ్రీరాగం | 559 |
| ఎదురాడరాదు | పాడి | 347 |
| ఎదురుకొంటి | వరాళి | 70 |
| ఎదురుచూచి | ఆహిరి | 146 |
| ఎదురుబడి | దేసాళం | 584 |
| ఎదురుమెచ్చ | లలిత | 398 |
| ఎన్నటిచుట్టమో | సామవరాళి | 264 |
| ఎన్నిచందాల | భైరవి | 292 |
| ఎన్ని చేఁతలదాన | ఆహిరి | 205 |
| ఎప్పటికప్పుడే | బౌళి | 313 |
| ఎప్పుడు చిత్తగిం | భైరవి | 106 |
| ఎప్పుడుదలఁచే | శ్రీరాగం | 524 |
| ఎప్పుడు భేదము | ఆహిరి | 445 |
| ఎప్పుడు వత్తువో | పాడి | 422 |
| ఎమ్మెకాఁడుగదె | శంకరాభరణం | 543 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఎమ్మెలునేతులు | గంభీరనాట | 405 |
| ఎమ్మెలు మాముం | మాళవిగౌళ | 404 |
| ఎరపరికమన్న | సౌరాష్ట్రం | 353 |
| ఎఱఁగగొల్ల | ముఖారి | 18 |
| ఎఱఁగనివాని | సామంతం | 345 |
| ఎఱఁగమానీ | పాడి | 68 |
| ఎఱఁగరాదేవు | సాళంగం | 349 |
| ఎఱిఁగించవయ్య | కురంజి | 178 |
| ఎఱుఁగుఎనీ | వేళావళి | 552 |
| ఎలయించీ సారె | దేశాక్షి | 91 |
| ఎవ్వరిఁబోలుదు | వరాళి | 276 |
| ఎవ్వరికి దొర | మాళవిగౌళ | 335 |
| ఎవ్వరిదినేర్పు | నాదరామక్రియ | 521 |
| ఎవ్వరినేము | కురంజి | 379 |
| ఎవ్వరినేరుపు | ధన్నాసి | 76 |
| ఎవ్వరు నిన్నాడు | సౌరాష్ట్రం | 519 |
| ఎవ్వరు నిన్నే | నాట | 465 |
| ఎవ్వరు నెఱఁగ | నాగవరాళి | 477 |
| ఎవ్వరునేమి | తెలుఁగు కాంబోది | 491 |
| ఎవ్వరెఱుఁగుదు | దన్నాశి | 196 |
| ఏఁకరీని మిమ్ముఁ | దేసాళం | 388 |
| ఏఁటికిఁజిం | సామంతం | 464 |
| ఏఁటికిఁదమ | మాళవశ్రీ | 566 |
| ఏఁటికిదాఁ | ముఖారి | 480 |
| ఏఁటికి దూరేవు | శ్రీరాగం | 476 |
| ఏఁటికి నెంచే | వసంతవరాళి | 365 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఏఁటికి మీగుజ | పాడి | 322 |
| ఏఁటికి సిగ్గులు | నాగగాంధారి | 360 |
| ఏఁటికి సిగ్గు | సింధురామక్రియ | 576 |
| ఏకరాజ్యమయ్య | బౌళి | 394 |
| ఏడకుఁబోనేల | లలిత | 233 |
| ఏడనుండివచ్చె | శుద్ధవసంతం | 569 |
| ఏపొద్దూఁ గొలు | సౌరాష్ట్రం | 268 |
| ఏమనిచెప్పఁగ | మాళవి | 210 |
| ఏమని చెప్పుదు | భైరవి | 158 |
| ఏమనిచెప్పుమనే | నాదరామక్రియ | 228 |
| ఏమనిచెప్పుదునే | హిందోళవసంతం | 105 |
| ఏమని చెప్పుదుమయ్య | దేసాళం | 47 |
| ఏమని చెప్పే | వరాళి | 54 |
| ఏమనిదూరే | దేవగాంధారి | 588 |
| ఏమనిపొగడ | కన్నడగౌళ | 1 |
| ఏమని పొగడుదు ఘు | శంకరాభరణం | 538 |
| ఏమని విన్నవించే | సాళంగం | 325 |
| ఏమని విన్నవించేనే | భూపాళం | 277 |
| ఏమయ్యనీవు | కాంబోది | 412 |
| ఏమాయనం | పాడి | 137 |
| ఏమాయనింత | సాళంగం | 547 |
| ఏమాయనే రమ | భైరవి | 183 |
| ఏమిచెప్పేది | కన్నడగౌళ | 16 |
| ఏమిచెప్పేది మో | మాళవిగౌళ | 72 |
| ఏమిచెప్పేవు | పాడి | 512 |
| ఏమి చెప్పేవేమా | సౌరాష్ట్రం | 162 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఏమిటికి మా | పడవంజరం | 546 |
| ఏమిదపము సే | కాంబోది | 58 |
| ఏమి సేతుఁ జెప్ప | ఆహిరి | 155 |
| ఏమి సేతునమ్మ | సామంతం | 157 |
| ఏమి సేతు నా | కాంబోది | 339 |
| ఏమి సేతుమయ్య | శుద్ధవసంతం | 102 |
| ఏమి సేయవచ్చు | నట్టనారాయణి | 63 |
| ఏమి సేయవచ్చు | నాదరామక్రియ | 317 |
| ఏమీ నెఱుఁగ | కన్నడగౌళ | 252 |
| ఏమీ నెఱుఁగని | భైరవి | 295 |
| ఏమీ నేరని | వరాళి | 202 |
| ఏమి సేసిన | రామక్రియ | 144 |
| ఏమే యెఱుఁగవా | కొండమలహరి | 578 |
| ఏరుపడెనింత | రామక్రియ | 401 |
| ఏలగడించుకొ | వరాళి | 466 |
| ఏల తప్పించు | సింధురామక్రియ | 280 |
| ఏలతమకించే | బౌళి | 484 |
| ఏలతలవంచు | ధన్నాశి | 208 |
| ఏల నన్నునొర | హిజ్జిజి | 327 |
| ఏలనన్నొడఁబర | దేసాళం | 446 |
| ఏలపొద్దులుగడ | దేశాక్షి | 179 |
| ఏలమూసిదాఁ | హిజ్జిజి | 131 |
| ఏలసరసములా | రామక్రియ | 156 |
| ఏలసిగ్గులువదే | పాడి | 290 |
| ఏలసిగ్గులువదేవే | కాంబోది | 182 |
| ఏలసిగ్గువదేవు | గుండక్రియ | 85 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
| --- | --- | --- |
| ఏలికసానికి | శుద్ధదేశి | 170 |
| ఏలినపతివి | సాళంగం | 285 |
| ఏలేలఁటదాని | ముఖారి | 147 |
| ఏలోయి నటకాఁడ | శుద్ధవసంతం | 351 |
| ఒకటి కినుమ | గౌళ | 232 |
| ఒడఁబాటునేసు | మాళవశ్రీ | 259 |
| ఒద్దికతోఁగూడి | పాడి | 448 |
| ఒయ్యనే లాలించి | దేసాళం | 169 |
| ఓయమ్మ తానేం | గౌళ | 124 |
| ఓరుపే నేరుపం | నారాయణి | 469 |
| ఔనయ్యా తగవు | నాదరామక్రియ | 96 |
| ఔనయ్యా నీదేవు | శంకరాభరణం | 497 |
| ఔనయ్యామంచి | రామక్రియ | 223 |
| ఔనయ్యామంచివాఁడ | సాళంగనాట | 384 |
| ఔనయ్యా మంచివాఁడ | సౌరాష్ట్రం | 215 |
| ఔనె భాగ్యవంతు | శంకరాభరణం | 431 |
| కంటిని మన్నన | పాడి | 403 |
| కంటి నీ మనసు | ముఖారి | 393 |
| కంటిమమ్మ | ధన్నాసి | 468 |
| కంటిమయ్యా యీ | కురంజి | 553 |
| కంటిమి కొత్తలు | మాళవశ్రీ | 4 |
| కంటిమిగా నీ | బౌళి | 355 |
| కంటిమి నీ | నాగవరాళి | 444 |
| కంటివయ్యా యీ | రామక్రియ | 429 |
| కందువ నీ | ఆహిరి | 577 |
| కడలేని కీరితి | శ్రీరాగం | 375 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| కడుఁగడుముద్ద | లలిత | 218 |
| కనుఁగొనవయ్యా | సామంతం | 308 |
| కనుఁగొనేఁగా | పాడి | 180 |
| తన్నువిన్నకొత్త | పడవంజరం | 462 |
| కన్నుల నీసంతో | నారాయణి | 245 |
| కన్నుల మొక్కేము | సామంతం | 472 |
| కన్నెగొల్లపడుచు | రామక్రియ | 187 |
| కమ్మినీవాకటా | సామంతం | 299 |
| కరఁగియిందుక | పాడి | 159 |
| కరుణించవయ్య | ముఖారి | 420 |
| కరుణించుము | శంకరాభరణం | 565 |
| కరుణింతువుగాని | కన్నడగౌళ | 539 |
| కలిగెఁగానీకు | శుద్ధవసంతం | 220 |
| కాంతకు నీకును | లలిత | 508 |
| కాంతనీపైప్రేమ | రామక్రియ | 272 |
| కాంతలకుఁబతు | పాడి | 45 |
| కాఁగిలించిపట్టు | ముఖారి | 29 |
| కాకున నేఁబొర | భైరవి | 342 |
| కాదనఁగవచ్చు | దేవగాంధారి | 198 |
| కానవచ్చీ మీ | లలిత | 452 |
| కానవచ్చె నా | శుద్ధదేశి | 126 |
| కానవచ్చె నీ | బౌళి | 592 |
| కానవచ్చె మీ | కేదారగౌళ | 315 |
| కాని అందుకే | పాడి | 581 |
| కానీ లేవే యందు | సామంతం | 207 |
| కానీవయ్యాచుట్టా | బౌళి | 129 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| కామునికేల తగ | వరాళి | 171 |
| కొత్తకొత్తవల | గుండక్రియ | 250 |
| కొత్తగానాతో | రామక్రియ | 181 |
| కొత్తపెండ్లికూఁతురవా | లలిత | 356 |
| కొత్తపెండ్లికూఁతురవై | ఆహిరి | 266 |
| కొనియాడేమే | వరాళి | 449 |
| కొమ్మనీచక్కఁ | ముఖారి | 409 |
| కోడెకాఁడు వీఁడు | సాళంగనాట | 479 |
| గద్దెమీఁదనుం | దేవగాంధారి | 306 |
| గయ్యాళితనము | మంగళకౌశిక | 328 |
| గుట్టుతోడమరి | సౌరాష్ట్రం | 253 |
| గోవులఁగాచి | శంకరాభరణం | 414 |
| ఘనుఁడనేనే | వేళావళి | 417 |
| ఘనుఁడవు నీవాళ్ళ | ఆహిరి | 350 |
| చండిసేసి పెనఁ | నాట | 427 |
| చక్కఁగానాన | ఆహిరి | 485 |
| చక్కఁదనాల | మాళవిగౌళ | 370 |
| చక్కనిదానవు | తెలుఁగుఁగాంబోది | 90 |
| చక్కనివాఁడ | దేవగాంధారి | 5 |
| చాటి చెప్పితిమి | ముఖారి | 334 |
| చిత్తగించవయ్య | నాగవరాళి | 492 |
| చిత్తగించవయ్య యీ | సాళంగం | 426 |
| చిత్తగించవయ్యా | భైరవి | 456 |
| చిత్తగించి చూడ | దేసాళం | 110 |
| చిత్తగించి చూడవ | రామక్రియ | 30 |
| చిత్తగించి నా | భైరవి | 67 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| చిత్తగించు రమ | మాళవిగౌళ | 532 |
| చిత్తగింతువు | భూపాళం | 80 |
| చిత్తము రానే | సామంతం | 289 |
| చిత్తము లెరిఁగి | ఆహిరి | 571 |
| చిత్తమువచ్చిన | కాంబోది | 562 |
| చూచినవారికిఁ | పాడి | 307 |
| చూచివచ్చితి | దేశాక్షి | 164 |
| చూడఁబిన్న | బౌళి | 230 |
| చూడఁబిన్నవు | సామంతం | 17 |
| చూడరేవో చెలు | లలిత | 560 |
| చూడరేవో చెలులా | దేవగాంధారి | 120 |
| చూడవయ్య ఇవి | పాడి | 361 |
| చూడవయ్యా | నాదరామక్రియ | 563 |
| చూతము నీ నే | మధ్యమావతి | 376 |
| చూతము నీ బలు | ఆహిరినాట | 557 |
| చెక్కుటి చేయిఁక | నట్టనారాయణి | 279 |
| చెప్పనరుదాయఁ | వరాళి | 188 |
| చెప్పరాదుచూప | ధన్నాసి | 227 |
| చెప్పరాదుచూప | శ్రీరాగం | 305 |
| చెప్పవయ్యవినేఁ | సామవరాళి | 130 |
| చెప్పవే నీసుద్దు | రామక్రియ | 69 |
| చెప్పితిమిప్పుడె | పాడి | 125 |
| చెప్పినట్టెల్లాఁ | దేశాక్షి | 391 |
| చెప్పినట్టెల్లా | సింధురామక్రియ | 590 |
| చెప్పేదేమిఇఁక | పాడి | 173 |
| చెలపచెమటల | నాగవరాళి | 318 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| చెలరేఁగి కొలువు | నారాయణి | 71 |
| చెలికత్తెలతో | ధన్నాసి | 2 |
| చెలికత్తెలము | దేసాళం | 194 |
| చెలినిన్ను దూరీ | హిందోళం | 451 |
| చెలియమేనే | దేశాక్షి | 152 |
| చెలులము నీకు | దేవక్రియ | 568 |
| చెలులము మా | భైరవి | 25 |
| చెలులాల నేనతని | గౌళ | 154 |
| చెలులాలయెట్టి | సామంతం | 243 |
| చెలులాలయేమి | ఆహిరి | 408 |
| చెలువుఁడ నీకు | కన్నడగౌళ | 591 |
| చెల్లఁబో ఆఁట | పాడి | 221 |
| చెల్లఁబో యెన్నా | కాంబోది | 39 |
| చెల్లుఁగదె యాతఁ | రీతిగౌళ | 545 |
| చెవిలో నేకత | సౌరాష్ట్రం | 540 |
| చేతికి లోనై తే | దేసాళం | 333 |
| చేపట్టఁగుంచమ | సామంతం | 367 |
| చేయివట్టితియ్య | ముఖారి | 101 |
| చేరి కరుణించు | ఆహిరి | 265 |
| చేరినన్నుఁజూచి | ఛాయానాట | 234 |
| చేరి నీ మొగము | దేశాక్షి | 434 |
| చేరివూరకుంటే | హిందోళం | 517 |
| చేరి వూరకేల | కాంబోది | 51 |
| చేవదేరె వలపు | బౌళి | 371 |
| చేసినట్టెల్లాఁ | బౌళి | 286 |
| చొక్కపు నీపెం | సామంతం | 558 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| తగవెఱఁగ | మంగళకౌశిక | 247 |
| తనంతనెఱఁగ | దేసాళం | 374 |
| తనచిత్తమెఱఁ | రామక్రియ | 42 |
| తడవాయ నీ | దేసాక్షి | 3 |
| తనమర్మమొక | దన్నాసి | 348 |
| తప్పించుకొనఁ | ఆహిరి | 50 |
| తప్పించుకొన | దేసాళం | 86 |
| తప్పులెంచకు | దేవగాంధారి | 238 |
| తమకించి నిన్నే | బౌళి | 453 |
| తరుణి జవ్వన | సామంతం | 167 |
| తరుణుల సహ | తోండి | 395 |
| తలఁపులో కోరి | ఆహిరి | 115 |
| తలపోసి తలపోసి | ఆహిరి | 165 |
| తలవంచుకొన | వరాళి | 283 |
| తానే తేరీఁగాని | రామక్రియ | 424 |
| తానే యెఱుఁగుఁ | ముఖారి | 97 |
| తానే యెఱుఁగుఁ | శ్రీరాగం | 113 |
| తానేల విఱ్ఱవీఁగీ | ముఖారి | 304 |
| తానేల సిగ్గు | లలిత | 269 |
| తానై తే నన్నిటా | సామంతం | 193 |
| తెలిపిచెప్పే | రీతిగౌళ | 326 |
| తెలుసునో తెలియ | దేవగాంధారి | 413 |
| తేట తెల్లములు | శంకరాభరణం | 585 |
| తేరిచూడ నిన్నీ | లలిత | 145 |
| తేవయ్య వీడెము | రీతిగౌళ | 564 |
| తొల్లి నీవుచేసు | కాంబోది | 296 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| తోడఁబెండ్లి యా | సాళంగనాట | 435 |
| దండనున్న సతు | వరాళి | 133 |
| దయఁజూచి రక్షిం | శ్రీరాగం | 387 |
| దూరనేల ఇఁక | శంకరాభరణం | 531 |
| నడుమవలసి | నాగవరాళి | 378 |
| ననిచి నీమాటలు | భైరవి | 402 |
| నన్నెంతవొగడే | పాడి | 119 |
| నన్నునేల దూరే | మేఁచబౌళి | 190 |
| నమ్మిక గావలె | నారాయణి | 373 |
| నమ్మితిఁదన | వరాళి | 362 |
| నవ్వవే సెలవుల | ముఖారి | 419 |
| నవ్వుగాదు నీ | దేవగాంధారి | 329 |
| నవ్వుగాదు నే | శ్రీరాగం | 22 |
| నా పంతము | దేశాక్షి | 504 |
| నా మనసెందాఁ | ముఖారి | 236 |
| నా మొగముచూచి | గౌళ | 56 |
| నావల్లఁగడమ | తెలుఁగుఁగాంబోది | 459 |
| నావల్లఁదప్పు | సాళంగం | 35 |
| నావాఁడనే యంటా | గౌళ | 81 |
| నిగిడినేఁగంటి | వరాళి | 507 |
| నిజము నెరప | శంకరాభరణం | 323 |
| నిన్నటి పంతా | ఛాయానాట | 359 |
| నిన్నుఁబాయఁ | లలిత | 528 |
| నీకునాకుసరి | ఆహిరి | 295 |
| నీకుబాఁతై | కాశి | 15 |
| నీకెంతపరా | నాగవరాళి | 226 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| నీ కొలఁదిదాన | సాళంగనాట | 586 |
| నీతలనే వేగ | పడవంజరం | 282 |
| నీతి విచారించు | లలిత | 440 |
| నీతో నవ్వఁగల | లలిత | 516 |
| నీ దిక్కే చూచి | ఆహిరి | 128 |
| నీ దేవులు నేనే | కన్నడగౌళ | 544 |
| నీ యందు నేమై | లలిత | 93 |
| నీవు నేనుగురి | కన్నడగౌళ | 515 |
| నీవు సరసుఁడవు | పాడి | 231 |
| నీవు సేసిన చేఁ | బౌళి | 421 |
| నీవెఱఁగని | ఆహిరినాట | 493 |
| నీవే ఇంత సేయఁ | వరాళి | 177 |
| నీవే పాడిపం | ముఖారి | 312 |
| నీవేమి సేసి | గౌళ | 195 |
| నీవేల దాఁచేవు | ముఖారి | 291 |
| నీవేల సిగ్గు | ధన్నాసి | 372 |
| నీవేల సిగ్గువ | కాంబోది | 7 |
| నీవై నాఁజేరఁ | దేవగాంధారి | 258 |
| నీవైనా నానతీ | సామంతం | 501 |
| నెట్టననెప్పుడు | భైరవి | 330 |
| నెట్టుకొని మన్నిం | దేశాక్షి | 439 |
| నెలఁత చక్క | నాదరామక్రియ | 108 |
| నెఱజాణవిన్ని | బౌళిరామక్రియ | 44 |
| నేనేమందునో | పాడి | 443 |
| నేనేమి యెఱుఁ | దేసాళం | 60 |
| నేరుతుమునీ | వరాళి | 579 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| నేరుతువయ్యా | బౌళిరామక్రియ | 573 |
| నేరుపరినం | బౌళి | 248 |
| నేరుపరివి నీవై | మంగళకౌశిక | 78 |
| పంతము దప్ప | భైరవి | 572 |
| పంతపు సుద్దులు | శుద్ధవసంతం | 582 |
| పట్టరానివయ | గౌళ | 273 |
| పట్టిన చలము | హిందోళవసంతం | 574 |
| పడఁతినెప్పుడు | భైరవి | 100 |
| పడఁతులఁగం | రామక్రియ | 94 |
| పతిఁబాసి విర | ఆహిరి | 397 |
| పతులకు సతు | కుంతలవరాళి | 237 |
| పరుసవేదివం | దేశాక్షి | 278 |
| పలువేడుకలతో | సాళంగనాట | 320 |
| పాడరే సోబ | బౌళి | 436 |
| పాయపుమదము | నట్టనారాయణి | 340 |
| పాయరాని చుట్ట | దేసాక్షి | 204 |
| పాయరాని మగఁ | ధన్నాసి | 498 |
| పాసివున్న | ఆహిరి | 192 |
| పిన్నది యిది | రామక్రియ | 257 |
| పిలువక వచ్చి | మాళవి | 53 |
| పిలువాఁగద | శంకరాభరణం | 197 |
| పెంచితి నిన్ను | కన్నడగౌళ | 174 |
| పొలఁతీ నీనట | దేవగాంధారి | 79 |
| పోరానీచుట్ట | నాదరామక్రియ | 500 |
| పోలించి చూచి | శంకరాభరణం | 8 |
| ప్రియము గలిగి | సామంతం | 489 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ప్రియురాలు | నాగగాందా(ధా)రి | 536 |
| బడలి వుందాన | పడవంజరం | 324 |
| బలవంతుడిత | రామక్రియ | 302 |
| బలిమి సేయకు | బలహంస | 463 |
| బలువాడవయ్యా | వరాళి | 593 |
| బాపురే యింత | ఆహిరినాట | 380 |
| భామల చయ్యా | మంగళకౌశిక | 450 |
| మంచిదయ్యా | వరాళి | 206 |
| మగడట ఆలట | ఆహిరి | 38 |
| మగువరో ఇందు | శ్రీరాగం | 363 |
| మగవాడ విన్ని | తెలుగుగాంబోది | 407 |
| మగవాడు మెత్త | బౌళి | 502 |
| మగవాడు వల | మాళవశ్రీ | 390 |
| మగవానితోనింత | దేసాళం | 496 |
| మగువ గుంపెన | రామక్రియ | 499 |
| మగువ లాల | బౌళి | 526 |
| మరుతంత్రము | ఆహిరి | 84 |
| మఱగులేటి | ఆహిరి | 437 |
| మఱచితినన | భూపాళం | 589 |
| మఱచి వూర | హిజ్జిజి | 189 |
| మఱి తరవాత | సాళంగం | 240 |
| మఱి యేల చెప్పే | లలిత | 255 |
| మాకుదెలి | వరాళి | 530 |
| మాటలేలరా | సామంతం | 410 |
| మానాపతివై | కాంబోది | 211 |
| మాపుదాకా | కాంబోది | 364 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| మాపొందు సేయు | శ్రీరాగం | 554 |
| మా యింటికిఁ | భైరవి | 242 |
| మిమ్మేమయలుగ | మధ్యమావతి | 168 |
| ముద్దరాలవై తే | కాంబోది | 95 |
| మునిముచ్చువల | నాదరామక్రియ | 267 |
| మెచ్చితిమితొలు | రామక్రియ | 383 |
| మెచ్చేరయ్య నా | సింధురామక్రియ | 458 |
| మేరమీరకువె | రామక్రియ | 241 |
| మేలయ్యమిమ్ముఁ | శ్రీరాగం | 575 |
| మేలుకు మేలే | నాగగాంధారి | 107 |
| మేలునీజాణత | ముఖారి | 172 |
| మేలు మేలు నీ | బౌళి | 140 |
| మేలురానీకత | నాట | 186 |
| మొక్కలీఁడవ | సాళంగనాట | 369 |
| మొక్కవేచెలు | సామంతం | 396 |
| మొక్కేనిదివో | బౌళి | 338 |
| మొదల నిన్నుఁ | మేఘరంజి | 21 |
| రమణుఁడచిత్త | ధన్నాసి | 454 |
| రమణుఁడవునీవు | వరాళి | 488 |
| రాఁడంటానుంటి | శ్రీరాగం | 163 |
| రాజసపువాని | ధన్నాశి | 262 |
| రావయ్య ఇఁకనై | కాంబోది | 254 |
| లలనల సంతలో | మాళవిగౌళ | 87 |
| లెస్సాయఁగానేఁ | శంకరాభరణం | 460 |
| వట్టిసిగ్గులు | గౌళ | 473 |
| వలచినవలపెల్లా | ఆహిరి | 400 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| వలచివచ్చితి | దేసాళం | 14 |
| వలపులకు గురైన | పాడి | 225 |
| వసుధలోనిటు | మాళవిగౌళ | 184 |
| వాకిలిగాచుకొని | కురంజి | 59 |
| వాకిలిగాచే | ముఖారి | 153 |
| వింటిరటే చెలులార | గౌళ | 511 |
| వింటిరటే చెలులాల | పళవంజరం | 27 |
| విచారించవలె | రామక్రియ | 32 |
| వినోదకాఁడైన | మాళవి | 301 |
| వినోదించవయ్యా | వరాళి | 118 |
| విన్నపముసేయు | అమరసింధు | 541 |
| విన్నవించరే | కాంబోది | 381 |
| విన్నవించవే | మంగళకౌశిక | 46 |
| విభునితోనిఁక | శుద్ధవసంతం | 6 |
| విరహమునకు | తెలుఁగుఁగాంబోది | 114 |
| వివేకించుకొన | సౌరాష్ట్రం | 430 |
| వీఁడె చూడరే | సాళంగనాట | 229 |
| వీఁపుగానరాఁగా | సాళంగం | 474 |
| వీడుదోడాయ | నాగవరాళి | 109 |
| వీడెమిత్తువురా | మంగళకౌశిక | 117 |
| వీదులనెల్లాఁ | సామంతం | 331 |
| వీనులార నీవే | భైరవి | 521 |
| వెంగెములునిన్నా | తెలుఁగుఁగాంబోది | 12 |
| వెరగయ్యా నీ | శంకరాభరణం | 216 |
| వెలయముందటె | మధ్యమావతి | 36 |
| వేఁడుకొనివేఁడు | భైరవి | 472 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| వేగిరించకురే | పాడి | 122 |
| వేగిరించనాకే | కన్నడగౌళ | 433 |
| వేగిలేచి సేసే | వేళావళి | 386 |
| వేడుక కాఁడవు | శుద్ధవసంతం | 151 |
| వేడుకయ్యీనా | దేసాళం | 442 |
| వేడుకయ్యీ మీ | రీతిగౌళ | 411 |
| వేరే నిన్నుఁబాసి | నాదరామక్రియ | 33 |
| వేవేగఁబ్రియాలు | కన్నడబంగాళం | 271 |
| వేసరక సారెనన్ను | ముఖారి | 556 |
| [1] వోజ(ఓజ)కువచ్చి | నాదరామక్రియ | 461 |
| సంగడికి రాఁ | శ్రీరాగం | 447 |
| సందుసుడికత్తె | సామంతం | 28 |
| సందుసుడికత్తెవు | రామక్రియ | 132 |
| సగముమానిసి | నాట | 209 |
| సతులకుఁబతు | మనోహరి | 294 |
| సారెసారె మన్నిం | ముఖారి | 77 |
| సారె నిన్నల | బౌళి | 249 |
| సిగ్గరి పెండ్లి | సాళంగనాట | 73 |
| సిగ్గుతోడ గొంకి | సాళంగనాట | 161 |
| సెలవులనవ్వు | తెలుఁగుఁగాంబోది | 533 |
| సేసవెట్టిపెండ్లా | బౌళి | 392 |
| సేసవెట్టిపెండ్లా | బౌళి | 200 |
| సేసినట్టుసేయ | గుజ్జరి | 142 |
| సేసినదెల్లాఁజేఁ | ముఖారి | 523 |
| సొలసితే పాయ | సౌరాష్ట్రం | 52 |


1. రేకుల వ్రాత ననుసరించి పొరపాటున అచ్చులో తప్పినది.

# అనుబంధము ౨

## అకారాది రాగ సంకీర్తనల సంఖ్యా సూచిక.


| రాగములు | సంకీర్తనల సంఖ్యలు |
|---|---|
| అమరసింధు | .... 541 |
| ఆహిరి | .... 23, 38, 50, 84, 115, 128, 146, 155, 165, 192, 205, 235, 265, 266, 288, 332, 350, 397, 400, 408, 437, 445, 485, 506, 527, 571, 577 |
| ఆహిరినాట | 380, 493, 557 |
| కన్నడగౌళ | .... 1, 16, 174, 252, 428, 483, 475, 503, 515, 539, 544, 591 |
| కన్నడ బంగాళం | .... 271 |
| కాంబోది | 7, 39, 48, 51, 58, 95, 127, 182, 211, 254, 296, 332, 364, 381, 412, 562 |
| కుంతలవరాళి | .... 237, 406, 551 |
| కురంజి | .... 59, 178, 251, 310, 379, 553 |
| కేదారగౌళ | .... 49, 166, 297, 315, 509 |
| కొండమలహరి | .... 423, 578 |
| గౌళ | .... 15 |
| గంభీరనాట | 405 |

| రాగములు | | సంకీర్తనల సంఖ్యలు |
|---|---|---|
| గుండక్రియ | .... | 85, 250, 567 |
| గుజ్జరి | | 142, 175 |
| గౌళ | .... | 24, 56, 81, 104 124, 154, 195, 219, 261, 232, 256 273 473, 505 511 |
| ఛాయానాట | .... | 234, 359 |
| తెలుగుగాంబోది | .... | 12, 90, 114, 270, 287, 336, 407, 459, 491, 533 |
| తోండి | .... | 395, 520 |
| ద(ధ)న్నాసి(శి) | .... | 2, 76, 92, 196, 208, 227, 262, 348, 372 454 468, 498 |
| దేవక్రియ | .... | 568 |
| దేవగాంధారి | | 5, 79, 120, 198, 238, 258 306, 329, 413, 588 |
| దేశి | .... | 319, 346 |
| దేసాళం | .... | 14, 20, 47, 60 61, 86, 110, 169, 194, 203, 274, 333, 374, 388, 399, 442 446, 496, 513, 537, 584 |
| దేశా(సా)ళి | .... | 3 55, 91, 152, 164, 179, 204, 278 303, 357, 391, 434, 439, 504, 510, 561 |
| నట్టనారాయణి | .... | 63, 279, 340 425 |
| నాగగాంధా(దా)రి | .... | 107, 360, 583 |

| రాగములు | | సంకీర్తనల సంఖ్యలు |
|---|---|---|
| నాగవరాళి | .... | 109, 226, 244, 293, 318, 378, 444, 477, 492, 583 |
| నాట | .... | 89, 186, 209 275, 427, 465, 490 |
| నాదరామక్రియ | | 11, 33, 96, 108. 228, 267, 317, 461, 500, 521, 542, 550, 563, 587 |
| నారాయణి | .... | 71, 121 191, 245, 373, 441, 469, 483 |
| నీలాంబరి | .... | 10, 514 |
| పడ(ళ)మంజరం | .... | 27, 282, 324, 462, 546 |
| పాడి | | 45, 68, 103, 112, 119, 122, 125, 137, 141, 143, 159, 173, 180, 199, 221 225 231, 260, 263, 290, 307, 322, 347, 361, 377, 382, 403, 415, 422 443, 448, 470, 482, 495, 512, 529, 548, 581 |
| బలహంస | .... | 463 |
| బౌళి(బవుళి) | .... | 41, 65, 74, 123, 129, 134, 140, 160, 176, 185, 200, 230, 248, 249, 286, 313, 338, 355, 371, 392, 394, 416, 421, 436, 453, 478, 484, 502, 526, 592 |
| బౌళిరామక్రియ | .... | 9, 44, 573 |
| భూపాళం | .... | 80, 277, 589 |

| రాగములు | సంకీర్తనల సంఖ్యలు |
|---|---|
| భైరవి | .... 25, 67, 88, 100, 106, 149, 158, 183, 242, 292, 295, 330, 342, 352, 402, 418, 456, 471, 522, 572 |
| మంగళకౌశి(సి)క | .... 46, 78, 117, 136, 247, 328, 450, 518, 570 |
| మధ్యమావతి | .... 36, 168, 309, 321, 376, 467 |
| మనోహరి | .... 294 |
| మాళవశ్రీ | .... 4, 259, 390, 566 |
| మాళవి | .... 40, 53, 138, 210, 301, 549 |
| మాళవిగౌళ | .... 72, 87, 184, 311, 335, 370, 404, 455, 532 |
| ముఖారి | .... 18, 29, 77, 97, 101, 147, 153, 172, 236, 291, 304, 312, 334, 337, 393, 409, 419, 420, 480, 486, 494, 523, 556 |
| మేచబౌళి | .... 190, 555 |
| మేఘరంజి | .... 21 |
| రామక్రియ | 30, 32, 42, 64, 69, 94, 132, 144, 156, 181, 187, 212, 223, 239, 241, 257, 272, 302, 316, 358, 383, 401, 424, 429, 487, 499 |
| రీతిగౌళ | .... 217, 326, 354, 411, 545, 564 |

| రాగములు | | సంకీర్తనల సంఖ్యలు |
|---|---|---|
| లలిత | | 34, 93, 99, 135, 145, 218, 233, 255, 269, 356, 368, 398, 440, 452, 481, 508, 516, 528, 560 |
| వరాళి | .... | 54, 70, 83, 118, 133, 171, 177, 188, 202, 206, 276, 283, 314, 362, 432, 449, 466, 488, 507, 530, 579, 598 |
| వసంతవరాళి | | 365, 534 |
| వేళావళి | .... | 386, 417, 552 |
| శంకరాభరణం | .... | 8, 31, 66, 148, 197, 216, 323, 341, 414, 431, 460, 497, 531, 538, 543, 565, 585 |
| శుద్ధదేశి | | 126, 170 |
| శుద్ధవసంతం | .... | 6, 48, 102, 151, 220, 343, 351, 366, 438, 569, 582 |
| శ్రీరాగం | | 22, 26, 98, 113, 163, 201, 214, 305, 363, 375, 387, 447, 476. 524, 554, 559, 575 |
| సామంతం | .... | 17, 28, 57, 82, 157, 167, 193, 207, 243, 281, 284, 289, 299, 308, 331, 345, 367, 385, 396, 410, 464, 472, 489, 501. 525, 558 |
| సామవరాళి | .... | 75, 130, 264 |

| రాగములు | | సంకీర్తనల సంఖ్యలు |
|---|---|---|
| సాళంగం | .... | 35, 213, 240, 285, 325, 349, 426. 474, 547 |
| సాళంగనాట | .... | 37, 73, 116, 150, 161, 229, 300, 320, 344, 369, 384, 435, 457, 479, 586 |
| సింధురామక్రియ | | 111, 280, 458, 576, 590 |
| సౌరాష్ట్రం | .... | 19, 52, 139, 162, 216, 253, 268, 298, 353, 430, 519, 540, 580 |
| హిందోళం | .... | 13, 62, 222, 224, 389, 451, 517 |
| హిందోళవసంతం | .... | 105, 574 |
| హిజ్జిజి | .... | 131, 189, 246, 327, 535 |

# అనుబంధము ౩

సందిగ్ధ పదసమీక్ష.

[ తాళ్ళపాకకవులవాఙ్మయములో అపూర్వపదరాశి గొప్పది. ప్రత్యేకముగ ఈపని గొప్పగ సాగవలసియున్నది. దానికుపస్కారకముగ, ఈ సంపుటములో నా దృష్టికి వచ్చిన కొన్నిపదములను లఘువుగ చర్చించితిని. నిఘంటువుల కెక్కనివీ, ఎక్కినా అన్యార్థము లందు ప్రయోగింపబడినవీ, వ్యాకరణమును పట్టిచూచేవి, ఇతరభాషా నిఘంటు ప్రసిద్ధములు మాత్రమే ఇందు చర్చింపబడినవి :- ]

1. అందుకాచేవు :- 150-వ పాట. అందు=Going near అని కిట్టల్. 'అంద్రై' అని తమిళము. 'అంద' అని తెలుగు. కాచుధాతుసాహచర్యముతో అందు శబ్దము, దగ్గరగ తిరిగి రహస్యమును గుర్తించు అనునర్థమున మాండలికముగ ప్రసిద్ధము. కిట్టలిచ్చిన యర్థమున కిది కొంత విశేషార్థము కావచ్చు.

2. అప్పసము :- 146-వ పాట. అప్పసము=నిచ్చలు, సతతము అని శ. ర. సూ. ని. కానీ ఇక్కడ, ఎప్పుడూ కావలిగ నుంచుట అను నర్థముగ తోచుచున్నది.

3. అయకట్టేవు :- 324-వ పాట ఆయకట్టు=ధనము వచ్చుబడి యొక్క నిర్ణయము అని శ. ర. ఆయకట్టు= 1. రాబడియొక్క నిర్ణయము, 2. చెఱువు మొదలగువానిక్రింద సేద్యమగు భూమి యొక్క పరిమితి అని సూ. ని. ఇక్కడ సాగుచేసి పండించు అను నర్థము సరిపోవునట్లున్నది.

4. ఆయిటిగాలి :- 152-వ పాట. ఆయిటి అనునది 'ఆవర్త' శబ్ద భవమైన వ్యావహారిక రూపముగా తోచుచున్నది. సుడిగాలి అని యర్థము. గ్రీష్మ ర్తువులో వీచేపెనుగాలికి ఆవటిగాలి, ఆవిటి గాలి అనియు వ్యవహారమున్నది.

5. అస్సారము ;- 460-వ పాట. ఇది నిఘంటు వ్యాకరణములను దాటిన ప్రయోగము. అసార శబ్దమునే అస్సారమని నిస్సార శబ్దార్థములో నిస్సారసాదృశ్యముతో స్వతంత్రించి ప్రయోగించి నట్లున్నది. "ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోఽనుధావతి" అను ఋషిమాగలవారిలో అన్నమాచార్యులొకరు. ప్రాసస్థలము గావున దుశ్చికిత్స్యము.

6. ఉబ్బరికాఁడు :- 105-వ పాట. 'ఉబ్బు' ఉబ్బుధాతు కృదంత-రూపము. దానిపై మతుబర్థక రూపము ఉబ్బరి. మరల దానిపై మతుబర్థకకాఁడువర్ణకము. 'న తద్ధితా త్తద్ధితః' అను వ్యాక-రణ నియమ మేమూల నుండెనో? లేక ఉబ్బుధాతువునుండి, ఉబ్బరము అనునర్థమున 'ఉబ్బరి' అను కృదంతరూపమేర్పడి, దానిపై మతుబర్థక 'కాఁడు' వచ్చిన రూపమైన కావలెను.

7. ఏతువులు ;- 563-వ పాట. హేతుశబ్దభవము కావచ్చును. అర్థమూ అదే. 'ఏతవ లెత్తి మాటలాడినాడు.' అను వ్యవ-హార మీనాటికిని గలదు. నెపము లెత్తిచూపుట అను విశేషార్థ మున పై వ్యవహారముగలదు.

8. ఏమిరే :- 14-వ పాట. ప్రార్థనార్థక మధ్యమ పురుష ఏకవచన బహువచనములందు వు-రు లపై వచ్చు 'చెప్పవే' 'చెప్పరే' వంటి రూపము అవ్యయముపైగూడ చేసినట్టు కానవచ్చుచున్నది. లేక ఏమిరా అను పుంలింగ రూపమువలె, ఏమిరే స్త్రీ లింగ రూపమైన కావచ్చు. ఈ వాఙ్మయములో ఏమిరే అని పుంలింగ రూప ప్రయోగములును గలవు. సంబోధక 'ఓరి'కి వ్యావహారిక-మైన 'ఓరే' లోని శేషభాగమైన కావచ్చు.

9. కరికుంభజఘనపు గజరాజ లక్ష్మిని :- 532-వ పాట. జఘనమును (నితంబమును) కరికుంభములతో పోల్చుట వింత. ఒకదశలో సాదృశ్యము సులభమే.

10. కలగంప :- 13-వ పాట. కలగూరగంపయొక్క మధ్యమపద-లోపరూపము గావచ్చు.

11 కలితే :- 530-వ పాట. కలుగు ధాతువునకు వ్యావహారిక రూపమా ? లేక కలుగు ధాత్వర్థమున కలుధాతు వొకటి యుండెనా ? ఈ ధాతు వీవాఙ్మయమున విస్తారముగ కలదు.

12. కాయాటుది :- 184-వ పాట. కాయవాటు శరీరము గలది అను వ్యావహారిక ప్రయోగమునకు సంగ్రహరూపముగా కానవచ్చు చున్నది. కాయవాటుశరీరము=గట్టిశరీరమని వ్యవహార మున్నది.

13. కోలగాచి పందెమాడుట=401 పాట. ఇదియొక పలుకుబడిగా తోచు చున్నది. జాతీయములన్ని తాత్పర్యార్థ ప్రధానములు. ఒక హద్దుచేసి దానిని.దాటకుండ నియమించుట దీని తాత్పర్యము ఒక గీతనుగాని కట్టనుగాని హద్దుగా చేసికొని దానిని దాటకుండ (చెడుగుడువలె) ఆడునట్టిక్రీడావిశేష మిందు జాతీయముగ ప్రయోగించినట్లున్నది.

14. గోదిలి విరహాన-: 112-వ పాట. 'గోదిలి' గూఢశబ్దభవముగా తోచుచున్నది. అర్థమూ అదే కావచ్చు.

15. గోనాల గొందులు :- 401-వ పాట. గొంది=చిన్నసందు అని ప్రౌఢ్యము. గోనము కోణ శబ్దభవము కావచ్చు. గోనాల గొందులు=మూలలలోని సందులు కావచ్చు.

16. చీరుమూరుగా :- 31-వ పాట. చీఱుమాఱు=Cnfusion, తాఱు మాఱు, Ill'treatment అని తమిళము. ఇక్కడ దాని ధాయార్ధ ముగ అడ్డమాకలు లేక ఇత్యాది కావచ్చు.

17. చేఁతలాడి :— 104-వ పాట. వగలు వన్నెలు మొదలగు బహు వచనాంతములపై మతుబర్థమున ఆడి వచ్చుట సహజము. చేఁతలు శబ్దముపై అల్లే వచ్చుట వింత. చేష్టలు(కలది)చేయునది అర్థము కావచ్చు.

18. జాజరకాఁడు :— 7-వ పాట. జాజరకాఁడు=దొంగఅని, జాజాల పాలికలు=అంకురార్పణ శరావము అనియు సూ. ని. జాజర= వంచన అని శ. ర. 'జాజర', తస్కర-శాద్వల శబ్దభవము కావచ్చు. ఈ దృష్టితోనే సూ. ని. పై రెండర్థముల నిచ్చియుండ వచ్చు. ఇక్కడి జాజర, శాద్వల శబ్దభవమైతే, వైశాఖశుద్ధ పూర్ణిమకు ముందు అన్నిధాన్యములు కుంపట్లలో మొలకపోసి, ఆ మొలకకుంపట్లను ఆ పున్నమనాడు పూజించి, అప్పుడు జక్కి మొదలగు చాలక్రీడావినోదములు (వేడుకలు) సలుపుట మాండలికమైనఆచారము. అందుకే యీ పున్నమకు మొలకలపున్నమ యనియు వ్యవహారము. క్రమముగ జాజరశబ్దము వేడుకకు పర్యాయమై యుండవచ్చుననియు, జాజరకాఁడు=వేడుకకాఁడు కావచ్చుననియు తోచుచున్నది. ఈ మొలకనోమును అన్నమాచార్యులు వాకొనియున్నారు గూడ. చూ :- 12 సం. 127-పాట. ఈ జాజర శబ్దార్థ మింక౹ కొంత విపులముగ 12 సం. ద్వితీయ ముద్రణపీఠికలో చర్చించితిని.

19. జామట :— 10-వ పాట. ప్రొద్దుట, మాపట శబ్దములవలె జాము శబ్దము నౌపవిక్తికము చేసి ప్రయోగించినాడేమో ?

20. తగులువిరితనాన :— 4-వ పాట. తగులు తనము విరియు (విడియు) తనము కావచ్చు. సందర్భానుసారముగ తగులుట= చేరుట, విరియుట=విడివడుట. లేక తగులుయొక్క విరి. (వికాసము), దానిపైన తనవర్ణకమూ కావచ్చు. రాగము హెచ్చిన తనము అని యర్థము.

21. తూకొని :— 173-వ పాట. తూకము + కొని = తూకము చేసి అనునర్థమున వాడినట్లున్నది.

22. తొక్కుమెట్టు చెమటలు :— 258-వ పాట. పై రెండు ధాతుజ విశేషణములు అతిశయార్థమున ప్రయోగించినట్లున్నది. పెల్లుబ్బి వచ్చు చెమటలు కావచ్చు.

23. దాష్టీకము :— 143-వ పాట. ధృష్ట శబ్దభవమైన భావార్థక వ్యావహారికరూపము గావచ్చు. ఇక్కడ ప్రాకరణికముగ పొగరుబోతుతనము అర్థము కావచ్చు. "అంత దాష్టీకము లేకుండా మాట్లాడుతాడు" ఇత్యాదివ్యవహారములో ఈ శబ్దము దాక్షిణ్య శబ్దభవముగను తోచుచున్నది.

24. దుస్సేవే :— 496-వ పాట. దూయు ధాతువునకు వ్యావహారిక రూపము కావచ్చు. దూసిపోయుట అర్థము. ప్రాకరణికముగ పరంపరగ పంతములు రాల్చుట కావచ్చు.

25. దోమటి :— 186-వ పాట. దోమటి = అన్నము అని శ.ర.సూ.ని. ఆయర్థమీవాఙ్మయమున సరిపడదు. మద్దితనము మొరటుతనము దొమ్మి వంటివి కావచ్చు. ఈ పద మీ వాఙ్మయమున విపులముగ నున్నది. "దోమటిదొడుకు" అని ఒంటగనుగలదు.

26. పెంటల పూజలు :— 70-వ పాట. పెంట = ఎరువుకుప్ప అని శ.ర. పెంట = శాఖానగరము అని సూ.ని. ఇక్కడ సమృద్ధి అనునర్థమున గానవచ్చుచున్నది. ఈ పద మీ వాఙ్మయమున నీయర్థమున ఇంకను గలదు. నన్నయ "కంపు" వలె స్వీకరింప వలసి యున్నది.

27. బలువురాలు :— 580-వ పాట. బలువుఁడు పుంలింగ రూపముగాగా, బలువురాలు అని స్త్రీలింగమున ప్రయోగించినట్లున్నది.

28. ముక్కందాయిటి రేఁగె :— 82-వ పాట. ముక్కందు + ఆయిటి. ఆయిటి = ఆవిరితోఁగూడిన గాలి కావచ్చు. చూ:- 152-వ పాట.

29. మొత్తగాఁడు :— 540-వ పాట. మొత్తము గలవాఁడు అను నర్థమున తద్ధితాంతమైన ఈ రూప మపురూపము.

30. లేవె :— 361-వ పాట. లేపు = Bed అని కిట్టల్. ఇక్కడ అదే కావచ్చు.

31. విణ్ణాపఁజివారు :— 281-వ పాట. విణ్ణప్పం సెయివార్ అను అరవ పదమునకు సంగ్రహమైనరూపము గావచ్చు. ఉత్సవములో ద్రావిడభాషలోని దివ్యప్రబంధముతో పై విన్నపము జరుగుట నాయూహకు కారణము.

32. వేయిటిపై జవ్వాదికొమ్మ :— 399-వ పాట. స్పష్టముగ వివరించుటకు వీలుగాని జాతీయముగ నున్నది.

33. సందుసుడిన్ :— 4-వ పాట. సందుసుడిన్, సందు స్సుడితనము, సందుసుడికత్తె అని యీ పద మీ వాఙ్మయమున పలుతావుల గలదు. సందుచూచి చొచ్చుట (అవకాశవాది) అర్థము కావచ్చు.

34. సటకారితనము :— 201-వ పాట. శాఠ్యకారి శబ్దభవముకావచ్చు. కపటముగ నడచువాడు.

35. సూసరము :— 53-వ పాట. దీని వ్యుత్పత్తి విచార్యము. ప్రకరణముతో బాసికము అర్థము కావచ్చు. సూసకము = స్త్రీలు తలపై ధరించెడి తిరుగుడుబిళ్ల అని వా.ని.

***

తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాలయము, తిరుపతి.

తిరుమల తిరుపతి దేవస్థానమువారి ప్రచురణ

T. T. D. Religious Publications Series No. 188

Price Rs. 16-00

తిరుమల తిరుపతి దేవస్థానంవారి ప్రచురణ

Published by S. Lakshminarayana, I.A.S. Executive Officer,
T. T. Devasthanams and Printed at T.T.D. Press, Tirupati.